సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+10+2 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 40

గురువారం 2-5-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'



పంజాబ్‌దే గెలుపు

రాణించిన చహర్.. చెన్నైపై 7 వికెట్ల తేడాతో గెలుపు - స్పోర్ట్స్‌లో



జీఎస్టీ రికార్డు వసూళ్లు


దేశవ్యాప్తంగా ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రూ. 2 లక్షల కోట్ల పైకి.. - బిజినెస్‌లో



కస్టడీలో నిందితుడు ఆత్మహత్య

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసం వద్ద కాల్పుల ఘటన నిందితుడు అనూజ్ తపన్ పోలీసు కస్టడీలో ఆత్మహత్య చేసుకున్నాడు.

వివరాలు 6లో ▸



చైనాలో కొట్టుకుపోయిన రోడ్డు

చైనాలోని మెయిజౌ నగరంలోని రోడ్డు కొట్టుకుపోవడంతో 24 మంది ప్రాణాలు కోల్పోగా.. 30 మంది గాయాలపాలయ్యారు.

వివరాలు 6లో ▸



రాయ్‌బరేలి నుంచి రాహుల్!

ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలి లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పోటీ చేసే అవకాశముందని సమాచారం.

వివరాలు 6లో ▸



కాలిఫోర్నియా వర్సిటీలో ఉద్రిక్తత

అమెరికాలోని కాలిఫోర్నియా వర్సిటీలో పాలస్తీనా, ఇజ్రాయెల్ అనుకూల వర్గాల విద్యార్థుల మధ్య ఘర్షణలు జరిగాయి.

వివరాలు 6లో ▸



మధ్యాహ్నం 2.30 గంటలకు పాయకరావుపేటలో జరిగిన సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభకు మండుటెండను సైతం లెక్కచేయకుండా హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



ఇవ్వడమే జగన్‌కు తెలుసు

బొబ్బిలి, పాయకరావుపేట, ఏలూరు సభల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- జగన్ భూములిచ్చేవాడే కానీ.. నీలా లాక్కునేవాడు కాదు చంద్రబాబూ
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై దుష్ప్రచారం
- దేశంలో వందేళ్ల తర్వాత ఈ సర్వే జరుగుతోంది
- రికార్డులు అప్‌డేట్ చేసి రైతన్నలకు అందజేస్తున్నాం
- వారిపై పైసా భారం పడకుండా పనులు చేపట్టాం

4 లో

- కోర్టులు, ఆఫీసుల చుట్టూ తిరిగే దుస్థితిని తప్పించాం
- బాబును ఓడించడమంటే.. పేదలను గెలిపించడమే
- జగన్ ఎప్పుడూ పేదలు, పేదలు అంటుంటే తట్టుకోలేకపోతున్నారు.. మన 59 నెలల పాలనలో జరిగిన మార్పులన్నీ విప్లవాలే
- నేర ప్రవృత్తికి నిలువెత్తు నిదర్శనం చంద్రబాబు
- వెన్నుపోట్లు, హత్యలతోనే ఆయన రాజకీయం
- వైఎస్సార్ గాలిలో కలిసిపోతాడని అసెంబ్లీ సాక్షిగా అనలేదా?
- ఇప్పుడు జగన్‌ను చంపేస్తే తప్పేమిటని అంటున్నాడు
- చంద్రబాబు మాదిరిగా నాకు జెడ్ ప్లస్ భద్రత లేదు.. జగన్‌కు జనమే రక్ష

నిరుద్యోగులపై చంద్రబాబు మరోసారి మాయా వల

'భృతి'.. అంతా భ్రాంతి

జాబు రావాలంటే బాబు రావాలంటూ 2014 ఎన్నికల్లో ప్రచారం



- కరపత్రాలు వేసి ఊరూరా పంపిణీ
- ఇంటికో ఉద్యోగం.. లేదంటే నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ.. అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లపాటు ఆ ఊసేలేదు
- ప్రతిపక్ష నేత అసెంబ్లీలో బాబును ఉక్కిరిబిక్కిరి చేస్తే అసలా పథకమే లేదన్న అచ్చెన్న
- ఆ ఒత్తిడి తట్టుకోలేక 2017–18 బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి రూ.500 కోట్లు కేటాయింపు
- అయినా అమలుచేయని చంద్రబాబు.. 2019 ఎన్నికలకు ఆరునెలల ముందు ముఖ్యమంత్రి యువ నేస్తం పేరుతో పథకం
- నెలకు రూ.1,000 చొప్పున ఇస్తామని ప్రకటన
- సవాలక్ష ఆంక్షలతో కేవలం 12 లక్షల మంది నిరుద్యోగులకు అర్హత
- కానీ, 2018 అక్టోబరులో కేవలం రూ.40 కోట్లు విడుదల
- చివరికి 1.62 లక్షల మంది మాత్రమే అర్హులని తేల్చిన బాబు
- 1.70 కోట్ల నిరుద్యోగులను నిలువునా మోసం చేసిన బాబు
- ఎన్నికలు రావడంతో మళ్లీ యువతకు గేలం.. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అంటూ మాయమాటలు
- బాబు గత చరిత్ర చూడండి.. ఆయన్ను నమ్మొద్దంటూ యువతకు విద్యావేత్తలు, మేధావులు హితవు

11 లో

ముస్లిం రిజర్వేషన్లను

రద్దు చేస్తాం

బీజేపీ ఏపీ శాఖ అధికారిక ప్రకటన

సాక్షి, అమరావతి: బీజేపీ ఏపీ శాఖ అధికారిక 'ఎక్స్' సోషల్ మీడియానే 'ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తాం' అంటూ ట్వీట్ చేయడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ రాష్ట్ర పర్యటనలో రిజర్వేషన్లపై మాట్లాడిన మాటలపై బీజేపీ ఏపీ రాష్ట్ర శాఖ వివరణ ఇస్తున్నట్టుగా పేర్కొం టూ.. అమిత్‌షా 'ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామని ప్రకటించారు.. కానీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్‌లు రద్దు చేస్తామనలేదు' అని తెలిపింది. అమిత్ షా వాస్తవంగా మాట్లాడిన మాటలు, ఆ మాటలను ఫేక్ చేసి కొందరు ప్రచారంలో పెట్టిన రెండు వీడియో లనూ జతపరిచి ఈ పోస్టు పెట్టారు.

మధ్య తరగతికి

మరింత భరోసా

వైఎస్సార్‌సీపీ నవరత్నాలు ప్లస్ మేనిఫెస్టోతో మరోసారి అండగా సీఎం జగన్

పట్టణ ప్రాంతాల్లోని మధ్య ఆదాయ కుటుంబాలకు సరసమైన ధరలకే ఇళ్ల స్థలాలు

- 123 పట్టణాల్లో ఎంఐజీ లే అవుట్ల అభివృద్ధి
- రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాలకు ఆరోగ్య భరోసా
- రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సహాయం
- కాపు, ఈబీసీ నేస్తం ద్వారా ఒక్కో కుటుంబానికి ఐదేళ్లలో రూ.60 వేల సాయం
- ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు విదేశీ విద్యా దీవెనతో తోడ్పాటు
- రూ.10 లక్షల వరకు రుణానికి కోర్సు ముగిసే వరకు పూర్తి వడ్డీ చెల్లింపు
- ఆప్కాస్, ఆశ, అంగన్‌వాడీ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నవరత్న పథకాలు
- ప్రభుత్వ ఉద్యోగులకు సొంత జిల్లాలోనే 60 శాతం ప్రభుత్వ ఖర్చుతో ఇంటి స్థలం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మధ్యతరగతి వర్గాల సంక్షేమానికి పలు చర్యలు చేపట్టి, ఆ వర్గాలను ఉన్నత స్థితికి తెస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు ప్లస్'తో కూడిన మేనిఫెస్టోతో మరోసారి సంపూర్ణ భరోసా కల్పించారు. పట్టణాల్లోని మధ్య తరగతి కుటుంబాల దశాబ్దాల సొంతింటి కలను సాకారం చేసేలా కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. 123 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యేకంగా ఎంఐజీ లేఅవుట్లను అభివృద్ధి చేసి, సరసమైన ధరలకే ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నారు. ఇందుకోసం వచ్చే ఐదేళ్లలో ప్రతి ఏటా రూ.వెయ్యి కోట్లు కేటాయించి..

మిగతా 2వ పేజీలో ▶

నేడు, రేపు తీవ్ర వడగాడ్పులు



రాష్ట్రం నిప్పుల కుంపటిలా మారింది. భానుడి భగభగలు తగ్గడం లేదు. బుధవారం అత్యధికంగా పల్నాడు జిల్లా కొప్పునూరులో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రత, తిరుపతి జిల్లా మంగానెల్లూరులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. గురు, శుక్రవారాల్లో వడగాడ్పులు మరింత తీవ్రం కానున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించిం ది. ప్రజలు ఎండదెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలని సూచించింది.

2 లో

ఇదండీ సంగతి



వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకును చీల్చడమే

షర్మిల లక్ష్యం

ఆడియో లీక్‌తో అడ్డంగా దొరికిపోయిన వైనం



12 లో

- చంద్రబాబుకు మేలు చేయడమే అజెండా.. పాడేరు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థితో మంతనాలతో స్పష్టీకరణ
- పాడేరు కాంగ్రెస్ టికెట్ తొలుత వంతల సుబ్బారావుకు..
- ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ నుంచి వెళ్లిన బుల్లిబాబుకి కేటాయింపు
- కాంగ్రెస్ రెబల్ వంతలను తప్పుకోవాలని ఆదేశించిన షర్మిల
- వైఎస్సార్‌సీపీ ఓట్లను చీల్చడానికే తాను బాధ్యతలు తీసుకున్నట్లు వెల్లడి

ఉద్యోగులు, పెన్షనర్లను ప్రభుత్వానికి దూరం చేసే కుట్ర



- వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకమనడం అవాస్తవం
- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి
- మంత్రివర్గ ఉప సంఘం, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు
- 'అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్'కు సానుకూలం
- 12వ పే రివిజన్ కమిషన్ నియామకం
- ప్రభుత్వ సలహాదారు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి

12 లో

న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో ఏపీ ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు



ప్రభుత్వ బడిలో ప్రగతి కెరటాలు

సీఎం జగన్ సంస్కరణలతో సర్కారు విద్యకు అంతర్జాతీయ గుర్తింపు

విదేశీ వేదికలపై ప్రతిభ చాటుతున్న ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు.. పేదింట పుట్టినా సౌకర్యాలు కల్పిస్తే ఎవరికీ తీసిపోమంటున్న ఆణిముత్యాలు

ఐక్యరాజ్య సమితిలో ఆకట్టుకున్న రాష్ట్ర విద్యా రంగ ఉన్నతి.. ఐక్యరాజ్య సమితి ఆహ్వానం మేరకు ప్రతినిధి బృందం

అధికారులకు బదులు విద్యార్థులనే పంపిన సీఎం జగన్.. యూఎన్ఓ, వరల్డ్ బ్యాంక్, వైట్‌హౌస్‌లో ప్రసంగం

సరికొత్త ఆవిష్కరణలతో జపాన్‌ను సందర్శించిన విద్యార్థులు

2 లో

'సుప్రీం' తీర్పును అభ్యర్థులు పాటించాల్సిందే

- కేసులు, ఆస్తుల వివరాలను పత్రికల్లో ప్రచురించాల్సిందే
- తేల్చిచెప్పిన హైకోర్టు ధర్మాసనం
- వివరాల సమర్పణకు గడువు కోరిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా తమపై ఉన్న కేసుల వివరాలను, ఆస్తుల వివరాలను స్వచ్ఛందంగా పత్రికల్లో ప్రచురించాల్సిందేనని, అలాగే ఆయా పార్టీల వెబ్‌సైట్‌లలో కూడా ఆ వివరాలను పొందుపరచాల్సిందేనని హైకోర్టు స్పష్టంచేసింది. సుప్రీంకోర్టు తీర్పునకు కట్టుబడి ఉండాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై, ఆ తీర్పు అమలవుతుందో లేదో చూడాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉందని తెలిపింది. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు కేసుల వివరాలను, ఆస్తుల వివరాలను స్వచ్ఛందంగా పత్రికల్లో ప్రచురించారో లేదో తెలుసుకుని చెబుతామని కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది. దీంతో హైకోర్టు తదుపరి విచారణను జూన్ 26కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల కేసుల వివరాలు, ఆస్తుల వివరాలకు సంబంధించిన ఫారం–26ను తెలుగులో అందుబాటులో ఉంచేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవాధ్యక్షులు డాక్టర్ సామల రమేష్‌బాబు హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై బుధవారం సీజే ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్ బాబు వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి నామినేషన్ వేశాక తనపై ఉన్న కేసుల వివరాలు, ఆస్తుల వివరాలను కనీస మూడుసార్లు పత్రికల్లో ప్రచురించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ధర్మాసనం స్పందిస్తూ, ఆ తీర్పును అమలుచేయాల్సిందేనని స్పష్టంచేసింది.

తెలంగాణ

కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై నిషేధం

- ఆయన చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫిర్యాదుతో ఈసీ చర్యలు
- బుధవారం రాత్రి 8 గంటల నుంచి 48 గంటల పాటు ప్రచారానికి దూరంగా ఉండాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంపై కేంద్ర ఎన్నికల సంఘం నిషేధం విధించింది. బుధవారం రాత్రి 8 గంటల నుంచి శుక్రవారం (మే 3) రాత్రి 8 గంటల వరకు.. 48 గంటల పాటు లోక్ సభ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని ఆదేశించింది. బహిరంగ సభలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించవద్దని సూచించింది. అలాగే మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు కూడా ఇవ్వకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు బస్సు యాత్రలో భాగంగా మహబూబాబాద్‌లో ఉన్న కేసీఆర్‌కు అధికారులు ఈసీ ఆదేశాలను అందజేశారు. దీంతో రోడ్ షోలో రాత్రి 7.45 గంటలలోపు ప్రసంగాన్ని ముగించిన కేసీఆర్.. ఈసీ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు ప్రచారాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు.

కాంగ్రెస్ ఫిర్యాదుతోనే..

ఎండిన పంట పొలాలను పరిశీలించేందుకు కేసీఆర్ ఏప్రిల్ 5న 'పొలం బాట' పేరిట కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సిరిసిల్లలో నిర్వహించిన మీడియా సమావేశంలో వరి ధాన్యానికి క్వింటాల్ రూ.500 చొప్పున బోనస్ ఇవ్వకుంటే కాంగ్రెస్‌ను వేటాడతామని హెచ్చరించారు. దీంతో కేసీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్.. ఏప్రిల్ 6న కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఈసీ ఆదేశాల మేరకు.. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి విచారణ జరిపి ఏప్రిల్ 10న నివేదిక సమర్పించారు. ఈసీ ఆ నివేదిక ఆధారంగా వివరణ ఇవ్వాలంటూ కేసీఆర్‌కు ఏప్రిల్ 16న షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీంతో ఆయన ఈసీకి సమాధానమిచ్చారు. అయితే దీనిపై సంతృప్తి చెందని ఎన్నికల సంఘం రెండు రోజుల పాటు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని కేసీఆర్‌ను ఆదేశించింది.

ప్రభుత్వ బడిలో ప్రగతి కెరటాలు

సీఎం జగన్ సంస్కరణలతో సర్కారు విద్యకి అంతర్జాతీయ గుర్తింపు..

విదేశీ వేదికలపై ప్రతిభ చాటుతున్న ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు



ప్రపంచ బ్యాంక్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



జపాన్‌లో ఏపీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

- రైతు కూలి బిడ్డ.. అమ్మాజాన్
- లారీ డ్రైవర్ బిడ్డ.. రాజేశ్వరి
- సెక్యూరిటీ గార్డు బిడ్డ.. జ్యోత్స్న
- కౌలురైతు కొడుకు.. అంజన్ సాయి
- రోజు కూలీ కూతురు.. గాయత్రి
- ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కుమార్తె.. శివలింగమ్మ
- ప్రభుత్వ టీచర్ కూతురు.. మనస్విని
- రైతుబిడ్డ.. యోగీశ్వర్
- మెకానిక్ కూతురు.. రిషితారెడ్డి
- ఆటోడ్రైవర్ బిడ్డ.. చంద్రలేఖ

తల్లిదండ్రులు కష్టపడితేనే పూట గడిచే కుటుంబాలకు చెందిన పిల్లలు వీరు. సీఎం వైఎస్ జగన్ సంకల్పంతో అత్యాధునికంగా మారిన ప్రభుత్వ బడుల నుంచి ఐక్యరాజ్య సమితిలో మెరిసిన మెరుపు తీగలు. 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 550 నుంచి 590 మార్కులు సాధించి, ప్రతిభను నిరూపించుకున్న ఆణిముత్యాలు.

నానాజీ అంకంరెడ్డి, సాక్షి అమరావతి:

ప్రభుత్వ బడులు, జూనియర్ కాలేజీల్లో చదువుకుని టాపర్లుగా నిలిచిన వారికి ఏటా 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట వైఎస్ జగన్ ప్రభుత్వం సత్కరిస్తోంది. రాష్ట్రంలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులు 22 వేల మందిని ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట నగదు ప్రోత్సాహకాలతో సత్కరించి, పేద విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అంతేకాదు.. ఇలాంటి పేదింటి రత్నాలను ప్రభుత్వ ప్రతినిధులుగా 10 మందిని ఎంపిక చేసి ఐక్యరాజ్య సమితికి పంపించారు. అప్పటి వరకు కనీసం జిల్లా కేంద్రాన్ని కూడా చూడని ఈ విద్యార్థులు ఐక్యరాజ్య సమితి, ప్రపంచ బ్యాంకులో ప్రసంగించడం చరిత్ర సృష్టించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చేసిన మార్పులు, మనబడి నాడు – నేడుతో సమకూరిన సదుపాయాలు, ఆధునిక ల్యాబ్స్‌తో జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో టాపర్లుగా నిలిచిన మరో ఏడుగురు విద్యార్థులు జపాన్ వెళ్లి వచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులకు ఈ స్థాయిలో ప్రోత్సహించడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి.

పేదింటి ఆణిముత్యాలే రాష్ట్ర ప్రతినిధులు

2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న వెంటనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పేదల పిల్లల విద్యాభివృద్ధిపై దృష్టి సారించారు. మన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్న లక్ష్యంతో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేశారు. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ స్క్రీన్ల ద్వారా బోధన, టోఫెల్ శిక్షణ వంటివి ప్రవేశపెట్టి, బోధన ప్రమాణాలు పెంచి, సర్కారు స్కూళ్లను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. ఇదే అంశాన్ని తెలియజేస్తూ గతేడాది ఆగస్టులో న్యూయార్క్ నగరంలోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగిన హైలెవల్ పొలిటికల్ ఫోరం (సదస్సు)లో ఏపీ విద్యా సంస్కరణలను తెలియజెబుతూ ఏర్పాటు చేసిన స్టాళ్లు అంతర్జాతీయ ప్రతినిధులను ఆకర్షించాయి. ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాలల అభివృద్ధిని స్వయంగా తెలుసుకుంటామని పలు దేశాల ప్రతినిధులు కోరడంతో పాటు ఐక్యరాజ్య సమితికి ప్రతినిధులను పంపాలని ఆహ్వానించారు. సాధారణంగా ఇలాంటి అంతర్జాతీయ సదస్సులకు అత్యున్నత అధికారులను పంపిస్తారు. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, పాఠశాలల అభివృద్ధిపై మాట్లాడేందుకు విద్యార్థులే సరైన ప్రతినిధులని సీఎం జగన్ భావించారు. అందుకే ఈ ఆణిముత్యాలను అంతర్జాతీయ వేదికలపై ప్రతినిధులుగా పంపించారు.

సీఎం నమ్మకాన్ని వమ్ము చేయని మన పిల్లలు

2022–23 విద్యా సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ స్కూళ్లలోని పిల్లలను 150 మందిని ఎంపిక చేసి, వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, మారిన బడుల తీరుపై పరీక్ష పెట్టారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మందికి ఇంటర్వ్యూలు చేసి, వారి నుంచి 10 మందిని ఎంపిక చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 15 నుంచి 27 వరకు వీరంతా ప్రభుత్వ ఖర్చుతో అమెరికా వెళ్లి ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో స్వయంగా మాట్లాడారు. ప్రపంచంలో అత్యంత అరుదుగా మాత్రమే ప్రవేశం లభించే అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో సైతం వీరు మాట్లాడే అవకాశం లభించింది. పేదింటి పిల్లలైనా, ప్రభుత్వ చేయూతతో అంతర్జాతీయ స్థాయి విజ్ఞానాన్ని సముపార్జించుకొన్న వీరంతా సీఎం జగన్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రంలో జరుగుతున్న విప్లవాత్మక మార్పులను వివరించారు. సీఎం జగన్ ఆదర్శవంతమైన సంస్కరణలను ప్రపంచానికి చాటిచెప్పారు.

జపాన్ సకురా సైన్స్ ఫెయిర్‌కూ ఏపీ విద్యార్థులు

రాష్ట్ర ప్రభుత్వం నాడు – నేడు పథకంతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించింది. దీంతో అక్కడి సైన్స్ ల్యాబ్స్, నిష్ణాతులైన ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నిర్వహించే ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్ (ఇన్‌స్పైర్) పోటీల్లో సత్తా చాటుతున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులు దైనందిన జీవితంలో చూసిన సమస్యలకు పరిష్కారాలను చూపే ఆకర్షణీయమైన అంశాలు, నమూనాలు తయారు చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో లేబొరేటరీలు అత్యాధునికంగా తీర్చిదిద్దడంతో మన విద్యార్థులు గత నాలుగేళ్లుగా ఏటా 40 వేలకు పైగా ప్రాజెక్టులు చేస్తున్నారు. వీటి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు 400 వరకు ఎంపికవుతున్నాయి. గత నాలుగేళ్లుగా జాతీయ పోటీలకు దాదాపు 45 ప్రాజెక్టులు ఎంపికవుతున్నాయి. ఈ పోటీల్లో విజేతలకు ప్రభుత్వం పేటెంట్ హక్కులు కూడా ఇస్తుంది. 2019కి ముందు జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ 10వ స్థానంలో ఉంటే ఇప్పుడు 3వ స్థానానికి చేరుకుంది. ఇక్కడే కాదు.. 2019 నుంచి 2022 వరకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏడుగురు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపించి, 'జపాన్ సకురా' అంతర్జాతీయ పోటీలకు ఎంపికై జపాన్‌లో పర్యటించి వచ్చారు.

ప్రభుత్వ బడిలో కొత్త ఆవిష్కరణలు

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించడంతో విద్యార్థులు చేస్తున్న ప్రయోగాలు సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకడంతో పాటు పేటెంట్లు సైతం అందుకుంటున్నారు. గుంటూరు జిల్లా అత్తోట జెడ్పీ స్కూల్ విద్యార్థిని పి.కీర్తి వీధుల్లో కూరగాయలు అమ్ముకునేవారికి ఉపయోగపడే వెండర్స్ ఫ్రెండ్లీ సోలార్ కార్ట్‌ను రూపొందించింది. చిత్తూరు జిల్లా ఏఎల్‌పురం జెడ్పీ స్కూల్ విద్యార్థిని కె.ప్రణయ 15 రోజులు కూరగాయలు పాడవకుండా నిల్వ చేసుకునే గార్లిక్ బ్యాగ్‌ను రూపొందించింది. చిత్తూరు జిల్లా జంగంపల్లి జెడ్పీ స్కూల్ విద్యార్థి పి.చరణ్ తేజ బైక్‌పై వెనుక కూర్చున్న వారికి రక్షణగా ఉండే సైడ్ సీట్‌ను తయారుచేశాడు. రైతు కుటుంబాలకు చెందిన ఈ ముగ్గురూ వారు నిత్యం చూస్తున్న సమస్యలకు పరిష్కారంగా ఈ ఆవిష్కరణలు చేసి, జాతీయ ప్రతినిధులను మెప్పించడమే కాదు.. గత నవంబర్‌లో జపాన్ వెళ్లి వచ్చారు. మరో నలుగురు విద్యార్థులు వచ్చే నెలలో జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు.

అత్యంత సామాన్యుల పిల్లలకే అవకాశం

- ఏలూరు జిల్లా పెదపాడు మండలం వట్లూరు జెడ్పీ స్కూల్లో చదువుకున్న పసుపులేటి గాయత్రి గతేడాది పదో తరగతిలో 590 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. జగనన్న ఆణిముత్యాలు అవార్డు కింద రూ.50 వేలు అందుకుంది. కూలి పనులు చేసే తండ్రి కష్టంపైనే బతుకుతున్న ఈ కుటుంబానికి జగనన్న విద్య, సంక్షేమ పథకాలు దన్నుగా నిలిచాయి.
- కర్నూలు జిల్లా కౌతాళం మండలం పొదలకుంటకు చెందిన మించాలవారి సోమనాథ్, గంగమ్మలకు నలుగురు సంతానంలో ఒకరైన శివలింగమ్మ ఆదోని కేజీబీవీలో పదో తరగతిలో 541 మార్కులు సాధించింది.
- తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన వంజవాకం యోగీశ్వర్ తండ్రి నాగరాజు సామాన్య రైతు. చంద్రగిరి ప్రభుత్వ బాలుర పాఠశాలలో చదువుకున్న యోగీశ్వర్ గతేడాది పదో తరగతిలో 586 మార్కులు సాధించి జిల్లాలో రెండోస్థానంలో నిలిచాడు.
- విజయనగరంలో మెకానిక్‌గా పనిచేస్తున్న అల్లం రామకృష్ణారెడ్డి, ఉదయలక్ష్మిల కుమార్తె రిషితారెడ్డి స్థానిక కస్పా మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో పదో తరగతిలో 587 మార్కులు సాధించింది. ప్రస్తుతం నూజివీడు ట్రిపుల్ ఐటీలో చదువుతోంది.
- శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బకు చెందిన షేక్ ఫాతిమా భర్త చనిపోవడంతో కూలీ పనులు చేస్తూ ఇద్దరు ఆడపిల్లలను పోషించుకుంటోంది. ఈమె రెండో కూతురు అమ్మాజాన్ వేంపల్లిలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో చదివి గతేడాది పదో తరగతిలో 581 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు సత్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి అందుకుంది. ఇప్పుడు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చదువుతోంది.
- నంద్యాల పట్టణం బొమ్మలసత్రం ప్రాంతానికి చెందిన సి.రాజేశ్వరి తండ్రి దస్తగిరి లారీడ్రైవర్. తల్లి రామలక్ష్మమ్మ ఇంటి వద్ద బట్టలు ఇస్త్రీ చేస్తుంటారు. రాజేశ్వరి నంద్యాలలోని ఏపీ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదివి 583 మార్కులు సాధించి జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఈ బాలిక ట్రిపుల్‌ఐటీలో ఇంజినీరింగ్ చదువుతోంది.
- అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన రామారావు, మణి దంపతుల రెండో కుమార్తె మోతుకూరి చంద్రలేఖ స్థానిక కేజీబీవీలో చదువుకుని గతేడాది పదో తరగతిలో 523 మార్కులు సాధించింది. జిల్లా టాపర్‌గా నిలిచి జగనన్న ఆణిముత్యాలు సత్కారం కింద రూ.50 వేల నగదు బహుమతి అందుకుంది.
- కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం రమణక్కపేటకు చెందిన దడాల సింహాచలం ప్రైవేటు సెక్యూరిటీ గార్డు. ఈయన రెండో సంతానమైన డి.జ్యోత్స్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో చదువుకుని పదో తరగతిలో 589 మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాలు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాన్ని అందుకుంది. ప్రస్తుతం కృష్ణాజిల్లా ఈడుపుగల్లులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ఐఐటీ అకాడమీలో ఇంటర్ చదువుతోంది.
- పశ్చిమ గోదావరి జిల్లా వల్లూరుపల్లి గ్రామానికి చెందిన జి.గణేష్ అంజన సాయి ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాలలో చదువుకుని గతేడాది పదో తరగతిలో 581 మార్కులు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. ఇతని తండ్రి గోపి కౌలు రైతు కాగా, తల్లి లక్ష్మి గృహిణి.

మధ్య తరగతికి.. మరింత భరోసా

▶ మొదటి పేజీ తరువాయి

రూ.2 వేల కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటుకు నిర్ణయించారు. 17 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 29 నగర పంచాయతీల్లో దశలవారీగా ఎంఐజీ లేఅవుట్లను అభివృద్ధి చేయనున్నారు. ఇదే కాకుండా, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు చేపట్టారు. అవి..

- ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు విదేశాల్లో చదువుకునేందుకు అండగా నిలవనున్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి ఎంపిక కాని ప్రభుత్వ ఉద్యోగుల పిల్లల ఉన్నత చదువుల కోసం తీసుకునే రుణంలో రూ.10 లక్షల వరకు పూర్తి వడ్డీని కోర్సు పూర్తయ్యేంత వరకు చెల్లించనున్నారు. గరిష్టంగా ఐదేళ్ల పాటు వడ్డీ చెల్లింపుతో ఆర్థిక భరోసానిచ్చారు.
- ప్రభుత్వ పాలనలో భాగస్వాములుగా ఉంటూ ఆప్కాస్, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు విద్య, వైద్యం, ఇళ్ల స్థలాలు సహా పూర్తి నవరత్న పథకాలను వర్తింజేయనున్నారు. దీనివల్ల రూ.25 వేల వరకు జీతం పొందుతున్న ఈ తరహా ఉద్యోగులందరికీ ఎంతో మేలు జరగనుంది. వీరితో పాటు ఇళ్లు లేని ప్రభుత్వ ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లోనే ఇళ్ల స్థలాలు ఇవ్వనున్నారు. ఆ స్థలం ఖరీదులో ప్రభుత్వం 60 శాతం ఖర్చును భరించనుంది.
- వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా మధ్యతరగతికి ఆరోగ్య రక్షణ కల్పిస్తున్నారు. రూ.5 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న కుటుంబాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చారు. వీరికి రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించనున్నారు.
- వైఎస్సార్ కాపు నేస్తం, ఈబీసీ నేస్తం ద్వారా గతంలో మాదిరిగానే ఏటా రూ.15 వేలు అందిస్తూ వచ్చే ఐదేళ్లలో నాలుగు విడతల్లో రూ.60 వేల ఆర్థిక సాయాన్ని అందించనున్నారు. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయస్కులైన అక్కచెల్లెమ్మల ఖాతాల్లో క్రమం తప్పకుండా ఈ ఆర్థిక సాయం జమ చేస్తారు.

ఆర్యవైశ్యులకు అండగా..

ఇప్పటికే ఓసీల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు నిధులను సైతం ఇస్తున్నారు తొలిసారిగా ఆర్య వైశ్యులకు ఒక కార్పొరేషన్‌ను తీసుకొచ్చి అండగా నిలిచారు. ఆర్యవైశ్య సత్రాలను సొంతంగా వారే నిర్వహించే హక్కులను కల్పించారు. ఇంతటి సంక్షేమాన్ని వచ్చే ఐదేళ్ల పాటు కొనసాగిస్తామంటూ 2024 మేనిఫెస్టో ద్వారా మరోసారి భరోసా ఇచ్చారు.

చెప్పినదానికంటే మిన్నగా..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సామాజికవర్గాలకు మాత్రమే కాకుండా ఇతర వర్గాలకు సైతం నవరత్నాలు పథకాలతో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఆర్థిక లబ్ధిని పెద్ద ఎత్తున అందించడం ద్వారా సీఎం జగన్ రికార్డు సృష్టించారు. రెడ్డి, కమ్మ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ సామాజిక వర్గాల అక్కచెల్లెమ్మలను సంక్షేమ పథకాలతో ఆర్థికంగా బలోపేతం చేశారు. ఈ ఐదేళ్లలో ఆయా వర్గాలకు డీబీటీ ద్వారా 1,66,45,078 మందికి రూ.43,132.75 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 2,00,59,280 మందికి రూ.86,969.93 కోట్లు కలిపి మొత్తం 3,67,04,358 మందికి రూ.1,30,102.68 కోట్లు లబ్ధి చేకూర్చడం విశేషం.

కాపుల అభివృద్ధికి..

కాపుల సంక్షేమానికి గత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ నూరు శాతం అమలు చేశారు. మేనిఫెస్టోలో చెప్పినదానికి మించి భారీ ఆర్థిక సాయం అందించారు. ఏడాదికి రూ.2 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు సాయం చేస్తామని చెప్పగా.. ఐదేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ కలిపి మొత్తంగా రూ.34,005.12 కోట్లు సాయమందించడం విశేషం. ఇందులో డీబీటీ ద్వారానే 65,34,600 ప్రయోజనాల కింద కాపులకు రూ.26,232.84 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. నాన్ డీబీటీ కింద మరో రూ.7,772.19 కోట్ల ప్రయోజనాలను కల్పించారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో కాపుల సంక్షేమానికి కేటాయించింది కేవలం రూ.1,340 కోట్లే.

స్మార్ట్ ఫ్లైట్ టెస్ట్ విజయవంతం



భువనేశ్వర్: ఒడిశాలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి బుధవారం నిర్వహించిన సూపర్ సోనిక్ మిస్సైల్ అసిస్టెడ్ రిలీజ్ ఆఫ్ టార్పెడో (స్మార్ట్) వ్యవస్థ పరీక్ష విజయవంతమైంది. స్మార్ట్ తదుపరి తరం క్షిపణి ఆధారిత తేలికపాటి టార్పెడో డెలివరీ వ్యవస్థ. దీన్ని తేలికపాటి టార్పెడో సంప్రదాయ శ్రేణికి మించి, భారత నావికాదళం యాంటీ–సబ్‌మెరైన్ వార్‌ఫేర్ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) రూపొందించి, అభివృద్ధి చేసింది.



ప్రధాన నగరాలు, పట్టణాల్లో బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	47.3	30.6
మార్కాపురం	46.0	29.0
కర్నూలు	44.5	31.1
కడప	44.2	29.2
ఏలూరు	44.0	28.0
తిరుపతి	44.0	28.0
విజయనగరం	43.0	37.0
విజయవాడ	43.0	30.0
రాజమహేంద్రవరం	43.0	28.0
నెల్లూరు	41.7	28.5
విశాఖపట్నం	37.4	28.2

నేడు, రేపు తీవ్ర వడగాడ్పులు



సాక్షి, విశాఖపట్నం: భానుడి భగభగలు తగ్గడం లేదు. ఎండ మంటలు చల్లారడం లేదు. రాష్ట్రం నిప్పుల కుంపటిలా మారింది. గురు, శుక్రవారాల్లో వడగాడ్పులు మరింత తీవ్రం కానున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. గురువారం 31 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 234 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలో 15, పార్వతీపురం మన్యంలో 8, శ్రీకాకుళంలో 5, ప్రకాశంలో 2, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒక మండలంలో తీవ్రవడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. పల్నాడు జిల్లాలో 21, ప్రకాశం 18, ఏలూరు 18, తూర్పుగోదావరి 17, నెల్లూరు 16, గుంటూరు 16, అనకాపల్లి 15, శ్రీకాకుళం 15, కాకినాడ 13, తిరుపతి 12, కృష్ణా 11, ఎన్టీఆర్ 11, బాపట్ల 11, విజయనగరం 10, అల్లూరి సీతారామరాజు 9, కోనసీమ 9, పార్వతీపురం మన్యం 7, వైఎస్సార్ 5, విశాఖపట్నం 1, అనంతపురం 1, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక మండలంలో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వివరించారు. శుక్రవారం 30 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 121 మండలాల్లో వడగాల్పుల ప్రభావం ఉంటుందని తెలిపారు.

నిప్పులుగక్కిన ఎండ

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం కూడా ఎండ నిప్పులుగక్కింది. పల్నాడు జిల్లా కొప్పునూరులో 46.2 డిగ్రీలు, తిరుపతి జిల్లా మంగానెల్లూరులో 46, ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లులో 45.8, నంద్యాల జిల్లా బనగానపల్లె, నెల్లూరు జిల్లా మర్రిపాడులో 45.7, చిత్తూరు జిల్లా కొత్తపల్లిలో 45.6, ప్రకాశం జిల్లా ఎండ్రపల్లిలో 45.5, వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురంలో 44.9, బాపట్ల జిల్లా వల్లపల్లిలో 44.6, అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో 44.5, కర్నూలు జిల్లా పంచలింగాలలో 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వివరించారు. 21 జిల్లాల్లో 43 డిగ్రీలకు పైగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపారు. 79 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 118 మండలాల్లో వడగాల్పులు వీచాయని తెలిపారు. ప్రజలు వీలైనంతవరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండాలని, ఎండదెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు.



అనారోగ్యంతో బాధపడుతున్న కొండారెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్ భారతమ్మ



అవ్వ ఆదిలక్ష్మమ్మతో ఆప్యాయంగా వైఎస్ భారతమ్మ



వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం రావులకొలనులో ప్రచారం నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ

క్లుప్తంగా...

పింఛన్ల విషయంలో కుల వివక్ష ఎందుకు!

టీడీపీ, జనసేన మేనిఫెస్టోపై కాపు ఐక్యవేదిక సూటి ప్రశ్న

సాక్షి, అమరావతి: పింఛన్ల విషయంలో టీడీపీ, జనసేన మేనిఫెస్టోలో కుల వివక్ష చూపిస్తారా? పింఛన్‌కు అర్హత పేదరికమా? లేక కులమా? మీకు ఏది ప్రామాణికం అని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ను కాపు ఐక్యవేదిక సూటిగా ప్రశ్నించింది. ఈ మేరకు కాపు ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ కోటిపల్లి అయ్యప్ప, కన్వీనర్ పెద్దిరెడ్డి మహేష్, కో–కన్వీనర్ పంచాది రంగారావు, కో–చైర్మన్ వంగా ఆంజనేయులు బుధవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మేనిఫెస్టోలో పేదరికాన్ని ప్రామాణికంగా కాకుండా కులాల వారీగా 50 ఏళ్ల వయసుకే నెలకు రూ.4 వేలు ఇస్తామని హామీలు ఇవ్వడం కుల వివక్షే అవుతుందన్నారు. అగ్రవర్ణాలైన కాపు, రెడ్డి, క్షత్రియ, వెలమ, ఆర్యవైశ్య, బ్రాహ్మణుల్లో పేదలు లేరని చంద్రబాబు, పవన్ భావిస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో పేదరికమే అర్హతగా కుల, మత, వర్గ విభేదాలు లేకుండా పింఛన్లు అందిస్తున్న విషయం మీకు తెలియదా? అని ప్రశ్నించారు. కులాలను కలపడం జనసేన విధానమని, కులాలను విడదీయడం జగన్ విధానమని పదేపదే చెప్పే పవన్ పింఛన్లు అందించే విషయంలో మేనిఫెస్టోలో వివక్ష చూపడం ఎంతవరకు సమర్థనీయమని ప్రశ్నించారు.

స్పెషల్ సీఎస్‌కు 'పీఎస్'నంటూ మోసాలు

సాక్షి, అమరావతి: ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ దగ్గర పర్సనల్ సెక్రటరీ(పీఎస్)గా పనిచేస్తున్నానంటూ సతీశ్ అలియాస్ సుబ్బారావు అనే వ్యక్తి ప్రజలను మభ్యపెడుతున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ జేఎండీ బి.మల్లారెడ్డి తెలిపారు. ఆయన 'సాక్షి'కి వెల్లడించిన వివరాల ప్రకారం..ఏమైనా పనులు ఉంటే చేసిపెడతానని, దానికి ప్రతిఫలంగా డబ్బు ఇవ్వాలంటూ అమాయకులను సతీశ్ నమ్మించి మోసం చేస్తున్నాడు. తన వాట్సాప్ ప్రొఫైల్‌లో విజయానంద్ ఫోటోను డీపీగా పెట్టుకుని అందరిని నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ ఘటనపై తాము సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మల్లారెడ్డి తెలిపారు. ఎవరైనా ఈ తరహా చర్యలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

గాజు గ్లాసు గుర్తును జనసేనకే రిజర్వ్ చేయాలి

హైకోర్టులో టీడీపీ వ్యాజ్యం

సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని, అందువల్ల రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల్లో గాజు గ్లాసు గుర్తును జనసేన పార్టీకే రిజర్వ్ చేసేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ టీడీపీ హైకోర్టును ఆశ్రయించింది. గాజు గ్లాసు గుర్తును స్వతంత్ర అభ్యర్థులకు గానీ, గుర్తింపు లేని రిజిస్టర్డ్ పార్టీలకు గానీ కేటాయించకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరింది. ఈ వ్యాజ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని ప్రతివాదులుగా చేర్చింది. ఈ వ్యాజ్యంపై గురువారం న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ విచారణ జరపనున్నారు. జనసేన పార్టీ పోటీ చేయని స్థానాల్లో గాజు గ్లాసు గుర్తును స్వతంత్ర, గుర్తింపు లేని రిజిస్టర్డ్ పార్టీ అభ్యర్థులకు కేటాయిస్తే అది తమ కూటమికి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుందని టీడీపీ ఆ పిటిషన్‌లో పేర్కొంది. గాజు గ్లాసు గుర్తు విషయంలో ఎన్నికల సంఘం తాజాగా తీసుకున్న నిర్ణయం జనసేన పార్టీ ఇబ్బందులను తొలగించేవిధంగా లేదని తెలిపింది. నిరక్షరాస్యులైన ఓటర్లు ఎన్నికల్లో గుర్తు ఆధారంగా ఓటు వేస్తారని, ఇప్పుడు గాజు గ్లాసు గుర్తును ఇతరులకు కేటాయిస్తే తమకు నష్టం వాటిల్లుతుందని పేర్కొంది. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరింది.

పోలవరంపై పవన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజల నెత్తిన పోలవరం పన్ను వేసేలా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మండిపడ్డారు. పవన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం ఆయన మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. విభజన చట్టం ప్రకారం జాతీయ ప్రాజెక్టుగా పోలవరం నిర్మాణ బాధ్యత సంపూర్ణంగా కేంద్ర ప్రభుత్వానిదేనని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అయినప్పటికీ నిర్వాసితుల పునరావాసం, పరిహారం నిమిత్తం రాష్ట్ర ప్రజలపై సెస్సు విధిస్తామని పవన్ ప్రతిపాదించడం గర్హనీయమని పేర్కొన్నారు. తమ సర్వస్వాన్ని పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేస్తున్న నిర్వాసితులకు చెల్లించవలసిన పరిహారాన్ని బిచ్చమెత్తి (క్రౌడ్ ఫండింగ్) సేకరిస్తామని పవన్ చెప్పడం సిగ్గుచేటన్నారు.

తంఛన్‌గానే పింఛన్

48,92,503 లబ్ధిదారులకు రూ.1,471.22 కోట్లు డీబీటీ విధానంలో జమ

- మే డే సెలవైనా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
- మరో 16,57,361 మందికి ఇళ్ల వద్దే సచివాలయాల ఉద్యోగులతో కొనసాగిన పంపిణీ
- ఇందుకోసం రూ.474.17 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- అవ్వాతాతలకు మళ్లీ చంద్రబాబు కాలం నాటి కష్టాలు
- వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయకుండా అడ్డుకున్న పచ్చమూక
- సీఎం జగన్ మళ్లీ వస్తేనే ఇబ్బందులు తప్పుతాయని ఆకాంక్ష




సాక్షి, అమరావతి: మే 1న మేడే సందర్భంగా సెలవు అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు తంచనుగా పింఛన్ అందించింది. 48,92,503 లబ్ధిదారులకు రూ.1,471.22 కోట్లను నేరుగా డీబీటీ విధానంలో వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసింది. అలాగే దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మంచానికి లేదా వీల్‌చైర్‌కే పరిమితమైన మరో 16,57,361 మందికి వారి ఇళ్ల వద్దే పింఛన్ల పంపిణీ మొదలుపెట్టింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.474.17 కోట్లను విడుదల చేయగా బుధవారం ఉదయం నుంచి ఆయా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పంపిణీని ప్రారంభించారు. గత ఐదేళ్లుగా వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు వారి ఇళ్ల వద్దే ప్రభుత్వం పింఛన్లను అందజేసింది. అయితే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తమ కుట్రలతో వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ జరగకుండా అడ్డుకున్నారు. దీంతో ప్రతినెలా ఒకటినే ఇళ్ల వద్దే పింఛన్ల సొమ్మును అందుకునే లబ్ధిదారులు గత నెల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఈసారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడంతో అవ్వాతాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. తమ కష్టాలకు చంద్రబాబే కారణమని వారు మండిపడుతున్నారు. ప్రతి నెలా 1నే వలంటీర్లు ఇంటికొచ్చి పింఛన్లు ఇచ్చేవారని.. ఇప్పుడు చంద్రబాబు కుట్రలతో వలంటీర్ల సేవలకు దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పడిన ఇబ్బందులు తమకు పచ్చమూక కుట్రలతో మళ్లీ వచ్చాయని ధ్వజమెత్తుతున్నారు.

అవ్వాతాతలకు పచ్చమూక తెచ్చిన కష్టాలు..

చంద్రబాబు, ఆయన సన్నిహితుల కుట్రలతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి అవ్వాతాతలకు పింఛన్ల నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు లేవు. మండల కేంద్రాలు, పట్టణాలు, నగరాల్లోనే బ్యాంకులు ఉన్నాయి. దీంతో మండల కేంద్రాలకు 10–15 కిలోమీటర్ల దూరంలో గ్రామాల్లో ఉండే అవ్వాతాతలకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఎవరో ఒకరి సహాయం లేకుండా బ్యాంకులకు వారు వెళ్లలేరు. దీంతో ఎవరో ఒకరిని బ్యాంకు వరకు రావాలని సహాయమడగాల్సిన పరిస్థితి. అంతేకాకుండా ఇప్పుడు వేసవి కూడా కావడంతో పింఛన్ల నగదు తీసుకోవాలంటే అవ్వాతాతలు చాలా కష్టపడాల్సి వస్తోంది. గత ఐదేళ్ల నుంచి తమ ఇళ్ల వద్దే పింఛన్ల సొమ్మును నేరుగా అందుకున్న అవ్వాతాతలు బ్యాంకులకు ఎలాగోలా కష్టపడి వెళ్లినా నగదు విత్‌డ్రా చేసుకోవడం తెలియదు. ఇందుకోసం వేరేవారిపైనే ఆధారపడాల్సి ఉంటుంది. ఇలా చంద్రబాబు, ఆయన ముఠా పన్నిన కుట్రలతో అవ్వాతాతలకు కష్టాలు తప్పడం లేదు.

పింఛన్ కోసం వెళ్లి మృత్యువాత



పింఛన్ కోసం అన్నమయ్య జిల్లా రాయచోటి కెనరా బ్యాంక్ దగ్గరికి వచ్చిన ముద్రగడ్డ సుబ్బన్న (80) బుధవారం వేసవి తాపానికి గురై కుప్పకూలి చనిపోయాడు. లక్కిరెడ్డిపల్లి మండలం కాకులవరం గ్రామం పిచ్చుకగుంట్లపల్లెకు చెందిన సుబ్బన్న 1వ తేదీ కావడంతో తన పెన్షన్ డబ్బులు బ్యాంకులో జమ అయ్యాయో, లేదో తెలుసుకోవడానికి బ్యాంకుకు వెళ్లాడు. అయితే మే డే కారణంగా బ్యాంకుకు సెలవు కావడంతో తిరుగుప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో ఎండ వేడికి తాళలేక బ్యాంకు సమీపంలోనే సొమ్మసిల్లి పడిపోయాడు. సమీపంలో ఉన్న వ్యక్తులు నీళ్ల చల్లి మంచినీరు తాగించినా ప్రాణాలు దక్కలేదు.

పింఛను నేరుగా ఇవ్వడం లేదని మృతి



వలంటీర్ల ద్వారా నేరుగా పింఛన్ ఇవ్వనీయకుండా చంద్రబాబు కుట్రలు చేశారని మనస్తాపానికి గురైన ఒక వృద్ధుడు గుండెపోటుతో మరణించాడు. నంద్యాల జిల్లా ఆత్మకూరు కళ్లా వీధికి చెందిన ఖలీల్ బేగ్ (75) ప్రతి నెలా ఇంటి వద్దనే వలంటీర్ ద్వారా పింఛన్ అందుకునేవాడు. అయితే ఈసారి పింఛన్ బ్యాంకులో వేస్తున్నారని.. అక్కడి నుంచి తెచ్చుకోవాలని తెలియడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అవే ఆలోచనలతో ఇంటిలోనే గుండెపోటుకు గురై మృతి చెందాడు.

చంద్రబాబు కుట్రలతో ఇబ్బందులు



నాకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. ఆధార్‌కు లింక్ చేసినా ఇప్పుడు నా బ్యాంక్ ఖాతా పని చేయడం లేదు. పింఛన్ వస్తుందో, లేదో అని భయంగా ఉంది. రెండు నెలల క్రితం వరకు వలంటీర్లు ఇంటికి వచ్చి తలుపు కొట్టి పింఛన్ రూ. 3 వేలు చేతిలో పెట్టేవారు. చంద్రబాబు కుట్రలకు మాలాంటి ముసలోళ్లు ఇబ్బందులు పడుతున్నారు.

– గుంజి లక్ష్మీదేవి

ఇంత ఎండలో బ్యాంకుకు ఎలా వెళ్లేది?



పింఛన్ సొమ్మును ఈసారి బ్యాంక్‌లో వేస్తారని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. ఎండలు మండిపోతున్నాయి. బయటకు రావాలంటేనే కష్టంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో బ్యాంక్‌కు వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలంటే నాలాంటి వృద్ధులకు ఇబ్బందే. వలంటీర్లు ఉన్నప్పుడు ఇంటి వద్దకే వచ్చి ఇచ్చేవారు. మాలాంటి వారికి ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. చంద్రబాబు వల్లే మాకీ కష్టాలు.

– బొబ్బ సుందరమ్మ, ఆత్మకూరు, పల్నాడు జిల్లా

వలంటీర్ ఉంటే ఉదయాన్నే పింఛన్..



నాకు వితంతు పింఛన్ వస్తోంది. మంచం మీద నుంచి పైకి లేవలేను. వలంటీర్ ఉన్నప్పుడు ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. బాబు ఓర్వలేక వలంటీర్లను అడ్డుకున్నారు. ఇప్పుడు పింఛన్‌ను బ్యాంకు ఖాతాలో వేస్తామంటున్నారు. నేను బ్యాంక్‌కు వెళ్లలేను. ఏం చేయాలో అర్థం కావడం లేదు. జగనన్న వస్తే మళ్లీ కష్టాలు తీరతాయి.

– తాతపూడి రాహేలమ్మ, వెలిగండ్ల, ప్రకాశం జిల్లా

బాబు మంచి చేయడు.. చేయనివ్వడు..



వలంటీర్ల ద్వారా మాకు వచ్చే పింఛన్లను అడ్డుకుంది చంద్రబాబే. ఆయన మంచి చేయడు.. ఎవరైనా చేస్తుంటే చేయనివ్వడు. ఐదేళ్లుగా ఇంటివద్దే పింఛన్ అందుకున్నాను. గత రెండు నెలలుగా చంద్రబాబు, ఆయన సన్నిహితుడు నిమ్మగడ్డ రమేశ్ కుట్రలతో మాకు కష్టాలు తెచ్చిపెట్టారు. ఇప్పుడు పింఛన్ తీసుకోవాలంటే బ్యాంకుకు వెళ్లాల్సి వస్తోంది. నా బ్యాంకు ఖాతా ఇప్పుడు వినియోగంలో కూడా లేదు.

– గంగాబాయి, కార్వేటినగరం మండలం, చిత్తూరు జిల్లా

మా నాన్నను ఓడించండని నేను అనలేదు

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కుమారుడు రవికుమార్



మాడుగుల (అనకాపల్లి జిల్లా): తన తండ్రిని ఓడించండని తాను అన్నట్టు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తల్లో నిజం లేదని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు కుమారుడు బూడి రవికుమార్ స్పష్టం చేశారు. ఇండిపెండెంట్‌గా పోటీలో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థి బూడి రవికుమార్ బుధవారం మాడుగులలో విలేకరులతో మాట్లాడారు. కన్నకొడుక్కి న్యాయం చేయలేనివాడు ఓటేసిన ప్రజలకు ఏం చేస్తాడని తాను అన్నట్టు వచ్చిన కథనంలో వాస్తవం లేదని చెప్పారు. తాను ఫేస్‌బుక్‌లోగానీ, వాట్సప్‌లోగానీ సమాచారం ఇవ్వలేదన్నారు. మాడుగులలో జరుగుతున్న పరిణామాలను అడ్డం పెట్టుకుని కొంతమంది తాను తండ్రిపై కామెంట్ చేసినట్టు సృష్టించారని చెప్పారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్నానని, అది తన వ్యక్తిగత విషయమని, అంతకు మించి ఎలాంటి వివాదాలతో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు.

జగన్ వల్లే వడ్డెర్లకు రాజకీయ గుర్తింపు

వడ్డెర సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రమణ

రాజంపేట టౌన్: సీఎం వైఎస్ జగన్‌వల్లే వడ్డెర్లకు రాజకీయంగా గుర్తింపు లభించిందని వడ్డెర సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వడ్డే రమణ తెలిపారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రెండు ఎమ్మెల్సీ, ఆరు మున్సిపల్ చైర్మన్, మైనింగ్ కార్పొరేషన్‌లో నలుగురికి డైరెక్టర్ పదవులు ఇచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామస్థాయిలో వడ్డెర్లను రాజకీయంగా బలోపేతం చేసేందుకు ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను ఇచ్చారని తెలిపారు. అందుకే తామంతా జగన్ వెన్నంటి ఉంటామన్నారు. బాబు హయాంలో వడ్డెర్లను విస్మరించారని, అందువల్ల అప్పట్లో తాము రాజకీయంగా ఎదుగు, బొదుగులేకుండా ఉండాల్సి వచ్చిందని చెప్పారు. గతంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వడ్డెర్లను ఎంతో ప్రోత్సహించారని గుర్తుచేశారు. అలాంటి కుటుంబానికి తాము ఎప్పటికి రుణపడి ఉంటామని ఆయన తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు శివయ్య, సర్పంచ్ హరి పాల్గొన్నారు.

జనసేన వ్యాజ్యాన్ని మూసేసిన హైకోర్టు

- ఈసీ నిర్ణయంతో తదుపరి విచారణ అవసరం లేదని తేల్చిన న్యాయస్థానం
- నిర్దేశిత స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులకు వేరే గుర్తులు కేటాయించాలని ఎన్నికల సంఘం ఆదేశాలు



సాక్షి, అమరావతి: గాజు గ్లాసు గుర్తును స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ జనసేన పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు మూసివేసింది. కూటమి మొత్తానికి వర్తించే విధంగా కాకుండా కేవలం జనసేన పార్టీకి మాత్రమే గాజు గ్లాసు గుర్తును పరిమితం చేస్తూ నిర్ణయం తీసుకున్నామని.. జనసేన పార్టీ పోటీ చేస్తున్న 21 అసెంబ్లీ స్థానాల పరిధిలో ఉన్న లోక్‌సభ నియోజక వర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులు, గుర్తింపు లేని రిజిస్టర్డ్ పార్టీలకు గాజు గ్లాసు గుర్తు కేటాయించవద్దని రిటర్నింగ్ అధికారులను ఆదేశించామని కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం హైకోర్టుకు లిఖితపూర్వకంగా నివేదించింది. అదేవిధంగా జనసేన పోటీ చేస్తున్న రెండు పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న స్వతంత్ర, గుర్తింపు లేని రిజిస్టర్డ్ పార్టీలకు కూడా గాజు గ్లాసు గుర్తును కేటాయించవద్దని ఆదేశాలు ఇచ్చామని ఎన్నికల సంఘం హైకోర్టుకు వివరించింది. గాజు గ్లాసు గుర్తు విషయంలో జనసేన పార్టీ పెట్టుకున్న వినతిపై ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పింది. ఎన్నికల సంఘం సమర్పించిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు జనసేన పిటిషన్‌పై తదుపరి విచారణ ఏదీ అవసరం లేదని స్పష్టం చేసింది. ఆ పిటిషన్‌ను మూసివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా.. 24 గంటల్లోగా పరిష్కరిస్తామని న్యాయస్థానం ఆదేశించింది. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా.. కేంద్ర ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. జనసేన వినతిపై నిర్ణయం వెలువరించామని చెప్పారు. జనసేనకు ఇబ్బంది లేకుండా నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఆ స్థానాల్లో స్వతంత్రులకు వేరే గుర్తులు కేటాయించండి

జనసేన పోటీ చేస్తున్న పార్లమెంటరీ స్థానాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలోను, ఆ పార్టీ పోటీ చేస్తున్న 21 అసెంబ్లీ స్థానాలకు చెందిన పార్లమెంటరీ స్థానాల్లోను ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తు కేటాయిస్తే.. ఎన్నికల నిబంధన 10 (5) ప్రకారం వేరే గుర్తులను కేటాయించాలంటూ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

చంద్రబాబు, పవన్‌పై కఠినచర్యలు తీసుకోండి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మీనాకు వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఎన్నికల నియమావళిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై కఠినచర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని (ఈసీని) వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మంగళవారం వారు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ గ్రీవెన్స్ సెల్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి, లీగల్ సెల్ నేత శ్రీనివాసరెడ్డి బుధవారం ఫిర్యాదు చేశారు. ఆ వ్యాఖ్యలకు సంబంధించిన ఆధారాలు అందజేశారు. దెందులూరు, తెనాలిల్లో నిర్వహించిన ప్రచారసభల్లో చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా సీఎం జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఉంగుటూరు, పెద్దాపురం సభల్లో పవన్‌కళ్యాణ్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. నియమావళిని ఉల్లంఘించిన వారిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్లను ప్రభావితం చేసేలా.. టీడీపీ అభ్యర్థులకు అనుకూలంగా మంగళవారం 'ఈనాడు'లో ప్రచురించిన వార్తలను పెయిడ్ ఆర్టికల్స్‌గా పరిగణించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు మీడియాతో మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై బాబు, పవన్ అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ యాక్ట్ ద్వారా ప్రజల ఆస్తులను సీఎం జగన్ తీసుకుంటున్నారంటూ అసత్య ప్రచారం చేస్తూ ప్రజల్లో అయోమయం సృష్టిస్తున్నారని విమర్శించారు. బాబు, పవన్ బజారు రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు.

యాక్టివ్ పవర్ కార్పొరేషన్‌కు హైకోర్టు నోటీసులు

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం వద్ద బుడమేరు డైవర్షన్ కెనాల్‌పై ఆంధ్రజ్యోతి దినపత్రిక యజమాని వేమూరి రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించిన మినీ హైడల్ పవర్ ప్లాంట్ అండ్ రెగ్యులేటర్‌ను తొలగించేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు స్పందించింది. ప్రతివాదులుగా ఉన్న యాక్టివ్ పవర్ ప్లాంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు, జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తదితరులకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 20కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ జగడం సుమతి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బుడమేరు డైవర్షన్ కెనాల్‌పై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన మినీ హైడల్ పవర్ ప్లాంట్‌ను తొలగించే విషయంలో అధికారులు స్పందించడం లేదని, తగిన చర్యల నిమిత్తం ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ విజయవాడకు చెందిన స్వర్ణాంధ్ర పత్రిక ప్రచురణకర్త, సీనియర్ జర్నలిస్ట్ కేబీజీ తిలక్ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ దుర్గాప్రసాదరావు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ప్రభుత్వం తరఫున హాజరైన అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరామ్ ఈ వ్యాజ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు. అందుకు అంగీకరించిన ధర్మాసనం ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. యాక్టివ్ పవర్‌కు వ్యక్తిగతంగా నోటీసులు అందచేసేందుకు పిటిషనర్‌కు అనుమతి ఇచ్చింది.



బస్తర్‌లో నేలకొరిగిన తొలితరం మావోయిస్టు

టేక్‌మెటా ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తెలంగాణ నేతలు.. మృతుల్లో చీమల నర్సయ్య, కాసరవెల్లి వినయ్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/బెల్లంపల్లి: బస్తర్‌లో మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్–కాంకేర్ సరిహద్దులో టేక్‌మెటా సమీపంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో బస్తర్‌లో నక్సలైట్ ఉద్యమాన్ని ప్రారంభించిన తొలితరం నేతల్లో ఒకరైన చీమల నర్సయ్య అలియాస్ జోగన్న, కాసరవెల్లి వినయ్ అలియాస్ రవి నేలకొరిగారు. మృతుల ఫొటోలు బయటకు రావడంతో వారి కుటుంబసభ్యులు ఛత్తీస్‌గఢ్‌కు పయనమయ్యారు.

పార్టీ విస్తరణలో నర్సయ్య కీలకపాత్ర

1980వ దశకంలో నక్సలైట్ ఉద్యమం తెలంగాణలో ఊపందుకుంది. కొండపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పట్టు సాధించింది. ఇదే సమయంలో ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రభుత్వం నిర్బంధం పెంచింది. ఈ క్రమంలో తెలంగాణలో తొలి ఎన్‌కౌంటర్ 1982 చివరలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చినమెట్‌పల్లి దగ్గర జరగ్గా, అంకం నారాయణ, మాసం గజేందర్ చనిపోయారు. ఆ వెంటనే 1983 ఫిబ్రవరి 3న పెద్దపల్లి జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత గణపతి సమకాలికుడు బయ్యపు దేవేందర్‌రెడ్డి మరణించారు. ఆ తర్వాత ఏప్రిల్‌లో జరిగిన మూడో ఎన్‌కౌంటర్ తెలంగాణ సరిహద్దు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అంకీస దగ్గర జరగగా పెద్ది శంకర్ ప్రాణాలు కోల్పోయారు. దీంతో చైనాలో మావో జెడాంగ్ అనుసరించిన వ్యూహం తరహాలో మైదాన ప్రాంతంతోపాటు అటవీ ప్రాంతంలో మరో షెల్టర్ జోన్ కోసం ఆనాటి నక్సలైట్లు అన్వేషణ సాగించారు. ఈ క్రమంలో బస్తర్ అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని తొలి బ్యాచ్‌ను 1982లో అక్కడకు పంపారు. అలా వెళ్లిన తొలితరం నాయకుల్లో చీమల నర్సయ్య కూడా ఉన్నారు. ఇతని స్వగ్రామం పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని జయ్యారం. 42 ఏళ్లుగా బస్తర్‌లో పనిచేస్తూ సాయుధ విప్లవానికి బస్తర్ అడవులను కేంద్ర స్థానంగా నిలపగలిగారు. ఇప్పటికీ 'రెడ్ కారిడార్'కు బస్తర్ కీలకంగా ఉంది.

సికాస నుంచి వినయ్

కాసరవెల్లి వినయ్‌ని పార్టీ అగ్రనేత కటకం సుదర్శన్ శిష్యుడిగా చెప్పుకుంటారు. వినయ్ తండ్రి రాజయ్యకు సింగరేణిలో ఉద్యోగం రావడంతో కుటుంబంతో సహా బెల్లంపల్లికి వచ్చాడు. 1990లో విద్యార్థి ఉద్యమాల ద్వారా వినయ్ విప్లవాల వైపు ఆకర్షితుడయ్యారు. ఆ తర్వాత సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస)లో కీలకంగా పనిచేశారు. నిర్బంధం ఎక్కువ కావడంతో చెన్నూర్ దళంలో కొంతకాలం పనిచేశాడు. విప్లవ విస్తరణ, మిలిటరీ శిక్షణ, ఆయుధాల తయారీ, సాహిత్యం తదితర పనుల కోసం వినయ్‌ని పార్టీ బస్తర్‌కు పంపించింది. 30 ఏళ్లుగా ఆయన బస్తర్‌లో పార్టీని విస్తరించారు. వినయ్ మరణవార్త తెలుసుకొని ఆయన సోదరుడు వెంకటేష్, కుటుంబ సభ్యులు బుధవారం బస్తర్‌కు బయలుదేరారు. గురువారం వినయ్ మృతదేహాన్ని అతడి స్వగ్రామం హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి తరలించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.





బొబ్బిలిలో ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఏలూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

ఇవ్వడమే జగన్‌కు తెలుసు

జగన్ భూములిచ్చేవాడే కానీ.. నీలా లాక్కునేవాడు కాదు చంద్రబాబూ.. • బొబ్బిలి, పాయకరావుపేట, ఏలూరు సభల్లో సీఎం జగన్

జగన్‌ను చంపేస్తే తప్పేమిటంటున్నాడు..

మీ బిడ్డ జగన్‌ను ఓడించలేమని, ఆ పేద అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, వారి కుటుంబ సభ్యులు మోసపోవడానికి సిద్ధంగా లేరని, ఎంత ప్రలోభపెట్టినా తన మాటలు నమ్మట్లేదని గ్రహించిన చంద్రబాబు నోట జగన్‌ను చంపేస్తే ఏమవుతుంది? అన్నమాట వినిపిస్తోంది. నాడు వైఎస్సార్ గాల్లో కలిసిపోతాడని అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు వ్యాఖ్యలు చేశాడు. నేడు జగన్‌ను చంపేస్తే తప్పేమిటని అంటున్నాడు. రాజకీయాల్లో ఇంతకన్నా సిగ్గుచేటు ఉంటుందా?

- బొబ్బిలి సభలో సీఎం జగన్







ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి విజయనగరం ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి చిన్నఅప్పలనాయుడు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నానీని గెలిపించాలని కోరుతున్న సీఎం వైఎస్ జగన్

దీవించండి..

బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి చిన్నఅప్పలనాయుడు, విజయనగరం ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్ యాదవ్, ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నానీని మీరంతా ఆశీర్వదించి గొప్ప మెజార్టీతో గెలిపించాలని ప్రార్థిస్తున్నా.

సాక్షి ప్రతినిధి, విజయనగరం/సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'జగన్ ఎలాంటివాడో నీకు తెలియదేమో కానీ ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదకూ తెలుసు చంద్రబాబూ! జగన్ భూములు ఇచ్చేవాడే కానీ నీలా భూములు లాక్కునేవాడు కాదు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అంటే చంద్రబాబుకు తెలియదు. వందేళ్ల క్రితం బ్రిటీష్ హయాంలో జరిగిన సర్వే తర్వాత ఇప్పుడు చేపట్టిన సర్వేతో పక్కాగా రికార్డులు సృష్టించి రైతులకు ఇబ్బందులు లేకుండా చేయడమే దీని ఉద్దేశం. 15 వేల గ్రామ సచివాలయాల్లో 15 వేల మంది సర్వేయర్లను నియమించి ఇలా సర్వే చేసిన పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు. రైతన్నలు కోర్టులు, రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూ డబ్బులు ఖర్చు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని మార్చి ప్రతి ఒక్కరికీ వారి భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలనే లక్ష్యంతో రీ సర్వే ద్వారా సరిహద్దు రాళ్లను నాటించి రికార్డులు అప్‌డేట్ చేసి ఆ పత్రాలన్నీ రిజిస్ట్రేషన్ చేసి రైతన్నలకు ఇస్తున్నాం. ఇంత గొప్ప కార్యక్రమానికి చేతనైతే మద్దతు పలకాలేగానీ చంద్రబాబు దుష్ప్రచారం చేస్తున్నారు. మనం అమలు చేసిన పథకాల గురించి చెబుతుంటే చంద్రబాబుకు కోపం వస్తోంది. గత 59 నెలల కాలంలో ఎన్నడూ లేని విప్లవాత్మక సంస్కరణలను మీ బిడ్డ తెచ్చినందుకే ఆయనకు కోపం వస్తోంది. ఈ ఎన్నికల్లో బాబును ఓడించడమంటే 'పేదలను గెలిపించడమే' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పష్టం చేశారు. నేరప్రవృత్తికి చంద్రబాబు నిలువెత్తు నిదర్శనమని, వెన్నుపోట్లు, హత్యలతోనే ఆయన రాజకీయాలు ముడిపడి ఉంటాయని ధ్వజమెత్తారు. సొంతమామ ఎన్టీఆర్‌ను, వంగవీటి రంగాను, పింగళి దశరథరామ్‌ను, ఐఏఎస్ అధికారి రాఘవేంద్రరావును కుట్రలతోనే కడ తేర్చారన్నారు. బుధవారం విజయనగరం జిల్లా బొబ్బిలి, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, ఏలూరులో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో సీఎం జగన్ మాట్లాడారు.

తట్టుకోలేకపోతున్నారు..

పేదల గురించి జగన్ మాట్లాడుతుంటే పెత్తందారులైన చంద్రబాబు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, దత్తపుత్రుడు, వదినమ్మకు చాలా బాధగా, విపరీతమైన కోపంగా ఉంటుంది. జగన్ ఎప్పుడూ పేదలు.. పేదలు అంటుంటే విని తట్టుకోలేక పోతున్నారు. ఈ రోజు జరుగుతున్నది కులాల మధ్య యుద్ధం కాదు. రాష్ట్రంలో క్లాస్ వార్ జరుగుతుంది. పేదలు ఒక ఒకవైపు, పెత్తందారులు మరోవైపు ఉన్నారు. కులం పరంగా, ఫలానా పార్టీ పట్ల అభిమానం వల్ల కావొచ్చు.. గత ఎన్నికల్లో నాకు ఓటు వేయని వారికి కూడా విజ్ఞప్తి చేస్తున్నా. ఇంటికి వెళ్లాక మీ కుటుంబానికి ఎవరి వల్ల మంచి జరిగిందో మీ కుటుంబ సభ్యులతో కలిసి కూర్చుని చర్చించండి. ఎవరు ఉంటే ఈ మంచి కొనసాగుతుందో ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నా.

- ఏలూరు సభలో సీఎం జగన్

ఇంటింటి భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలివి

మరో 13 రోజుల్లో ఎన్నికల యుద్ధం జరగబోతోంది. ఇది జగన్‌కు, చంద్రబాబుకు మధ్య జరుగుతున్న యుద్ధం కాదు.. పేదలకు, చంద్రబాబు మోసాలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి కాదు. రాబోయే ఐదేళ్ల పాటు మీ ఇంటింటి భవిష్యత్తు, పథకాల కొనసాగింపును నిర్ణయించేవి. ఓటుతో మీ తలరాతలు మారతాయి. ఈ ఎన్నికల్లో జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ కొనసాగింపు. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నీ ముగింపే, మళ్లీ మోసపోవడమే. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. బాబుకు ఓటు వేయడమంటే కొండచిలువ నోట్లో తలకాయ పెట్టడమే. పేదలంటే బాబు ముఖాకు కోపం. గతంలో ఎప్పుడూ జరగని విధంగా రూ.2.70 లక్షల కోట్లు డీబీటీతో నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లో జమ చేశాం. మీ బిడ్డ ఇచ్చింది ఏకంగా 2.31 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు. మేనిఫెస్టోలో చెప్పిన 99 శాతం హామీలను అమలు చేశాం. నేను వరుసబెట్టి మనందరి ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీమ్‌ల లిస్టు చదువుతుంటే చంద్రబాబుకు పిచ్చి కోపం వస్తోంది. మీరంతా చూస్తున్నారు కదా ఆ కోపాన్ని.. ఆయనకు మనమీద ఎందుకంత పిచ్చికోపం వస్తోందంటే.. గతంలో ఎన్నడూ చూడని విధంగా మీ బిడ్డ విప్లవాలు తెచ్చాడు కాబట్టే. నేను చెబుతున్న విషయాలు గతంలో ఎప్పుడైనా అమలు జరిగాయో లేదో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయమని కోరుతున్నా.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ విషయంలో దుష్ప్రచారం జరుగుతోంది. జగన్ మీ భూములు కాజేస్తాడంటూ ప్రతి ఒక్కరికీ మెసేజ్‌లు పంపుతూ, ఫోన్లు చేసి చెబుతున్నారు. అయ్యా చంద్రబాబూ.. జగన్ ఎలాంటి వాడో నీకు తెలియదేమో కానీ ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదకూ తెలుసు. జగన్ భూములు ఇచ్చేవాడే కానీ నీలా భూములు లాక్కునేవాడు కాదు

- పాయకరావుపేట సభలో సీఎం జగన్

జగన్‌ను చంపితే ఏమవుతుందంటున్న బాబు

మీ జగన్ ప్రజలకు ఏం చేశాడో గుర్తుచేస్తూ ప్రచారం చేస్తున్నాడు. చంద్రబాబు మాత్రం ఏం మాట్లాడుతున్నాడో మీరంతా గమనిస్తూనే ఉన్నారు. రెండు రోజుల క్రితం నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో ఇదే పెద్దమనిషి రేపు జగన్‌ను చంపితే ఏం జరుగుతుంది? అని వ్యాఖ్యలు చేశాడు. ఆయన మానసిక పరిస్థితి, ఆ ఆలోచనలు ఎలా ఉన్నాయో గమనించాలని కోరుతున్నా. ఏమయ్యా చంద్రబాబూ..! ప్రజలు నీకు ఎందుకు ఓటు వేయాలి? అని నేను అడుగుతుంటే నీ సమాధానం అదా?

అక్కచెల్లెమ్మలే రక్షించుకుంటారు..

అయ్యా చంద్రబాబూ.. నువ్వు అనుకుంటే సరిపోదు. ఈ 59 నెలల్లో మంచి జరిగిన ఆ కోట్ల మంది అక్కచెల్లెమ్మల కుటుంబాలు జగన్‌కు తోడుగా ఉన్నాయి. ప్రతి ఇంట్లోనూ జగన్‌కు తోడుగా, అండగా ఉన్నారయ్యా చంద్రబాబూ! వారి జగన్‌ను వారే రక్షించుకుంటారు. నాకు నీ మాదిరిగా జడ్ ప్లస్, జడ్ డబుల్ ప్లస్ సెక్యూరిటీ అక్కర్లేదయ్యా. అక్కచెల్లెమ్మల కుటుంబాలకు మంచి చేస్తూ లంచాలు, వివక్ష లేకుండా ఇచ్చిన రూ.2.70 లక్షల కోట్ల డీబీటీ బటన్‌లే నాకు శ్రీరామరక్ష. పిల్లలు బాగుండాలని ఇచ్చిన అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, అక్కచెల్లెమ్మలు బాగుండాలని ఆరాటపడుతూ అందించిన చేయూత, ఆసరా, సున్నావడ్డీ, 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల ఇళ్ల నిర్మాణం.. ఇవన్నీ నాకు రక్ష అని చంద్రబాబుకు చెబుతున్నా. నా అవ్వాతాతలకు మంచి చేస్తూ ఇంటివద్దే అందించిన పెన్షన్లతో దేవుడికి చేస్తున్న ప్రార్థనలే నాకు శ్రీరామ రక్ష. నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల ప్రార్థనలే వారి బిడ్డ జగన్‌కు శ్రీరామరక్ష. మంచిని అందుకున్న నా రైతన్నలు ఆ భూమాత, పంచ భూతాల సాక్షిగా చేస్తున్న ప్రార్థనే నాకు శ్రీరామ రక్ష.

జగన్ మార్కు సామాజిక న్యాయం

అసెంబ్లీ, ఎంపీ సీట్లు కలిపి మొత్తం 200 స్థానాలకుగానూ 100 స్థానాల్లో నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలకు టికెట్లు ఇచ్చాం. మంత్రి పదవుల్లో ఏకంగా 68 శాతం నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే ఇచ్చాం. ఐదుగురు డిప్యూటీ సీఎంలు ఉంటే నాలుగు పదవులు ఆ వర్గాలకే కేటాయించి గౌరవించాం. నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం రిజర్వేషన్లు వారికే కల్పిస్తూ చట్టం తెచ్చాం. ఇంత సామాజిక న్యాయం, తోడుగా ఉన్న పరిస్థితులు గతంలో ఎప్పుడైనా జరిగాయా? వలంటీర్లు మళ్లీ ఇంటికే రావాలన్నా, పేదవాడి భవిష్యత్తు మారాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు, వివక్ష లేని పాలన జరగాలన్నా, మన పిల్లలు, మన చదువులు, మన బడులు బాగుపడాలన్నా, మన వైద్యం, మన వ్యవసాయం మెరుగుపడాలన్నా రెండు బటన్లు ఫ్యాను గుర్తు మీద నొక్కాలి. 175కు 175 అసెంబ్లీ స్థానాలు, 25కు 25 ఎంపీ స్థానాల్లో గెలిపించాలి. మీ అందరికీ మంచి చేసిన ఫ్యాను ఇంట్లోనే ఉండాలి. చెడు చేసిన సైకిల్ ఇంటి బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ సింక్ లోనే ఉండాలి.

బాబు వ్యాఖ్యలు నేరప్రవృత్తికి నిదర్శనం

ఆ రోజు నా తండ్రి రాజశేఖరరెడ్డి చేస్తున్న మంచి పనులు, ఆయనకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక అక్కసుతో అసెంబ్లీ సాక్షిగా నాన్ననుద్దేశించి 'నువ్వు ఆ గాలిలోనే కలిసిపోతావ్..!' అన్న నీ వ్యాఖ్యలను నేను ఎప్పటికీ మర్చిపోలేను చంద్రబాబూ. నాడు నా తండ్రిని, నేడు నన్ను ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక నువ్వు మాట్లాడుతున్న మాటలు నీ దిగజారుడుతనానికి, నీ నేర ప్రవృత్తికి అద్దం పడుతున్నాయి.

అబద్ధాలకు రెక్కలు...

చంద్రబాబు తన అబద్ధాలు, మోసాలకు రెక్కలు కడుతున్నాడు. అవ్వాతాతలకు ఇంటికే వచ్చే పెన్షన్‌ను అడ్డుకుని మనపై నెపం వేస్తున్నాడు. ఏ రోజైనా ఆయన అవ్వాతాతల బాధలు, కష్టాలను పట్టించుకున్నాడా? ఏనాడైనా ఇంటికే పెన్షన్ ఇచ్చాడా? తన మనిషి నిమ్మగడ్డ రమేశ్‌తో కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖలు రాయించి ఇంటివద్దే అందిస్తున్న పెన్షన్లను అడ్డుకున్నాడు. ఆ అవ్వాతాతలు తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టడంతో మీబిడ్డపై నెపం మోపుతున్నాడు.

మీ బిడ్డ తెచ్చిన కొన్ని విప్లవాలివీ..

- అవ్వాతాతలకు ఇంటికే వచ్చే రూ.3 వేల పెన్షన్ కానుక విప్లవమా? కాదా?
- గవర్నమెంట్ బడుల్లో నాడు–నేడు, ఇంగ్లీష్ మీడియం, బడి తెరిచే సమయానికే విద్యా కానుక, బైజూస్ కంటెంట్, 3 తరగతి నుంచే టోఫెల్ క్లాసులు, సబ్జెక్ట్ టీచర్లు, సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణం, 8వ తరగతికి వచ్చేసరికి పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు, 6వ తరగతి నుంచి డిజిటల్ బోధన, ఐఎఫ్‌పీలు లాంటివి విప్లవమా? కాదా?
- తొలిసారిగా పిల్లల చేతుల్లో బైలింగ్యువల్ టెక్స్ట్‌బుక్స్, పూర్తి ఫీజులు చెల్లిస్తూ ఇంజనీరింగ్, డాక్టర్, డిగ్రీ లాంటి ఉన్నత చదువులు అభ్యసించే 93శాతం మందికి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, అంతర్జాతీయ వర్సిటీలు అందించే ఆన్‌లైన్ సర్టిఫైడ్ కోర్సులను మన కరిక్యులమ్‌లో భాగం చేయడం లాంటివి విప్లవాలు కాదా?
- మీ పిల్లలను బడికి పంపించండమ్మా.. మీకు తోడుగా మీబిడ్డ ఉన్నాడంటూ అమ్మఒడి అందించడం గతంలో ఎప్పుడైనా జరిగిందా?
- అక్కచెల్లెమ్మలు తమ కాళ్ల మీద తాము నిలబడేలా చేయూత, కాపునేస్తం, సున్నావడ్డీ, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీతో పాటు 31లక్షల ఇళ్ల పట్టాలు వారి పేరిటే రిజిస్ట్రేషన్, 22 లక్షల ఇళ్ల నిర్మాణాలు, గ్రామంలోనే మహిళా పోలీస్, భద్రత కోసం దిశ యాప్, నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టుల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది మీ జగన్ కాదా? ఇవన్నీ విప్లవాలు అవునా? కాదా?
- మొట్టమొదటిసారిగా రైతన్నలకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా, ఆర్బీకేలు, ఈ–క్రాప్, ఉచిత పంటల బీమా, పగటిపూట 9 గంటలపాటు నాణ్యమైన ఉచిత విద్యుత్, నష్టపోతే సీజన్ ముగిసేలోగా ఇన్‌పుట్ సబ్సిడీ, ఆర్బీకేల ద్వారా మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు, జీఎల్‌టీ, ఆక్వా రైతులకు రూపాయిన్నరకే కరెంట్, ఆయిల్‌పామ్ రైతులకు మెరుగైన ధర ఇచ్చిందెవరు? ఇవన్నీ విప్లవాలు కాదా?
- వైద్యం కోసం అప్పులపాలు కాకుండా విస్తరించిన ఆరోగ్యశ్రీతో రూ.25 లక్షలదాకా ఉచిత వైద్యం, ఆపరేషన్ తరువాత విశ్రాంతి సమయంలో జీవన భృతికి ఇబ్బంది లేకుండా ఆరోగ్య ఆసరా, మన గ్రామంలోనే విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, ఇంటింటినీ జల్లెడ పడుతూ ఆరోగ్య సురక్ష లాంటివి అమలు చేసింది మీ బిడ్డ పాలనలో కాదా? ఇవన్నీ వైద్య రంగంలో విప్లవాలు కాదా?
- మత్స్యకార భరోసా, నేతన్ననేస్తం, వాహనమిత్ర, చేదోడు, తోడు, ఎంఎస్ఎంఈలకు సంపూర్ణ మద్దతు, లా నేస్తం లాంటివి తెచ్చిందెవరు?
- గ్రామ స్వరాజ్యానికి అర్థం చెబుతూ ఈరోజు ఊరిలోకి అడుగుపెట్టిన వెంటనే గ్రామ సచివాలయం కనిపిస్తోంది. ఏకంగా 600 రకాల సేవలు మన ఇంటివద్దే అందుతున్నాయి. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి 60–70 ఇళ్లకు పెన్షన్ నుంచి పౌరసేవలు, పథకాలు, రేషన్ దాకా డోర్ డెలివరీ అవుతున్నాయి. అదే గ్రామంలో నాలుగు అడుగులు ముందుకేస్తే విలేజ్ క్లినిక్, నాడు–నేడుతో మారిన ఇంగ్లీష్ మీడియం బడులు, గ్రామానికే ఫైబర్ గ్రిడ్, నిర్మాణంలో ఉన్న డిజిటల్ లైబ్రరీలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ గతంలో ఉన్నాయా?
- మీ బిడ్డ ప్రభుత్వం రాకముందు గవర్నమెంట్ ఇచ్చే డబ్బులు లంచాలు, తిరుగుళ్లు లేకుండా నేరుగా మీ చేతికే అందుతాయంటే ఎవరైనా నమ్మేవారా? నా అక్కచెల్లెమ్మలు, వాళ్ల కుటుంబాలు, పిల్లలు బాగుండాలని 130 సార్లు బటన్ నొక్కి ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు పారదర్శకంగా అందించడం ఓ విప్లవాత్మక చరిత్ర కాదా?

పేదలకు పథకాలు అందాలా.. లేదా?

చంద్రబాబును అడుగుతున్నా.. ఒక ముఖ్యమంత్రి, ఒక నిజమైన నాయకుడు, ఒక నిజమైన లీడర్ రాష్ట్రంలో 90 శాతం మంది పేదలకు ఈ రోజు మంచి చేయడం కొనసాగాలా.. వద్దా? ఎవరు మేలు చేశారు? నిజమైన నాయకుడు ఎవరో ఆలోచన చేయాలని అందరినీ కోరుతున్నా. రాష్ట్రంలో తెల్లరేషన్ కార్డులున్న కుటుంబాలు 1.44 కోట్లు. అంటే జనాభాలో 90 శాతం. వీరందరూ పేదలు కాదా? వీరికి పథకాలు అందాలా? లేదా? ఈరోజు రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ కార్డులున్న వారు జనాభాలో 95 శాతం ఉన్నారు. వీరికి పథకాలు అందాలా లేదా? ఉన్నత చదువులు చదువుతున్న 93 శాతం మందికి పూర్తి ఫీజుల చెల్లిస్తూ విద్యాదీవెన, ఖర్చులకు వసతి దీవెన అందాలా.. లేదా? పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న నా అక్కచెల్లెమ్మలు 1.05 కోట్ల మంది పేదలు కాదా? వీరందరికీ పథకాలు అందాలా.. లేదా? రాష్ట్రంలో అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి అక్కలు 66 లక్షల మందికిపైగా పెన్షన్లు తీసుకుంటున్నారు. రైతు భరోసాతో 55 లక్షల మంది రైతన్నలకు అండగా నిలిచాం. మరో 60 లక్షల మంది అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన తీసుకుంటున్నారు. 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలిచ్చి 22 లక్షల గృహ నిర్మాణాలు చేపట్టాం. ఇప్పుడు చెప్పండి.. వీరంతా పేదలు కాదా? వీరికి పథకాలు అందాలా లేదా?



ఏలూరులో ఓ అభిమాని ఫ్లెక్సీతో ఇలా...



పాయకరావుపేటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

ప్రపంచంలో ఎవరైనా నమ్ముతారా?

- 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు పేరు చెబితే ఏ పేదవాడికైనా ఒక్క మంచి పనిగానీ, పథకంగానీ గుర్తుకొస్తుందా? ఆ పెద్దమనిషి తన జీవిత కాలంలో ఏ రోజూ పేదలకు మంచి చేసిందిలేదు. 2014లోనూ ఇదే మాదిరిగా హామీలిచ్చి వంచించాడు. ఒక్కసారి వాటిని గుర్తుచేసుకుంటే ప్రపంచంలో ఎవరైనా చంద్రబాబును నమ్ముతారేమో మీరే చెప్పండి.
- రైతులకు రూ.87,612 కోట్ల రుణమాఫీ జరిగిందా?
- పొదుపు సంఘాల రుణాలన్నీ రద్దు చేస్తానంటూ ఏకంగా రూ.14,205కోట్లు ఎగనామం పెట్టాడు.
- ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు కాదు కదా ఎవరికైనా ఒక్క రూపాయి అయినా బ్యాంకులో జమ చేశాడా?
- ఇంటికో ఉద్యోగం లేదంటే నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తానన్నాడు. ఏ ఒక్క ఇంటికైనా 60 నెలల్లో రూ.2వేలు చొప్పున రూ.1.20 లక్షలు ఇచ్చాడా?
- అర్హులందరికీ 3 సెంట్ల స్థలం, పక్కా ఇళ్లు అన్నాడు. ఒక్కరికైనా సెంటు స్థలం ఇచ్చాడా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత పవర్ లూమ్స్ మాఫీ అన్నాడు. జరిగిందా?
- ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా?
- సింగపూర్‌కు మించి అభివృద్ధి, ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మాణం జరిగిందా? మన బొబ్బిలి, పాయకరావుపేటలో ఎక్కడైనా కనిపిస్తున్నాయా?
- ప్రత్యేక హోదా తీసుకురాకపోగా అమ్మేశాడు.
- ఇప్పుడు మళ్లీ మోసగించేందుకు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, ఇంటింటికీ కేజీ బంగారం, బెంజ్ కారు అంటూ నమ్మబలుకుతున్నారు.

Format C-7

(For political parties to publish in the newspapers, social media platforms & website of the party)

Information regarding individuals with pending criminal cases, who have been selected as candidates, along with the reasons for such selection, as also as to why other individuals without criminal antecedents could not be selected as candidates. (As per the Commission's directions issued in pursuance of the Order dated13.02.2020 of the Hon'ble Supreme Court in contempt petition(C) no. 2192 of 2018 in WP(C) no. 536 of 2011)

Name of Political Party : YUVAJANA SRAMIKA RYTHU CONGRESS PARTY
Name of the Election : Andhra Pradesh Legislative Assembly
Name of State/ UT : ANDHRA PRADESH
Name of the Constituency - 71 - Gannavaram Assembly Constituency
Name of the candidate - VALLABHANENIVAMSI MOHAN

Sl. No		
1.	Criminal antecedents	
	a. Nature of the offences	1. Unlawful Assembly & Disobedience to order duly promulgated by the public servant 2. Unlawful Assembly & causing inconvenience to the public and raising slogans 3. Raising slogans and causing disturbance to the polling process.
	b. Case no.	1. CC No. 2481/2023 2. CC No. 2475/2023 3. CC No. 2479/2023
	c. Name of the Court	Special Court for trial of criminal cases relating to elected M.P.'s & M.L.A.'s, Vijayawada
	d. Whether charges have been framed or not (Yes/No)	Yes
	e. Date of conviction, if any	NA
	f. Details of punishment undergone, if any	NA
	g. Any other information required to be given	NA
2.	The reasons for the selection of the candidate. Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words)	The candidate has an impeccable record in his constituency in serving he poor and serving the society at large, the candidate has been involved in various activities benefiting the society.
3.	Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words)	The candidate was clearly ahead of all his counterparts candidates in the survey conducted by the party

Name of the Constituency - 72 - GUDIVADA ASSEMBLY CONSTITUENCY
Name of the candidate - KODALI SRI VENKATESWARA RAO (NANI)

Sl. No		
1.	Criminal antecedents	
	a. Nature of the offences	Criminal IPC of 152,353,426
	b. Case no.	CRLA/133/2012
	c. Name of the Court	XI Additional District Judge, Gudivada
	d. Whether charges have been framed or not (Yes/No)	Yes
	e. Date of conviction, if any	30.07.2012
	f. Details of punishment undergone, if any	NA
	g. Any other information required to be given	NA
2	The reasons for the selection of the candidate. Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words)	The selected candidate is a senior, sincere and dedicated party worker who has already been on various important positions and is quite popular in the constituency
3	Reasons as to why other individuals without criminal actecedents could not be selected as candidates (not more than 100 words)	The case is long pending and party believes that there will be no adverse outcome against the alleged accused. Moreover in comparison to other individuals without criminal antecedents this candidate is quite popular and accepted amongst the general public.

Name of the Constituency - 74 - Pedana
Name of the candidate - UPPALA RAMESH

Sl. No		
1.	Criminal antecedents	
	a. Nature of the offences	Unlawful Assembly for wrongful restraint and Criminal intimidation with common intention. Under Sections 341, 143, 506, R/w 149 of IPC.
	b. Case no.	CC.No.1306 of 2020 In FIR No. 171 of 2018
	c. Name of the Court	Judicial First Class Magistrate, Special Mobile Court, Machilipatnam. (summons not served in the case).
	d. Whether charges have been framed or not (Yes/No)	NO
	e. Date of conviction, if any	Not Applicable
	f. Details of punishment undergone, if any	Not Applicable
	g. Any other information required to be given	Not Applicable
2.	The reasons for the selection of the candidate. Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words)	The candidate has done some remarkable work in this constituency which made him extremely popular among the common people. The candidate is known for his public service and is available for common people. Seeing his development-oriented image, the YSR Congress party has decided to field him from this seat.
3.	Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words)	The other candidates if having no without criminal antecedents Could not be selected other than the candidate why because the candidate Uppala Rameshis a fit candidate for MLA to the AP Legislative Assembly. The Selected candidate is young and dynamic and dedicated worker to the YSR Congress party and the case lodged against his is politically motivated and false case is foisted against his and there will be no adverse out come against the alleged the accused.

Name of the Constituency - 76 - AVANIGADDA
Name of the candidate - RAMESHBABU SIMHADRI

Sl. No.		
1.	Criminal antecedents	
	a. Nature of the offences	Protest for irrigation water for formers at lankapalli ,Challapalli Mandal .Section 143,341,188r/w 149 IPC
	b. Case no.	C.C.NO 519/2019
	c. Name of the Court	JUDICIAL FIRST CLASS MEGISTRATE AT MOVVA
	d. Whether charges have been framed or not (Yes/No)	NO
	e. Date of conviction, if any	NOT APPLICABLE
	f. Details of punishment undergone, if any	NOT APPLICABLE
	g. Any other information required to be given	NOT APPLICABLE
2.	Thereasonsfortheselectionof thecandidate.Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words)	The selected candidate is a very senior sincere and dedicated party worker who has already been on various important positions as elected member of assembly
3.	Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words)	As a senior party worker, he had an edge over other individuals considering the fact that whatever charges are alleged in the charge sheet have no substance and are purely with a vindicate approach and personal vendetta being waged by his political enemies. The case is long pending and party believes that there will be no adverse outcome against the alleged accused.

Name of the Constituency -78 - Penamulur
Name of the candidate - JOGI RAMESH

Sl. No.		
1.	Criminal antecedents	
	a. Nature of the offences	1. Loadged under Sections 143,506,324,188, 269, 270 R/W 34 IPC (DHARNA CASE). 2. Loadged under Sections 143,188,342,353,452,290,50 6, R/W 149 IPC&sec 7(1) crpc (DHARNA CASE) 3. Loadged under Sections 341,143,506,r/w 149 ipc&sec30 of police act (DHARNA CASE) 4. Loadged under Sections 353,143,R/W 149 IPC (DHARNA CASE) 5. Loadged under Sections 143,506,324,188,269, 270 R/W 34 IPC (DHARNA CASE) 6. Loadged under Sections143, 145,147.148, 290,341,353,149 OF IPC &30 OF POLICE ACT (DHARNA CASE)
	b. Case no.	1.FIR No:923/2021, TADEPALLI PS, FIR No:605/2017 &IBRAHIMPATNAM PS. 2. FIR No:180/2018, IBRAHIMPATNAM PS. 3. CR.NO.171/2018. 4. FIR No:115/2018. 5. FIR No:96/2018. 6. FIR No: 605/2017, IBRAHIMPATNAM PS.
	c. Name of the Court	1. Pending in PS 2.Pending in PS 3. Hon'ble Special Mobile Court,Machilipatnam. 4.Pending in PS 5.Pending in PS 6.Pending in PS
	d. Whether charges have been framed or not (Yes/No)	NO
	e. Date of conviction, if any	NOT APPLICABLE
	f. Details of punishment undergone, if any	NOT APPLICABLE
	g. Any other information required to be given	NOT APPLICABLE
2.	The reasons for the selection of thecandidate.Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words)	The candidate is an Indian politician has swiftly risen through the ranks since his early days, he has been a vocal advocate for the development of the Backward Classes (BCs), His political journey includes notable victories in the 2009 and 2019 Andhra Pradesh Assembly elections. Known for his grassroots activism and leadership, Ramesh's recent appointment as a Minister in the Jagan 2.0 cabinet solidifies his influence in state politics. The candidate has being involved in various activities benefitting the societies.
3.	Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words)	The other candidates if having no without criminal antecedents Could not be selected other than the candidate why because the candidate Jogi Rameshis a fit candidate for MLA to the AP Legislative Assembly. His history of the service to people itself making him he is the one to contest as MLA. The Selected candidate dynamic and dedicated worker to the YSR Congress party and the case lodged against him is politically motivated and false case is foisted against him and there will be no adverse out come against the alleged the accused. And all the alleged cases are pending.

(తరువాయి II లో)

Name of the Constituency - 81 - Vijayawada East
Name of the candidate - AVINASH DEVINENI

Sl. No		
1.	Criminal antecedents	
	a. Nature of the offences	Dharna Case
	b. Case no.	FIR 447/2017, Machavaram PS FIR 570/2015 Patamata PS
	c. Name of the Court	NA
	d. Whether charges have been framed or not (Yes/No)	NO
	e. Date of conviction, if any	NOT APPLICABLE
	f. Details of punishment undergone, if any	NOT APPLICABLE
	g. Any other information required to be given	NOT APPLICABLE
2.	The reasons for the selection of the candidate.Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words)	The candidate has an impeccable record in his constituency in serving the poor and serving the society at large, the candidate has been involved in various activities benefiting the society.
3.	Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words)	He has been implicated in the case due to his social activities. The false case was registered against the candidate.

Name of the Constituency -82 - MYLAVARAM ASSEMBLY CONSTITUTION.
Name of the candidate - TIRAPATHI RAO SARNALA

Sl. No		
1.	Criminal antecedents	
	a. Nature of the offences	U/ss. 323, 324, 506 R/w. 34 IPC
	b. Case no.	Crime No. 220/2023, Mylavaram P.S
	c. Name of the Court	Judicial First Class Magistrate at Mylavaram (No Charge Sheet is filed).
	d. Whether charges have been framed or not (Yes/No)	NO
	e. Date of conviction, if any	NOT APPLICABLE
	f. Details of punishment undergone, if any	NOT APPLICABLE
	g. Any other information required to be given	Accused along with other persons beat with hands and legs indiscriminately beat the complainant with stone at his head then received the bleeding head injury and threatened with dire consequences with criminal intimidation.
2.	The reasons for the selection of the candidate.Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls	The candidate has done some remarkable work in this constituency which made him extremely popular among common people. The candidate is known for this public service and is available for common people. Seeing his development-oriented image, the Congress party has decided to field him from this seat.
3.	(not more than 100 words) Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words)	The pending cases mentioned in the affidavit are politically motivated. The YSRCP party always believes that some small politically motivated cases should not bar a deserving candidate from people's representation therefore, the candidate has been given chance to represent this constituency.

Name of the Constituency - 84 - JAGGAYYAPET
Name of the candidate - UDAYABHANU SAMINENI

Sl. No		
1.	Criminal antecedents	
	a. Nature of the offences	DHARNA CASE
	b. Case no.	FIR. NO. 605/2017, IBRAHIMPATNAM PS, NTR DIST. Case is under investigation and Accused pending.
	c. Name of the Court	Not Applicable as it is under investigation.
	d. Whether charges have been framed or not (Yes/No)	NO
	e. Date of conviction, if any	NOT APPLICABLE
	f. Details of punishment undergone, if any	NOT APPLICABLE
	g. Any other information required to be given	NOT APPLICABLE
2.	The reasons for the selection of the candidate.Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls	The candidate has done some remarkable work in this constituency which made him extremely popular among common people. The candidate is known for this public service and is available for common people. Seeing his development-oriented image, the Congress party has decided to field him from this seat.
3.	(not more than 100 words) Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words)	The candidate is popular leader and has been actively involved in various social developmental works and hence got recommended by the majority party workers to be selected as party candidate from his constituency.

Sd/- **LellaAppi Reddy**
State General Secretary
Yuvajana Sramika Rythu Congress Party

ఓటు హక్కు అందరూ వినియోగించుకోవాలి

- రిటైర్డ్ ఇన్‌కంటాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం.భూపాల్‌రెడ్డి
- నరసరావుపేటలో ఓటర్ల చైతన్య యాత్ర



గాంధీ విగ్రహం వద్ద ఓటర్లను చైతన్య పరుస్తున్న మహాత్మాగాంధీ గుడి ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలోని ప్రతి ఓటరు తన ఓటు హక్కును బాధ్యతగా గుర్తించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయాలని రిటైర్డ్ ఇన్‌కంటాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం. భూపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 13వ తేదీన ఉభయ తెలుగు రాష్ట్రాలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్లను చైతన్య పరిచేందుకు మహాత్మా గాంధీ గుడి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు చైతన్య యాత్రను బుధవారం వినుకొండ రోడ్డులో భూపాల్‌రెడ్డి ప్రారంభించారు.
ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. కులమతాలకు అతీతంగా, అభివృద్ధే ధ్యేయంగా ఓటు వేయాలన్నారు. మద్యం, డబ్బుకు తమ ఓటును అమ్ముకోవద్దని సూచించారు. కార్యక్రమంలో సింగం యోగాంజనేయ శర్మ, ఈ.ఎం.స్వామి, ఎ.ఎ.మధుకుమార్, ఎం.శ్రీపాల్‌రెడ్డి, స్వర్ణ చినరామిరెడ్డి, ఎస్.నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
చైతన్యయాత్రలో భాగంగా సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియం, ఎస్ ఎస్ అండ్ ఎన్ కళాశాల మైదానంలో ఓటర్లను కలసి కరపత్రాలను పంపిణీ చేసి ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు

- కావాలనే ఈ చట్టంపై టీడీపీ నాయకులు దుష్ప్రచారం
- ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి


పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: టీడీపీ నాయకులు ప్రచారం చేస్తున్న ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని వైఎస్సార్ సీపీ నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చట్టంపై హైకోర్టులో కేసు నమోదైందని, తీర్పు కోసం వేచి చూస్తున్నారన్నారు. దీనిపై టీడీపీ నాయకులు వారి సోషల్ మీడియా ఆధారంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆస్తులను దోచుకునేందుకు తీసుకొచ్చారని, దీని అమలు కోసం జీఓ కూడా జారీ చేశారంటూ ఒక తప్పుడు ప్రచారం మొదలు పెట్టారన్నారు. ఎన్నికల వేళ సీఎం జగన్ వ్యక్తిత్వాన్ని దెబ్బతీయటమే ధ్యేయంగా ఈ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. 20ఏళ్లపాటు డీకే భూమిని సాగుచేసుకుంటుంటే హక్కులు కల్పించిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. వేల ఎకరాలపై దళితులకు హక్కులు కల్పించారన్నారు. చంద్రబాబునాయుడు ఏనాడు దళితులకు భూమిపై హక్కు ఇవ్వాలని అనుకోలేదన్నారు.

బాబుకు మేనిఫెస్టోపై గౌరవం లేదు

చంద్రబాబుకు ఏనాడూ మేనిఫెస్టోపై గౌరవంలేదన్నారు. 2014ఎన్నికల సందర్భంగా రైతు రుణమాఫీ చేస్తానని రైతుల ఓట్లతో అధికారంలోకి రాగానే రూ.87వేల కోట్ల రుణ మాఫీని చేయకుండా కుటుంబరావు కమిటీ వేసి కేవలం రూ.11వేల కోట్లు మాఫీ చేశాడన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి 2019 ఎన్నికలకు ముందు ఆర్నెల్లుపాటు మాత్రమే కొంతమందికి ఇచ్చాడన్నారు. జాబు రావాలంటే బాబు రావాలని చెప్పి ఐదేళ్లలో 32వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చాడన్నారు. ప్రస్తుతం ప్రకటించిన మేనిఫెస్టో అమలు కోసం ఏడాదికి రూ.12లక్షలు కోట్లు కావాలని ఆర్థిక శాస్త్రవేత్తలు, విశ్లేషకులు అంచనా వేశారని, మన రాష్ట్ర బడ్జెట్ రూ.2.34లక్షల కోట్లు మాత్రమే అన్నారు. బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయ చరిత్రలో మేనిఫెస్టోపై ప్రజలకు విశ్వసనీయత కల్పించిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. సీనియర్ నాయకులు డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై జరుగుతున్న దుష్ప్రచారం అందరూ ఖండించాలని కోరారు.

తీరంలో ఇద్దరిని కాపాడిన పోలీసులు, గజ ఈతగాళ్లు

సిబ్బందిని అభినందించిన ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్ల టౌన్: సముద్రంలో స్నానాలు చేస్తుండగా అలల తాకిడికి కొట్టుకుపోతున్న ఇద్దరిని గజ ఈతగాళ్లు కాపాడిన ఘటన బుధవారం సూర్యలంక తీరంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళగిరి పట్టణానికి చెందిన వేశం భాను ప్రకాష్, గాలి కిరణ్‌బాబు స్నేహితులతో కలిసి సూర్యలంక సముద్రతీరానికి విహారయాత్రకు వచ్చారు. వీరంతా సముద్రంలో స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి ఇద్దరు సముద్రంలో కొట్టుకుపోసాగారు. స్నేహితులు కేకలు వేయడంతో తీరంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లు తక్షణమే స్పందించి మునిగిపోతున్న వారిని రక్షించి, ఒడ్డుకు చేర్చారు. ప్రథమ చికిత్స చేశారు. ఇద్దరు యువకుల ప్రాణాల్ని రక్షించిన కానిస్టేబుల్ ఎస్.నాగరాజు, హోంగార్డులు ఎస్‌నరసింహమూర్తి, శ్రీనివాసరావు, నాగరాజు, గజ ఈతగాళ్లు సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఆంజనేయులు, శివ కోటేశ్వరరావును యాత్రికులతో పాటు, ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

Format C-7
(for political parties to publish inthe newspapers, social media platforms& website of the party)

Information regarding individuals with pending criminal cases, who have been selected as candidates, along with the reasons for such selection, as also as to why other individuals without criminal antecedents could not be selected as candidates. (As per the Commission's directions issued in pursuance of the Order dated13.02.2020 of the Hon'ble Supreme Court in contempt petition(C) no. 2192 of 2018 in WP(C) no. 536 of 2011)

Name of Political Party:YUVAJANA SRAMIKA RYTHU CONGRESS PARTY
***Name of the Election:_General Elections - 2024**
Name of State/ UT: ANDHRA PRADESH
Name of the Constituency - 12 - VIJAYAWADA PARLIAMENTARY CONSTITUENCY
Name of the candidate - SRINIVAS KESINENI (NANI)

Sl. No		
1.	Criminal antecedents	
	a. Nature of the offences	IPC Sec : 353,188,143,341, r/w 149 (Assault or Criminal force to deter public servant from discharge of his duty.)
	b. Case no.	FIR No.20/2020 P.S. Krishna Lanka
	c. Name of the Court	II Additional Chief Metropolitan Magistrate at Vijayawada.
	d. Whether charges have been framed or not (Yes/No)	No
	e. Date of conviction, if any	Not Applicable
	f. Details of punishment undergone, if any	Not Applicable
	g. Any other information required to be given	HIGH COURT OF A.P, AT AMARAVATHI This case is Under High Court Stay vide IA No :1/2020, Crl.L.P.No.643/2020, Crl.L.P.No.644/2020, Crl.L.P.No.645/2020. Dated: 05/2/2020, 18/2/2020 and 24/6/2020. Dated : 07/10/2020 interim order passed earlier shall remain in operation until further orders.
2.	The reasons for the selection of the candidate. Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words)	The candidate has been elected as a Member of Parliament Lok Sabha 2 times, he served the people at his level best. He have no any criminal back ground.
3.	Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words)	The cases registered against the contesting candidate are political motivated cases, where even charges have not been framed.

Sd/- **LellaAppi Reddy**
State General Secretary
Yuvajana Sramika Rythu Congress Party

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



తిరుమల: తిరుమల శ్రీవారిని కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.అంజరియా బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

పద్మావతి వర్సిటీలో జర్మన్ బృందం పర్యటన



తిరుపతి సిటీ: జర్మనీలోని మాగ్దేబర్గ్, హైడెల్‌బర్గ్, కొలోన్, ఫ్రీ వర్సిటీల నుంచి ప్రత్యేక ప్రతినిధి బృందం బుధవారం తిరుపతి పద్మావతి మహిళా వర్సిటీలో పర్యటించి 'యూనివర్సిటీలు–ఇండియన్, జర్మన్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారం' అనే అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించింది. మహిళా వర్సిటీ వీసీ భారతి మాట్లాడుతూ..వర్సిటీలో అకడమిక్, రీసెర్చ్, ఇంక్యుబేషన్ సౌకర్యాలపై చర్చించినట్లు తెలిపారు. స్టూడెంట్స్ మొబిలిటీ, ఉమ్మడి పరిశోధన కార్యక్రమాలు, డ్యూయల్, డబుల్ డిగ్రీ ప్రోగ్రామ్స్, ఫ్యాకల్టీ మార్పిడి కోసం ఇలాంటి సమావేశాలు దోహదపడతాయన్నారు. ఇంజినీరింగ్‌తో పాటు నేచురల్ సైన్స్, నర్సింగ్, సోషల్ సైన్స్ రంగాల్లో సహకారానికి విదేశీ విద్యాసంస్థల భాగస్వామ్యం అవసరమన్నారు. జర్మన్, భారత విద్యా సంస్థల మధ్య పరస్పర సహకారం, భాగస్వామ్యానికి ఈ పర్యటన పునాది వేస్తుందన్నారు.

ప్రాచ్య పరిశోధనా సంస్థను సందర్శించిన ఎన్‌ఆర్‌ఐలు



తిరుపతి సిటీ: అమెరికాలోని అట్లాంట, జార్జియా రాష్ట్రాల్లోని ప్రతిష్టాత్మక కంపెనీలు నిర్వహిస్తోన్న ఎన్‌ఆర్‌ఐలు ఎస్వీయూలోని ప్రాచ్య పరిశోధనా సంస్థను బుధవారం సందర్శించారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి అనుమతితో ఎన్‌ఆర్‌ఐలు సంస్థలో భద్రపరచిన ప్రాచీన రాతప్రతులను తిలకించారు. తాళపత్ర, కాగిత ప్రతుల్లో నిక్షిప్తమైన జ్ఞాన సంపదను, లిపి, అందమైన అక్షరాలను తీర్చిదిద్దడంలో పూర్వీకులు కనబరిచిన నైపుణ్యాన్ని వారికి సంస్థ సంచాలకులు ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు వివరించారు. మన ప్రాచీన జ్ఞానాన్ని సంరక్షిస్తున్న సంస్థ అభివృద్ధికి, నవీకరణకు తమ వంతు సహకారం అందిస్తామని ఎన్‌ఆర్‌ఐలు హామీ ఇచ్చారు. సంస్థను సందర్శించిన వారిలో సెరినిటీ ఇన్ఫోటెక్ అధినేత శ్రీనురెడ్డి, విజన్ ఇన్ఫోటెక్ ప్రతినిధి ఉపేంద్ర, సీ విజన్ టెక్ అధినేత రాజశేఖర్‌రెడ్డితో పాటు డాక్టర్ సుందర రాజారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలం డ్యాంను సందర్శించిన వరల్డ్ బ్యాంక్ సభ్యులు



శ్రీశైలం ప్రాజెక్ట్: మరమ్మతులకు నిధుల మంజూరులో భాగంగా వరల్డ్‌బ్యాంక్ సభ్యులు డాక్టర్ హనీషాలేమ్, అఖిలేష్‌కుమార్ యాదవ్ శ్రీశైలం డ్యాంను బుధవారం పరిశీలించారు. డ్యాం బ్లాక్‌ల పటిష్టత, ప్లంజ్‌పూల్, ఆప్రాన్‌ల పనులు, అప్రోచ్‌రోడ్ నిర్మాణం, డ్యాం సేఫ్టీ కోసం తీసుకోవాల్సిన ఇతరత్రా పనులకు రూ.190 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటికే పలుమార్లు వరల్డ్ బ్యాంక్ ప్రతినిధులు, కృష్ణానది యాజమాన్య బోర్డ్ సభ్యులు, డ్రిప్ మేనేజ్‌మెంట్ సభ్యులు, డ్యాం సేఫ్టీ అథారిటీ సభ్యులు, సెంట్రల్‌వాటర్ కమిషన్ సభ్యులు డ్యాం పటిష్టతపై అధ్యయనం చేసి నివేదికలు కేంద్రానికి సమర్పించారు. డ్యాంలోని అన్ని విభాగాలను వరల్డ్‌బ్యాంక్ ప్రతినిధులు పరిశీలించారు.

పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండల పరిధిలోని కొమెరపూడిలో 35 టీడీపీ కుటుంబాలు బుధవారం మంత్రి అంబటి సమక్షంలో పార్టీలో చేరాయి. - సత్తెనపల్లి



ప్రశాంత ఎన్నికలకు 'పోలీస్' కసరత్తు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి



- కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు
- వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ
- జైళ్లలో ఖైదీలపైనా ప్రత్యేక నిఘా
- ములాఖత్‌లు రద్దు
- ఏపీలో 14,141 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ సన్నద్ధమవుతున్నది. ప్రధానంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఎన్నికల కమిషన్ (ఈసీ) మార్గదర్శకాలను పాటిస్తూ కార్యాచరణను ఖరారు చేసింది. ప్రస్తుతం ఏర్పాటు చేయాలని నిర్ణయించిన పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే 14,141 సమస్యాత్మక కేంద్రాలున్నట్లు పోలీస్ శాఖ గుర్తించింది.

ప్రస్తుతం.. 46,165 పోలింగ్ కేంద్రాలు.. మరో 887 కేంద్రాలకు ప్రతిపాదనలు..

2024 సార్వత్రిక ఎన్నికలు, రాష్ట్ర శాసనసభ ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ ఇప్పటికే 46,165 పోలింగ్ కేంద్రాలను గుర్తించింది. అదనంగా మరో 887 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ప్రతిపాదనలను పంపారు. దీనిపై ఈసీ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఏర్పాటు చేయాలని నిర్ణయించిన పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే 14,141 పోలింగ్ కేంద్రాలు సున్నితమైనవిగా గుర్తించారు. ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్రానికి చెందిన 1,14,950మంది సివిల్ పోలీసులు, 52 కంపెనీల రాష్ట్ర సాయుధ బలగాలతో పాటు అదనంగా 491 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను నియోగించనున్నారు. కేంద్ర సాయుధ బలగాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో భద్రతా విధుల్లో నియోగించాలని నిర్ణయించారు. ఇక 14,141 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ద్వారా పోలింగ్‌ను నిశితంగా పర్యవేక్షిస్తారు. ఇక ఒక మైక్రో అబ్జర్వర్‌ను ఆ పోలింగ్ కేంద్రాల్లో ఒక మైక్రో అబ్జర్వర్‌ను కూడా నియమించాలని ఈసీ నిర్ణయించింది. ఆ పోలింగ్ కేంద్రాల పరిధిలో రాష్ట్ర పోలీసు, కేంద్ర సాయుధ బలగాలు క్రమం తప్పకుండా తరచూ కవాతు నిర్వహిస్తాయి. ఆ పరిధిలో పెండింగ్ నాన్ బెయిలబుల్ వారంట్లను త్వరితగతిన జారీ చేయాలని ఇప్పటికే ఆదేశించింది. గత ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన, ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడిన నేర చరిత్ర ఉన్నవారి కదలికలపై నిఘాను పటిష్టపరిచారు. జిల్లా ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు ఎప్పటికప్పుడు బందోబస్తు, నిఘా చర్యలను పర్యవేక్షిస్తూ ఎన్నికల ప్రధాన అధికారికి నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు.

జైళ్లలోనూ నిఘా పటిష్టం..

జిల్లా కలెక్టర్లు తమ జిల్లాల్లోని జైళ్లను తనిఖీ చేయాలని ఈసీ ఆదేశించింది. జైళ్ల మాన్యువల్ సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షించాలని స్పష్టం చేసింది. ఇక గతంలో ఎన్నికల అక్రమాలకు పాల్పడి ప్రస్తుతం జైళ్లలో ఉన్న ఖైదీలపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు. ఇప్పటికే అటువంటి ఖైదీలకు ములాఖత్‌లు రద్దు చేశారు. ఎన్నికలు ముగిసేవరకు ఖైదీలను ఒక జైలు నుంచి మరో జైలుకు తరలించకూడదని నిర్ణయించారు. న్యాయస్థానం ఆదేశాలు ఉంటే తప్పా ఖైదీలను ఇతర జైళ్లకు తరలించ వద్దని ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నం

- తీవ్రంగా గాయపడ్డ రఘుపతి నాయుడి పరిస్థితి విషమం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడి అక్క ఆదిలక్ష్మి



చికిత్స పొందుతున్న రఘుపతి నాయుడు

చౌడేపల్లి: చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం బోయకొండ క్రాస్ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రఘుపతి నాయుడిపై మంగళవారం రాత్రి టీడీపీ నాయకులు రాడ్లు, కట్టెలతో దాడికి తెగబడి అతన్ని హతమార్చేందుకు యత్నించారు. అపస్మారక స్థితిలో రక్తపు మడుగులో పడిఉన్న రఘుపతి నాయుడిని మదనపల్లె తీసుకెళ్లగా..పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సూచన మేరకు తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. రఘుపతి నాయుడు పక్షిరాజపురం సమీపంలోని టమోటా తోటలో పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. రాష్ట్ర రఘుపతి నాయుడు పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డూ రమణ బావమరిది. ఈ ఘటనపై బాధితుడి అక్క ఆదిలక్ష్మి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గత నెల 27న రాత్రి లడ్డూ రమణ ఇంటిపై టీడీపీ నాయకులు కలిసి దాడి చేసి వైఎస్సార్‌సీపీ నేతలను గాయపరిచిన ఘటన తెలిసిందే. ఆ సమయంలో అక్కడే ఉన్న రఘుపతినాయుడును ఉద్దేశించి 'నీ అంతుచూస్తాం. నిన్ను కూడా చంపేస్తాం' అంటూ టీడీపీ నాయకులు జె.సుబ్రహ్మణ్యం, హరి, బాబు తదితరులు హెచ్చరించారు. కాగా.. మంగళవారం రాత్రి సుమారు 8:30 గంటల ప్రాంతంలో రఘుపతి నాయుడుకు అతని అక్క ఆదిలక్ష్మి ఫోన్ చేయగా రెండుసార్లు కట్ చేశాడు. మళ్లీ ఐదు నిమిషాలకు రఘుపతి నాయుడు ఆమెకు ఫోన్‌చేసి టమోటా తోట నుంచి బయలుదేరానని.. 10 నిమిషాల్లో ఇంటికి వస్తానని ఆందోళనగా మాట్లాడాడు. తనవెంట పరికిదొనకు చెందిన లక్ష్మీపతి కూడా ఉన్నట్లు చెప్పాడు. ఈలోపు ఆదిలక్ష్మి కుమారుడు లోకేశ్‌కు మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి ఫోన్‌చేసి రఘుపతినాయుడును కొట్టి రోడ్డుపై పడేశారని సమాచారం ఇచ్చారు. వెంటనే అతని అక్క ఆదిలక్ష్మి బంధువులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని ప్రైవేటు వాహనంలో ఆస్పత్రికి తరలించారు. టీడీపీ నేతలు సవాల్ విసిరినట్టుగా వారే తన తమ్ముడిని హత్య చేయడానికి ప్రయత్నించారని, తమ కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఆదిలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంద్రబాబు ఓటమి తథ్యం

- బాబు వల్ల ఎన్టీఆర్ కుటుంబానికి తీవ్ర అన్యాయం
- ఇన్నాళ్లు దొంగ ఓట్లతోనే కుప్పంలో చంద్రబాబు గెలుపు
- తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి



విలేకరులతో మాట్లాడుతున్న లక్ష్మీపార్వతి

కుప్పం (చిత్తూరు జిల్లా): కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు మారుమూల ప్రాంతమైన కుప్పంను ఎంపిక చేసుకుని తమిళనాడు ఓటర్లను చేర్పించి ఇన్నాళ్లు దొంగ ఓట్లతో చంద్రబాబు కుప్పంలో గెలుస్తూ వస్తున్నాడని, ఇకపై అతని ఆటలు సాగవని రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి ధ్వజమెత్తారు. బుధవారం వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రెడ్డప్ప, భరత్‌కు మద్దతుగా కుప్పం పట్టణంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఓటుకు కోట్లు కేసులో పట్టుబడి హైదరాబాద్‌నుంచి కరకట్టకు ఎలా పారిపోయి వచ్చాడో.. చంద్రగిరిలో ఓడిపోయిన తరువాత కుప్పానికి అలానే పారిపోయి వచ్చాడని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దొంగ ఓట్లను తొలగించిందని ఇక అతని ఆటలు సాగవని అన్నారు. చంద్రబాబు మోసాలకు ఎన్టీఆర్ కుటుంబం తీవ్రంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 35 ఏళ్ల కుప్పం ప్రజలను మోసం చేస్తున్న అవినీతిపరుడు చంద్రబాబును తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. చెప్పింది చేసే నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని చెప్పారు. కుప్పంలో ప్రజల్లో మార్పు కనిపిస్తోందని కచ్చితంగా చంద్రబాబును కుప్పం నుంచి తరిమికొట్టడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి భరత్, స్థానిక నాయకులు మురుగేష్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కావటిపై దాడికి టీడీపీ యత్నం

- ప్రచార రథం అద్దాలు పగులగొట్టి.. మైకులు విరిచి దౌర్జన్యం
- మహిళా కార్యకర్త, డ్రైవర్‌కు గాయాలు
- ఈవూరివారిపాలెంలో రెచ్చిపోయిన పచ్చ మూకలు



ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ ప్రచార రథం అద్దాలు

చిలకలూరిపేట: టీడీపీ వర్గీయులు దాష్టీకానికి తెగబడ్డారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం ఈవూరివారిపాలెంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు మంగళవారం రాత్రి ఈవూరివారిపాలెంలోని ఎస్టీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారం ముగించుకుని రాత్రి చిలకలూరిపేట పట్టణానికి బయలుదేరారు. కాన్వాయ్‌లోని కొన్ని వాహనాలు కాలనీ నుంచి గ్రామంలోని ప్రధాన రహదారిపైకి చేరుకోగా.. టీడీపీలోని ఆధిపత్య సామాజిక వర్గానికి చెందిన వారు అడ్డుపడి వాహనాలను నిలిపివేశారు. ఈ గ్రామంలోకి టీడీపీ తప్ప వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అడుగుపెట్టడానికి వీలులేదని.. ఎవరి అనుమతితో గ్రామంలోకి వచ్చారంటూ దూషణలకు దిగారు. వాహనాలపై దాడికి తెగబడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రచార రథం అద్దాలను ధ్వంసం చేసి లైట్లు పగులగొట్టారు. మైకులు విరిచి నానా బీభత్సానికి పాల్పడ్డారు. వాహనం నడుపుతున్న కొత్తపల్లి మణికంఠ, మహిళా కార్యకర్త షేక్ సమీరాపై దాడి చేసి కొట్టారు. వెనుక కాలనీలో ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగమనోహర్ నాయుడు గొడవ జరుగుతున్న విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్నారు. వాహనాలపై కార్యకర్తలపై దాడికి దిగడం ఏమిటని ప్రశ్నిస్తూ శాంతియుతంగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో మరింతగా రెచ్చిపోయిన టీడీపీ వర్గీయులు పత్రికలో రాయడానికి వీలులేని భాషలో దూషిస్తూ ఆయనపైనా దాడికి యత్నించారు. ఇది గమనించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మనోహర్ నాయుడు చుట్టూ వలయంగా ఏర్పడి ఆయనకు రక్షణ కల్పించాల్సి వచ్చింది. అయినప్పటికీ టీడీపీ వర్గీయులు తీవ్రమైన పదజాలంతో దూషణల పర్వం కొనసాగించారు. అనంతరం మనోహర్ నాయుడు, ఆయన వర్గీయులు రూరల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఘటనపై ఫిర్యాదు చేశారు.

తొలినుంచీ అదే తీరు

ఈవూరివారిపాలెంలో టీడీపీ వర్గీయుల తీరు ఎప్పుడూ దౌర్జన్యపూరితంగానే ఉంటుంది. ఎన్నికల్లో బూత్‌లు స్వాధీనం చేసుకోవడం, రిగ్గింగ్‌కు పాల్పడటం, వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బూత్‌లో నుంచి లాగి కొట్టడం ఇక్కడ పరిపాటి. ఒకే సామాజిక వర్గం వారు పెత్తనం చెలాయిస్తూ గ్రామంలోని ఎస్టీ వర్గీయులు వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తారనే ఉద్దేశంతో వారిని పోలింగ్ బూత్‌లకు రాకుండా దాడులు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం ఇక్కడ నిత్యం జరిగే పరిణామాలే. ఈ ఎన్నికల్లో అయినా అధికారులు తమకు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పిస్తారా అనే ఆందోళన ఎస్టీ వర్గీయులు వ్యక్తం చేస్తున్నారు.

పెన్షనర్ల డీఏ రద్దుకు ప్రయత్నించింది బాబు కాదా?

- ఆయన ఎప్పటికీ ఉద్యోగులు, పెన్షనర్ల వ్యతిరేకే..
- రాష్ట్రంలోనే కాదు.. దేశమంతా పెన్షనర్లకు చెల్లింపుల్లో జాప్యం
- సీఎం జగన్ ఏ రోజూ ఉద్యోగులను ఇబ్బంది పెట్టలేదు
- ఏపీ జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కోన దేవదాసు



సాక్షి, అమరావతి: చంద్రబాబు గతంలో పెన్షనర్లకు నరకం చూపారని, పెన్షనర్లకు డీఏ ఎందుకు ఇవ్వాలన్న చంద్రబాబు మాటలు మరిచిపోయారా? అంటూ ఏపీ జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కోన దేవదాసు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షనర్ల సంఘాల పేరుతో కొందరు చంద్రబాబుకు ఊడిగం చేయడం బాధాకరమన్నారు. 2004కు ముందు చంద్రబాబు పెన్షనర్లకు డీఏ రద్దు చేయాలని ప్రయత్నం చేయడం నిజం కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పటికీ ఉద్యోగుల వ్యతిరేకేనన్న విషయం, ఉద్యోగులు, పెన్షనర్లంటే ఆయనకు ఎంత చులకన భావమో ఆయన రాసిన మనసులో మాట పుస్తకం చదివితే తెలుస్తుందన్నారు. కొంత కాలంగా పెన్షనర్లకు ఆర్థిక పరమైన చెల్లింపుల్లో ఆలస్యమవుతున్న మాట వాస్తవమేనని, కానీ అది కేవలం ఏపీలోనే కాదని, దేశమంతా ఇలానే జరుగుతోందన్నారు. రెవెన్యూ మిగులు కలిగిన తెలంగాణ పరిస్థితి.. మన కంటే దారుణంగా ఉందని తెలిపారు. చంద్రబాబు ఉచిత హామీలకు ఏటా రూ.లక్షా యాభై వేల కోట్లు ఖర్చవుతుందని, ఆయన ఇచ్చిన హామీలు అమలు చేస్తే పీఆర్సీ, డీఏల సంగతి దేవుడెరుగు అసలు నెల నెలా పెన్షన్ వస్తుందో లేదో ఆలోచించాలని సూచించారు. కరోనా కారణంగా ఆర్థిక పరమైన ఇబ్బందులు తప్ప, మిగతా అంశాల్లో సీఎం జగన్ ఏ రోజూ ఉద్యోగులను ఇబ్బంది పెట్టలేదని, రానున్న రోజుల్లో మంచి జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో పెన్షనర్లు అందరూ సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని కోన దేవదాసు పిలుపునిచ్చారు.

దొంగ ఓట్లలో ఆరితేరిన 'కుప్పం తమ్ముళ్లు'

- కలర్ ఓటర్ జాబితాను చేజిక్కించుకున్న టీడీపీ నేతలు
- బూత్‌ల వారీగా గుర్తు తెలియని, అందుబాటులోలేని వారి గుర్తింపు
- బెంగళూరులో సాంకేతిక నిపుణులతో నకిలీ ఓటరు కార్డుల తయారీ
- ఆ దొంగ ఓట్లతో గెలవడానికి కుయుక్తులు



శాంతిపురం (చిత్తూరు జిల్లా): దొంగ చేతికి తాళం చిక్కినట్లు.. కుప్పం ఓటర్ల జాబితా కలర్ కాపీని టీడీపీ నేతలు చేజిక్కించుకున్నారు. అసలే దొంగ ఓట్లతో ఎన్నికలు నడపడంలో అపారమైన అనుభవం ఉన్న వాళ్లు ఈసారి మరో అడుగు ముందుకేశారు. ఓటర్ల జాబితాలో ఉన్న గుర్తు తెలియని, స్థానికంగా లేని వారి ఓట్లను గుర్తించి నకిలీ ఓటరు కార్డులతో ఆయా ఓట్లను తమకు వేసుకునే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటరు నమోదు అధికారి సంతకం చేసిన బ్లాక్ అండ్ వైట్ ఓటరు జాబితాను మాత్రమే రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు ఇవ్వాలి. కలర్ ఓటరు జాబితా అక్రమార్కుల చేతికి చిక్కితే ఆయా ఫోటోలను కొంత వరకూ పోలికలు ఉన్న ఇతరుల ఫోటోలతో మార్పులు చేసి ఆ ఓటును తమకు వేయించుకునే అవకాశం ఉంది. అందుకే ఎన్నికల అధికారులు కలర్ ఓటర్ లిస్టును బహిరంగపరచరు. కానీ మోసాలు చేయటంలో సిద్ధహస్తులైన కుప్పం టీడీపీ నాయకులు తమకు వంత పాడే కొందరు అధికారుల ద్వారా కలర్ ప్రింట్ సాఫ్ట్ కాపీని చేజిక్కించుకున్నారు. దానితో కుప్పం పట్టణంలోని ఓ జిరాక్స్ సెంటరులో ప్రింట్లు తీసుకున్నారు. విషయం బయటకు పొక్కడంతో ఎన్నికల అధికారులు గుట్టుచప్పుడు కాకుండా పోలీసుల సాయంతో జిరాక్స్ సెంటర్‌లోని సాఫ్ట్ కాపీని డిలీట్ చేయించి, కొన్ని ప్రింట్లను స్వాధీనం చేసుకున్నారు. సాఫ్ట్ కాపీ బయటకు పోవటానికి కారకులైన సిబ్బందిని గుర్తించి, ఎన్నికల విధుల నుంచి పక్కన పెట్టారు. అయితే అప్పటికే టీడీపీ నాయకులు సాఫ్ట్ కాపీని, కలర్ ఓటరు లిస్టులను తమకు కావాల్సిన వారితో పంచుకున్నారు.

బూత్‌ల వారీ సమాచార సేకరణ

ఓటర్ల జాబితాలో టీడీపీ నాయకులు భారీగా దొంగ ఓట్లను చేర్పించారని ఎమ్మెల్సీ భరత్, ఆయన తండ్రి దివంగత చంద్రమౌళి పదే పదే ఫిర్యాదులు చేయడంతో దశల వారీగా దాదాపు 30 వేల దొంగ ఓట్లను అధికారులు తొలగించారు. దీంతో కొత్త ఎత్తులకు తెరతీసిన తెలుగు తమ్ముళ్లు ఓటరు జాబితాలో పేరు ఉండి వివిధ కారణాలతో దీర్ఘకాలంగా గ్రామాల్లో లేని వారు, ఓటర్ల జాబితాలో ఉన్నా.. గుర్తు తెలియని వ్యక్తుల వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా ఇప్పటికే సేకరించారు. ఈ సమాచారంతో బెంగళూరులో నకిలీ ఓటరు, ఆధార్ కార్డులను తయారు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆ ఫార్చ్యూనర్ కందికుంటదే!

- ప్రధాన అనుచరుడు రాంబాబు ఆధ్వర్యంలో రూ.2 కోట్ల తరలింపు యత్నం!
- అతడితోపాటు మరో వ్యక్తి హస్తం ఉన్నట్లు అనుమానం
- కందికుంటకు ఈసీ నోటీసులు జారీచేసే అవకాశం



అనంతపురం: శ్రీ సత్యసాయి జిల్లా కదిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌ను రూ.2 కోట్ల వ్యవహారం ఇరకాటంలో పడేసింది. అనంతపురం నుంచి కదిరికి ఆయన కారులో తరలిస్తున్న సుమారు రూ.2 కోట్లను మంగళవారం పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. అభ్యర్థి కారులోనే నగదును తరలిస్తుండటం చర్చనీయాంశమైంది. ఎన్నికల్లో తనకు అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో కందికుంట ప్రలోభాలకు తెర తీశారు. డబ్బు ఎరవేసి ఓట్లు దండుకోవాలని పన్నాగం పన్నారు. ఈ క్రమంలోనే అనంతపురం నుంచి కదిరికి డబ్బు తరలిస్తుండగా..పోలీసు తనిఖీల్లో పట్టుబడింది. నగదు తరలింపు వ్యవహారాన్ని ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. నగదు లభించిన ఏపీ 39 ఆర్‌క్యూ 0999 నంబరు ఫార్చ్యూనర్ కారు కందికుంట ప్రసాద్ పేరుతోనే రిజిస్టర్ అయింది. దీంతో ఎన్నికల సంఘం కందికుంటకు నోటీసులు ఇవ్వడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. అనంతపురం పోలీసులు ఆయనకు నోటీసులు ఇవ్వనున్నారు. నగదు తరలించడానికి కారణాలేమిటి? తదితర అంశాలను ప్రస్తావిస్తూ కందికుంటకు నోటీసులు జారీచేసి వివరణ తీసుకోనున్నారు.

బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి అనంతపురానికి కందికుంట వాహనంలోనే రాంబాబు రాక

డబ్బు తరలింపు వ్యవహారంలో హైదరాబాద్‌కు చెందిన కందికుంట ప్రధాన అనుచరుడు రాంబాబు కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. కందికుంట ఫార్చ్యూనర్ కారు సోమవారం కదిరి నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు వెళ్లి.. అక్కడ రాంబాబును ఎక్కించుకుని అనంతపురం వచ్చింది. రాంబాబు సోమవారం రాత్రి నగరంలోని ఓ త్రీస్టార్ హోటల్‌లో బసచేశారు. మంగళవారం ఉదయం రాంబాబును అదే ఫార్చ్యూనర్ కారులో తీసుకెళ్లి రాంనగర్‌లో వదలి పెట్టారు. తర్వాత కందికుంట వాహన డ్రైవర్ ఆనంద్‌కుమార్ రాంనగర్‌లోని ఒక ఇంటికి వెళ్లి, అప్పటికే బ్యాగుల్లో ఉంచిన నగదును కారులో పెట్టుకున్నాడు. ముందు ఒక కారు (పైలట్ వాహనం), వెనుక కందికుంట ఫార్చ్యూనర్ కారు వెళ్లేలా ప్రణాళిక రచించుకున్నారు. అనంతపురంలోని విద్యుత్‌నగర్ సర్కిల్‌కు వెళ్లాక ముందు ఉన్న కారులో పోలీసులు తనిఖీ చేశారు. వెనుక ఉన్న కందికుంట కారు డ్రైవర్ పోలీసులను చూసి భయపడి కారులో ఉన్న నగదు బ్యాగులు పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు ఆ కారు రిజిస్ట్రేషన్ వివరాలు పరిశీలించగా అది కందికుంటదని తేలింది. అప్పటికే ముందున్న కారులోని వ్యక్తులు వేగంగా వెళ్లిపోయారు. ఆ కారులో వెళ్లింది ఎవరన్న అంశంపై పోలీసులు దృష్టి సారించారు. ఈ నగదు తరలింపు వ్యవహారంలో కందికుంట అనుచరుడు రాంబాబుతో పాటు మరోవ్యక్తి ఉన్నట్లు తెలుస్తోంది.

ఆదాయపన్ను అధికారుల విచారణ ప్రారంభం

పోలీసుల తనిఖీల్లో రూ.10 లక్షల కంటే ఎక్కువగా నగదు పట్టుబడితే ఆదాయపన్ను విభాగానికి సమాచారం అందించాల్సి ఉంటుంది. దీంతో పోలీసులు దాదాపు రూ.2 కోట్ల నగదు పట్టుబడిన విషయాన్ని ఆదాయపన్ను శాఖకు తెలిపారు. ఆ శాఖ అధికారులు కూడా విచారణ ప్రారంభించారు. నగదుకు సంబంధించిన లావాదేవీలపై ఆరా తీస్తున్నారు. వారి విచారణ పూర్తయిన తరువాత చట్టపరంగా చర్యలు తీసుకోనున్నారు. ఏది ఏమైనా కందికుంట వెంకటప్రసాద్ చుట్టూ రూ.2 కోట్ల ఉచ్చు బిగుస్తోందని విశ్లేషకులు అంటున్నారు. కందికుంటకు అసలే నియోజకవర్గంలో ప్రతికూల పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలో ఆయన కారులోనే డబ్బు పట్టుబడింది. దీంతో ఆయన ఎన్నికల సంఘంతో పాటు పోలీసులు, ఆదాయపన్ను అధికారులకు సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ పరిణామాలతో కందికుంట ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లు సొంత టీడీపీ వారు చెబుతున్నారు.

రూ.5 కోట్ల విలువైన ద్రవరూప గంజాయి స్వాధీనం



చింతపల్లి రూరల్ (అల్లూరి సీతారామ రాజు జిల్లా): తరలించేందుకు సిద్ధంగా ఉన్న సుమారు రూ.5 కోట్ల విలువైన 54.200 కిలోల ద్రవరూప గంజాయి, తయారీ యంత్రాలు, సామగ్రిని బుధవారం స్వాధీనం చేసుకున్నామని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జి.మాడుగుల మండలం, ఉవ్వసింగి పంచాయతీ, అలగం గ్రామానికి చెందిన ఉలంగి ప్రకాశ్‌రావు ఒడిశాలోని చిత్రకొండ బ్లాక్, మల్కన్‌గిరి జిల్లా ఇసుకబందలలో గిరిజనుల నుంచి గంజాయిని కొనుగోలు చేస్తుంటాడు. ఇలా కొనుగోలు చేసిన గంజాయిని తన కుటుంబ సభ్యులు, అలగం గ్రామానికే చెందిన మరో ఇద్దరి సాయంతో ద్రవ రూపంలో తయారుచేసి కేరళ, కర్ణాటక, రాజమండ్రి ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడు. ఈక్రమంలో బుధవారం ద్రవరూప గంజాయిని బలపం పంచాయతీ రాళ్లగెడ్డ–కోరుకొండ మార్గంలోని ఎర్రగుప్ప వద్ద రవాణాకు సిద్ధంగా ఉంచినట్టు తమకు సమాచారం వచ్చిందని ఏఎస్పీ తెలిపారు. దీంతో సీఐ రమేశ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజారావు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి, 54.200 కిలోల ద్రవరూప గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.5 కోట్లు ఉంటుందని ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. నిందితుడు ప్రకాశ్‌రావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. దీనికి సంబంధం ఉన్న మిగతా వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



చైనాలో కొట్టుకుపోయిన ఎక్స్‌ప్రెస్ వే..

24 మంది దుర్మరణం

బీజింగ్: చైనాలో ప్రధాన రహదారి కొట్టుకుపోయిన ఘటనలో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని మెయిజౌ నగరంలో బుధవారం వేకువజామున ఘటన చోటుచేసుకుంది. చైనాలో 'లేబర్ డే'సందర్భంగా ఐదు రోజుల సెలవులు బుధవారం నుంచే మొదలయ్యాయి. దీంతో గ్వాంగ్‌డాంగ్-ఫుజియాన్ ఎక్స్‌ప్రెస్ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంది. భారీ వర్షాల కారణంగా మెయిజౌ నగరంలోని కొండప్రాంతంలో ఉన్న 18 మీటర్ల రహదారి కొట్టుకుపోయింది. అనూహ్య పరిణామంతో 20 వరకు వాహనాలు అందులో పడిపోయాయి. కొన్ని వాహనాల్లో మంటలు చెలరేగి దగ్ధమయ్యాయి. వాటిలో ఉన్న 54 మందిలో 24 మంది చనిపోగా మరో 30 మంది గాయాలపాలయ్యారు.

సల్మాన్ నివాసం వద్ద కాల్పుల కేసు..

కస్టడీలో నిందితుడి ఆత్మహత్య



ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసం వద్ద ఏప్రిల్ 14వ తేదీన జరిగిన కాల్పుల ఘటన నిందితుల్లో ఒకరు పోలీసు కస్టడీలో ఆత్మహత్య చేసుకున్నారు. కాల్పులు జరిపిన నిందితులకు ఆయుధాలు సరఫరా చేసినట్లు అనూజ్ తపన్(32)పై ఆరోపణలున్నాయి. పోలీసులు ఇతడిని పోలీస్ కమిషనర్ కార్యాలయ భవనం ఆవరణలోని మొదటి అంతస్తు లాకప్‌లో ఉంచారు. బుధవారం ఉదయం టాయిలెట్‌కని వెళ్లిన ఇతడు ఎంతసేపటికీ బయటకు రాలేదు. తలుపు బద్దలు కొట్టి చూడగా బెడ్‌షీట్‌తో ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే గోకుల్‌దాస్ తేజ్‌పాల్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటన సమయంలో ఈ కేసులో నిందితులుగా ఉన్న మరో ఐదుగురు కూడా లాకప్‌లో ఉన్నారని అధికారులు తెలిపారు. తపన్ స్వస్థలం పంజాబ్.

150 స్కూళ్లకు

బాంబు బెదిరింపు

- దేశ రాజధాని ఢిల్లీలో కలకలం
- హుటాహుటిన పోలీసు బృందాల తనిఖీలు
- వట్టివేనని తేలడంతో ఊపిరి పీల్చుకున్న జనం

సాక్షి, న్యూఢిల్లీ: పాఠశాలలను బాంబులతో పేల్చేస్తామంటూ ఆగంతకులు పంపిన హెచ్చరికలు దేశ రాజధాని ఢిల్లీలోని బుధవారం ఉదయం తీవ్ర కలకలానికి కారణమయ్యాయి. ఢిల్లీ, నోయిడా, గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్, ఘజియాబాద్ ప్రాంతాల్లోని 150 పైచిలుకు స్కూళ్లకు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపు మెయిల్స్ పంపారు. స్కూళ్లలో బాంబులు పెట్టామంటూ మెయిల్స్ అందడంపై ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో తమకు 97 ఫోన్ కాల్స్ వచ్చాయని ఢిల్లీ ఫైర్ సర్వీస్ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. మధ్యాహ్నం తర్వాతా కొన్ని కాల్స్ అందాయన్నారు. తూర్పు ఢిల్లీలోని 24 ప్రైవేట్ స్కూళ్లు, దక్షిణ ఢిల్లీ ప్రాంతంలోని 18 స్కూళ్లు, పశ్చిమ ఢిల్లీ ప్రాంతంలోని 21, షాదారాలోని 10 పాఠశాలలకు బెదిరింపులు వచ్చినట్లు తేలిందని పోలీసులు వెల్లడించారు. ఈ సమాచారం బయటకు పొక్కడంతో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో స్కూళ్ల వద్దకు చేరుకుని, తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లడం, పాఠశాలల నిర్వాహకులు మైక్‌ల ద్వారా తల్లిదండ్రులు సూచనలు ఇవ్వడం కనిపించింది.

సోదాల్లో 20 బృందాలు

ఢిల్లీ క్రైం బ్రాంచి పోలీసు బృందాలు సీపీ రవీందర్ యాదవ్ నేతృత్వంలోని బెదిరింపులు అందిన స్కూళ్లలో ప్రొటోకాల్ ప్రకారం పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో కూడిన 20 బృందాలను రంగంలోకి దించారు. ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో అవన్నీ ఉత్తుత్తి బెదిరింపులేనని హోం శాఖ ప్రకటించింది.

డార్క్‌నెట్ నుంచి మెయిళ్లు

ఎటువంటి ఆధారాలు చిక్కకుండా డార్క్‌నెట్‌ను ఉపయోగించుకుని దుండగులు ఈ చర్యకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేసింది. sawariim@mail. ru. అనే ఈ మెయిల్ ఐడీ నుంచి వచ్చిన ఈ మెయిళ్లన్నిటిలోనూ..'మీరు ఎక్కడ కలుసుకున్నా వారిని చంపండి, వారు మిమ్మల్ని తరిమికొట్టిన ప్రదేశాల నుంచి వారినీ తరిమికొట్టండి. స్కూల్లో చాలా పేలుడు పదార్థాలున్నాయి..'అనే విషయమే ఉందని వెల్లడించింది. ఇందులోని సవరిమ్ అనే అరబిక్ పదాన్ని ఉగ్ర సంస్థ ఐఎస్ తరచూ వాడుతుంటుందని ఓ అధికారి తెలిపారు. బెదిరింపుల్లో పవిత్ర ఖురాన్‌ను కూడా ఉటంకించారని చెప్పారు. ఎన్నికల వేళ ప్రజల్లో భయాందోళనలను సృష్టించడానికి ఉగ్ర సంస్థలు పన్నిన కుట్రగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ భద్రతకు సంబంధించిన అంశంగా భావిస్తూ లోతుగా దర్యాప్తు చేపడతామని కేంద్ర హోంశాఖ తెలిపింది. విచారణ కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొంది.



ఢిల్లీలోని ఓ స్కూలు నుంచి తమ చిన్నారులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు



ఎన్నికల విచిత్రం

అస్సాంలోని ధుబ్రి జిల్లాలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో సంప్రదాయ టోపీని ధరిస్తున్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా

కమలానికి పెనుసవాళ్లు

- బీజేపీ మళ్లీ గెలిస్తే రిజర్వేషన్ల రద్దు, రాజ్యాంగం మార్పు తప్పదంటూ విపక్షాల ప్రచారం
- రాజస్తాన్, యూపీలో బీజేపీపై రాజ్‌పుత్‌ల తీవ్ర అసంతృప్తి
- కర్ణాటకలో మిత్రపక్షమైన జేడీ(ఎస్) నేత ప్రజ్వల్‌పై లైంగిక వేధింపుల కేసు
- విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టడంలో విఫలమవుతున్న బీజేపీ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు శాయశక్తులా కృషిచేస్తున్న కమల దళానికి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితర కీలక నేతలు సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మరోవైపు విపక్షం నుంచి ఎదురుదాడి, మిత్రపక్షాల కారణంగా తలెత్తుతున్న చిక్కులు, కొన్ని వర్గాల్లో నానాటికీ పెరుగుతున్న అసంతృప్తి వంటివి బీజేపీలో అలజడి సృష్టిస్తున్నాయి.

రిజర్వేషన్ల రద్దు అంశంపై రగడ

ఈసారి ఎన్నికల్లో బీజేపీ ఇప్పటిదాకా సొంతంగా 432 మంది అభ్యర్థులను బరిలో నిలిపింది. మరో పది నుంచి పదిహేను మంది అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయి. మొత్తం 445 మంది అభ్యర్థులను బరిలో నిలిపినా, 370 సీట్ల లక్ష్యం సాధించాలంటే 80 శాతానికి పైగా స్థానాల్లో కచ్చితంగా నెగ్గాల్సి ఉంటుంది. కానీ, అందుకు ప్రతిబంధకాలు లేకపోలేదు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మళ్లీ వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తారని, రాజ్యాంగాన్ని మార్చేస్తారని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. రిజర్వేషన్లు, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకమని పదేపదే ఆరోపిస్తున్నాయి. ఇదే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక, ఆప్ నేత సంజయ్ సింగ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్, ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వీ యాదవ్ రిజర్వేషన్లు, రాజ్యాంగంపై బీజేపీని ఇరుకున పెడుతున్నారు. దీనికి తోడు కాంగ్రెస్ ఇటీవల వైరల్ చేసిన అమిత్ షా డీప్‌ఫేక్ వీడియో తర్వాత రిజర్వేషన్ల రద్దు అంశంపై జనంలో చర్చ మొదలైంది. రిజర్వేషన్లు రద్దు చేసే ప్రసక్తే లేదని, అలాంటి ఆలోచనే లేదని నరేంద్ర మోదీ, అమిత్ షా ఎన్నికల ప్రచార సభల్లో హామీ ఇస్తున్నప్పటికీ, దేశంలో 80 శాతానికి పైగా ఉన్న ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీల్లో అనుమానాలు పూర్తిగా తొలగిపోవడం లేదు. మరో ఐదు విడతల్లో 350కి పైగా స్థానాల్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. రిజర్వేషన్ల రద్దు వ్యవహారం ఓటర్లపై తప్పనిసరిగా ప్రభావం చూపుతుందని రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

అందుకేనా 400 సీట్లు?

మళ్లీ బీజేపీని గెలిపిస్తే రాజ్యాంగాన్ని మార్చేయడం ఖాయం అంటూ ప్రతిపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి. రాజ్యాంగంతోపాటు కీలకమైన చట్టాలను మార్చడానికే 'అబ్‌కీ బార్ చార్ సౌ పార్' నినాదాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిందని కాంగెరస్ అధ్యక్షుడు ఖర్గే సహా విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. న్యాయం, సమానత్వం, పౌర హక్కులు, ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ద్వేషిస్తోందని, నియంతృత్వ పాలన తీసుకురావడమే ఆ పార్టీ లక్ష్యమని విపక్షాలు మండిపడుతున్నాయి. దీనిపైనా ప్రధాని నరేంద్ర మోదీ వివరణ ఇవ్వాల్సి వచ్చింది. సాక్షాత్తూ బాబాసాహెబ్ అంబేడ్కర్ దిగివచ్చినా రాజ్యాంగాన్ని మార్చలేరని ఆయన పలు సభల్లో చెప్పారు. అయినప్పటికీ రాజ్యాంగ మార్పుపై బీజేపీ నేతలు అనంతకుమార్ హెగ్డే, అరుణ్ గోవిల్ చేసిన వ్యాఖ్యలు బీజేపీకి సంకటంగా మారాయి. రాజ్యాంగాన్ని మార్చే ఉద్దేశం తమకు లేదని మోదీ పదేపదే స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేస్తున్నా విపక్షాల దాడిని సమర్థంగా తిప్పికొట్టడంలో బీజేపీ విఫలమవుతోంది. రాజ్యాంగం మార్పుపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను కొన్ని వర్గాల ప్రజలు నమ్ముతున్నట్లే కనిపిస్తోంది. ఇంకోవైపు రాజస్తాన్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో తమ జనాభా ఉన్న స్థానాల్లోనూ తమ వర్గం వారికి టిక్కెట్లు ఇవ్వలేదని రాజ్‌పుత్‌లు బీజేపీపై అసంతృప్తితో రగిలిపోతున్నారు. మహాపంచాయతీలు నిర్వహించి బీజేపీకి వ్యతిరేకంగా తీర్మానాలు చేస్తున్నారు.

ప్రజ్వల్ రేవణ్ణ వీడియోలతో వివాదం

కర్ణాటకలో బీజేపీ మిత్రపక్షమైన జేడీ(ఎస్) సిట్టింగ్ ఎంపీ, మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. యువతులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ సంబంధిత వీడియోలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. కర్ణాటకలో రెండో విడత పోలింగ్‌కు రెండు రోజుల ముందు ప్రజ్వల్ రేవణ్ణ వీడియోలు బయటకు వచ్చాయి. ఈ వ్యవహారంపై బీజేపీ ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతోంది. ప్రజ్వల్ రేవణ్ణను జేడీ(ఎస్) నుంచి బహిష్కరించినప్పటికీ వివాదం ఇప్పట్లో ఆగేలా లేదు.



బాలరాముని సన్నిధిలో రాష్ట్రపతి ముర్ము పూజలు

అయోధ్యలో రాష్ట్రపతి

- బాలరామున్ని దర్శించుకున్న ముర్ము
- ఆలయ ప్రారంభం తర్వాత తొలిసారి రాక

అయోధ్య: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం అయోధ్య సందర్శించారు. నూతన మందిరంలో ఇటీవలే కొలువుదీరిన బాలరామున్ని తొలిసారిగా దర్శించుకున్నారు. స్వామికి సాష్టాంగ నమస్కారం చేసి హారతిచ్చారు. అంతకుముందు సరయూ నది హారతి కార్యక్రమంలో కూడా రాష్ట్రపతి పాల్గొన్నారు. అంగవస్త్రం ధరించి సంప్రదాయబద్ధంగా హారతిచ్చారు. అనంతరం నదికి పూలమాలలు సమర్పించి మొక్కుకున్నారు. తర్వాత ప్రఖ్యాత హనుమాన్ గఢి ఆలయాన్ని సందర్శించారు. పూజల్లో పాల్గొని ఆంజనేయునికి హారతిచ్చారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించిన అనంతరం రామాలయానికి చేరుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. రామజన్మభూమి ఆలయ ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్రదాస్ రాష్ట్రపతికి దగ్గరుండి దర్శనం చేయించారు. రామ్ లల్లా పట్ల ఆమె భక్తిశ్రద్ధలు అపూర్వమని కొనియాడారు. ''స్వామికి రాష్ట్రపతి హారతిచ్చారు. సాష్టాంగం చేసి భక్తిని చాటుకున్నారు. రాష్ట్రపతి, ప్రధాని ఇద్దరూ గొప్ప రామ భక్తులు కావడం నిజంగా గొప్ప విషయం'' అని సత్యేంద్రదాస్ అన్నారు.

అప్పట్లో విపక్షాల రగడ...

అయోధ్యలో నూతన రామాలయం నిర్మాణానంతరం రాష్ట్రపతి అక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. ఆలయం జనవరి 22న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమవడం తెలిసిందే. బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం కూడా ఆయన ఆధ్వర్యంలోనే జరిగింది. దేశవ్యాప్తంగా అన్ని రంగాలకు చెందిన వేలాది మంది ప్రముఖులను కార్యక్రమానికి ఆహ్వానించారు. రాష్ట్రపతి మాత్రం అందులో పాల్గొనలేదు. దీనిపై విపక్షాల నుంచి తీవ్ర అభ్యంతరాలు, విమర్శలు వెల్లువెత్తాయి. ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతిని పూర్తిగా పక్కన పెట్టి సర్వం మోదీమయంగా కార్యక్రమం జరిపించారని కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ తదితరులు దుయ్యబట్టారు. ముర్ము ఆదివాసీ కాబట్టే రాష్ట్రపతి అని కూడా చూడకుండా కావాలనే కార్యక్రమానికి దూరంగా ఉంచారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ బుధవారం ఆమె అయోధ్య వెళ్లి నూతన ఆలయాన్ని, బాలరామున్ని దర్శించుకోవడం విశేషం.

సారీ పప్పా..

ఈసారీ సాధించలేను..!

కోటాలో మరో విద్యార్థి బలవన్మరణం

కోటా(రాజస్తాన్): రాజస్తాన్‌లోని కోటా నగరంలో 48 గంటల వ్యవధిలో మరో విద్యార్థి ప్రాణాలు తీసుకున్నాడు. రాష్ట్రానికే చెందిన భరత్ కుమార్ రాజ్‌పుత్ ఇప్పటికే రెండుసార్లు నీట్ కోసం ప్రయత్నించాడు. మూడోసారి ఈనెల 5న మళ్లీ పరీక్ష రాసేందుకు ప్రిపేరవుతున్నాడు. నీట్‌కు ప్రిపరేరవుతున్న తన బంధువుతో కలిసి స్థానిక రాజీవ్‌గాంధీ నగర్‌లోని ఓ ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటున్నాడు. మంగళవారం ఉదయం బంధువు బయటకు వెళ్లిన సమయంలో బెడ్ షీట్‌తో ఫ్యానుకు ఉరి వేసుకున్నాడని పోలీసులు తెలిపారు. అతడి వద్ద సారీ పప్పా..ఈఏడాది కూడా నీట్ సాధించలేను..'అని ఉన్న సూసైడ్ నోట్ లభించింది. తీవ్ర ఒత్తిడికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా భావిస్తున్నామని పోలీసులు అంటున్నారు. సోమవారం హరియాణాకు చెందిన సుమిత్ పాంచాల్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం తెల్సిందే.

రాయ్‌బరేలి నుంచి రాహుల్!

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలి, అమేథీ స్థానాల నుంచి ఎవరు పోటీచేస్తారనే దానిపై కాంగ్రెస్ ఇంకా సస్పెన్స్‌ను కొనసాగిస్తూనే ఉంది. నామినేషన్ల ప్రక్రియ ముగియడానికి మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. తాజాగా విశ్వసనీయ వర్గాల సమాచారమేమింటే రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ నుంచి బరిలోకి దిగే అవకాశాలున్నాయి. దీనిపై వారి కుటుంబం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సమాచారం. రాయ్‌బరేలీ నుంచి బరిలోకి దిగడానికి ప్రియాంక ఆసక్తిగా ఉన్నారట. అయితే రాహుల్ వద్దని వారిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ నాయకత్వానివి వారసత్వ రాజకీయాలనే ప్రధాని మోదీ విమర్శలను దృష్టిలో పెట్టుకొని ప్రియాంకను వద్దంటున్నట్లు ఈ వర్గాలు వెల్లడించాయి.

జార్ఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడికీ సమన్లు

రాంచీ: అమిత్ షా ఫేక్ వీడియో కేసులో జార్ఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్‌కు ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ చేశారు. గురువారం విచారణకు హాజరు కావాలని కోరారు. 'ఢిల్లీ పోలీసుల నుంచి మంగళవారం నాకు నోటీసు అందింది. నాకెందుకు నోటీసు ఇచ్చారో అర్థం కావడం లేదు. ఇది అరాచకమే. నిర్ధారించుకోకుండా సమన్లు ఇవ్వడం సమంజసం కాదు' అని ఠాకూర్ స్పందించారు. జార్ఖండ్ కాంగ్రెస్ ఎక్స్ ఖాతాను కూడా స్తంభింపజేశారు.

కాలిఫోర్నియా వర్సిటీలో ఉద్రిక్తత

- ఇజ్రాయెల్, పాలస్తీనా అనుకూల విద్యార్థుల ఘర్షణలు భారీగా అరెస్టులు



లాస్‌ఏంజెలిస్: పాలస్తీనా-ఇజ్రాయెల్ రగడ అమెరికాలో మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తోంది. లాస్ ఏంజెలిస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో పాలస్తీనా, ఇజ్రాయెల్ అనుకూల వర్గాల విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. బైడెన్ ప్రభుత్వ ఇజ్రాయెల్ అనుకూల విధానాలను నిరసిస్తూ పాలస్తీనా వర్గం వర్సిటీలో టెంట్లు వేసుకుని నిరసనలను సాగిస్తున్న విషయం తెలిసిందే. హెల్మెట్లు, మాస్కులు ధరించిన కొందరు కర్రలు చేతబట్టుకుని మంగళవారం అర్ధరాత్రి టెంట్లపైకి దాడికి దిగారు. బాణసంచా కూడా కాల్చినట్లు లాస్‌ఏంజెలెస్ టైమ్స్ తెలిపింది. ఈ సందర్భంగా ఇరువర్గాల వారు పిడిగుద్దులు కురిపించుకున్నారు. కుర్చీలతోపాటు అందిన వస్తువులను విసురుకున్నారు. వర్సిటీని పాలస్తీనా అనుకూల వర్గాలు ఆక్రమించుకుని తమను లోపలికి రానివ్వడం లేదన్న ఇజ్రాయెల్ అనుకూల విద్యార్థుల ఆరోపణల నేపథ్యంలో ఈ దాడి జరగడం గమనార్హం. హింసాత్మక ఘటనల కారణంగా వర్సిటీలో బుధవారం తరగతులు రద్దయ్యాయి. సోమవారం కొలంబియా వర్సిటీ కూడా ఈ ఘర్షణలకు వేదికవడం తెలిసిందే. హామిల్టన్ హాల్‌లో దాదాపు 20 గంటలపాటు తిష్టవేసిన పాలస్తీనా అనుకూల విద్యార్థులను పోలీసులు బలవంతంగా బయటకు పంపించారు. వర్సిటీతోపాటు సిటీ కాలేజీలో ఆందోళనలకు దిగిన దాదాపు 300 మందిని అరెస్టు చేశారు. నార్తర్న్ ఆరిజోనా యూనివర్సిటీలో టెంట్లు వేసి నిరసన సాగిస్తున్న పాలస్తీనా అనుకూల విద్యార్థులను పోలీసులు ఖాళీ చేయించారు. కొద్ది వారాలుగా అమెరికాలో పాలస్తీనా, ఇజ్రాయెల్ విద్యార్థుల మధ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్నాయి. దేశవ్యాప్తంగా పలు వర్సిటీలకు విస్తరిస్తూ ఆందోళన కలిగిస్తున్నాయి. రోడ్ ఐలాండ్స్ క్యాంపస్‌లో ఆందోళన చేస్తున్న పాలస్తీనా అనుకూల విద్యార్థి వర్గంతో బ్రౌన్ యూనివర్సిటీ ఒప్పందం కుదుర్చుకుంది. వచ్చే అక్టోబర్ నుంచి వర్సిటీలోకి ఇజ్రాయెల్ వ్యక్తుల పెట్టుబడులను స్వీకరించరాదనేది వారిలో ప్రధాన షరతు. ఆందోళనకారుల డిమాండ్‌కు ఇలా ఒక యూనివర్సిటీ తలొగ్గడం అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారని చెబుతున్నారు!



కొలంబియా వర్సిటీలో ఆందోళనకారులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



కాలిఫోర్నియా వర్సిటీ వద్ద ఇరువర్గాల విద్యార్థుల ఘర్షణలు

అమెరికాలో గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ హతం

కాలిఫోర్నియా: పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో ప్రధాన నిందితుడు, గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ అమెరికాలో హత్యకు గురయ్యాడు. అతడిని తామే చంపినట్లు అర్ష్ దల్లా-లఖ్‌బీర్ గ్యాంగ్ ప్రకటించుకుంది. మంగళవారం సాయంత్రం ఫ్రెస్నో ప్రాంతంలో మరో వ్యక్తితో మాట్లాడుతున్న బ్రార్‌పైకి దుండుగులు కాల్పులు జరిపారు. ఘటనలో బ్రార్ చనిపోగా మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానిక మీడియా తెలిపింది. ఘటనపై పోలీసులు స్పందించలేదు.

సాదిక్ ఖాన్‌పై తరుణ్ గులాటి పోటీ..

నేడు లండన్ మేయర్ ఎన్నిక

లండన్: యూకే రాజధాని లండన్ నగర మేయర్ పదవికి జరగనున్న ఎన్నికల్లో పాక్ సంతతికి చెందిన సాదిక్ ఖాన్‌తో ఢిల్లీలో జన్మించిన తరుణ్ గులాటి తలపడుతున్నారు. మేయర్ పదవికి గురువారం పోలింగ్ జరగనుంది. ప్రతిష్టాత్మక మేయర్ పదవి కోసం 13 మంది బరిలో ఉన్నారు. ప్రస్తుత మేయర్ సాదిక్ ఖాన్ లేబర్‌పార్టీ తరపున పోటీ చేస్తుండగా తరుణ్ గులాటి(63) ఇండిపెండెంట్ అభ్యర్థి. తరుణ్‌తోపాటు భారత సంతతికి చెందిన శ్యామ్ బాత్రా అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి కూడా పోటీ పడుతున్నారు. కాగా, ప్రధాన పోటీ సాదిక్ ఖాన్‌కు, కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థిని సుసాన్ హాల్‌కు మధ్యే ఉంది.

ఎలక్షన్ బీట్

మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వబోమని రాసివ్వగలరా?: మోదీ



బనస్కాంత: మతం ఆధారంగా ఎప్పటికీ రిజర్వేషన్లు కల్పించబోమని కాంగ్రెస్‌తో పాటు విపక్ష కూటమిలోని భాగస్వామ్య పార్టీలు లిఖితపూర్వకంగా గ్యారంటీ ఇస్తాయా? అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సవాలు విసిరారు. రాజకీయ లబ్ధి కోసం మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. బుధవారం గుజరాత్‌లోని దీసా, హిమ్మత్‌నగర్‌లో ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ప్రసంగించారు. తాను, తమ పార్టీ బీజేపీ ఉన్నంతకాలం విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లకు పూర్తి రక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. మతం పేరిట రిజర్వేషన్లను దుర్వినియోగం చేయబోమంటూ కాంగ్రెస్ హామీ ఇవ్వగలదా? అని ప్రశ్నించారు. స్వార్థం కోసం రిజర్వేషన్లతో ఆటలు ఆడుతామంటే సహించబోమని హెచ్చరించారు. ఇక్కడ మోదీ ఉన్నాడన్న సంగతిని కాంగ్రెస్ నాయకులు గుర్తుపెట్టుకోవాలని అన్నారు. రాజ్యాంగం ముసుగులో రిజర్వేషన్ల జోలికి రావొద్దని చెప్పారు.

రద్దు చేయం.. చేయనివ్వం: అమిత్ షా



కోర్బా: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను రద్దు చేసే ప్రశ్నే లేదని, ఒకవేళ కాంగ్రెస్ పార్టీ రద్దు చేయాలని చూస్తే తాము కచ్చితంగా అడ్డుకుంటామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తేల్చిచెప్పారు. రిజర్వేషన్లు రద్దు చేయమని, చేయనివ్వబోమని పేర్కొన్నారు. అబద్ధాలు పదేపదే బిగ్గరగా చెబితే అవే నిజమవుతాయన్నదే కాంగ్రెస్ ఉద్దేశమని మండిపడ్డారు. ఒక కుటుంబం కోసం అబద్ధాలు చెప్పొద్దని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు హితవు పలికారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే చివరకు ఖర్గేను బలిపశువును చేస్తారని అన్నారు. బుధవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోర్బా జిల్లాలోని కాట్‌ఘోరా పట్టణంలో ఎన్నికల ప్రచార సభలో అమిత్ షా మాట్లాడారు. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయితే రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం సాగిస్తోందని మండిపడ్డారు. తాను అనని మాటలు అన్నట్లుగా ఫేక్ వీడియో సృష్టించారని ధ్వజమెత్తారు. బీజేపీ గత పదేళ్లుగా అధికారంలో కొనసాగుతోందని, రిజర్వేషన్లను తొలగించిందా? అని ప్రశ్నించారు.

నేరగాళ్లకు ప్రధాని మోదీ రక్షణ: రాహుల్

న్యూఢిల్లీ/బెంగళూరు: నేరగాళ్లకు ప్రధాని నరేంద్ర మోదీ రక్షణ కల్పిస్తున్నారని, 'రాజకీయ కుటుంబాన్ని' కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కర్ణాటకలో జేడీ(ఎస్) ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై ప్రధాని మోదీ ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. ఈ మేరకు రాహుల్ గాంధీ బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. కర్ణాటకలో మహిళలపై అత్యంత ఘోరమైన నేరాలు జరిగితే ప్రధానమంత్రి మాట్లాడకపోవడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ప్రజ్వల్ రేవణ్ణ అరాచకాలకు పాల్పడ్డాడని తెలిసినప్పటికీ ఎన్నికల్లో అతడికి మద్దతుగా ఎందుకు ప్రచారం చేశారని మోదీని నిలదీశారు. ప్రజ్వల్ రేవణ్ణ దేశం నుంచి అంత సులభంగా ఎలా తప్పించుకొని పారిపోయాడని ప్రశ్నించారు. దేశంలో మహిళలపై ఎక్కడ నేరాలు జరిగినా ప్రధానమంత్రి మౌనంగా పాటిస్తున్నారని, నేరగాళ్లకు అండగా నిలుస్తున్నారని రాహుల్ ధ్వజమెత్తారు. నేరస్తులను కాపాడుతానంటూ మోదీ గ్యారంటీ ఇస్తున్నారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈవీఎంలపై అనుమానాలు: మమత



ఫరక్కా/బహరంపూర్: లోక్‌సభ మొదటి రెండు దశల్లో పోలింగ్ శాతాలు పెరిగాయంటూ ఎన్నికల కమిషన్(ఈసీ) వెల్లడించిన గణాంకాలపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అనుమానం వ్యక్తం చేశారు.తుది పోలింగ్ శాతాలను ఆలస్యంగా విడుదల చేసిన ఈసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు దశల్లోనూ పోలింగ్ శాతాలు అనూహ్యంగా పెరగడంతో ఈవీఎంల పనితీరుపై ఆమె అనుమానాలు వ్యక్తం చేశారు. బుధవారం మమత మల్దా, ముర్షిదాబాద్ జిల్లాల్లో టీఎంసీ ఎన్నికల ప్రచార ర్యాలీల్లో పాల్గొన్నారు. 'ఏప్రిల్ 19, 26వ తేదీల్లో జరిగిన రెండు విడతల పోలింగ్ శాతాలను ఆ వెంటనే ఈసీ ప్రకటించింది. కానీ, తాజాగా ఈసీ విడుదల చేసిన గణాంకాలను మొదట్లో ప్రకటించిన వాటితో పోల్చి చూస్తే అకస్మాత్తుగా పోలింగ్ శాతం 5.75 మేర పెరిగినట్లు కనిపిస్తోంది. ఇది ఆందోళన కలిగించే విషయం. బీజేపీకి అనుకూలంగా లేని ప్రాంతాల్లోనే ఇలా పెరగడంపై మాకు ఎన్నో అనుమానాలున్నాయి. ఈసీ వీటిని నివృత్తి చేయాల్సిందే'అని ఆమె కుండబద్దలు కొట్టారు.

తృణమూల్ కంటే బీజేపీకి ఓటేయడం బెటర్

కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ వివాదాస్పద వ్యాఖ్య



కోల్‌కతా: విపక్ష 'ఇండియా' కూటమి భాగస్వామ్యపక్షమైన తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై కాంగ్రెస్ సీనియర్ నేత, పశ్చిమ బెంగాల్ పీసీసీ అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి విరుచుకుపడ్డారు. తృణమూల్ కంటే బీజేపీకి ఓటు వేయడమే ఉత్తమం అన్నారు. బుధవారం పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ''ఈసారి బీజేపీ కూటమికి 400 సీట్లు రావు. ఇప్పటికే 100 సీట్లు ప్రధాని మోదీ చేతుల నుంచి జారిపోయాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను, సీపీఎంను గెలిపించడం చాలా అవసరం. కాంగ్రెస్, సీపీఎం ఓడిపోతే లౌకికవాదానికి ముప్పు తప్పదు. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ కంటే బీజేపీకి ఓటు వేయడమే బెటర్. అందుకే తృణమూల్ కాంగ్రెస్‌ను, బీజేపీని పక్కనపెట్టి కాంగ్రెస్‌ను గెలిపించండి'' అని కోరారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

గురువారం । 2 । మే । 2024



పింఛన్ల పంపిణీ

యనమలకుదురు రెండవ సచివాలయం పరిధిలోని లంబాడి పేట వద్ద రావినూతల సుబ్బమ్మకు ఇంటి వద్ద వృద్ధాప్య పెన్షన్ ఇస్తున్న సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ తనూజ.



భానుడి నుంచి రక్షణగా..

ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు రక్షణ చర్యలుగా చలువ కళ్లజోళ్లు, తలపై టోపీలు ధరించి ప్రయణిస్తున్నారు.



	కనిష్టం	గరిష్టం
నందిగామ	28.5	44.6
జగ్గయ్యపేట	26	42
మచిలీపట్నం	30	37
గుడివాడ	30	42

న్యూస్‌రీల్

జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో వంశీకి సిల్వర్ మెడల్



గన్నవరం: జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడల్లో పంచాయతీరాజ్ ఉద్యోగి కాంస్య పతకం సాధించారు. ముంబయిలో ఏప్రిల్ 24 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెలివెల వంశీమోహన్‌కృష్ణ పాల్గొన్నారు. డిస్కస్ త్రో విభాగంలో ఉత్తమ క్రీడా నైపుణ్యం కనబరిచి సిల్వర్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా వంశీమోహన్‌కృష్ణను ఎన్జీవోస్ సంఘ నేతలు, పంచాయతీరాజ్ ఉద్యోగులు అభినందించారు.

మొర్సుమల్లి చెక్‌పోస్టు తనిఖీ




మైలవరం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఎన్నికల పరిశీలకులు ప్రీతీందర్ సింగ్ తెలిపారు. మైలవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొర్సుమల్లి చెక్‌పోస్టును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ నేపథ్యంలో డబ్బు, మద్యం అక్రమ రవాణా జరగకుండా పోలీస్ సిబ్బంది గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. ఇరువైపులా రాకపోకలు సాగించే వాహనాలు పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే విడిచిపెట్టాలని సూచించారు. ధ్రువీకరణ పత్రాలు లేకుండా నగదు రవాణా చేస్తుంటే స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారులకు తెలియజేయాలని చెప్పారు. ఆయనతో పాటు మైలవరం ఏసీపీ మురళీమోహన్, సీఐ కిశోర్‌బాబు, ఎస్ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు.

దక్షిణ భారత స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు కృష్ణా టీమ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేరళలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం (కొట్టాయం) నిర్వహిస్తున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయం హ్యాండ్‌బాల్ (పురుషులు) పోటీలకు కృష్ణా విశ్వవిద్యాలయంకు చెందిన బృందం పయనమై వెళ్లిందని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు తెలిపారు. ఈ బృందానికి తమ కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావు మేనేజర్‌గా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ బృందంలో తమ కళాశాలకు చెందిన కేబీ గిరిసుబ్రహ్మణ్యం, ఎం. భార్గవ్‌కిరణ్, బి.సంతోష్‌కుమార్, వి.మధుశంకర్, కె.సంగీత్‌కుమార్, పి.తేజ్, బి.గోపీ, డీఏఆర్ కళాశాలకు చెందిన కె.సుకుమార్, టి.సంజయ్, ఏబీఎస్వీ నాగేంద్ర, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలకు చెందిన ఎస్.నాగశ్రీనాథ్, పి.పుష్పరాజ్, బి.దుర్గారావు, వికాస్ కాలేజ్‌కు చెందిన ఎం.మహేష్‌కుమార్, డాక్టర్ ఎల్‌హెచ్ఆర్ కళాశాల నుంచి కె. వెంకటేశ్వరరావు, కె.తన్వజయ తదితరులు ఉన్నారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అభినందించినట్లు పేర్కొన్నారు.

క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని క్రీడా ఔత్సాహికులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కమిటీ చైర్మన్ టి.త్రినాథరాజు తెలిపారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి సంవత్సరం నిర్వహించే సమ్మర్ క్యాంపునకు ఈ గ్రౌండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. శిక్షణతో పిల్లలకు ప్రాథమిక నైపుణ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఆటలోని మెలకువలు నేర్చుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరి త్రిమూర్తి, సీనియర్ క్రీడాకారులు ఎల్లారావు, బాబుజీ, విజయ్‌సారథి పాల్గొన్నారు.

జోరు.. ప్రచార హోరు



పశ్చిమ నియోజకవర్గం ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి అసిఫ్, చిత్రంలో కేశినేని శ్వేత తదితరులు



విజయవాడ 11వ డివిజన్ పంట కాలువ రోడ్డు రెల్లి కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్

- ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- మండుటెండలోనూ తిరుగుతున్న అభ్యర్థులు
- ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్ సీపీ
- టీడీపీ ప్రచారానికి ఆశించిన మేర స్పందన కరువు
- బీజేపీ, టీడీపీ, జనసేన మధ్య కుదరని సఖ్యత



విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం గవర్నర్‌పేటలో ఓట్లు అభ్యర్థిస్తున్న వెలంపల్లి, ఎంపీ కేశినేని శ్రీనివాస్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు ప్రచార పర్వాన్ని హోరెత్తిస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ తంతు ముగియడంతో బరిలో నిలిచే అభ్యర్థులు ఎవ్వరో తేలిపోయింది. దీంతో అభ్యర్థులంతా ప్రచారంపై దృష్టి సారించారు. కేవలం 10 రోజులు మాత్రమే గడువు ఉండటంతో ప్రచార వేగం పెంచారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ప్రచారంలో నిమగ్నమయ్యారు. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకొంటున్నారు. ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకొనేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీ ప్రచారంలో దూకుడు పెంచింది. ఇంటింటి ప్రచారం చేస్తూ తమకు అవకాశం కల్పించాలని అభ్యర్థులు ఓటర్లను వేడుకొంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేసిన మేలును తెలియజేస్తున్నారు. సిద్ధం సభలు, ఉమ్మడి కృష్ణా జిల్లాలో మేమంతా సిద్ధం బస్సుయాత్ర సూపర్ సక్సెస్ కావడం, నామినేషన్ కార్యక్రమాలకు స్వచ్ఛందంగా జనాలు తరలిరావటంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది. అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు అలుపెరగకుండా ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రతి గడప తడుతున్నారు. విజయవాడ పార్లమెంటు అభ్యర్థి కేశినేని నాని, మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, విజయవాడ తూర్పులో దేవినేని అవినాష్, సెంట్రల్‌లో వెలంపల్లి శ్రీనివాస్, పశ్చిమ నియోజకవర్గంలో అసిఫ్, మైలవరంలో సర్నాల తిరుపతిరావు, తిరువూరులో స్వామిదాసు, జగ్గయ్యపేటలో ఉదయభాను , మచిలీపట్నంలో పేర్ని కిట్టు, అవనిగడ్డలో సింహాద్రి రమేష్, పామర్రులో కైలే అనిల్‌కుమార్, గుడివాడలో కొడాలి నాని, గన్నవరంలో వల్లభనేని వంశీ, పెడనలో ఉప్పాల రాము, ప్రచారాలకు ఓటర్లు బ్రహ్మరథం పడుతున్నారు. వాళ్ల ప్రచారాలకు విశేష స్పందన లభిస్తోంది. జనాల నుంచి వీరికి మద్దతు లభించడంతో రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు.

టీడీపీలో రగులుతున్న సీనియర్లు...

పలు నియోజకవర్గాల్లో డబ్బు మూటలతో వచ్చిన కొత్త నేతలకు టిక్కెట్లు కేటాయించడంతో ఆది నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేసిన టీడీపీ సీనియర్ నేతలు లోలోపల రగిలిపోతున్నారు. దీంతో అభ్యర్థులకు వీరి నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన అలవికానీ హామీలు, మ్యానిఫెస్టోతో జనాల ముందుకు వెళితే ప్రజల ఛీత్కారాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం వీరిని పట్టి పీడిస్తోంది. ఈ పరిణామాలన్నీ వారి ప్రచారానికి ప్రతిబంధకంగా నిలుస్తున్నాయి.

టీడీపీ ప్రచారంలో ఆపసోపాలు...

టీడీపీ ప్రచారంలో ఆపసోపాలు పడుతోంది. టీడీపీ, బీజేపీ, జనసేన మధ్య సఖ్యత పూర్తిగా కొరవడింది. విజయవాడలో పార్లమెంటు అభ్యర్థి కేశినేని చిన్ని, ఎమ్మెల్యే అభ్యర్థుల మధ్య సమన్వయం లేదు. మచిలీపట్నంలో జనసేన తరఫున ఎంపీ అభ్యర్థి బాలశౌరికి, ఎమ్మెల్యేల అభ్యర్థుల మధ్య ప్రచారంలో ఎవరికి వారే యమునా తీరు అన్న చందాన వ్యవహరిస్తున్నారు. ఇటీవల పెడన, మచిలీపట్నంలో నిర్వహించిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సభలకు జనాల నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో పార్టీ అభ్యర్థులతో పాటు శ్రేణులు డీలా పడ్డాయి. పామర్రు, ఉయ్యూరులో జరిగిన చంద్రబాబు సభలు తుస్సుమనడంతో క్యాడర్‌లో నిస్తేజం నెలకొంది. ప్రచారాల్లో సైతం జనాల నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో ఆ పార్టీల అభ్యర్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు నియోజకవర్గాల్లో అభ్యర్థులకు అసమ్మతి సెగలు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి.

పెరుగుతున్న దూరం

- బీజేపీతో కలవని టీడీపీ నేతలు
- జెండా కడితే ముస్లిం వర్గాల నుంచి వ్యతిరేకత వస్తోందట
- సమన్వయం లేదంటూ వాపోతున్న బీజేపీ నేతలు
- అవమానకరంగా ఉందంటున్న నాయకులు



పెనమలూరు నియోజకవర్గంలోని టీడీపీ ప్రచార వాహనాలకు బీజేపీ జెండా లేని వైనం

కంకిపాడు: రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడినా నేతలు మాత్రం కలవడం లేదు. జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన నేతల ప్రచార కార్యక్రమాల్లో బీజేపీని దూరం పెడుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీ జెండాను ప్రచార వాహనాలకు సైతం కట్టడానికి సుముఖత చూపటం లేదు. బీజేపీ జెండాను ప్రచార వాహనాలకు కడితే ముస్లిం వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వస్తుందట.. ఓట్లు పడవని టీడీపీ, జనసేన భావించడంతో జెండా కట్టడం లేదు.. అంటూ బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ అధినాయకత్వం పట్టించుకోకపోవడం అవమానకరంగా ఉందంటూ ఆ పార్టీ నేతలు వాపోతున్నారు.

పెనమలూరు వేదికగా..

సార్వత్రిక ఎన్నికల్లో పెనమలూరు నుంచి టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ బరిలో ఉన్నారు. నియోజకవర్గంలో ఆ పార్టీ ప్రచార వాహనాలను ఏర్పాటు చేసింది. ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్లతో ప్రచారం చేస్తున్నాయి. కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన జెండాలను మాత్రం అన్ని ప్రచార వాహనాలకు కట్టారు. జెండా మాస్తే తక్షణమే వాటిని మార్చుతున్నారు. కూటమిలో భాగమైన బీజేపీ జెండాను మాత్రం ఏ ఒక్క వాహనానికి కట్టలేదు. దీనిపై బీజేపీకి చెందిన ఓ మండల నాయకుడు...'బీజేపీ జెండా మోయలేమంటున్నారు. జెండాను చూస్తేనే ముస్లింలు ఓట్లు వేయరంట..తలకొట్టేసినట్టు అవుతోంది' అంటూ బాహాటంగానే వాపోవడంపై ప్రస్తుతం తీవ్ర చర్చ సాగుతోంది. అధినాయకత్వం కూడా స్పందించడం లేదని బీజేపీ నేతలు వాపోతున్నారు. అభ్యర్థి కూడా కనీసం కలుపుకుని వెళ్లే ప్రయత్నం చేయకపోవడంతో బీజేపీ నేతలు, కార్యకర్తలు ప్రచారానికి పూర్తిగా దూరంగా ఉంటున్నారు. దీంతో ఆ ఓటు బ్యాంక్‌కు గండిపడినట్టే.

ఇదీ ఒక కారణం

వైఎస్సార్ సీపీకి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు చేరువగా ఉన్నాయి. ఆయా వర్గాల నుంచి ప్రజలు స్వాగతం పలుకుతూ అండగా నిలుస్తున్నారు. వైఎస్సార్ సీపీకి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. కొన్ని రోజులుగా నియోజకవర్గంలోని ఏ గ్రామానికి వెళ్లినా ఎన్నికల ప్రచారానికి అపూర్వ ఆదరణ లభిస్తోంది. తాజాగా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ బీజేపీ అధినాయకత్వం ప్రకటించడం తెలిసిందే. దీంతో ఆ వర్గాలు బీజేపీకి దూరమయ్యే పరిస్థితి. కూటమి పేరుతో కలుపుకుని వెళ్తే ఆదరించే పరిస్థితి లేదు. దీంతో కూటమి పరిస్థితి ముందు నుయ్యి..వెనుక గొయ్యి చందంగా తయారైంది. ఓటమి సెగ మొదలుకావడంతో కూటమి వెన్నులో వణుకు మొదలైంది.

జనసైనికులు ప్రవర్తన, పద్ధతి మార్చుకోవాలి

అవనిగడ్డ: జనసైనికులంటే అరవడం, కేకలు పెట్టడం, కొట్టడం కాదని.. ప్రవర్తన, పద్ధతి మార్చుకుని సమాజ హితానికి పని చేయాలని క్రికెటర్ అంబటి రాయుడు హితవు పలికారు. మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి బుద్ధప్రసాద్ కోసం ఆయన బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. స్థానిక రాజీవ్ గాంధీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో అంబటి రాయుడు మాట్లాడుతుండగా కొంతమంది యువకులు ఈలలు, కేకలు వేశారు. దీంతో ఆయన పై విధంగా జన సైనికులకు హితబోధ చేశారు. జనసేన తరఫున ప్రచారానికి వచ్చిన ఆయన కార్యకర్తల నైజాన్ని బహిరంగ పరచడంపై కొంత మంది ఆవేదన చెందారు.

పారదర్శకంగా ఈవీఎంల ర్యాండమైజేషన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు వేదికపై ఎన్నికల పరిశీలకులు

- ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రక్రియ పూర్తి
- కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):ఈ నెల 13 న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్స్ (ఈవీఎం)ల రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో బుధవారం జనరల్ అబ్జర్వర్లు మంజూ రాజ్‌పాల్, నరేందర్‌సింగ్ బాలి సమక్షంలో కలెక్టర్ ఢిల్లీరావు ఆధ్వర్యంలో ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో పాటు ఎలక్షన్ ఏజెంట్లు, అభ్యర్థులు, అభ్యర్థుల ప్రతినిధులు తదితరులు హాజరుగా కాగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఈవీఎంలను నియోజకవర్గాలకు కేటాయించామని తెలిపారు. రెండో ర్యాండమైజేషన్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో ఈవీఎంలను పోలింగ్ స్టేషన్లకు అనుసంధానించినట్లు చెప్పారు.

ఎన్నికల నియమావళిపై ప్రత్యేక దృష్టి...


జనరల్ అబ్జర్వర్లు మంజూ రాజ్‌పాల్, నరేందర్ సింగ్ బాలి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. తాము ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు మునిసిపల్ గెస్ట్ హౌస్‌లో అందుబాటులో ఉంటామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలు ఎన్నికల ఉల్లంఘనలకు సంబంధించి ఫిర్యాదులు, విజ్ఞాపనలు నేరుగా కలిసి సమర్పించవచ్చన్నారు. సువిధ యాప్ ద్వారా అనుమతులు, సీ–విజిల్ ద్వారా ఫిర్యాదుల స్వీకరణ, ఈసీఐ డిజిటల్ వేదికలు తదితరాలపై జనరల్ అబ్జర్వర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు...

తిరువూరు నియోజకవర్గానికి 280 బ్యాలెట్ యూనిట్లు, 280 కంట్రోల్ యూనిట్లు, 304 వీవీ ప్యాట్లు కేటాయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి 303 బీయూలు, 303 సీయూలు, 328 వీవీప్యాట్లు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి 642 బీయూలు, 321 సీయూలు, 346 వీవీప్యాట్లు, విజయవాడ తూర్పు నియోజకవర్గానికి 357 బీయూలు, 357 సీయూలు, 387 వీవీప్యాట్లు కేటాయించినట్లు వివరించారు. మైలవరంలో 354 బీయూలు, 354 సీయూలు, 383 వీవీప్యాట్లు, నందిగామకు 266 బీయూలు, 266 సీయూలు, 288 వీవీ ప్యాట్లు, జగ్గయ్యపేటకు 266 బీయూలు, 266 సీయూలు, 288 వీవీప్యాట్లు కేటాయించినట్లు తెలిపారు.

నేటి నుంచి హోం ఓటింగ్

కృష్ణా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ



చిలకలపూడి(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం పైగా దివ్యాంగులకు గురువారం నుంచి హోం ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో హోం ఓటింగ్ ప్రక్రియకు 35 బృందాలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. గన్నవరం, పెనమలూరు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ఆరు బృందాలు, పామర్రు నియోజకవర్గంలో ఐదు బృందాలు, మచిలీపట్నం , పెడన, గుడివాడ నియోజకవర్గాల్లో నాలుగు బృందాలు ఉంటాయని వివరించారు. హోం ఓటింగ్ ప్రక్రియలో భాగంగా ఒక్కొక్క బృందంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారి, సూక్ష్మ పరిశీలకులు, వీడియో గ్రాఫర్, పోలీస్ ఎస్కార్ట్ ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఫారం –12డీ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో 85 సంవత్సరాలు పైబడిన వారు 9,114 మంది ఉన్నారని, 40 శాతం పైబడి వైకల్యం కలిగిన వారు 22,429 మంది ఉన్నారని వివరించారు. హోం ఓటింగ్ ప్రక్రియ ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు జరుగుతుందని మిగిలిన వారికి 7, 8 తేదీల్లో కూడా నిర్వహిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు.

భద్రతకు కట్టుబడి

- ప్రభుత్వ పాఠశాలల్లో నైట్‌వాచ్‌మన్ల నియామకం
- బడిలో పరిశుభ్రత కోసం ఆయా పోస్టుల భర్తీ
- ఎన్టీఆర్ జిల్లాలో 1,147 మందికి ఉపాధి
- వారి వేతనాల కోసం ఏడాదికి రూ.8.25 కోట్లు



వెలగలేరు జెడ్పీ హైస్కూల్లో టాయిలెట్లు శుభ్రపరుస్తున్న ఆయాలు



వెలగలేరు జెడ్పీ హైస్కూలు వద్ద కాపలాగా ఉన్న వాచ్‌మెన్

జి.కొండూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పేద విద్యార్థులకు సైతం మెరుగైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టింది. మనబడి నాడు – నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దింది. నూతన భవనాలు, గ్రీన్ బోర్డులు, విద్యార్థులకు కూర్చునేందుకు అధునాతన టేబుళ్లు, విద్యుత్, స్వచ్ఛమైన తాగునీరు, నిరంతర నీటి సరఫరాతో కూడిన మరుగుదొడ్లు వంటి ఎన్నో వసతులను సమకూర్చింది. ఈ పాఠశాలల్లో పరిశుభ్రత కోసం ఆయాలు, రాత్రివేళ రక్షణ కోసం వాచ్‌మన్లను నియమించి పేద విద్యార్థుల చదువులపై చిత్తశుద్ధిని చాటుకుంది.

నెలకు రూ.6వేల చొప్పున వేతనం

ప్రభుత్వ పాఠశాలలకు రక్షణగా ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటికే గుర్తించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు 132 మంది నైట్ వాచ్‌మన్లను ప్రభుత్వం నియమించింది. పాఠశాలల్లో పరిశుభ్రతను మెరుగు పరిచేందుకు 1,015 మంది ఆయాలను నియమించింది. వారికి నెలకు రూ.6 వేల చొప్పున సంవత్సరానికి రూ.8.25 కోట్లను ఖర్చు చేస్తోంది. ఈ నియామకాల వల్ల జిల్లాలో 1,147 మంది పేదలకు ఉపాధి ఏర్పడింది.

విధులు ఇలా..

నైట్ వాచ్‌మన్లుగా నియమితులైన వ్యక్తులు పాఠశాల హెచ్ఎం, పేరెంట్స్ కమిటీ పర్యవేక్షణలో పనిచేస్తారు. పనిదినాల్లో పాఠశాలలు మూసివేయడానికి ముందే విధులకు హాజరై మరుసటి రోజు పాఠశాలలు తెరిచే వరకు రక్షణగా ఉంటారు. ఇతర రోజుల్లో కూడా విధుల్లో ఉంటారు. పాఠశాలల భవనాలు, అత్యాధునిక వస్తువులు, డిజిటల్ పరికరాలకు రక్షకులుగా పనిచేస్తారు. ఏవైనా అసాధారణ కార్యకలాపాలు జరిగినా, అగ్ని ప్రమాదాలు సంభవించినా వెంటనే ఆయా పాఠశాలల హెచ్ఎంలు, స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇస్తారు. పాఠశాల గార్డెన్‌లకు వాటరింగ్ చేయడంతోపాటు ఆర్ఓ ప్లాంట్లను శుభ్రం చేస్తారు. పాఠశాలలకు సంబంధించిన మెటీరియల్‌ను హెచ్ఎంలకు అందజేయడం వంటి పనులను నైట్‌వాచ్‌మన్లు చేస్తారు. ఆయాలుగా నియమితులైన మహిళలు రసాయనాలతో టాయిలెట్లను రోజుకు నాలుగు సార్లు శుభ్రం చేస్తారు. పాఠశాలల గదులు, క్యాంపస్‌లను శుభ్రంచేస్తారు. నైట్ వాచ్‌మన్లు, ఆయాలకు టాయిలెట్ల నిర్వహణ నిధి నుంచి గౌరవ వేతనంగా నెలకు రూ.6 వేల చొప్పున అందుతుంది.

ఎన్టీఆర్ జిల్లాలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

కేటగిరి	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	621	32,480
ప్రాథమికోన్నత	132	11,006
ఉన్నత	163	54,974
మొత్తం	916	98,460

పాఠశాలలకు పూర్తి భద్రత



రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అత్యాధునిక వసతులను కల్పించడమే కాకుండా వాటికి రక్షణగా నైట్ వాచ్‌మన్లను నియమించింది. ఈ చర్య ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. గతంలో పాఠశాలల్లో చోరీలతో పాటు అసాంఘిక కార్యకలాపాలు జరిగేవి. ఇప్పుడు ఇక ఆ సమస్య లేదు. గ్రామంలో వ్యక్తులనే నియమించడం వల్లన వారికి ఉపాధి కలుగుతుంది.

– చెన్నూరు సాంబదుర్గారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్, కట్టుబడిపాలెం హైస్కూలు

పరిశుభ్ర వాతావరణం



ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ఆయాలను నియమించడం గొప్ప నిర్ణయం. టాయిలెట్లు క్లీనింగ్, పాఠశాల గదులను శుభ్రం చేసేందుకు నాణ్యమైన రసాయనాలను సైతం ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఆదర్శనీయం.

– తుంగం వెంకటరమణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్, గంగినేని జెడ్పీ హైస్కూల్

కార్మికులకు క్యారేజీల తాయిలాలు

జగ్గయ్యపేట:కార్మికులకు జగ్గయ్యపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోదరుడు శ్రీరాం చినబాబు క్యారేజీలను తాయిలాలుగా పంపిణీ చేసిన ఘటన పట్టణంలో బుధవారం జరిగింది. వివరాల ప్రకారం మే డే సందర్భంగా ఆర్టీసీ డిపో సమీపంలోని కార్మికనగర్‌లో పలు సంఘాల కార్మికులు మే డే వేడుకలు జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ సోదరుడు చినబాబు మే 13న జరిగే ఎన్నికలలో తన సోదరునికి సైకిల్ గుర్తుకే ఓటేసి గెలిపించాలని కోరుతూ తనఅనుచరుల సహాయంతో కార్మికులకు క్యారేజీ బాక్సులను పంపిణీ చేశారు. ఈ క్యారేజీ బాక్స్‌లు సైతం కార్మికులందరికీ పంపిణీ చేస్తామని చెప్పి, కొద్దిమందికి మాత్రమే పంపిణీ చేయడంపై కార్మికుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి.



జగ్గయ్యపేటలో క్యారేజీ బాక్సులను తీసుకెళ్తున్న కార్మికులు

క్లుప్తంగా

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన టీడీపీ



ఇంజినీరింగ్ కాలేజీలో ప్రసంగిస్తున్న చిన్ని. వేదికపై ఎమ్మెల్యే అభ్యర్థి కొలికపూడి

తిరువూరు: తెలుగుదేశం పార్టీ నేతలు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి తిరువూరులోని ప్రైవేటు కళాశాలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులతో మేధావుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ గెలిస్తే రాష్ట్రంలో ఐటీ పరిశ్రమలొస్తాయని, క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థులకు అధిక సంఖ్యలో ఉద్యోగాలు వస్తాయని చెప్పుకొచ్చారు. అధ్యాపకులు తమ పరిధిలో తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలియజేసి ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కళాశాల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హామీల చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

వడిత్యా శంకర్‌నాయక్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజల నమ్మకం, విశ్వాసం కోల్పోయిన చంద్రబాబు నాయుడు ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని గిరిజన ప్రజా సమాఖ్య (జీపీఎస్) వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రోజు రోజుకు ముఖ్యమంత్రికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారం కైవసం చేసుకుందామనుకున్న కూటమిని ప్రజలు నమ్మడంలేదన్నారు. ఎలాగైనా అధికారం పొందాలని అడ్డదారుల్లో ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల మన్ననలు పొందిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ప్రారంభమైన పింఛన్ల పంపిణీ

చిలకలపూడి(మచిలీపట్నం): పింఛను కానుక ద్వారా జిల్లాలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ బుధవారం ప్రారంభమైంది. కృష్ణా జిల్లాలో మొత్తం 2,43,400 మంది లబ్ధిదారులు ఉన్నారు. 1,78,056 మంది బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు. మిగిలిన 65,344 మంది ఇళ్లకు సిబ్బంది వెళ్లి పింఛన్లు అందజేయనున్నారు. సచివాలయ సిబ్బంది మొదటి రోజైన బుధవారం 48,491 మందికి పింఛన్లు అందజేశారు. మేడే సందర్భంగా బుధవారం బ్యాంకులకు సెలవు కావటంతో లబ్ధిదారులు గురువారం నుంచి నగదు డ్రా చేసుకోనున్నారు.

ఘనంగా కార్మికుల దినోత్సవం



వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ పతాకానికి వందనం చేస్తున్న గౌతంరెడ్డి, ఆసిఫ్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రధాన కార్యాలయంలో బుధవారం కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి యూనియన్ జెండాను ఆవిష్కరించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కార్మికుల సొమ్ము దిగమింగిన అచ్చెన్నాయుడు

ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల పొట్ట కొట్టి వారి సొమ్మును దిగమింగి అరెస్టయిన నీచుడు అచ్చెన్నాయుడని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వంలో కార్మిక మంత్రిగా పని చేసిన అచ్చెన్నాయుడు ఈఎస్ఐ ఆస్పత్రులకు సంబంధించి కార్మికులు చెల్లించిన డబ్బును కైంకర్యం చేసి జైలుకు వెళ్లాడని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ పారిశుద్ధ్య కార్మికుల కష్ట సుఖాలు తెలుసుకుని నెలకు రూ.22 వేల వేతనం ఇస్తున్న కార్మికుల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఆటో, ట్యాక్సీ, లారీ, టిప్పర్ డ్రైవర్లుగా పని చేస్తున్న వారికి ఆయా వాహనాలు కొనుగోలు చేసేందుకు కేవలం ఆరు శాతం వడ్డీకి బ్యాంక్ ద్వారా రుణం ఇప్పిస్తానని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. కార్మికులకు సీఎం జగన్ అన్యాయం చేశారని విషం చిమ్ముతూ రోత రాతలు రాస్తున్న ఈనాడు రామోజీరావుకు జర్నలిజం విలువలు తెలుసా? అని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వ పాలనకు సీఎం జగనన్న పాలనకు మధ్య తేడా గమనించా లని కార్మికులను కోరారు. కార్మికుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తే, టీడీపీ హయాంలో కార్మిక మంత్రి అచ్చెన్నాయుడు కార్మికుల సొమ్మును దోచుకున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు విశ్వనాథ రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మెహరాజ్, జోనల్ ఇన్‌చార్జ్ నంబూరు ప్రదీప్, అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు పలువురు పాల్గొన్నారు.

పాస్ మార్కులు కూడా తెచ్చుకోని చంద్రబాబు

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



జగన్‌మోహనరావు, అరుణకుమార్‌తో కలిసి మాట్లాడుతున్న ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

నందిగామ టౌన్: హామీల అమలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 99 మార్కులు తెచ్చుకుంటే, చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో కనీసం పాస్ మార్కులు కూడా తెచ్చుకోలేకపోయారని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నందిగామ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ కుమార్‌తో ఆయన బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేయగలిగినవే చెప్తారని, చెప్పిన వాటిని కచ్చితంగా చేస్తారని పేర్కొన్నారు. చంద్రబాబు మాదిరిగా అధికారంలోకి వచ్చేందుకు అలివి కాని మోసపూరిత హామీలు ఇవ్వడం, ఆ తరువాత వాటిని విస్మరించి ప్రజలను వంచించడం తెలియదని స్పష్టంచేశారు. ఈ ఎన్నికల్లో జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలతో పాటు విజయవాడ పార్లమెంట్ సీటును వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కైవసం చేసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. 2014లో సైతం బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని గుర్తుచేశారు. చంద్రబాబు చేసిన మోసానికి 2019 ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని వివరించారు. ఈ ఎన్నికల్లో మరోమారు ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు కూటమిగా వస్తున్నారని ఎద్దేవాచేశారు. ఎంత చేసినా చంద్రబాబు కూటమిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా వైఎస్సార్ సీపీ పక్షానే ఉన్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, షేక్ ఖాలిక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ గోల్డ్ అప్రైజర్ కమిటీ అధ్యక్షుడిగా సుధాకర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కేడీసీసీ బ్యాంక్ గోల్డ్ అప్రైజర్ నూతన కమిటీ అధ్యక్షుడిగా భవిరి సుధాకర్ ఎన్నికయ్యారు. చిట్టినగర్ పుల్లేటికుర్తి విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా తాటికొండ వరప్రసాదరావు, కోశాధికారిగా తలశిల శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా రాణా బెనర్జీ ఎన్నికయ్యారు. భవిరి సుధాకర్ మాట్లాడుతూ.. సభ్యుల సహాయ సహకారాలతో అప్రైజర్ల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

విజయలక్ష్మికి దాసరి సేవా రత్న పురస్కారం



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు డాక్టర్ పరచూరి విజయలక్ష్మిని దాసరి సేవారత్న పురస్కారానికి ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా ఈ పురస్కారం ప్రదానం చేశారు. తెలుగు ఫిలిమ్ చాంబర్, తెలుగు చిత్ర నిర్మాతల మండలి, దర్శకుల మండలి, మా అసోసియేషన్ సంస్థలు ఏటా సోషల్ సర్వీస్‌లో ముందుండి, సాంస్కృతిక సంస్థ నిర్వహిస్తూ సేవలు చేసిన వారిని దాసరి సేవారత్న అవార్డ్‌కు ఎంపిక చేస్తారు. 2024 సంవత్సరానికి విజయలక్ష్మిని ఎంపిక చేసి అవార్డు ప్రదానం చేశారు. సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, తమ్మారెడ్డి భరద్వాజ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. విజయలక్ష్మికి నగరానికి చెందిన నిడుమోలు రమాసత్యనారాయణ, డేవిడ్‌రాజు, ప్రసూన రామన్, బోడి ఆంజనేయరాజు అభినందనలు తెలిపారు.

విజయవంతంగా జనన, మరణాల నమోదు



ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న పద్మావతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర వ్యాప్తంగా జనన, మరణాల నమోదు నిర్వహణ సక్రమంగా జరుగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకులు, రాష్ట్ర జనన మరణాల రిజిస్ట్రార్ పద్మావతి తెలిపారు. కొండపల్లి మునిసిపాల్టీలో బుధవారం ఆన్‌లైన్ జనన, మరణాల నమోదు, సర్టిఫికెట్లు జారీ ప్రక్రియపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏ వయస్సు వారు ఎంత మంది ఉన్నారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర పరిధిలో సంక్షేమ, ఇతర పథకాలు పేదలకు అమలు జరగాలంటే జనన, మరణాల లెక్కలు సక్రమంగా ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో కూడా వీటి వివరాలు సరిపోల్చుకున్నారు. మునిసిపాల్టీలో జనన, మరణాల నమోదు సేవలు సక్రమంగా ఉన్నాయని మునిసిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌ను అభినందించారు. రాష్ట్ర డెప్యూటీ డైరెక్టర్ కె.రవీంద్రరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

58,032 గోవా మద్యం సీసాల ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న రోడ్డు రోలర్



మద్యం సీసాల ధ్వంసాన్ని ప్రారంభిస్తున్న జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ నయీమ్ అస్మీ

ఉంగుటూరు: గన్నవరం మండలం మెట్లపల్లిలో శ్రీనివాస గార్డెన్స్‌లో ఇటీవల సీజ్ చేసిన 10,500 లీటర్ల 58,032 గోవా మద్యం సీసాలను పొట్టిపాడు టోల్‌ప్లాజా సమీపంలో సర్వీసు రోడ్డులో బుధవారం సాయంత్రం అధికారులు ధ్వంసం చేశారు. కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్, గన్నవరం ఆర్వో గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ మాట్లాడుతూ.. ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని మెట్లపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాల కేసులో ఇప్పటికే గూడపాటి వెంకటశివ దుర్గా ప్రసాద్, చందూరి వామనాచారిని అరెస్ట్ చేసి రిమాండు చేశామన్నారు. ఆ ప్రాంతానికి మద్యం ఎలా వచ్చింది, దీనిలో ఎంత మంది పాత్ర ఉంది అనే విషయంపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నా మని పేర్కొన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ జి.వెంకటేశ్వరరావు, గన్నవరం డీఎస్పీ ఆర్.జి.జయసూర్య, హనుమాన్ జంక్షన్ సీఐ నవీన్ నరసింహమూర్తి, ఆత్కూరు ఎస్ఐ పైడిబాబు పాల్గొన్నారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు మోసం

ఎన్నికల ప్రచారంలో ఉదయభాను



ఉదయభాను, కేశినేని నానితో కరచాలనం చేస్తున్న మహిళలు

జగ్గయ్యపేట: టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు పెద్ద మోసమని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను విమర్శించారు. చంద్రబాబు మాయలో పడొద్దని ప్రజలకు సూచించారు. మండలంలోని గౌరవరం, బండిపాలెం, గుండబోయినపాలెం గ్రామాల్లో విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)తో కలిసి బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ ముంగిటకు వచ్చిన ఉదయభాను, కేశినేని నానికి ఆయా గ్రామాల ప్రజలు సాదర స్వాగతం పలికారు. 'మీమంతా మీ వెంటే' అంటూ మహిళలు, పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఉదయభాను, కేశినేని నాని వెంట నడిచారు. ఈ సందర్భంగా ప్రచార వాహనంపై ఉదయభాను మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు సూపర్ సిక్స్ అంటూ వచ్చారని, 2014లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని గుర్తు చేశారు. జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను సామాన్యులకు చేరకుండా ఎలా అడ్డుకున్నారో అందరికీ తెలుసని పేర్కొన్నారు. ఈ సారి వలంటీర్లలపై విషం కక్కి, అది కుదరకపోయే సరికి మాటమార్చి తాను ఈ వ్యవస్థను కొనసాగిస్తానని చెబుతున్నారని విమర్శించారు. టీడీపీ అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గాన్ని కనీసం అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు. గత ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసినట్లు ఉదయభాను తెలిపారు. టీడీపీతో జతకట్టిన బీజేపీ కూడా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెబుతోందన్నారు. దీంతో ముస్లింలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని చెప్పారు. కేశినేని నాని మాట్లాడుతూ.. ప్రజాబలం ఉన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించలేకనే బీజేపీ, జనసేన పార్టీతో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. ఎన్ని కూటములు కట్టినా వైఎస్సార్ సీపీ పక్షానే ప్రజలు ఉన్నారని స్పష్టంచేశారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి తనను, ఉదయభానును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య, జిల్లా మహిళా కన్వీనర్ సంపత విజిత, నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, నాయకులు సయ్యద్ బాలసైదా, బూతుకూరి అప్పిరెడ్డి, గంగూరి సాంబశివరావు, అన్నాబత్తుల శ్రీనివాసరావు, గోవా రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి, కాసరగడ్డ రామారావు, శేషయ్య, బ్రహ్మయ్య, గద్దె సుధీర్, మైలా రామకృష్ణ, రంజిత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం రవాణాచేస్తే చర్యలు

జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆవులయ్య

కోనేరుసెంటర్(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని కృష్ణా జిల్లాలో మద్యం విక్రయాలకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ.ఆవులయ్య పేర్కొన్నారు. ఆయన జిల్లాలోని ఎక్సైజ్ సిబ్బందితో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా మద్యం విక్రయాలు, మద్యం అక్రమ రవాణా, సారా తయారీ, విక్రయాలపై నిఘా ఉంచామని తెలిపారు. బెల్టుషాపులపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి మద్యం విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తు లను పట్టుకునేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ దుకాణాల్లోని మద్యం సీసాలు బెల్టుషాపులకు తరలిపోకుండా ప్రత్యేక బృందాలను నియమించామని వివరించారు. గడిచిన 15 రోజుల్లో ఐదు బెల్టుషాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారికి ప్రభుత్వ దుకాణాల నుంచి మద్యం సీసాలను సరఫరా చేసిన ఇద్దరు సేల్స్‌మెన్‌లను అరెస్ట్ చేశామని వివరించారు. వైన్ షాపుల్లో తనిఖీలు ముమ్మరం చేసి ఎనిమిది కేసులు నమోదు చేసి పది మంది సేల్స్‌మెన్‌లతో పాటు ముగ్గురు సూపర్‌వైజర్‌లను ఉద్యోగం నుంచి తొలగించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. వారి నుంచి రూ.5,98,688 రికవరీ చేశామన్నారు. ఆరు ఎంఆర్‌పీ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గన్నవరం నియోజకవర్గం పరిధిలోని మెట్లపల్లిలో రూ.75.44 లక్షల ఖరీదు చేసే 58,032 గోవా మద్యం బాటిళ్లను పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. జిల్లాలో మద్యం రవాణా, అక్రమ నిల్వలు, బెల్టుదుకాణా లు, కల్తీ కల్లు, సారా తయారీ, విక్రయాలు తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు తమ వద్ద ఉన్న సమాచారాన్ని 90590 52288 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేస్తే వెంటనే దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. గుడివాడ డిస్టలరీ డిపో నుంచి సరఫరా అయ్యే మద్యానికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు సీసీ టీవీలు, జీపీఎస్ సిస్టమ్‌ను ఏర్పాటుచేశామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ దాడులు ముమ్మరం చేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలి

- ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర ఎంతో కీలకం
- కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి బాలాజీ



మాట్లాడుతున్న కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి బాలాజీ. చిత్రంలో ఎన్నికల పరిశీలకులు

చిలకలపూడి(మచిలీపట్నం): సాధారణ ఎన్నికలకు సంబంధించి సూక్ష్మ పరిశీలకులు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.కె.బాలాజీ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో సాధారణ ఎన్నికల సూక్ష్మ పరిశీలకులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాలాజీ మాట్లాడుతూ.. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, సజావుగా జరిగేందుకు, ఎన్నికల నిర్వహణ తీరు పరిశీలించేందుకు క్రిటికల్ పోలీస్ స్టేషన్లలో ఎన్నికల సంఘం వెబ్ కాస్టింగ్, నిరంతర వీడియోగ్రాఫ్ ఏర్పాటుతో పాటు సూక్ష్మ పరిశీలకులను నియమించిందన్నారు. సూక్ష్మ పరిశీలకుల విధులకు సంబంధించి 18 పాయింట్లు క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలని సూచించారు. సాధారణ ఎన్నికల పరిశీలకుడు జాన్ కింగ్స్ లే మాట్లాడుతూ.. సూక్ష్మ పరిశీలకుల బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు. సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిశీలించిన విషయాలపై సాధారణ పరిశీలకులకు నివేదికలు సమర్పించాలన్నారు. మరో సాధారణ పరిశీలకుడు నరహరిసింగ్ బంగర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల సంఘానికి కళ్లు, చెవులు వంటి వారన్నారు. వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణ తీరు పరిశీలించి ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు కృషి చేయాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. నియోజకవర్గాల వారీగా సూక్ష్మ పరిశీలకులకు ఈ నెల ఎనిమిదో తేదీన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ ఆనంద్‌కుమార్, నోడల్ అధికారి బి.మురళీకిషోర్, ఎల్‌డీఎం జయవర్ధన్, కమ్యూనికేషన్ నోడల్ అధికారి ఎస్.ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీనివాస్ కేసు విచారణ వేగవంతం

పటమట(విజయవాడతూర్పు): కుటుంబ సభ్యులను హత్య చేసి తాను ఆత్మహత్య చేసుకున్న ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ధారవత్ శ్రీనివాస్(40) కేసు విచారణలో పోలీసులు వేగం పెంచారు. డాక్టర్ శ్రీనివాస్, అతని తల్లి రమణమ్మ (65), భార్య ఉషా (38), కుమార్తె శైలజ (11), శ్రీహాన్ (6) కుటుంబ సభ్యుల మృతదేహాలకు బుధవారం పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. డాక్టర్ కాల్‌డేటాను పరిశీలించగా.. కొంతకాలంగా ఎవరితోనూ సరైన కమ్యూనికేషన్ నడపలేదని, ఫోన్ ఫ్లైట్ మోడ్‌లో ఉందని, అప్పుల తాకిడికి అలా చేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల అప్పుల బాధ పడలేక రెండు స్థలాలను డాక్టర్ శ్రీనివాస్ విక్రయించాడని విచారణలో తేల్చారు. మృతుడికి పలు బ్యాంకుల్లో ఖాతాలు ఉండటం, వాటి నుంచి లోన్లు తీసుకోవడాన్ని గుర్తించారు. మృతుడి చివరి వాగ్మూలంలో తన ఇంటిపై రూ.48 లక్షల బ్యాంక్ రుణం ఉందని, ఇంటిలో ఉన్న రూ.16 లక్షలు, కొంత నగలు, కారు విక్రయించి ఆ లోను తీర్చాలని డాక్టర్ తన ఫోనులో వాయిస్ రికార్డు చేశారని పోలీసులు తెలిపారు. తను ఆత్మహత్య చేసుకునేలా ఎవరైనా అప్పుల ఒత్తిడి పెంచారా అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నామని పటమట సీఐ మోహనరెడ్డి తెలిపారు. శ్రీనివాస్‌తో హాస్పిటల్ నిర్వహణలో వాటా ఉన్నవారిని, సన్నిహిత వైద్యులను, అతని స్నేహితులను విచారణ చేస్తున్నామని వివరించారు.

దావులూరు వద్ద రూ.14.24 లక్షల సీజ్



పట్టుబడిన నగదుతో సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సందీప్, ఎస్ఎస్‌టీ ఇన్‌చార్జి శ్రీదేవి

కంకిపాడు: మండలంలోని దావులూరు టోల్‌గేట్ వద్ద భారీగా నగదు పట్టుబడింది. పోలీసులు, ఎన్నికల ప్రత్యేక బృందం సంయుక్తంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో బందరుకు చెందిన వ్యక్తి బైక్‌పై తరలిస్తున్న రూ.14.24 లక్షల నగదు గుర్తించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవటంతో ఆ మొత్తాన్ని అధికారులు సీజ్ చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కంకిపాడు సీఐ వీ.శ్రీనివాసరావు ఈ కేసు వివరాలను వెల్లడించారు. కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ ఆదేశాలతో గన్నవరం డీఎస్పీ ఆర్.జి.జయసూర్య పర్యవేక్షణలో దావులూరు టోల్‌గేట్ వద్ద గల ఎన్నికల చెక్ పోస్టులో పోలీసులు, ఎన్నికల ప్రత్యేక బృంద సభ్యులు వాహన తనిఖీలు చేపట్టారు. విజయవాడ నుంచి మచిలీపట్నం బైక్‌పై వెళ్తున్న మచిలీపట్నం వాసి పచ్చిగొల్ల నరేంద్ర బాబును తనిఖీ చేశారు. తనిఖీల్లో అతని వద్ద రూ.14.24 లక్షల నగదును గుర్తించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవటంతో ఆ నగదు సీజ్ చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపారు. ఈ సమావేశంలో ఎస్ఐ డి.సందీప్, ఎస్ఎస్‌టీ ఇన్‌చార్జి జి.శ్రీదేవి పాల్గొన్నారు.

అదుపుతప్పి పల్టీకొట్టిన కారు



పెనుగంచిప్రోలు: మండలంధిలోని ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద జాతీయ రహదారిపై ఓ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రమాదం బుధవారం జరిగింది. హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వెళ్తున్న కారు ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద అదుపు తప్పి డివైడర్‌పైకి ఎక్కి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారు బాగా దెబ్బతిన్నా, ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో డ్రైవింగ్ చేస్తున్న పశ్చిమగోదావరి జిల్లా నిడుప్రోలుకు చెందిన ఎస్.వంశీకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు మరో నలుగురు ఉన్నారు. ఎస్ఐ పి.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో మొగల్రాజపురం సెక్షన్, లబ్బీపేట సబ్‌స్టేషన్ బృందావనకాలనీ ఫీడర్‌లో గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ సిటీ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. అందులో భాగంగా ఫకీరుగూడెం, ఎ కన్వెన్షన్ ఏరియా, గ్రీన్‌ల్యాండ్ ఏరియా, ఎస్ట్రానిక్స్ రోడ్డు, సింధుభవన్ రోడ్డు, సిరీస్‌రాజు రోడ్డు, మాచినేని వెంకటేశ్వరరావు వీధి, బృందావనకాలనీ, నందమూరిరోడ్డుల్లో ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

రైల్వే గ్రూప్‌-డీ ఉద్యోగుల పనితీరు భేష్



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): ఇండియన్ రైల్వేలో గ్రూప్‌-డీ ఉద్యోగుల పనితీరు అభినందనీయమని సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ విజయవాడ డివిజన్ అధ్యక్షురాలు డాక్టర్ వర్షాపాటిల్ అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం(మేడే)ను బుధవారం రైల్వే ఆస్పత్రి వద్ద ఉన్న ఈ-వరల్డ్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వర్షాపాటిల్ మాట్లాడుతూ ఇండియన్ రైల్వేకి గ్రూప్‌-డీ ఉద్యోగులు వెన్నెముకలాంటి వారన్నారు. వారే రైల్వేకి నిజమైన హీరోలన్నారు. వారి కృషి, నైపుణ్యంతో ఇండియన్ రైల్వే ముందుకు దూసుకుపోతోందన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 12 మంది గ్రూప్‌-డీ మహిళ ఉద్యోగులను సత్కరించి వారికి ప్రశంస పత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సంయుక్త కార్యదర్శి వాసంతిక, జాక్ అండ్ జిల్ స్కూల్ కార్యదర్శి శ్రీరమ్య పాల్గొన్నారు.

జనశిక్షణ సంస్థాన్‌లో మేడే వేడుకలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల శ్రమను దోచుకుంటున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్నవే కార్మిక చట్టాలని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా అన్నారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో మేడే సందర్భంగా సభ బుధవారం జరిగింది. విద్యాకన్నా మాట్లాడుతూ కార్మికుల విప్లవం మొదటిగా అమెరికాలో మొదలై క్రమంగా ప్రపంచ మొత్తం వ్యాపించిందన్నారు. రోజుల్లో ఎనిమిది గంటల పని విధానం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కార్మికులు పోరాడి సాధించుకున్నారని చెప్పారు. సంస్థ డైరెక్టర్ ఏ.పూర్ణిమ, రీసోర్స్‌పర్సన్స్, ఉద్యోగులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జానపద గీతాలు, నృత్యాలు



విజయవాడకల్చరల్: దామోదర జానపదం-మామ్ ట్రస్ట్ ఆధ్వర్యాన కార్మిక దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన జానపద గీతాలు, నృత్య కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమాలను మామ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాంతి వాసుదేవరావ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జానపదం జనపదమని తెలిపారు. శ్రమైక జీవనంలోనే శక్తి దాగి ఉంటుందన్నారు. అంతర్జాతీయ గాయకుడు దామోదర గణపతిరావు మాట్లాడుతూ సంస్థ ద్వారా అనేక మంది గాయకులను పరిచయం చేసినట్లు తెలిపారు. కవులు, గాయకులు మాతృభాషా వికాసానికి కృషి చేయాలని సూచించారు. లలిత, కుసుమాంజలి, సుశీల, రమణ, తేజ, మనస్విని, చందు, పాదుషా, దివ్యశ్రీ, హిమశ్రీ, సహస్రసాహితి, దివ్యలత పలు జానపద గీతాలను ఆలపించారు. నెలిబండ్ల బాలస్వామి, కోట్ల శివశంకరరావు, వేద గంగోత్రి, వరప్రసాద్, అంబటి మధుమోహన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో భక్తులు మొక్కులు తీర్చుకునే కొబ్బరి చిప్పలకు బహిరంగ వేలం గురువారం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.గంగాధరరావు తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ గురువారం సాయంత్రం 4 గంటలకు సంవత్సరం కాలపరిమితికి ఆలయంలో కొబ్బరి చిప్పలు సేకరించుకోవటానికి బహింగ వేలం నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని తెలిపారు.

బెజవాడకు రక్షణ ఛత్రం



వారధి ఎగువ ప్రాంతంలో నిర్మించిన రిటైనింగ్‌వాల్



వారధి దిగువన రిటైనింగ్ వాల్ నిర్మించి, ఏర్పాటు చేసిన జలవిహారం

కృష్ణానది ముంపు నుంచి శాశ్వత విముక్తి

- సీఎం వైఎస్ జగన్ చొరవతో వేగంగా పూర్తయిన రిటైనింగ్‌వాల్ నిర్మాణం
- ఆ పక్కనే కృష్ణమ్మ జలవిహారం పార్కు
- 70 వేల మందికి ప్రయోజనం కలిగించిన వైనం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆ ప్రాంత ప్రజలు
- రిటైనింగ్ వాల్‌పై గద్దే బూటకపు మాటలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కృష్ణమ్మ చెంతనే నివసిస్తున్న ప్రజల ముంపు కష్టాలను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తొలగించారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ చొరవతో రూ.400 కోట్లు వెచ్చించి రక్షణ కవచంలా రిటైనింగ్ వాల్ నిర్మించారు. దీంతో 70 వేల మంది ప్రజలకు ముంపు కష్టాలు తొలగిపోయాయి. ఇక కృష్ణానదికి ఎంత వరద వచ్చినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటూ కృష్ణా కరకట్ట ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టాలు గుర్తించి రక్షణ గోడ కట్టించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోపాటు దేవినేని అవినాష్‌కు తామంతా మద్దతుగా నిలుస్తామని స్పష్టం చేస్తున్నారు. గతంలో తమ ఇబ్బందులు పట్టించుకోని వారంతా ఇప్పుడు వచ్చి కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని, వారి మాటలు చూస్తే పిట్టల దొర మాటల్లా ఉన్నాయంటున్నారు.

ఆ కష్టాలు తలచుకుంటేనే..

కృష్ణానదికి వరదలు వచ్చిన సమయంలో తాము పడిన కష్టాలు తలచుకుంటేనే ఆందోళనగా ఉంటుందని ఆ ప్రాంత వాసులు అంటున్నారు. ఆ సమయంలో ఇంట్లో సామాన్లు సర్దుకుని ప్రభుత్వం ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాల్లోకి తరలివెళ్లేవారమంటున్నారు. అక్కడ సరైన ఆహారం, నీళ్లు లేక, ఇంట్లో సామాన్లు ఏమైపోతాయో అనే ఆందోళనతో బిక్కు బిక్కుమంటూ గడిపేవారని వివరిస్తున్నారు. అలా వరద తగ్గే వరకూ పునరావాస కేంద్రాల్లో వారం, పదిరోజులు ఉన్న సందర్భాలు ఉన్నాయని.. ఆ సమయంలో సరైన మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడేవారని ఆనాటి చేదు జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్నారు.

ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక దృష్టి..

కృష్ణానది ముంపు సమస్యను పరిష్కరించాలనే మహోన్నత ఆశయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.400 కోట్లు వెచ్చించి కనకదుర్గమ్మ వారిధి దిగువన, ఎగువన రిటైనింగ్ వాల్ నిర్మాణం చేశారు. అంతేకాకుండా రిటైనింగ్‌వాల్ పక్కనే కృష్ణమ్మ జలవిహారం పేరుతో పార్కు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రిటైనింగ్‌వాల్ నిర్మాణంలో రామలింగేశ్వరనగర్, కోటినగర్ పోలీస్ కాలనీ, భూపేష్‌గుప్తానగర్, తారకరామనగర్, రణదీవెనగర్, పోస్టల్ కాలనీల్లో నివసించే 70 వేల మంది జనాభాకు ప్రయోజనకరంగా మారింది.



మా కష్టాలు తొలగిపోయాయి..

కృష్ణానదికి వరద వచ్చిందంటే మాకు కష్టాలు మొదలయ్యేవి. ఇళ్లలోకి నీరు చేరడంతో సామాన్లు సర్దుకుని పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. వరద తగ్గిన తర్వాత మళ్లీ ఇళ్లకు చేరేవాళ్లం. నా చిన్నప్పటి నుంచి ఇదే ప్రాంతంలో ఉంటున్నా. అనేక మంది ఎన్నో హామీలు ఇచ్చారు. కానీ మా ప్రాంతానికి హామీ ఇవ్వకుండానే రక్షణ గోడ కట్టించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, దేవినేని అవినాష్‌లకు ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– కంపెల్ల భాను లక్ష్మీనారాయణ, రణదీవెనగర్



అవినాష్ కృషి ఎంతో ఉంది..

కృష్ణానదికి రిటైనింగ్‌వాల్ నిర్మించడంలో దేవినేని అవినాష్ కృషి ఎంతో ఉంది. రాణీగారితోట ప్రాంత ప్రజల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రూ.400కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మించారు. ఇప్పుడు వచ్చి టీడీపీ నాయకులు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు. వాళ్లకు ప్రజల కష్టాలు తెలియవు. మా కష్టాలు తొలగించిన దేవినేని అవినాష్‌కు ప్రజలు అండగా నిలుస్తున్నారు.

– తంగిరాల రామిరెడ్డి, కార్పొరేటర్, 17వ డివిజన్

‘తూర్పు’నకు టీడీపీ చేసింది శూన్యం



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇస్త్రీ చేస్తున్న దేవినేని అవినాష్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గంలో పదేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ నియోజకవర్గానికి చేసింది శూన్యమని వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం పటమట 11వ డివిజన్‌లోని రెల్లిస్ కాలనీ నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో నియోజకవర్గంలో రూ. 650 కోట్ల అభివృద్ధి పనులు చేశామని, సుదీర్ఘ సమస్యగా ఉన్న రెల్లిస్ కాలనీ వాసులకు పట్టాలిచ్చింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, సీఎం వైఎస్ జగన్ సారథ్యంలోని ప్రభుత్వంతో కాలనీ వాసులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. తాము ప్రజలకు మంచి చేశాం కాబట్టే ధైర్యంగా ఓట్లు అడగగలుతున్నామని, సీఎం జగన్ చెప్పిందే చేస్తారని, చేసేదే చెబుతారని మళ్లీ ఆయన్ను సీఎం చేస్తే నియోజకవర్గం, నగరం, రాష్ట్రం మరింత అభివృద్ధి జరుగుతాయని స్పష్టం చేశారు. కాల్‌మనీ, సెక్స్‌రాకెట్, గంజాయి వంటి అసాంఘిక పనులను ప్రోత్సహించే టీడీపీ అభ్యర్థి గద్దెను ఇంటికి పంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. టిడ్కో పేరుతో ప్రజల నుంచి సొమ్ములు వసూలు చేసిన నాయకులు కాపీ కొట్టిన హామీలతో ఎన్నికల ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మే 13న జరిగే ఎన్నికల్లో తూర్పు ఎమ్మెల్యేగా తనను, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

సాయిబాబా సేవలు అభినందనీయం

- విలక్షణమైన పనితీరుతో అధికారులను మెప్పించారు
- జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సాయిబాబాను సత్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాచార, పౌరసంబంధాల శాఖలో ప్రచార సహాయకుడు, ఆడియో విజువల్ సూపర్‌వైజర్‌గా 33 ఏళ్ల పాటు సేవలందించిన ఆగం సాయిబాబా సేవలు అభినందనీయమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ఆయన తన విలక్షణమైన పనితీరుతో అధికారులను మెప్పించారని కలెక్టర్ పేర్కొన్నారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఆడియో విజువల్ సూపర్‌వైజర్ (ఏవీఎస్)గా పనిచేసి మంగళవారం పదవీ విరమణ చేసిన ఆగం సాయిబాబాను కలెక్టర్ ఢిల్లీరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాచార శాఖలో తనదైన శైలిలో విధులు నిర్వర్తించి.. శాఖకు మంచి పేరు తీసుకొచ్చేలా సాయిబాబా పనిచేశారన్నారు. ఛాయాచిత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేయడం వంటి విషయాల్లో ఆయన మంచి ప్రతిభ కనబరిచారని కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐపీఆర్‌ఓ యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహన్‌రావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, పబ్లిసిటీ సహాయకుడు వీవీ ప్రసాద్, జిల్లా సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ అర్బన్ కాపునాడు ప్రధాన కార్యదర్శి, జనసేన నాయకులు 16వ డివిజన్‌కు చెందిన పోతురాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. వారికి వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజల్లో తిరుగులేని ఆదరణ లభిస్తోందన్నారు. ఇటీవల ప్రతి పక్ష పార్టీలు నిర్వహించే సభలకు, ర్యాలీలకు జనాలు రాక డబ్బులు ఇచ్చి తరలించే దుస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. గౌరవ ప్రదమైన పదవిలో ఉన్న నాయకులు కూడా వైఎస్సార్ సీపీలో చేరడంతో తమ బలం మరింత పెరిగిందన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని, కొత్తగా వచ్చిన నాయకులను సమన్వయం చేసుకొని ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని అవినాష్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 16వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడిశెట్టి రాధిక, బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి కంటి పరీక్షలు



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాలేజీలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శంకర నేత్ర చికిత్సాలయం సహకారంతో కంటి చూపు పరీక్షలు ఉచితంగా చేశారు. దాదాపు 200 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్ల జోళ్లు అందజేశారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చన్నం రాధాకృష్ణ , ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కవిత్వం సామాజిక అంశాల సమాహారం



విజయవాడకల్చరల్: కవిత్వం సామాజిక అంశాల సమాహారమని సాహితీవేత్త ఎన్.వేణుగోపాల్ అన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా సాహితీ మిత్రులు ప్రచురించిన కవిత 2023, లెనిన్ కావ్యం (తెలుగు అనువాదం) ఆవిష్కరణ సభను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో బుధవారం నిర్వహించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ కవిత్వానికి సామాజిక ప్రయోజనం ఉండాలని కవిత్వం ప్రజల గుండె చప్పుడు నుంచి లావా వలే రావాలని, సమాజాన్ని మార్చే శక్తి కవిత్వానికే ఉంటుందన్నారు. సాహితీ మిత్రులు ఈ విషయంలో పూర్తిగా విజయం సాధించినట్లు తెలిపారు. కవిత 2023 సంకలనాన్ని బాలాంత్రపు ప్రసూన, లెనిన్ కావ్యాలన్ని అద్దేపల్లి ప్రభు ఆవిష్కరించారు. సంపాదకుల పక్షాన కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ ప్రజలతో మమేకమైనదే సాహిత్యమని అన్నారు. సాహితీ మిత్రులు 23 సంవత్సరాలుగా ఏటా మే ఒకటో తేదీన క్రమం తప్పకుండా కవితా సంపుటిని ప్రచురిస్తోందని తెలిపారు. కవి అనిల్ డ్యాని సభను ప్రారంభించారు. అతిథులు కవితా సంపుటిని ఆవిష్కరించారు. కవిత 2023 సంకలనంలోని కవులు స్వీయ కవితాగానం చేశారు. శ్రీరాం పుష్పాల నిర్వహించారు. సాహితీ మిత్రులు కీలక బాధ్యుడు విశ్వేశ్వరరావుతోపాటు పలువురు సాహితీ మిత్రులు పాల్గొన్నారు.

శ్రీనివాసుడికి పంచామృత అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లో వేంచేసిన శ్రీ పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పంచామృత అభిషేకాలను తమ పేరిట జరిపించుకున్నారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, తులసీ దళ అర్చనను ఆలయ అర్చకుడు రామరత్నమాచార్యులు జరిపించారు. పూజలో దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలను వ్యాపారాల్లో ప్రోత్సహించడమే లక్ష్యం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళలను వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆర్కే ఫౌండేషన్ పనిచేస్తోందని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఉమా నవీన అన్నారు. భవానీపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులోని ఎస్ కన్వెన్షన్‌లో ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృత్తి, వ్యాపారాల్లో రాణించేందుకు మహిళలకు ముద్రా రుణాలు మంజూరు చేయించడం, సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ రాధాకృష్ణ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ గతంలో అనేక రకాలైన సేవ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ మానవాభివృద్ధి జరగాలంటే మహిళాశక్తి పెంపొందాలని పేర్కొన్నారు. సదస్సులో రోటరీ క్లబ్ రామరావు, యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ కృష్ణారావు, జన శిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యాకన్న, నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ మేనేజర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో అభివృద్ధిపై చర్చకు సిద్ధం

7వ డివిజన్ ప్రచారంలో దేవినేని అవినాష్



ఏడో డివిజన్‌లో దేవినేని అవినాష్‌ను ఆశీర్వదిస్తున్న వృద్ధుడు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కొండ ప్రాంతాల్లో ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో చర్చకు తాము సిద్ధమని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం దేవినేని అవినాష్ ఏడో డివిజన్ పరిధిలోని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ గతంలో ఈ డివిజన్‌లో తాను పర్యటించే సమయంలో రోడ్లు అన్ని గుంతలు పడి వర్షాకాలంలో ముంపునకు గురయ్యేవన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ డివిజన్‌లో పదిహేను అంతర్గత రహదారులను పునర్నిర్మాణం చేశామన్నారు. రోడ్ల నిర్మాణంతో పాటుగా కొండపైకి మంచినీటి సరఫరా కోసం పైపులైన్లు, రోడ్లు, మెట్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించామన్నారు. పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ ఈ నియోజకవర్గానికి ఏమీ అభివృద్ధి చేయలేదని ప్రజలే తమతో చెబుతున్నారన్నారు.

ఆ కంటైనర్‌తో గద్దెకు లింకు..

ఇటీవల విశాఖపట్నంలో భారీ స్థాయిలో పట్టుబడిన గంజాయికి గద్దె రామ్మోహన్‌కు సంబంధం ఉందని అవినాష్ ఆరోపించారు. గద్దె రామ్మోహన్ సొంత కంపెనీ అయిన బాలాజీ ఆక్వాకు విశాఖపట్నంలో పట్టుబడిన ఆక్వా కంపెనీకి సంబంధం ఉందన్నారు. ఆ కంపెనీ యాజమాన్యానికి చెందిన పిల్లలు, గద్దె రామ్మోహన్ కుమారులు అమెరికాలో కలిసి చదువుకున్నారని అవినాష్ చెప్పారు. గద్దె రామ్మోహన్ అనుచరులు చేస్తున్న కాల్‌మనీ వేధింపులపై ఇటీవలే ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. మంచితనం ముసుగువేసుకున్న గద్దె రామ్మోహన్ గురించి ప్రజలకు తెలిసిపోయిందని చెప్పారు.

సీఎం జగన్‌తోనే రజకుల అభ్యున్నతి



సమావేశంలో పాల్గొన్న గాడ్గే బాబా ఐలమ్మ సామాజిక సేవా సంఘం నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రజకుల సమగ్ర అభివృద్ధి జరిగిందని, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రజకులు అండగా ఉండాలని గాడ్గే బాబా ఐలమ్మ సామాజిక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి తిరుపతిరావు అన్నారు. దుర్గాపురంలో బుధవారం గాడ్గే బాబా ఐలమ్మ సామాజిక సేవా సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రజకుల అభివృద్ధి, సంక్షేమానికి జగనన్న చిత్తశుద్ధితో పనిచేశారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రజక సామాజిక భవనాలు, దోభీఘాట్ల పరిరక్షణ, ముఖ్యంగా రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా రజకుల ఆత్మ గౌరవం ఇనుమడింప చేశారని పేర్కొన్నారు. సంఘం కార్యదర్శి అంజురి సత్యనారాయణ మాట్లాడుతూ విజయవాడ నగరంలో ఐలమ్మ సామాజిక భవన్, ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయడంతో పాటు దోభీఘాట్‌లకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. సంఘం సంయుక్త కార్యదర్శి కొండాయగుంట రాము మాట్లాడుతూ రాష్ట్రంలోని రజకులు అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జగనన్న ముఖ్యమంత్రిగా తిరిగి ఎన్నిక అయ్యేవిధంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. నగరంలో ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాసరావు, దేవినేని అవినాష్, ఆసిఫ్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో కొండపల్లి వెంకటేశ్వరరావు, సామంతకూరి దుర్గారావు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



9వ డివిజన్‌లోప్రచారం చేస్తున్న దేవినేని సుధీర, కేశినేని హైమా



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న దేవినేని క్రాంతి

లబ్బీపేట/కృష్ణలంక(విజయవాడతూర్పు): అన్ని ప్రాంతాలు సమాంతర అభివృద్ధి చేయడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఆ పార్టీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. ఆమె ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 12వ డివిజన్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో ఐదేళ్లుగా అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆ ప్రాంతంలో చేసిన అభివృద్ధిని తెలియజేస్తూ ఓట్లు అభ్యర్థించారు. మీ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించాలన్నా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదిస్తూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు. అలాగే కృష్ణలంక, 22వ డివిజన్‌లోని స్వర్గపురి వీధుల్లో కూడా విస్తృత పర్యటన చేశారు. స్థానిక కార్పొరేటర్ తాటిపర్తి కొండిరెడ్డి పాల్గొన్నారు

సుధీర, హైమాల ప్రచారం..

వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ కుమార్తె కేశినేని హైమా, అసెంబ్లీ అభ్యర్థి దేవినేని అవినాష్ భార్య దేవినేని సుధీర 9వ డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలన్నారు. మంచి మనస్సుతో పనులు చేసే వారిని ఆశీర్వదించాలని కోరారు. వారి వెంట వల్లూరు ఈశ్వరప్రసాద్, మాగంటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో వేసవి ఏర్పాట్లు



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న సిబ్బంది



మూగజీవాల కోసం తాగునీటి సదుపాయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పెరుగుతున్న ఎండలతో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తులు నడుచుకుంటూ వచ్చే కనకదుర్గనగర్ మహా మండపం మార్గంలో పీచుతో ఏర్పాటు చేసిన కార్పెట్లు ఏర్పాటు చేయడంతో పాటు చలువ పందిళ్లు ఏర్పాటు చేసింది. ఇక అమ్మవారి ఆలయంలో చలువ పందిళ్లు, ఓం టర్నింగ్ మొదలు ఆలయం వరకు పలు చోట్ల మంచినీటి సదుపాయాన్ని కల్పించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మంచినీటి చలివేంద్రాలలో తాగునీటిని అందిస్తుండగా, మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. భక్తులతో పాటు ఇంద్రకీలాద్రి కొండపై ఉండే మూగజీవాలకు మంచినీటిని అందించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో కేఎస్ రామరావు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పలు చోట్ల కోతులకు, పావురాల కోసం ప్లాస్టిక్ గిన్నెలను ఏర్పాటు చేసి మంచినీటిని అందిస్తున్నారు.

కోడ్ ఉల్లంఘనులు సుజనా, చిన్ని

- కమలం గుర్తుతో గోరింటాకు పెడుతున్న సుజనా టీమ్
- ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్న వైనం



గుడి అభివద్ధి పనుల శంకుస్థాపనలో సుజనా చౌదరి, టీడీపీ నాయకులు


భవానీపురం(విజయవాడపశ్చిమ): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో భాగస్వాములైన విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ(చిన్ని), పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి సుజనా చౌదరి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఇప్పటికే వారిద్దరిపై భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయిన సంగతి తెలిసిందే. అయినా డోంట్ కేర్ అన్నట్లుగా ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉండటం గమనార్హం. నగరంలోని 38వ డివిజన్ పరిధిలో విద్యాధరపురంలో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు బుధవారం సుజనా చౌదరి నియమించిన ఒక బృందం ఇంటింటికీ తిరిగి మహిళల చేతులకు గోరింటాకు (మెహందీ) పెడుతూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. గోరింటాకు పెట్టడం కూడా అలా ఇలా కాదు.. ఎంచక్కా సుజనా చౌదరి ఎన్నికల గుర్తు అయిన కమలం గుర్తు వేస్తున్నారు. అంటే ఆ గోరింటాకు చేతిని రేపు పోలింగ్ రోజు ఓటర్లకు చూపించి వారిని ప్రభావితం చేయరని గ్యారెంటీ ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కమలం గుర్తుతో గోరింటాకు పెడుతున్న సుజనా చౌదరి టీమ్‌కు రోజుకు ఇంతని నిర్ణయించటమే కాకుండా వారికి సుమారు రూ.750 విలువ చేసే డ్రెస్ అందజేస్తున్నారు.

గుడి అభివృద్ధి పనుల శంకుస్థాపనలో సుజనా, చిన్ని

భవానీపురం కరకట్ట సౌత్ రోడ్‌లోగల శ్రీదుర్గా భవానీ అమ్మవారి గుడిని అభివృద్ధి చేసేందుకు సుజనా చౌదరి, కేశినేని చిన్ని మాట ఇచ్చారు. ఆ గుడి ముందున్న రేకుల షెడ్ తొలగించి అక్కడ శ్లాబ్ నిర్మించేందుకు అయ్యే ఖర్చు తామే భరిస్తామని గుడి కమిటీ సభ్యులను ప్రలోభ పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగానే సోమవారం గుడి అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో సుజనాతో పాటు కేశినేని చిన్ని, టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, తాడి శకుంతల, 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చిన సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. వాస్తవానికి కరకట్టపై గుడి నిర్మించటమే నిబంధనలకు విరుద్ధం.

కరకట్ట సౌత్ – నార్త్ మధ్యలో మెట్ల నిర్మాణం

భవానీపురం కరకట్ట సౌత్ రోడ్డుకు, కరకట్ట నార్త్ వైపునకు మధ్య ఉండే మెట్లు పాడైపోవడంతో వాటిని నిర్మించడం ప్రారంభించారు సుజనా, కేశినేని చిన్ని బృందం. ఇప్పటికే రెండు మూడు దార్లలో మెట్లు కట్టేశారని, తాము అధికారంలోకి వస్తే ఈ ప్రాంతం రూపురేఖలు మార్చేస్తామని వారు చెబుతున్నారని స్థానికులు తెలిపారు. రేపు గెలిచినా, ఓడినా సుజనా చౌదరి ఇక్కడ ఉండడని తమకు తెలుసని, చేస్తామని వచ్చినప్పుడు చేయించుకోవడమే మంచిదని, ఓటు ఎవరికి వేస్తామనేది తరువాత సంగతి అంటూ వారు వ్యాఖ్యానించటం కొసమెరుపు.



సుజన టీమ్ వారు ఓటర్ల చేతులపై కమలం గుర్తుతో వేసిన గోరింటాకు



అల వాణిజ్య పురములో..

బెజవాడకు కీర్తి కిరీటం.. మన పశ్చిమం

ఒక పక్క కృష్ణమ్మ పరవళ్లు.. మరో పక్క కొండపైన దుర్గమ్మకు జేజేలు.. చుట్టూ వ్యాపార, వాణిజ్య కేంద్రాలు.. విభిన్న మతాలు.. విశిష్ట సంప్రదాయాలు.. ఎటుచూసినా భిన్నత్వంలో ఏకత్వం ప్రస్ఫుటంగా కనిపించే ప్రాంతం.. ఇతర ప్రాంతాల వాసులను పర్యాటకంగా విశేషంగా ఆకర్షించే ఖిల్లా మన పశ్చిమ నియోజకవర్గం. విజయవాడ నగరంలో ఏర్పడిన మొట్టమొదటి నియోజకవర్గం పశ్చిమం.. వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పడ్డాక అనేక సంస్కరణలతో నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఎటుచూసినా అభివృద్ధి కళ్ల ముందు సాక్షాత్కరిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ ఫలాలతో పేద కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మరోసారి విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ముఖ చిత్రం మీ కోసం.. – వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)

- వ్యాపార, వాణిజ్య కేంద్రంగా ఘన చరిత్ర
- ఆధ్యాత్మిక మందిరాలకు కేరాఫ్
- విభిన్న మతాలు, సాంస్కృతుల సమ్మేళనంగా 'మినీ భారత్'
- అత్యధిక సంఖ్యలో ముస్లిం మైనార్టీలు

వాణిజ్య రాజధాని..

విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వాణిజ్య, వ్యాపార రాజధాని, ఉమ్మడి రాష్ట్రంలో తొలినాటి నుంచి వ్యాపార రాజధానిగా పేరుగాంచిన విజయవాడ నగరం అత్యధిక వ్యాపారం ఈ నియోజకవర్గంలోనే జరుగుతోంది. అంతేకాదు రాష్ట్రంలోనే రెండో అతి రెండో అతి పెద్ద ఆలయమైన దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఈ నియోజకవర్గంలోనే కొలువై ఉంది. ప్రకాశం బ్యారేజీ నుంచి తూర్పు కృష్ణాకు వెళ్లే సాగునీరు ఈ నియోజకవర్గం నుంచి కదులుతోంది.

చరిత్ర ఇది..

దేశంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తొలి నాళ్లలో 1952లో విజయవాడ నగరం మొత్తం ఒక నియోజకవర్గంగానే కొనసాగింది. 1967లో విజయవాడ తూర్పు, పశ్చిమ నియోజక వర్గాలుగా విజయవాడను విభజించారు. అప్పుడు పశ్చిమ నియోజకవర్గం నూతనంగా ఏర్పడింది. 2008లో విజయవాడను మూడు నియోజక వర్గాలుగా మార్పు చేయటంతో కొత్తగా సెంట్రల్ నియోజకవర్గం ఆవిర్భవించింది. నియోజకవర్గాల పునర్విభజన జరిగిన సందర్భాల్లో ఈ నియోజకవర్గం సరిహద్దుల్లోనూ మార్పులు వస్తూ వచ్చాయి.

మూడో వంతు డివిజన్లు..

నగరపాలకసంస్థ పరిధిలోని 34, 35 37 నుంచి 56 డివిజన్ల వరకూ మొత్తం 22 డివిజన్లు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. తూర్పు దిక్కులో రైల్వేలైన్, సెంట్రల్ నియోజకవర్గం, దక్షిణం కృష్ణా నది, పడమర, ఉత్తర దిక్కుల్లో మైలవరం నియోజకవర్గం హద్దులుగా ఉన్నాయి. అదేవిధంగా హైదరాబాద్ నుంచి విశాఖపట్నం, చైన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారులు ఇక్కడి నుంచి వెళ్తాయి.

సర్వమత సమ్మేళనం..

పశ్చిమ నియోజకవర్గం ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతోంది. ఒకవైపు కొండపైన కొలువైన్న కనకదుర్గమ్మతో పాటుగా కొండ దిగువన ధర్మరాజు ప్రతిష్ఠితమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం), అర్జునుడు ప్రతిష్ట చేసిన విజయేశ్వరస్వామి వారి దేవస్థానం, అలాగే 1200 సంవత్సరాల క్రితం కొలువైన వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం పాతబస్తీలో ఉన్నాయి. వాటితో పాటుగా బ్రిటీష్ పాలకుల కాలంలో ఏర్పడిన సీఎస్ఐ, ఆర్‌సీఎం, తెలుగు బాప్టిస్ట్ సెంటినరీ చర్చిలు సైతం వంద సంవత్సరాలను ఎప్పుడో పూర్తి చేసుకున్నాయి. క్రైస్తవంలోని అని వర్గాలకు ఇక్కడ లెక్కకు మంచి చర్చిలు కొనసాగుతున్నాయి. అదేవిధంగా 500 సంవత్సరాల క్రితం ఏర్పడిన మసీదులు, 125 ఏళ్ల క్రితమే ఒక్కడ జైన ఆలయాలు కొలువై ఉన్నాయి. అంతేకాకుండా సిక్కుల ఆలయమైన గురుద్వార్ సైతం ఈ నియోజకవర్గంలో దర్శనమిస్తుంది.



వ్యాపారాలకు ఖిల్లా..

ఈ నియోజకవర్గం పూర్తిగా వ్యాపార కేంద్రం. సుమారు వందకుపైగా హోల్‌సేల్ వ్యాపార సంఘాలు ఈ నియోజకవర్గంలో ఉన్నాయంటే వ్యాపార విస్తృతి ఎంతగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఒక టెక్స్‌టైల్, రెడీమేడ్ వస్త్ర దుకాణాలు వెయ్యి వరకూ ఈ ఒక్క నియోజకవర్గంలోనే ఉన్నాయి. అంతేకాకుండా సుమారు 350 బులియన్ వ్యాపారులు పాతబస్తీలో వ్యాపారాలు చేస్తున్నారు. వీరికి ఏడెనిమిది దశాబ్దాల నుంచి కొనసాగుతున్న సంఘాలు ఉన్నాయి. పాతిక వేల మంది బంగారు ఆభరణాలు తయారు చేసే కార్మికులు పాతబస్తీలో పని చేస్తుంటారు. నాలుగు వందలకు పైగా హోల్ సేల్ మెడికల్ దుకాణాలు ఉన్నాయి. పచారి వంటి ఇంకా ఎన్నో రంగాలకు చెందిన దుకాణాలు సుదీర్ఘ కాలంగా వ్యాపారాలను నిర్వహిస్తున్నాయి.



కాలేశ్వరరావు మార్కెట్

మినీ భారత్..

ఈ నియోజకవర్గం మినీ భారతదేశంగా పలువురు పిలుస్తారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజానీకం మనకు దర్శనమిస్తారు. రాజస్థాన్, పశ్చిమబెంగాల్, కేరళ, కర్నాటక, గుజరాత్, హరియాణా, ఉత్తరప్రదేశ్, వంటి రాష్ట్రాలకు చెందిన ప్రజానీకం కొన్ని దశాబ్దాల క్రితమే ఇక్కడ నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. అన్ని మతాలకు చెందిన ప్రజలు సోదరభావంతో సామరస్య జీవనాన్ని కొనసాగిస్తున్నారు.



సరికొత్తగా ముస్తాబైన రాజీవ్ గాంధీ పార్కు

పర్యాటక స్వర్గధామం..

పర్యాటక రంగానికి వస్తే కృష్ణానది మధ్యలో విస్తరించి ఉన్న భవానీ ద్వీపానికి ఈ నియోజకవర్గం నుంచే వెళ్లాల్సి ఉంటుంది. అలాగే దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ స్మారకార్థం ఏర్పాటు చేసిన గాంధీహిల్ ఈ నియోజకవర్గంలో దర్శనమిస్తుంది. దేశంలోనే పెద్ద రైల్వే స్టేషన్లలో ఒకటిగా నిలిచే విజయవాడ రైల్వే స్టేషన్ ఈ నియోజకవర్గంలోనే కనిపిస్తుంది. అంతేకాకుండా ప్రకాశం బ్యారేజీ పరిసరాలు, రాజీవ్‌గాంధీ పార్క్ వంటి అనేకం ఈ నియోజకవర్గంలో అలరారుతున్నాయి.



గాంధీ హిల్‌పై స్తూపం

2019 నుంచి నేటి వరకూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంపిణీ చేసిన వివిధ సంక్షేమ పథకాలు, లబ్ధిదారుల సంఖ్య, అందిన మొత్తం

పథకాలు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం(రూపాయలలో)
వైఎస్సార్ పెన్షన్ కానుక	21,645	380,02,39,856
వైఎస్సార్ చేయూత	36,239	67,94,81,250
వైఎస్సార్ ఆసరా	27,809	88,75,69,436
వైఎస్సార్ సున్నా వడ్డీ	3,416	19,59,24,509
వైఎస్సార్ బీమా	430	8,33,42,078
జగనన్న తోడు	18,489	18,48,90,000
జగనన్న చేదోడు	9,147	9,14,70,000
వైఎస్సార్ కల్యాణమస్తు	85	63,75,000
అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లు	39	46,80,000
వైఎస్సార్ కాపు నేస్తం	3,912	5,86,80,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	5,556	8,33,40,000
వైఎస్సార్ లా నేస్తం	112	1,34,40,000
వైఎస్సార్ నేతన్న నేస్తం	2	48,000
వైఎస్సార్ వాహన నేస్తం	6,350	6,35,00,000
జగనన్న అమ్మ ఒడి	19,546	27,36,44,000
జగనన్న విద్యాదీవెన	15,268	74,09,33,068
జగనన్న వసతి దీవెన	11,508	14,96,10,000
వైఎస్సార్ మత్స్యకార భరోసా	46	4,60,000
విద్యార్థులకు ట్యాబ్‌లు	2,620	8,64,60,000
ఇళ్ల స్థలాలు	41,815	
రేషన్ కార్డులు	1,11,087	

నియోజకవర్గ జనాభా **3,75,256**

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు **2,55,963**

పురుషులు **1,26,634** | స్త్రీలు **1,29,296** | థర్డ్ జెండర్ **33**

రాజకీయ రణం.. ఏకపక్షం



- ఈ నియోజకవర్గంలో తొలిగా 1952 ఎన్నికల్లో తమ్మిన పోతరాజు (సీపీఐ) మరుపిళ్ల చిట్టి(కాంగ్రెస్) గెలుపొందారు.
- 1958లో మరుపిళ్ల చిట్టి తమ్మిన పోతరాజుపై గెలుపొందారు.
- 1962లో తమ్మిన పోతరాజు మరుపిళ్ల చిట్టిపై గెలిచారు.
- 1967లో మరుపిళ్ల చిట్టి తమ్మిన పోతరాజుపై గెలుపొందారు.
- 1972లో కాంగ్రెస్ నేత ఆసిఫ్‌పాషా తమ్మిన పోతరాజుపై గెలుపొందారు.
- 1978లో కాంగ్రెస్ నేత పోతిన చిన్నా జేఎన్‌పీ అభ్యర్థి ఇంతియాజుద్దీన్‌పై గెలిచారు.
- 1983లో టీడీపీ అభ్యర్థి బీఎస్ జయరాజు ఉప్పలపాటి రామచంద్రరాజు(సీపీఐ)పై గెలుపొందారు.
- 1985లో ఉప్పలపాటి రామచంద్రరాజు కాంగ్రెస్ అభ్యర్థి ఎంకే బేగ్‌పై గెలుపొందారు.
- 1989లో ఎంకే బేగ్ సీపీఐ అభ్యర్థి కె. చంద్రశేఖర రావుపై గెలిచారు.
- 1994లో సీపీఐ అభ్యర్థి కె. సుబ్బరాజు ఎంకే బేగ్‌పై గెలిచారు.
- 1999లో కాంగ్రెస్ అభ్యర్థి జలీల్‌ఖాన్ టీడీపీ అభ్యర్థి నాగుల్‌మీరాపై గెలిచారు.
- 2004లో సీపీఐ అభ్యర్థి షేక్ నాజర్‌వలీ టీడీపీ అభ్యర్థి ఎంకే బేగ్‌పై గెలిచారు.
- 2009లో ప్రజారాజ్యం నుంచి పోటీ చేసిన వెలంపల్లి శ్రీనివాసరావు కాంగ్రెస్ అభ్యర్థి మల్లికా బేగంపై గెలిచారు.
- 2014లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన జలీల్‌ఖాన్ వెలంపల్లి శ్రీనివాసరావుపై గెలుపొందారు.
- 2019లో వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేసిన వెలంపల్లి శ్రీనివాసరావు టీడీపీ అభ్యర్థి షబానాఖాతూన్‌పై గెలుపొందారు.

అత్యధికంగా గెలిచింది వీరే..

ఈ నియోజకవర్గంలో మైనార్టీలు, నగరాల సామాజిక వర్గాలకు చెందిన నాయకులే అధికంగా గెలుస్తూ వచ్చారు. నగరాల నుంచి ముగ్గురు నాయకులు పలుమార్లు గెలవగా, మైనార్టీలు ఐదు సార్లు గెలిచారు. అలాగే క్షత్రియులు, ఆర్యవైశ్య సామాజికవర్గాలు రెండు సార్లు, ఎస్సీ నుంచి ఒకసారి ఈ నియోజకవర్గంలో గెలుపొందారు.

టీడీపీ ఒకే ఒక్కసారి..

ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 15 సార్లు ఎన్నికలు జరిగితే తెలుగుదేశం పార్టీ కేవలం ఒకసారి మాత్రమే గెలిచింది. అది కూడా నందమూరి తారక రామారావు పార్టీ పెట్టిన సమయంలో ఆయన హవా కొనసాగిన తొలి ఎన్నికల్లో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ కాంగ్రెస్ ఆరుసార్లు, సీపీఐ, ఐదుసార్లు, వైఎస్సార్‌సీపీ రెండుసార్లు, టీడీపీ, పీఆర్పీ ఒక్కొక్కసారి గెలిచాయి.

మైనార్టీలదే పైచేయి..

ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత అత్యధికంగా ముస్లింలు ఉన్న నియోజకవర్గం పశ్చిమ నియోజకవర్గమని స్థానిక ముస్లిం వర్గాలు చెబుతున్నాయి. ముస్లిం మైనార్టీల్లో ఉన్న అన్ని వర్గాలు ఇక్కడ కనిపిస్తాయి. ఈ నియోజకవర్గంలో వక్ఫ్ ఆస్తులు కూడా అధికంగానే ఉన్నాయి. రంజాన్ మాసాన్ని ఈ ప్రాంతంలో ముస్లిం సోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. రంజాన్ మాసం వచ్చిందంటే ఇది మరో హైదరాబాద్ పాత బస్తీగా కనిపిస్తుంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా షేక్ ఆసిఫ్, బీజేపీ అభ్యర్థిగా వై.సుజనా చౌదరి పోటీలో ఉన్నారు.



షేక్ ఆసిఫ్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి



వై.సుజనాచౌదరి బీజేపీ అభ్యర్థి

తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

- నందివాడ మండలంలో వైరి వర్గాలుగా ఎల్లో బ్రదర్స్
- రావి వర్గం వర్సెస్ సీనియర్ టీడీపీ నాయకులు
- ప్రతి గ్రామంలో టీడీపీ నాయకుల గ్రూపుల గోల
- పట్టించుకోని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము



గుడివాడరూరల్: నందివాడ మండలంలో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు వర్గం, సీనియర్ టీడీపీ నాయకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా గ్రామాల్లో పరిస్థితి నెలకొంది. నందివాడ మండలం ఆది నుంచి టీడీపీకి ప్రతికూలంగా ఉండేది. టీడీపీ ఆవిర్భావం నుంచి నందివాడ మండలంలో జెడ్పీటీసీ, ఎంపీపీలు టీడీపీ గెల్చుకున్న దాఖలాలు లేవు. కాంగ్రెస్ పార్టీ మండల వ్యవస్థ ఏర్పడిన కాలం నుంచి దివంగత జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావు ప్రోద్బలంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు జెడ్పీటీసీ, ఎంపీపీలుగా ఎన్నికవుతూ వచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తర్వాత రెండు దఫాలుగా ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులను ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ప్రోత్సాహంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుస్తూ వచ్చారు. మండలంలో టీడీపీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారింది. గ్రామాల్లో రావి వెంకటేశ్వరరావుకు టీడీపీ సీనియర్ నాయకులకు మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. మొదటి నుంచి రావి వర్గంకు, పిన్నమనేని వర్గానికి మధ్య విభేదాలు ఉండేవి. రావి పోటీ చేసిన సమయంలో టీడీపీ నాయకులకు, రావికి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉండేవి. ఈ నేపథ్యంలో రావి ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో పిన్నమనేని వర్గంతో పాటు సీనియర్ నాయకులను పక్కన పెట్టి కార్యక్రమాలు కొనసాగించారు. రావికి వ్యతిరేకంగా ఉన్న సీనియర్ నాయకులు, పిన్నమనేని వర్గం కొత్తగా వచ్చిన వెనిగండ్ల రాముతో చేరిపోయారు. రావికి వ్యతిరేకంగా కార్యక్రమాలు కొనసాగించారు. అనూహ్యంగా రావిని పక్కనపెట్టి వెనిగండ్ల రాముకు టీడీపీ టిక్కెట్ దక్కడంతో టీడీపీ సీనియర్ నాయకులు కొత్త ఉత్సాహంతో పార్టీలో కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

డబ్బుల ఎర...

వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పరిపాలన కాలంలో ప్రజలకు నవరత్నాల ద్వారా అన్ని రకాల లబ్ధి చేకూరింది. నాయకులతో సంబంధం లేకుండా ప్రజలకు నేరుగా ప్రభుత్వ ఫలాలు అందడంతో ప్రజల్లో ప్రభుత్వానికి ఆదరణ ఎక్కువైంది. ఏదో రకంగా గెలవాలన్న ధ్యేయంతో టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము గ్రామాల్లో ప్రజలను నోటుతో కొనేందుకు సిద్ధమయ్యారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న సిబ్బందితో సర్వేలు నిర్వహించి ఇంటింటికీ తమ సొంత సిబ్బందిని పంపించి నోటుతో ఓటును కొనేందుకు సిద్ధమయ్యారు. కులాల వారీగా డబ్బు ఎర చూపి నాయకులను కొనుగోలు చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్న నాయకులతో పాటు కార్యకర్తలను కొనుగోలు చేసేందుకు డబ్బు ఎర చూపుతున్నారు. ఇప్పటికే చాలా మంది వైఎస్సార్‌సీపీ నాయకులకు డబ్బు ఎర చూపినా వారు తిరస్కరించడంతో రాము కంగుతిన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను కొనుగోలు చేసేందుకు అస్త్ర శస్త్రాలు ఉపయోగిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొడాలి నానిపై పూర్తి నమ్మకం ఉన్న నాయకులు, కార్యకర్తలు టీడీపీ ప్రలోభాలకు లొంగకపోవడంతో రాము అయోమయంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో రాము ఓటమి ఖాయమని, ఎన్నికల తర్వాత ఆయన తిరిగి అమెరికాకు వెళ్లిపోవడం, గుడివాడ టీడీపీకి మళ్లీ రావి వెంకటేశ్వరరావు ఇన్‌చార్జి కావడం ఖాయమని టీడీపీలో రావి వర్గీయులే అంతరంగిక సమావేశాల్లో గుసగుసలాడుకుంటున్నట్టు తెలుస్తోంది.

రాము ఓటమే ధ్యేయంగా రావి వర్గీయులు..

రావికి టికెట్ దక్కకపోవడంతో నిరుత్సాహంగా ఉన్న రావి వర్గీయులు వెనిగండ్ల రాము ఓటమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు వినికిడి. ఇప్పటికే రావి వర్గీయులు పార్టీకి అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. వెనిగండ్ల వర్గీయులు గ్రామాల్లో రావి వర్గీయులను పక్కనపెట్టి పార్టీ కార్యకలాపాలను కొనసాగిస్తుండటంతో రావి వర్గీయులు భగ్గుమంటున్నారు. వెనిగండ్ల వర్గీయుల పోకడలతో విసిగిపోయిన రావి వర్గీయులు గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలకు దూరంగా మిన్నకుండిపోయారు. దశాబ్దాలుగా పార్టీ కోసం కష్టపడిన రావిని పక్కనపెట్టి నిన్నగాక మొన్న పార్టీలో చేరిన వెనిగండ్లకు టికెట్ ఇవ్వడమే కాకుండా పార్టీకోసం పని చేస్తున్న టీడీపీ శ్రేణులను పక్కన పెట్టడంపై మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కుదరవల్లి గ్రామంలో టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ప్రచారంలో భాగంగా సీనియర్ నాయకులను పక్కన పెట్టారు. దీంతో ఆ గ్రామ నాయకులు రాము తీరుపై రగిలిపోతున్నారు. వెంకట రాఘవాపురంలో ఆది నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులను వెనిగండ్ల రాము కనీసం పట్టించుకోకుండా కార్యక్రమాలు చేయడం పట్ల ఆ గ్రామంలో నాయకులు, కార్యకర్తలు రాము తీరును వ్యతిరేకిస్తున్నారు. పోలుకొండ గ్రామంలో మొదటి నుంచి వెనిగండ్లకు అనుకూలంగా పనిచేసిన నాయకులను పక్కన పెట్టి రావి వర్గం పార్టీలో అనుసరిస్తున్న విధానాల పట్ల సీనియర్ నాయకులు మండిపడుతున్నారు. ఇలపర్రులో పిన్నమనేని, వెనిగండ్ల వర్గం వర్సెస్ రావి వర్గం మధ్య విభేదాలు ఎక్కువయ్యాయి. రుద్రపాక, తమిరిశ, తుమ్మలపల్లి, పెదలింగాల, చినలింగాల, పుట్టగుంట, నందివాడ, దండిగానపూడి, అనమనపూడి గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

సకుటుంబ సపరివార ప్రచారం



ఉయ్యూరులో ప్రచారం చేస్తున్న మంత్రి జోగి సతీమణి శకుంతలాదేవి



ప్రచారంలో జోగి కుమార్తె రేష్మ ప్రియాంక

ఉయ్యూరు: ఎన్నికల ప్రచారం వినూత్నంగా సాగుతోంది. పెనమలూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ సకుటుంబ సపరివార సమేతంగా ఇంటింటి ప్రచారం సాగిస్తూ దూసుకుపోతున్నారు. జోగి రమేష్‌తో పాటుగా సతీమణి శకుంతలాదేవి, కుమార్తె రేష్మ ప్రియాంక, కుమారులు రాజీవ్, రోహిత్ ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. రోజూ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో పర్యటిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను వివరిస్తూ ఎన్నికల మేనిఫెస్టోను తెలియజేస్తూ వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. కూటమి కుట్రలు, మోసపూరిత విధానాలను వివరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ విజయాన్ని కాంక్షిస్తూ జగన్ మళ్లీ సీఎం అయితేనే సంక్షేమం ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.



ముదునూరులో మజ్జిగ పంపిణీ చేస్తూ ప్రచారం సాగిస్తున్న జోగి చిన్న కుమారుడు రోహిత్



ఉయ్యూరులో ప్రచారం చేస్తున్న జోగి పెద్ద కుమారుడు రాజీవ్

క్లుప్తంగా...

8న ప్రధాని మోదీ విజయవాడ రాక



సాక్షి,అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న విజయవాడ రానున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియం వద్ద నుంచి బెంజి సర్కిల్ వరకు రోడ్ షో నిర్వహిస్తారు. మోదీ రాక సందర్భంగా భారీ స్వాగత ఏర్పాట్లు చేయాలని బీజేపీ రాష్ట్ర శాఖ సమాయత్తం అవుతోంది. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ నేతలు సమీక్ష నిర్వహించారు. మోదీ ఎన్నికల ప్రచారంపై పార్టీ శ్రేణులకు ఎన్నికల సహ ఇన్‌చార్జి సిద్ధార్థ్‌నాథ్‌సింగ్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏపీ బీజేపీ ఎన్నికల సమన్వయకర్త పేరాల శేఖర్ పాల్గొన్నారు.

వలంటీర్లపై టీడీపీ, జనసేన విమర్శలను మరిచిపోం

- ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెబుతాం
- వలంటీర్ల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేష్‌బాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలను చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నర సంవత్సరాల కిందట ఏర్పాటుచేసిన వలంటీర్ వ్యవస్థపై టీడీపీ, జనసేన చేసిన తీవ్ర విమర్శలు, అసభ్యకరమైన అసత్య ఆరోపణలను తాము ఎప్పటికీ మరిచిపోలేమని వలంటీర్ల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్ము సురేష్‌బాబు పేర్కొన్నారు. తమను సంఘ విద్రోహశక్తులుగా, తీవ్రవాదులుగా పేర్కొన్న టీడీపీ, జనసేన పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెబుతామని ఆయన తెలిపారు. ముఖ్యంగా వలంటీర్లను మహిళలను అక్రమ రవాణా చేసేవారిగా, తీవ్రవాదులుగా చిత్రీకరించిన పవన్‌కళ్యాణ్‌ను పిఠాపురంలో కచ్చితంగా ఓడిస్తామని స్పష్టంచేశారు. ఈ మేరకు సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'వలంటీర్లుగా మమ్మల్ని ముందుపెట్టి అర్హతగల అన్ని వర్గాల ప్రజలకు సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అమలుచేశారు. అటువంటి వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది వలంటీర్లు రాజీనామా చేసి తమ నియోజకవర్గాల్లో సైనికులుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం పేదలందరిపై ఉంది. రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన వెంటనే తన తొలి సంతకం ద్వారా ఇప్పుడు రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి కొనసాగిస్తారనే నమ్మకం మా అందరికి ఉంది.' అని సురేష్‌బాబు తెలిపారు.

జనసేనలో దళితులపై వివక్ష మారలేదు


- మహాసేన నేత రాజేష్ ఆగ్రహం
- జనసేన నేతల తీరుతో అవనిగడ్డ సభకు రాకుండా వెనుదిరిగిన రాజేష్

అవనిగడ్డ: దళితులపై జనసేన పార్టీలో వివక్ష ఇంకా కొనసాగుతూనే ఉందని మహాసేన రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబటి రాయుడు కార్యక్రమం పేరుతో తనకు స్వాగతం పలకడానికి వచ్చిన వారిని తీసుకుపోయి జనసేన నాయకులు ఘోరంగా అవమానించారని రాజేష్ తన అనుచరుల వద్ద వాపోయారు. పి.గన్నవరంలో తనకు టీడీపీ సీటు కేటాయిస్తే నానా యాగీ చేసి సీటు ఇవ్వకుండా జనసేన నాయకులు అడ్డుకున్నారని, అయినా పొత్తు ధర్మం పాటించి ప్రచారానికి వస్తే దళితుడనైన తనపై వివక్ష చూపి ఘోరంగా అవమానించారని తన సన్నిహితుల వద్ద వాపోయారు. వివరాల్లోకి వెళితే.. కృష్ణా జిల్లా అవనిగడ్డ వంతెన సెంటర్‌లో గురువారం సాయంత్రం 5 గంటలకు మహాసేన రాజేష్, క్రికెటర్ అంబటి రాయుడు సభ జరగాల్సి ఉంది. రాజేష్ రావడం కొంత ఆలస్యం కాగా.. అప్పటికే గుంటూరు జిల్లా వైపు నుంచి అంబటి రాయుడు అవనిగడ్డ చేరుకున్నారు. దీంతో మోపిదేవి కాలనీ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాజేష్ కోసం ఎదురు చూస్తున్న దళితుల్ని అవనిగడ్డకు తరలించారు. తన అనుచరుల ద్వారా సమాచారం తెలుసుకున్న రాజేష్ అవాక్కయ్యారు. తన కోసం ఎదురు చూస్తున్న వారిని అంబటి రాయుడు సభకు తరలించి తనను అవమానించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అవనిగడ్డ సభకు రాకుండానే మొవ్వ నుంచి వెనక్కి వెళ్లిపోయారు. జనసేన నేతలు, కార్యక్రమ నిర్వాహకులకు అందుబాటులో లేకుండా ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసుకున్నారు.

'భృతి'.. అంతా భ్రాంతి

నిరుద్యోగులపై బాబు మరోసారి మాయా వల

సాక్షి, అమరావతి : "జాబు రావాలంటే బాబు రావాలి.. తమ్ముళ్లూ మీ కలలు సాకారం చేయబోతున్నా.. ఇంటికొక ఉద్యోగం ఇస్తా.. ఉద్యోగం ఇవ్వకపోతే ఉపాధి కల్పిస్తా.. మీరేమీ చదువుకోకపోయినా నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.2 వేలిస్తా".. ఈ హామీ గుర్తుందా? 2014 ఎన్నికల్లో చంద్రబాబు సంతకంతో కూడిన కరపత్రాన్ని తెలుగుదేశం పార్టీ ఊరూరా పంచుతూ ప్రచారం చేసింది. సీన్ కట్ చేస్తే ఆ ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. చెప్పినట్లుగా నిరుద్యోగులకు ఇచ్చిన హామీ అమలుచేశారా అంటే అనేకానేక హామీల్లాగే అదీ బాబు అటకెక్కించేశారు. ఇప్పుడు మళ్లీ అలాంటి హామీతోనే ఆయన మరోసారి యువతకు వల విసురుతున్నారు. ఆయన మాయలో పడొద్దని.. భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని మేధావులు, విద్యావేత్తలు యువతకు సూచిస్తున్నారు.



నిరుద్యోగ యువతకు రూ.1000 నుండి రూ.2000 వరకు నిరుద్యోగ భృతి ఇస్తాం.



యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని 2014లో టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న దృశ్యం

నిరుద్యోగ భృతి ఇవ్వబోమన్న అచ్చెన్న..

ఇక అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్ల పాటు చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. కానీ, నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మాత్రం సందర్భం వచ్చిన ప్రతీసారి ఈ అంశంపై చంద్రబాబు సర్కారును నిలదీస్తూనే ఉన్నారు. నిరుద్యోగ భృతి చెల్లిస్తానని యువతకు మాటిచ్చి ఎలా విస్మరిస్తారంటూ ఉక్కిరిబిక్కిరి చేశారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక వైఎస్సార్‌సీపీ సభ్యుల ప్రశ్నకు నిరుద్యోగ భృతి అనే పథకమేలేదని, ఈ ప్రశ్న ఉత్పన్నమే కాదంటూ నాటి కార్మిక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అసెంబ్లీలో అసలు విషయాన్ని కుండబద్దలు కొట్టారు. శిక్షణనిచ్చి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని, నిరుద్యోగ భృతి ఇవ్వబోమని, బాబు వస్తే జాబు వస్తుందనే నినాదంతో ఎన్నికల్లో వెళ్లిన మాట వాస్తవమేనని ఆయన చెప్పారు. అయినా, నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలో జగన్ పట్టువిడవకుండా ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతుండడంతో 2017–18లో బడ్జెట్‌లో టీడీపీ ప్రభుత్వం కంటితుడుపుగా రూ.500 కోట్లు కేటాయించింది. దీనిపై జగన్ మండిపడుతూ.. జాబు రావాలంటే బాబు రావాలని, జాబు ఇవ్వకపోతే ఇంటికో ఉద్యోగం ఇస్తానంటూ ఎన్నికల ముందు ఇంటింటా ప్రచారం చేసి ఇప్పుడు గొప్పగా రూ.500 కోట్లు కేటాయించామని చెప్పడం నిరుద్యోగులను నిలువునా మోసం చేయడమేనని ఉతికి ఆరేశారు. అంతేకాక.. రాష్ట్రంలో 1.75 కోట్ల కుటుంబాలున్నాయని, ఒక్కో కుటుంబానికి నెలకు రెండువేల చొప్పున భృతి ఇవ్వాలని.. ఇందుకు నెలకు రూ.3,500 కోట్లు అవసరమని, అలాగే ఏడాదికి రూ.40 వేల కోట్లు అవసరమైతే రూ.500 కోట్లు ఏ మూలకు సరిపోతాయంటూ చంద్రబాబు ప్రభుత్వాన్ని వైఎస్ జగన్ చీల్చిచెండాడారు.

ఉన్న ఉద్యోగాలకు బాబు ఎసరు..

ఇలా నిరుద్యోగ భృతి ఇస్తానంటూ నాలుగున్నరేళ్ల పాటు ఎగమనామం పెట్టి ఎన్నికల ముందు ఆర్నెల్లపాటు యువతను మోసం చేయడానికి కంటితుడుపు చర్యగా ముఖ్యమంత్రి యువనేస్తం పేరుతో చంద్రబాబు ఎత్తుగడ వేశారు. కానీ, నిరుద్యోగ భృతి ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకపోగా ఆరోగ్య మిత్రలను, ఫీల్డ్ అసిస్టెంట్లను, గోపాల మిత్రలను ఉద్యోగాల నుంచి చంద్రబాబు తొలగించారు. దీంతో.. మళ్లీ ఇప్పుడు ఎన్నికల ముందు యువతను, నిరుద్యోగులను మోసం చేయడానికి చంద్రబాబు కుయుక్తులు, మోసపూరిత ప్రకటనలతో వస్తున్నారు తస్మాత్ జాగ్రత్త నిరుద్యోగులూ.. అంటూ మేధావులు, విద్యావేత్తలు యువతను అప్రమత్తం చేస్తున్నారు. నిరుద్యోగ భృతిపై 2014 ఎన్నికల ముందు ఇంటింటా ప్రచారం చేసి అధికారం దక్కాక ఎలా మోసం చేశారో అచ్చు అలాగే చంద్రబాబు మళ్లీ యువతకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అంటూ అరచేతిలో వైకుంఠం చూపెడుతున్నారని.. చంద్రబాబు వలలో పడి మరోసారి మోసపోవద్దని వారు సూచిస్తున్నారు.

వైఎస్ జగన్ ఒత్తిడితో.. ఎన్నికలకు ఆర్నెల్ల ముందు..

ఇక 2017-18లో రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ చంద్రబాబు పైసా ఖర్చు పెట్టలేదు. ప్రతిపక్ష నేత జగన్ తన ఒత్తిడి కొనసాగిస్తుండడంతో ఇక 2019 ఎన్నికలకు ఆర్నెల్ల ముందు నాలుగు నెలల కోసం నిరుద్యోగ భృతి కాదు ముఖ్యమంత్రి యువనేస్తం పేరుతో నిరుద్యోగులకు నెలకు రూ.1,000 ఇస్తామని చంద్రబాబు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు విధివిధానాల రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేసింది. ఈ ఉపసంఘం సవాలక్ష ఆంక్షలు విధించి నిరుద్యోగ భృతి ఇచ్చే వారి సంఖ్యను భారీగా కుదించింది.

- టెన్త్, ఇంటర్ చదివిన వారు అనర్హులని ఆంక్షలు విధించింది.
- 22 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వారు డిగ్రీ చదివిన వారికే భృతి వర్తిస్తుందని, దారిద్య్ర రేఖకు దిగువనున్న వారు.. తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటరు ఐడీ కార్డు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని షరతులు విధించింది.
- దీంతో వచ్చిన దరఖాస్తుల్లో 12 లక్షల మందికి పైగా నిరుద్యోగ భృతికి అర్హులుగా తేల్చింది.
- ఆ తరువాత అది పది లక్షలు, మళ్లీ మళ్లీ వడపోత తర్వాత 2.10 లక్షల మందే అర్హులంటూ వెల్లడించి మళ్లీ దానిని 1.62 లక్షలకు కుదించింది.
- అనంతరం 2018 అక్టోబరులో కేవలం రూ.40 కోట్లు విడుదల చేసి ఈ-కేవైసీ మెలిక పెట్టింది.
- అలాగే, ప్రతినెలా వేలిముద్ర వేస్తేనే నిరుద్యోగ భృతి అంటూ ఆంక్షలు పెట్టుకుంటూ పోయి ఎన్నికల వరకు తాత్సారం చేశారు.

చంద్రబాబుది బోగస్ మేనిఫెస్టో

- మళ్లీ మోసం చేసేందుకు ప్రజల ముందుకొస్తున్నారు
- 2019లో టీడీపీని ప్రజలు చెత్తబుట్టలో పడేశారు
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల సునీత



సాక్షి,అమరావతి: చంద్రబాబు మేనిఫెస్టో బోగస్ అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల సునీత ధ్వజమెత్తారు. అధికారంలో ఉండి 2014–19 మధ్య మేనిఫెస్టోలో ఏం అమలు చేశారని నిలదీశారు. మళ్లీ దగా, కుట్రలతో మోసం చేసేందుకు ప్రజల ముందుకు వచ్చారని మండిపడ్డారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం సునీత మీడియాతో మాట్లాడారు. ప్రజలు చంద్రబాబును ఇక నమ్మే పరిస్థితి లేదన్నారు. 2019లో చంద్రబాబును ప్రజలు చెత్తబుట్టలో పడేశారని.. అయినా ఆయనకు బుద్ధి రాలేదని విరుచుకుపడ్డారు. సీఎం వైఎస్ జగన్ విద్యా, వైద్య రంగాల్లో తెచ్చిన విప్లవాత్మక సంస్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెచ్చాయన్నారు. చంద్రబాబుకు దోచుకోవడానికే అధికారం కావాలని ఆరోపించారు. పోలవరాన్ని కూడా బాబు ఏటీఎంగా వాడుకొన్నారని సాక్షాత్తూ ప్రధాని మోదీనే అన్నారని గుర్తు చేశారు. అమరావతి కుంభకోణం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు. దాని ఫలితమే గత ఎన్నికల్లో టీడీపీ 23 సీట్లకే పరిమితమైందని చెప్పారు. ఓటమి భయంతో సీఎం జగన్‌పై హత్యాయత్నాలకు బాబు ప్రేరేపిస్తున్నారన్నారు. బీజేపీ బాబును నమ్మడం లేదు కాబట్టే మేనిఫెస్టో విడుదల సమయంలో ఆ పార్టీ నేతలు దాన్ని పట్టుకోలేదన్నారు. 650 వాగ్దానాలిచ్చి ప్రజలను మోసం చేసిన వ్యక్తి బాబు అయితే.. చేసేదే చెప్పి.. మేనిఫెస్టోలో 99.4 శాతం హామీల్ని నెరవేర్చిన దమ్మున్న నాయకుడు సీఎం జగన్ అని తెలిపారు. చంద్రబాబు అభివృద్ధిపై చెబుతున్న మాటలు గ్రాఫిక్స్‌లోనే కనిపిస్తాయన్నారు. అదే సీఎం జగన్ చేసిన అభివృద్ధి గ్రామాల్లో కనిపిస్తోందన్నారు.

హత్యారాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు

- అలాంటి చంద్రబాబు ఇప్పుడు నీతులు మాట్లాడటం సిగ్గుచేటు
- లోకేశ్ నోరు అదుపులో పెట్టుకోవాలి.. పవన్ స్థాయికి తగినట్లు మాట్లాడాలి
- కూటమి మేనిఫెస్టో ప్రజాగళం కాదు.. ప్రజాగరళం
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఎన్.నాగార్జునయాదవ్



సాక్షి, అమరావతి: రాజకీయాల్లో హత్యారాజకీయాలకు తెరలేపింది చంద్రబాబే.. హత్యారాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ నారా బాబు.. అని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఎన్.నాగార్జునయాదవ్ ధ్వజమెత్తారు. వంగవీటి రంగాని చంపించింది చంద్రబాబు కాదా? జర్నలిస్టు పింగళి దశరథరామ్‌ని, ఐఏఎస్ ఆఫీసర్ రాఘవేంద్రరావును చంపించింది చంద్రబాబేనన్నది జగమెరిగిన సత్యం. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నీచ, నికృష్టమైన, దుర్మార్గమైన చరిత్రగల చంద్రబాబు ఇప్పుడు నీతులు మాట్లాడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. లోకేశ్ స్థాయికి మించి సీఎం జగన్‌ను అంటే మేం వేయి అంటాం జాగ్రత్త? స్విమ్మింగ్‌పూల్ స్వీటీ లోకేశ్ అని యూత్‌లో ఆయనకు పేరుంది. రాజకీయాల్లో ఎక్కువకాలం రాణించాలంటే లోకేశ్ తప్పుడు ప్రేలాపనలు మానుకోవాలి. పరిటాల ఆస్తులు దోచుకోబోయిన పవన్‌కి హైదరాబాద్‌లో గుండుకొట్టించిన విషయం తెలుగువారికి తెలిసిన నిజం. అప్పట్లో చిరంజీవి రంగప్రవేశం చేసి చంద్రబాబు ద్వారా పవన్‌ను విడిపించుకొచ్చారు. అలాంటి పవన్ ఇప్పుడు సింహంలాంటి మనిషి వైఎస్ జగన్ గురించి మాట్లాడటమా? దేనికైనా అర్థంపర్థం ఉండాలి. పవన్ స్థాయికి తగినట్లు మాట్లాడటం నేర్చుకోవాలి. సీఎం జగన్ జీవితంలో పేదలకు పంచటమే తెలుసు. అమరావతిలో చంద్రబాబు దోచిపెడితే తీసుకున్న పవన్ నీతులు వల్లెవేయటం మంచిదికాదు. ఈ ముగ్గురు మూర్ఖులు చంద్రబాబు, పవన్, లోకేశ్ మూడుప్రాంతాల్లో తిరిగి అసత్యాలు చెబుతున్నారు. ఈనెల 13 తర్వాత ఎక్కడుంటారో ఎవరికీ తెలీదు. త్వరలోనే ఓటుతో వీరందరికీ ప్రజలు బుద్ధి చెబుతారు. అబద్ధానికి పసుపు పూస్తే ఎలా ఉంటుందో అలా ఉంది ఈ కూటమి మేనిఫెస్టో. దీన్నిచూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఎందుకంటే.. దానికి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పెట్టిన పేరు ప్రజాగళం అంట. దీనిపై ప్రజలు మాత్రం అది ప్రజాగళం కాదు.. ప్రజాగరళం అంటున్నారు. అంతేకాదు, దాన్ని ఐదుకోట్ల మంది ప్రజల పాలిట యమగళంగా భావిస్తున్నారు. పావలాకు కూడా చెల్లని చెత్త డాక్యుమెంట్‌గా ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

టీడీపీది ప్రజాగళం కాదు.. యమగళం

2014లో హామీల పేరుతో ప్రజల్ని చంద్రబాబు మోసం చేశారు

- ఇప్పుడు మళ్లీ 'కిచిడీ' మేనిఫెస్టో తెచ్చారు
- ఆ హామీలకు బీజేపీ నేతలు సైతం ష్యూరిటీ ఇవ్వలేదు
- ఇక ఆ మేనిఫెస్టోకు గ్యారెంటీ ఎక్కడిది?
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ధ్వజం



బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): కూటమి మేనిఫెస్టో ప్రజాగళం కాదు.. యమగళమని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విమర్శించారు. విశాఖలోని సిరిపురంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 2014లో 650కి పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అందులో కనీసం 10 శాతం కూడా నెరవేర్చలేదని గుర్తుచేశారు. మోసపూరిత హామీలతో ప్రజల్ని దారుణంగా వంచించాయని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకే.. చంద్రబాబు పేర్లు మార్చి తన మేనిఫెస్టోలో పెట్టుకున్నారని దుయ్యబట్టారు. మరికొన్ని హామీలను పక్క రాష్ట్రాల మేనిఫెస్టోల నుంచి కాపీ కొట్టారు తప్ప సొంతంగా ఒక్క హామీ కూడా పెట్టలేకపోయారని విమర్శించారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన మొదటి ఐదు సంతకాలనే చంద్రబాబు నెరవేర్చలేదని గుర్తు చేశారు. అప్పుడిచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారో ప్రజలకు చెప్పే ధైర్యం ఉందా? అని టీడీపీ అభ్యర్థులకు సవాల్ విసిరారు. చంద్రబాబు తెచ్చిన కిచిడీ మేనిఫెస్టోలోని హామీలకు కూటమిలోని బీజేపీయే ష్యూరిటీగా ఇవ్వలేదన్నారు. ఇక ఆ మేనిఫెస్టోకు గ్యారెంటీ ఎక్కడిదని ప్రశ్నించారు. టీడీపీ, బీజేపీ, జనసేనకు ఓటేస్తే విద్య, వైద్యంతో పాటు సంక్షేమ పథకాలను వద్దనుకున్నట్లేనని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలు, ఆస్పత్రుల అభివృద్ధిని టీడీపీ నిలిపివేస్తుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని ఆపివేస్తుందన్నారు. పేద, మధ్యతరగతి బతుకులు మారుస్తూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్న సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. 2019లో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారో చెబుతూ.. 2024 మేనిఫెస్టోను ప్రకటించిన దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్ని గెలిపించాలని కోరారు.

కాలేజీలో చదివేటప్పుడు కొన్ని వెధవ పనులు చేశా

టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్



నెల్లూరు సిటీ: తాను ఫారిన్‌లోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ చదివేటప్పుడు కొన్ని వెధవ పనులు చేశానని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. నెల్లూరు నగరంలోని వీఆర్సీ గ్రౌండ్స్‌లో బుధవారం యువగళం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువగళం నిర్వహణ యాంకర్ ఫెడ్రిక్.. ఎంబీఏ చదివేటప్పుడు విద్యార్థిగా ఏమైనా సరదా పనులు చేశారా? అని లోకేశ్‌ను ప్రశ్నించారు. దానికి లోకేశ్ సమాధానమిస్తూ.. 'కాలేజీ సమయంలో వెధవ పనులు అందరం చేస్తాం. దానిలో ఎలాంటి డౌట్ లేదు. నేను కూడా చేశా' అని చెప్పారు. అనంతరం రాజకీయాల గురించి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో నెల్లూరుకు విమానాశ్రయం తెస్తానన్నారు. యువగళం కార్యక్రమానికి ముందుగా నిర్దేశించిన వారిని, యువతను మాత్రమే అనుమతించారు. నారాయణ కళాశాలలో చదివే ఇంజనీరింగ్, మెడికల్ కళాశాల విద్యార్థులను తెచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.

టీడీపీది బూటకపు మేనిఫెస్టో

- చంద్రబాబు మరోసారి ప్రజలను వంచిస్తున్నారు
- ఆయన పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్టం చేశారు
- ప్రజలలో సీఎం జగన్‌కు ఉన్న విశ్వసనీయత చంద్రబాబుకు, పవన్‌కు లేదు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



సాక్షి,అమరావతి: టీడీపీది బూటకపు మేనిఫెస్టో అని, చంద్రబాబు ప్రజలను మరోసారి వంచిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ధ్వజమెత్తారు. అది ఒక టిష్యూ పేపర్ అని మండిపడ్డారు. బాబు మేనిఫెస్టో అంతా పాపాల పుట్ట, అసత్యాల బొంత అని అన్నారు. ఆయన బుధవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 2014లో చంద్రబాబు, మోదీ, పవన్ కళ్యాణ్ ఇచ్చిన మేనిఫెస్టోలో చెప్పిన హామీలలో ఒక్కటి కూడా అమలు చేయలేదని, అందువల్ల ఇప్పుడు విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. 2018 డిసెంబర్‌కి పోలవరం పూర్తి చేస్తామని బాబు 2014లో చెప్పారని, దానిని పూర్తి చేయలేక చేతులెత్తేశారని అన్నారు. ప్రస్తుత మేనిఫెస్టోలో కూడా పోలవరంపై స్పష్టత ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పొత్తులో ఉన్నప్పటికీ, చంద్రబాబు ఎన్నికల హామీలకు బాధ్యత వహిస్తామని బీజేపీ ఎందుకు చెప్పలేదని, మేనిఫెస్టోను ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు. విభజన హామీలపై బీజేపీ నుంచి ఎందుకు క్లారిటీ తీసుకోలేదని అన్నారు. చంద్రబాబు, పవన్ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌పై చంద్రబాబు, పవన్ దారుణ వ్యాఖ్యలు మానుకోకపోతే గట్టిగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఏం చేస్తారో చెప్పాలి కానీ, నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించబోమన్నారు. ఎవరు ఎవరికి సమాధి కట్టారో చంద్రబాబు గుర్తుతెచ్చుకోవాలన్నారు. వంగవీటి రంగాను హత్య చేసింది, పత్తికొండలో నారాయణరెడ్డిని చంపించింది, గోదావరి పుష్కరాల్లో ప్రచార యావతో 20 మందిని చంపించింది నీవే కదా చంద్రబాబూ అని ప్రశ్నించారు. బాబు పాలనలో రాష్ట్రాన్ని రావణకాష్టం చేశారన్నారు. అందుకే 2019లో ప్రజలు చంద్రబాబుకు రాజకీయ సమాధి కట్టారని చెప్పారు. ప్రజలలో సీఎం జగన్‌కు ఉన్న విశ్వసనీయత చంద్రబాబుకు, పవన్‌కు లేదని స్పష్టంచేశారు. మోసం చేసే మాటలు చెప్పడం కంటే చచ్చిపోవడం మేలని సీఎం జగన్ చెప్పారన్నారు. పింఛన్ ఒకేసారి రూ.3,500 ఇస్తామని చెప్పడానికి సీఎం జగన్ అంగీకరించలేదన్నారు. దమ్ముగా తాను రూ.3,500 ఇవ్వగలనని, అది కూడా రెండు విడుతల్లో పెంచుతానని కరాఖండిగా చెప్పారన్నారు. అలా చేస్తే ప్రజలు సీఎం జగన్ చెప్పే చేస్తాడని ఆశలు పెంచుకుంటారని, అలా మోసం చేయలేను అని చెప్పారన్నారు. మీ ఇంట్లో మేలు జరిగితేనే తనకు ఓటేయాలని దమ్ముగా చెప్పిన్న నాయకుడు కూడా వైఎస్ జగనే అని చెప్పారు. చంద్రబాబుకు అలాంటి ధైర్యం ఉందా అని ప్రశ్నించారు.

డ్వాక్రా మహిళలకు పట్టుచీరలు.. నగదు

తిరుపతిలో పంపిణీ చేస్తూ దొరికిన జనసేన శ్రేణులు



తిరుపతిలోని నితిన్ అపార్ట్‌మెంట్ నుంచి తాయిలాలు తీసుకుని వస్తున్న మహిళలు

సాక్షి, తిరుపతి: తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కోట్ల రూపాయలతో ఓటర్ల కొనుగోలును ముమ్మరం చేశారు. డ్వాక్రా సభ్యులను లక్ష్యంగా చేసుకుని రిసోర్స్ పర్సన్స్(ఆర్పీ) ద్వారా పట్టుచీరలు, నగదు పంపిణీ చేస్తున్నారు. బుధవారం తిరుపతిలోని అన్నమయ్య కూడలిలో ఆర్డీవో, అర్బన్, రూరల్ తహశీల్దార్ కార్యాలయాలకు దగ్గరలో ఉన్న నితిన్ అపార్ట్‌మెంట్ తొలిఅంతస్తులో జనసేన అభ్యర్థి ఆరణి అనుచరులు డ్వాక్రా సభ్యులకు పట్టుచీరలు, నగదు పంపిణీ చేపట్టారు. ఈ విషయం తెలిసి స్థానికులు అధికారులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి డ్వాక్రా మహిళలకు జనసేన శ్రేణులు నగదు, చీరలు పంపిణీ చేస్తుండగా పట్టుకుని 45 పట్టుచీరలు, 35 నగదు ఉన్న కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో కవరులో రూ.3వేలు ఉన్నాయి. ఉదయం నుంచి రహస్యంగా సాగుతున్న ఈ కార్యక్రమంలో 150 మంది ఆర్పీలకు తాయిలాలు పంపిణీ చేసినట్లు సమాచారం. డ్వాక్రా సంఘాల్లోని కీలకమైన సభ్యులకు పట్టుచీరతోపాటు రూ.25వేలు చొప్పున కవరులో పెట్టి ఇచ్చినట్లు ఒక ఆర్పీ 'సాక్షి'కి తెలిపారు.

టీడీపీ నేతలతో కలిసి స్లిప్పులు పంపిణీ చేసిన బీఎల్‌వో

మరోవైపు తిరుపతి 14వ డివిజన్ ఎస్టీవీ నగర్‌లో టీడీపీ నేతలతో కలిసి ఒక బీఎల్‌వో ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తూ దొరికారు. 147 పోలింగ్ బూత్‌కు చెందిన బీఎల్‌వో భారతి, ఆర్పీ లక్ష్మి టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తుండగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తంచేశారు.

ఒకట్రెండు జగన్ పథకాలను కొనసాగిస్తా

- పదిరోజులు కష్టపడితే అందరి భవిష్యత్తు మారుస్తా
- చీరాల, గుంటూరు సభల్లో చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, బాపట్ల/కొరిటెపాడు (గుంటూరు) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన వాటిల్లో ఒకట్రెండు పథకాలను ప్రజలకు ఉపయోగపడేలా కొనసాగిస్తామని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు అన్నారు. జాబు రావాలంటే బాబు రావాలని.. ఎండ ఉందని ఓట్లకు రాకుండా ఏమారితే కొంపలు కూలిపోతాయన్నారు. చీరాల బైపాస్ రోడ్డులో, గుంటూరులో బుధవారం ప్రజాగళం సభల్లో ఆయన ప్రసంగిస్తూ.. తాను అధికారంలోకి రాగానే రూ.20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. తాను అధికారంలోకి రాగానే సీఎం జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ రద్దుచేస్తానన్నారు. ఈ చట్టాన్ని రద్దుచేయాలని తాను డిమాండ్ చేస్తున్నా జగన్ స్పందించడంలేదన్నారు. ఇప్పుడు రద్దుచేయాలన్నా ఎన్నికల కోడ్‌వల్ల రద్దు చేసేందుకు అవకాశం లేదన్నారు. కార్యకర్తలు పదిరోజులు కష్టపడితే అందరి భవిష్యత్ మారుస్తానని ఆయన చెప్పారు. ఇక సీఎం జగన్, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఏపీలోనే అధికంగా ఉన్నాయన్నారు. నాసిరకం మద్యంతో పేదల రక్తం పీలుస్తున్నారని జగ్గూ భాయ్ బ్రాండ్స్‌తో రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాడని ఆరోపించారు. 30 వేల ఆడబిడ్డల తాళిబొట్లు తెంపిన సైకో జగన్ అని అన్నారు. తాను ఉన్నప్పుడు ఉచితంగా ఇసుక ఇస్తే జగన్ మాత్రం రూ.5 వేలకు ట్రాక్టర్ అమ్ముతున్నారని, దీంతో 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక ఆత్మహత్యలు చేసుకున్నారని నోరుజారి తర్వాత సరిదిద్దుకుని ఉపాధిలేక అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నారని, మరికొందరు రోడ్డునపడ్డారన్నారు. చీరాల తరహా రౌడీయిజం, దుర్మార్గాలను అంతం చేసి ప్రజాపాలన సాగిస్తానని చంద్రబాబు చెప్పారు. డ్రైవర్‌కు పని తెలీక అతను రివర్స్ గేర్‌లో వెళ్తే ఎలా ఉంటుందో జగన్ పాలన అలాగే ఉందన్నారు. పాఠశాలలకు రంగులు వేస్తే పిల్లలకు చదువెలా వస్తుందని ప్రశ్నించారు.

మీకు రోషం లేదా? రోడ్లపైకి రారా!

గుంటూరు సభలో బాబు మాట్లాడుతూ.. మీకు రోషం లేదా! మీరు రోడ్లపైకి రారా! అంటూ వ్యాఖ్యానించారు. అమరావతి రాజధాని కావాలి.. ఓటు మాత్రం వేయం.. సైకో డబ్బులిస్తే ఓటు వేస్తాం.. అంతేనా మీ ఆలోచనా అంటూ ఆయన అసహనం వ్యక్తంచేశారు. 2019 కంటే ఈ ఐదేళ్లలో మీ జీవన ప్రమాణాలు పెరిగాయా? అంటూ చంద్రబాబు ప్రశ్నించారు.

జనసేన గుర్తింపు పొందిన పార్టీ కాదు

- ప్రత్యేక పరిస్థితుల్లోనే 'కూటమి' కట్టాను
- ఇసుక ర్యాంపుల నుంచి నెలనెలా జగన్‌కు డబ్బులు
- ఆయన మరోసారి వస్తే భూములు లాగేసుకుంటాడు
- మండపేట, పెందుర్తి, అచ్యుతాపురం సభల్లో పవన్



అచ్యుతాపురం సభలో మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

కపిలేశ్వరపురం/మండపేట/సాక్షి, విశాఖపట్నం/అచ్యుతాపురం (అనకాపల్లి జిల్లా) : జనసేన గుర్తింపు పొందిన పార్టీ కాదని, ప్రత్యేక పరిస్థితుల్లో, జగన్ పాలన నుంచి విముక్తి కలిగించడానికి కూటమి కట్టానని ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. మండపేట, విశాఖ జిల్లా పెందుర్తి, అచ్యుతాపురంలలో బుధవారం జరిగిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. పవన్ ప్రసంగిస్తూ.. కూటమిలోని వారు ఏ పార్టీకి చెందినప్పటికీ జనసేన అభ్యర్థులుగానే భావించి మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. జగన్ క్లాస్‌వార్ గురించి మాట్లాడడం సరికాదన్నారు. ఇసుక ర్యాంపుల్లో అక్రమాలు జరుగుతున్నాయని.. ఇక్కడి ర్యాంపులు నుంచి జగన్‌కు నెలకు రూ.10 కోట్లు అందుతోందని ఆరోపించారు. ఒక్కడు కూర్చుని పెత్తనం చెలాయిస్తానంటే అథః పాతాళానికి తొక్కేస్తానన్నారు. ఇదే విషయాన్ని తోట త్రిమూర్తులుకు కూడా చెబుతున్నానన్నారు. 30 వేల మంది మహిళలు అదృశ్యమైపోతే జగన్ కనీసం ప్రెస్‌మీట్ కూడా పెట్టలేదన్నారు. జగన్ పాలనలో అట్రాసిటీ కేసులు పెరిగాయని, దళిత ప్రయోజన పథకాలను తీసేశారన్నారు. ఇక జగన్ ప్రజల భూములను లాగేసుకునేందుకు ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తెచ్చాడని, చిన్నపాటి స్థలం ఉన్నా స్టాంప్ పేపర్ కాకుండా జిరాక్స్ పేపర్ ఇస్తారంటున్నారని విమర్శించారు. సభలో కాకినాడ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ద్వారంపూడి, తోట త్రిమూర్తులను విమర్శించారు. ఇక మండపేటలో ధాన్యం కొనుగోలులో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. కూటమిలో అందరి లక్ష్యమూ జగన్ పాలన నుంచి విముక్తి కలిగించడమేనన్నారు. ఆంధ్రప్రదేశ్ కోసం టీడీపీ, బీజేపీలను తానే కలిపానని.. మరోసారి జగన్‌కు అవకాశం ఇవ్వొద్దని కోరారు. పిఠాపురంలో తనకు లక్ష ఓట్ల మెజారిటీ వస్తుందన్నారు. ఇక పవన్ తన ప్రసంగాల్లో పొంతనలేని మాటలతో అభిమానులకు విసుగు తెప్పించారు. అలాగే, అకస్మాత్తుగా తన ప్రసంగాలను ముగించేయడం కొసమెరుపు.

క్లుప్తంగా...

నేటి నుంచి ఆర్‌సెట్‌ పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత విద్యలోని వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి మేలో నిర్వహించే ఎంట్రన్స్‌ పరీక్షల తేదీలను ఉన్నత విద్యా మండలి కార్యదర్శి నాజీర్‌ అహ్మద్‌ బుధవారం ప్రకటించారు. గురువారం నుంచి 5వ తేదీ వరకు ఆర్‌సెట్, 6న ఐసెట్, 8న ఈసెట్‌ పరీక్ష జరగనుండగా వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఇక 16 నుంచి 23 వరకు ఏపీఈఏపీ సెట్‌కు 7వ తేదీ నుంచి హాల్‌ టికెట్లు డౌన్‌లోడ్‌ చేసుకోవాలని సూచించారు. 29 నుంచి 31వరకు పీజీ సెట్‌ పరీక్షకు సంబంధించి 22నుంచి హాల్‌టికెట్లను https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ ద్వారా పొందాలని సూచించారు.

నర్సింగ్‌ విద్యార్థులకు సదవకాశం

సబ్జెక్టులు క్లియర్‌ చేసుకునేందుకు దరఖాస్తులకు ఆహ్వానం



సాక్షి, అమరావతి: బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం కోర్సుల్లో ఫెయిల్‌ అయ్యి, నిర్దీత కాలపరిమితి లోగా సబ్జెక్టులు క్లియర్‌ చేయనటువంటి విద్యార్థులకు ఏపీ నర్సింగ్, మిడ్‌వైఫరీ కౌన్సిల్‌ సదవకాశం కల్పించినట్లు రిజిస్ట్రార్‌ కె.సుశీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరందరికీ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. hmis.ap.nic.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో ఉంచామని, విద్యార్థులు వెబ్‌సైట్‌ను సందర్శించి ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికుల జీవితాలను మెరుగుపరిచిన సీఎం జగన్‌

వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన పథకాలు, విధానాల వల్ల రాష్ట్రంలోని కార్మికుల జీవితాలు మెరుగుపడ్డాయని వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు పూనూరి గౌతమ్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'కార్మికుల సంక్షేమానికి, వారి పిల్లల విద్య, కుటుంబ సభ్యుల ఆరోగ్యం కోసం సీఎం జగన్‌ అనేక పథకాలు తీసుకొచ్చారు. కార్మికుల ప్రమాద బీమా సొమ్మును రూ.5లక్షలకు పెంచారు. వాహన మిత్రతో ఆటో, టాక్సీల ద్వారా ఉపాధి పొందుతున్నవారికి అండగా నిలిచారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను రూ.8వేల నుంచి రూ.22వేలకు సీఎం జగన్‌ పెంచారు. కానీ, కార్మికులకు అన్యాయం చేసిన చరిత్ర చంద్రబాబుది. కార్మికుల సొమ్ము తిన్న అచ్చెన్నాయుడు గతంలో అరెస్టయ్యారు. కార్మిక ద్రోహులుగా చంద్రబాబు, అచ్చెన్నాయుడులను కార్మికులు గుర్తించారు. భవన నిర్మాణ కార్మికుల నడ్డి విరిచింది చంద్రబాబే. వాస్తవాలు తెలుసుకుని ఎల్లోమీడియా వార్తలు రాయాలి. అచ్చెన్నాయుడు ఎందుకు అరెస్టు అయ్యారో ఎల్లోమీడియా వారు చర్చకు రాగలరా? ప్రజాప్రయోజనాలపై చిత్తశుద్ధి లేని చంద్రబాబు ఇచ్చిన కాగితాలను మేనిఫెస్టో అంటారా? టీడీపీ, జనసేన మేనిఫెస్టో ఒక చెల్లని చెత్త డాక్యుమెంట్‌. అబద్ధాలు, మోసాలతో నిండిన ఆ మేనిఫెస్టోకు చివరికి ప్రధాని మోదీ గ్యారెంటీ కూడా లేదు. నెరవేర్చని హామీలను బీజేపీకి రుద్దవద్దని మోదీనే టీడీపీ, జనసేన మేనిఫెస్టోకు దూరంగా ఉన్నారు. కాబట్టి ప్రజలు అందరూ ఆలోచించాలి.' అని గౌతమ్‌రెడ్డి అన్నారు.

శిరోముండనం కేసులో అనుబంధ పిటిషన్‌కు అనుమతి

విచారణ 7వ తేదీకి వాయిదా

సాక్షి, అమరావతి: శిరోముండనం కేసులో బాధితులను ప్రతివాదులుగా చేరుస్తూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఇతర పిటిషనర్లు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. త్రిమూర్తులతో పాటు ఇతర దోషులు దాఖలు చేసిన అప్పీళ్లపై అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలని బాధితులకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శిరోముండనం కేసులో తమను దోషులుగా నిర్ధారించి ఏడాదిన్నర పాటు జైలు శిక్ష విధిస్తూ విశాఖపట్నం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్‌ చేస్తూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరో 8 మంది హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ అప్పీళ్లు గత వారం విచారణకు రాగా.. బాధితులను ప్రతివాదులుగా చేర్చాలని త్రిమూర్తులు తదితరులను న్యాయస్థానం ఆదేశించింది. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యాలు విచారణకు రాగా.. బాధితులను ప్రతివాదులుగా చేరుస్తూ అనుబంధ పిటిషన్‌ దాఖలు చేశామని త్రిమూర్తులు తదితరుల తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. దీంతో న్యాయమూర్తి ఆ అనుబంధ పిటిషన్‌ను అనుమతిస్తూ తదుపరి విచారణను 7వ తేదీకి వాయిదా వేశారు.

వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకును చీల్చడమే షర్మిల లక్ష్యం

పాడేరు కాంగ్రెస్‌ రెబల్‌ అభ్యర్థితో మంతనాలతో స్పష్టీకరణ

- చంద్రబాబు నాయుడుకు మేలు చేయడమే అజెండా
- ఆడియో లీక్‌తో అడ్డంగా దొరికిపోయిన వైనం
- పాడేరు కాంగ్రెస్‌ టికెట్‌ తొలుత వంతల సుబ్బారావుకు
- ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ నుంచి వెళ్లిన బుల్లిబాబుకి కేటాయింపు
- పాడేరులో కాంగ్రెస్‌ రెబల్‌గా వంతల పోటీ
- పోటీ నుంచి తప్పుకోవాలని వంతలను ఆదేశించిన షర్మిల
- వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకు కోసమే తాను బాధ్యతలు తీసుకున్నట్లు వెల్లడి



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ ఓటు బ్యాంకు చీల్చి, చంద్రబాబుకు మేలు చేకూర్చడమే లక్ష్యంగా షర్మిల కాంగ్రెస్‌ పార్టీలో చేరినట్లు స్పష్టమైంది. పాడేరులో కాంగ్రెస్‌ రెబల్‌ అభ్యర్థి వంతల సుబ్బారావును విరమింపజేయడానికి షర్మిల చేసిన ప్రయత్నం షర్మిల ఎల్లో రాజకీయాన్ని తేటతెల్లం చేసింది. వైఎస్సార్‌సీపీ ఓట్లు కోసమే బుల్లిబాబుకి టికెట్‌ ఇచ్చామంటూ సుబ్బారావుతో షర్మిల మాట్లాడిన ఆడియో లీకవడంతో అడ్డంగా దొరికిపోయారు.

పాడేరు కాంగ్రెస్‌ అభ్యర్థిగా షర్మిల తొలుత వంతల సుబ్బారావును ఎంపిక చేశారు. ఇటీవల పాడేరులో జరిగిన సభలో కూడా సుబ్బారావే అభ్యర్థి అని ప్రకటించారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ నుంచి బుల్లిబాబు కాంగ్రెస్‌లోకి రావడంతో షర్మిల ప్లేటు ఫిరాయించారు. సుబ్బారావును కాదని బుల్లిబాబుకు టికెట్‌ ఇచ్చారు. దీంతో వంతల సుబ్బారావు రెబల్‌ అభ్యర్థిగా నామినేషన్‌ వేశారు. దీంతో షర్మిల సుబ్బారావుతో ఫోన్‌లో మాట్లాడారు. వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ ఓట్లు చీల్చేందుకే బుల్లిబాబుకి టికెట్‌ ఇస్తున్నామనీ.. పోటీ నుంచి తప్పుకోవాలని కోరారు. రెబల్‌గా బరిలో ఉంటే పార్టీలోకి మళ్లీ రాలేరంటూ హెచ్చరించారు. మీ సభలకంటే నా సభలకే జనాలు ఎక్కువ మంది వస్తున్నారంటూ సుబ్బారావు కూడా ఘాటుగా సమాధానమిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్‌ చేస్తున్న ఆడియోలో ఏముందంటే..

షర్మిల: నమస్తే అన్నా.. ఇప్పటికి కూడా ఆలస్యం కాలేదన్నా. నెక్స్ట్‌ టైమ్‌ తప్పకుండా ఆపర్చ్యూనిటీ ఇస్తాం. పార్టీలో సముచితమైన స్థానం, గౌరవమిస్తాను. మీరు నా సొంత అన్న లెక్క అన్నా. అర్థం చేసుకోకపోతే ఎలా అన్నా. నేనైతే మీకియ్యాలనే అనుకున్నానన్నా. కానీ రఘువీరారెడ్డి గారు ఆల్రెడీ అరకు సీపీఎంకు ఇచ్చేశారు. ఈ సీటు బుల్లిబాబుకు ఇమ్మన్నారు. మీకు అన్నీ తెలిసి మేమేదో డబ్బుల కోసమో.. నా టీమ్‌ ఏదో డబ్బుల కోసమో బుల్లిబాబుకి ఇచ్చామని ప్రచారం చెయ్యడం కూడా కరెక్ట్‌ కాదు కదా మీరు. అది వాస్తవం కాదు కదా అన్నా..

సుబ్బారావు: నేనేమీ ప్రచారం చెయ్యలేదు. నేనైతే ఎక్కడా మీ గురించి కానీ, పార్టీ గురించి కానీ ప్రచారం చెయ్యలేదు.

షర్మిల: సరే అన్నా.. ఇప్పటికి కూడా ఆలస్యం కాలేదు. మీరు రెబల్‌ కావద్దు. నెక్స్ట్‌టైమ్‌ తప్పకుండా అవకాశం ఉంటుంది. కమ్‌ బ్యాక్‌.

సుబ్బారావు: ఇంత అన్యాయం ఏంటి మేడం. ఏ రోజూ జెండా మోయని వాడికీ, పార్టీలో లేనివాడికీ ఇచ్చెయ్యడం వల్ల నాకు బాధ ఉంది. మరొక్క విషయం.. మీరు వేలాది మంది జనం ముందు ప్రకటన చెయ్యకపోయినా బాగుండేది. మీరు ప్రకటన చెయ్యడం వల్ల నేను డిసప్పాయింట్‌ అయ్యాను. మా వాళ్లు కూడా ఫీలయ్యారు.

షర్మిల: అన్నా.. మీకు అన్నీ తెలుసు. కాంగ్రెస్‌ ఓటు బ్యాంకు ముఖ్యం, మనకు వైసీపీ ఓటు బ్యాంకు కూడా ముఖ్యము. రెండూ కలిసొస్తాయనే కదా తీసుకుంది. నేను తీసుకుంది ఎందుకు? వైసీపీ ఓటు బ్యాంకు కోసమే కదా.

సుబ్బారావు: నేనిప్పుడు చూశాను.. మీరు మాట్లాడింది, మీరు ప్రచారం చేసింది. మొన్న నా జనాల్ని చూస్తే.. మీకంటే ఐదు రెట్లు ఎక్కువ మంది వచ్చారు. రూపాయి ఖర్చు పెట్టకుండా. వీడియోలు పెట్టమంటే పెడతాను. చూడండి. నేను ఓటు బ్యాంకు ఉన్నవాడిని. కానీ.. గ్రౌండ్‌ లెవల్‌లో రిపోర్ట్‌ లేదు అని అన్నారు. నా రిపోర్ట్‌ ఏంటో ఎవరికెన్ని ఓట్లు వస్తాయో చూడండి. నేను కాంగ్రెస్‌లోనే ఉంటాను.

షర్మిల: అన్నా.. మీరు ఇప్పుడు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే ఇంక కాంగ్రెస్‌ పార్టీ గురించి మర్చిపోండి.

సుబ్బారావు: మర్చిపోవాలంటే.. మర్చిపోతానిక.

షర్మిల: మర్చిపోండి.. మీకు ఇప్పుడు మాత్రమే అవకాశం ఉంది. మళ్లీ కుటుంబంలోకి రావడానికి. మీరు రెబల్‌గా పోటీ చేసినాక, కాంగ్రెస్‌ పార్టీకి డ్యామేజ్‌ చేసినాక మళ్లా మీరు కాంగ్రెస్‌లోకి రాలేరు.

సుబ్బారావు: నా భవిష్యత్తే డ్యామేజ్‌ అయ్యింది. నాకింకేముంది మరి.

షర్మిల: అదే అన్నా.. ఇప్పుడు ఆలోచించుకోండి. మళ్లీ మీకు కాంగ్రెస్‌ పార్టీ అవసరము అని వెనక్కొస్తే మీకిక్కడ స్థానం ఉండదు.

సుబ్బారావు: మంచిదే కదా.

రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ చైర్మన్, వైస్‌ చైర్మన్‌లకు ఘన సన్మానం

న్యాయవాదుల సంక్షేమమే బార్‌ కౌన్సిల్‌ పరమావధి: ద్వారకానాథరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ నూతన చైర్మన్‌ ఎస్‌.ద్వారకానాథరెడ్డి, వైస్‌ చైర్మన్‌ ఎస్‌.కృష్ణమోహన్‌లను హైకోర్టు న్యాయవాదుల సంఘం బుధవారం ఘనంగా సన్మానించింది. సంఘం అధ్యక్షుడు జానకిరామిరెడ్డి నేతృత్వంలో న్యాయవాదులు కొత్తగా ఎన్నికైన చైర్మన్, వైస్‌ చైర్మన్‌లకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో తాజాగా సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కలిగినీడి చిదంబరం, ఉపాధ్యక్షుడు ఎస్‌.రంగారెడ్డితో పాటు మొత్తం కార్యవర్గం పాల్గొంది. ఈ సందర్భంగా ద్వారకానాథరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి బార్‌ కౌన్సిల్‌ కట్టుబడి ఉందన్నారు. న్యాయవాదుల సంఘంతో మరింత సమన్వయంగా పనిచేస్తామన్నారు. న్యాయవాదుల సంఘం కోసం రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. న్యాయవాదులు వృత్తిపరంగా తమకు ఎదురయ్యే ప్రతీ సమస్యను బార్‌ కౌన్సిల్‌ దృష్టికి తీసుకురావొచ్చునన్నారు. న్యాయవాదుల సంక్షేమమే బార్‌ కౌన్సిల్‌ పరమావధి అని ఆయన చెప్పారు.



రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ చైర్మన్‌ ద్వారకానాథరెడ్డిని సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం

వ్యక్తిగత అజెండాతోనే షర్మిల దుష్ప్రచారం

- అవినాశ్‌రెడ్డికి కడప ఎంపీ సీటు ఇచ్చినందుకే సీఎం జగన్‌పై కక్ష
- చంద్రబాబు చేతిలో కీలుబొమ్మల్లా షర్మిల, సునీత
- మహిళా కమిషన్‌ మాజీ చైర్‌పర్సన్‌ వాసిరెడ్డి పద్మ ధ్వజం



సాక్షి, అమరావతి: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యక్తిగత అజెండాతోనే ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్, ఆయన సతీమణి భారతిపై విషం కక్కుతున్నారని ఏపీ మహిళా కమిషన్‌ మాజీ చైర్‌పర్సన్‌ వాసిరెడ్డి పద్మ మండిపడ్డారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు చేతిలో షర్మిల, సునీత కీలుబొమ్మల్లా మారిపోయారన్నారు. తెలంగాణలో పార్టీ పెట్టి.. ఎందరినో ముంచేసిన షర్మిల ఏపీకి వచ్చింది చంద్రబాబు ప్రయోజనాల కోసమేనన్నారు. కడప ఎంపీ సీటును అవినాశ్‌రెడ్డికి ఇచ్చినందుకే సీఎం జగన్‌పై కక్ష గట్టి దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సందర్భం లేని విషయాల్లోనూ వైఎస్‌ భారతి పేరును తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు. అత్యంత దీనావస్థలో ఉన్న కాంగ్రెస్‌ వ్యక్తిగత అజెండాలను తీర్చడానికి వేదికవడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ టికెట్లు ఇవ్వని నాయకులకు గేలం వేసి కాంగ్రెస్‌ సీట్లు ఇస్తామని షర్మిల వారిని మోసం చేశారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ఓటు బ్యాంకుకు గండికొట్టడమే ఆమె అజెండాగా కనిపిస్తోందన్నారు. ఈ ఒక్క ఉదంతంతో ఆమెను వెనుకుండి చంద్రబాబు ఆడిస్తున్నారనేది స్పష్టమైపోయిందని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్‌లో షర్మిలను అడుగు కూడా పెట్టనివ్వని రేవంత్‌రెడ్డి ఇప్పుడు పూర్తి సహకారం అందిస్తుండటం ఎవరి కోసమో అందరికీ తెలిసిందేనన్నారు. వివేకా పరువును షర్మిల, సునీతలు నడిరోడ్డుపై పెట్టేశారని మండిపడ్డారు. వివేకా హత్య జరిగిన రోజు వేకువజామునే వైఎస్‌ భారతికి ఫోన్‌ వచ్చిందన్న విషయం సునీతకు ఎవరు చెప్పారని ప్రశ్నించారు. కట్టుకథలు అల్లుకుంటూ ప్రజలను మోసం చేయొద్దని హితవు పలికారు. సీఎం జగన్‌కు చెల్లెళ్లు అనే హోదా తప్ప షర్మిల, సునీతలకు ఏముందో చెప్పాలన్నారు. చంద్రబాబును గెలిపించాలనే ధ్యేయంతో వీరిద్దరిని ఎల్లో మీడియా హైలెట్‌ చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారం ముగిశాక పచ్చ మీడియా వీరిని కనీసం కన్నెత్తి కూడా చూడదన్నారు.

జగన్‌ ఏనాడైనా ప్రజా సమస్యలను గుర్తించారా?

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

బద్వేలు అర్బన్‌/పోరుమామిళ్ల /కాశినాయన/అట్లూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌ ప్రజాదర్బార్‌ పెట్టి ప్రజా సమస్యల కోసం కృషి చేస్తే ఆయన వారసుడు జగన్‌ ఏనాడైనా ప్రజల్లోకి వెళ్లి సమస్యలను గుర్తించారా అని పీసీసీ అధ్యక్షురాలు, కాంగ్రెస్‌ పార్టీ కడప ఎంపీ అభ్యర్థి షర్మిల ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్‌ పార్టీయేనన్నారు. వైఎస్సార్‌ జిల్లా బద్వేలు, కలసపాడు, పోరుమామిళ్ల, కాశినాయన, బి.కోడూరు, అట్లూరు మండలాల్లో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త రాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్నా అటు చంద్రబాబుగానీ, ఇటు జగన్‌మోహన్‌రెడ్డి గాని ప్రత్యేక హోదా కోసం పోరాడలేదని, ఇద్దరూ బీజేపీకి గులాంగిరి చేస్తున్నారని అన్నారు. అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తానని చెప్పిన జగన్‌ ఎన్ని ఉద్యోగాలు భర్తీచేశారని ప్రశ్నించారు. వైఎస్సార్‌ మాట ఇస్తే మడమ తిప్పరని, ఆయన తనయుడు జగన్‌ మాత్రం మద్యపాన నిషేధం చేస్తానని మాటిచ్చి మడమ తిప్పారన్నారు. ప్రజలు అధికారం కట్టబెడితే ఆ అధికారాన్ని వైఎస్‌ వివేకానందరెడ్డిని హత్యచేసిన వారిని కాపాడేందుకు ఉపయోగించుకుంటున్నారని షర్మిల ఆరోపించారు. తనను గెలిపిస్తే కేంద్రంలో మంత్రినవుతానని, ప్రత్యేక హోదా వస్తుందని, పోలవరం పూర్తవుతుందని ఆమె చెప్పారు. రాజశేఖర్‌రెడ్డి తమ్ముడిని హత్య చేయించిన వారు ఒకవైపు, న్యాయం కోసం పోరాటం చేసేవారు మరోవైపు ఉన్నారని, మీరే తేల్చుకుని ఓటు వేయాలని ఆమె కోరారు. ఇక రోడ్‌షోకు జనం నుంచి స్పందన లేకపోవడంతో గంటలోపే 10 గ్రామాల పర్యటన పూర్తయింది.

కడప కోర్టు ఉత్తర్వులపై విచారణ 3కి వాయిదా

- వివేకా హత్యపై తప్పుడు ప్రచారం చేయొద్దన్న కడప కోర్టు
- ఆ ఉత్తర్వులను సవాల్‌ చేస్తూ హైకోర్టులో బీటెక్‌ రవి, సునీత, షర్మిల పిటిషన్లు



సాక్షి, అమరావతి: సీబీఐ కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న మాజీ మంత్రి వైఎస్‌ వివేకానందరెడ్డి హత్య కేసు అంశంపై మాట్లాడవద్దంటూ కడప జిల్లా కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్‌ చేస్తూ టీడీపీ నేత బీటెక్‌ రవి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన వ్యాజ్యాల్లో తదుపరి విచారణ ఈ నెల 3వ తేదీకి వాయిదా పడింది. కోర్టుకు నివేదించబోయే న్యాయపరమైన విషయాలను ఇరుపక్షాలు కూడా పరస్పరం మార్పిడి చేసుకోవాలని అటు పిటిషనర్ల తరఫు న్యాయవాదులకు, ఇటు వైఎస్సార్‌సీపీ తరఫు న్యాయవాదికి హైకోర్టు స్పష్టం చేసింది. ఆ తర్వాత పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్‌ గుహనాథన్‌ నరేందర్, జస్టిస్‌ నూనెపల్లి హరినాథ్‌ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యాజ్యాల విచారణ నుంచి రెండు ధర్మాసనాల న్యాయమూర్తులు తప్పుకోవడంతో.. బుధవారం జస్టిస్‌ నరేందర్‌ నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. పిటిషనర్ల తరఫున సీనియర్‌ న్యాయవాది ఉన్నం మురళీధరరావు, న్యాయవాది గూడపాటి వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. బాధితుడు కాని వ్యక్తి దాఖలు చేసిన వ్యాజ్యానికి విచారణార్హత ఉండదన్నారు. సురేష్‌ తరఫు సీనియర్‌ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి స్పందిస్తూ, తమ వాదనలు వినిపించేందుకు కొంత సమయం ఇవ్వాలని కోర్టును కోరారు. దీంతో తదుపరి విచారణను ఈ నెల 3వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

ఉద్యోగులు, పెన్షనర్లను ప్రభుత్వానికి దూరం చేసే కుట్ర

వారంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారనడం అవాస్తవం

- వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి
- మంత్రివర్గ ఉప సంఘం, జాయింట్‌ స్టాఫ్‌ కౌన్సిల్‌ ఏర్పాటు
- 'అడిషనల్‌ క్వాంటమ్‌ ఆఫ్‌ పెన్షన్‌'కు సానుకూలం
- 12వ పే రివిజన్‌ కమిషన్‌ నియామకం
- ప్రభుత్వ సలహాదారు ఎస్‌.చంద్రశేఖర్‌రెడ్డి



కడప కార్పొరేషన్‌: ఉద్యోగులు, పెన్షనర్లను రాష్ట్ర ప్రభుత్వానికి దూరం చేసే కుట్ర జరుగుతోందని ప్రభుత్వ సలహాదారు, ఏపీ ఎన్జీవో మాజీ అధ్యక్షుడు ఎస్‌.చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఇక్కడి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులు, పెన్షనర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారనడంలో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని, జాయింట్‌ స్టాఫ్‌ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసిందని, ఆ కౌన్సిల్‌ ఏడాదిలో ఏడెనిమిది సార్లు సమావేశమై ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తోందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, జీపీఎఫ్, సరెండర్‌ లీవులు, టీఏ, ఏపీజీఎల్‌ఐ ఇవ్వడంలో కొంత ఆలస్యం జరిగినా, ఎందుకు జరిగిందో ఉద్యోగులకూ తెలుసన్నారు. రెండేళ్లు కోవిడ్‌ వల్ల ప్రపంచం యావత్తు అల్లాడిపోయిందని, రాష్ట్రానికి రూ.76 వేల కోట్ల నష్టం వాటిల్లిందని గుర్తుచేశారు.

10,177 మంది రెగ్యులరైజ్‌

రాష్ట్ర బడ్జెట్‌ లక్షా ఇరవై ఐదు వేల కోట్లుగా ఉంటే అందులో 95 వేల కోట్లు జీతాలకే పోతోందని, మిగిలిన బడ్జెట్‌ సంక్షేమ పథకాలకు వినియోగిస్తున్నారని తెలిపారు. వారం రోజులుగా పీఎఫ్‌ బకాయిలను క్లియర్‌ చేశారని తెలిపారు. కొంతమంది ప్రభుత్వంపై బురదజల్లుతూ రూ.25 వేల కోట్ల బకాయిలున్నాయనడం దారుణమన్నారు. 11వ పీఆర్‌సీ అరియెర్స్‌ మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటినీ క్లియర్‌ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పెన్షన్‌ తగ్గిస్తున్నారని చెప్పడం సరికాదన్నారు. ఐఆర్‌ 23 శాతం ఫిట్‌మెంట్‌ ఇచ్చారని, అడిషనల్‌ క్వాంటమ్‌ ఆఫ్‌ పెన్షన్‌ ఇచ్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 10,177 మందిని రెగ్యులరైజ్‌ చేశారని, వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న 11 వేల మందికి 010 పద్దు కింద జీతాలిచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని తెలిపారు. లక్షా ముప్పై ఐదు వేల మందిని సచివాలయాల్లో నియమించిన సీఎం జగన్‌.. 12వ పే రివిజన్‌ కమిషన్‌ కూడా వేసి జూలై నుంచి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. మే నెలతో పాటు ఒక డీఏ ఇస్తున్నారని, జూన్‌లో మరో డీఏ ఇస్తారని చెప్పారు. సీపీఎస్‌ వల్ల ప్రభుత్వంపై ఎక్కువ భారం పడుతుందనే జీపీఎస్‌ తీసుకొచ్చారని వివరించారు. కీలకమైన విద్య, వైద్యరంగాల్లో ఖాళీలన్నీ భర్తీ చేశారని, ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్‌ కార్పొరేషన్‌ ద్వారా ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలిస్తున్నారని, చిన్న స్థాయి ఉద్యోగులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయనున్నారని చెప్పారు. పాత జిల్లాలతో పాటు కొత్త జిల్లాల్లో పనిచేస్తున్న వారికీ 16 శాతం హెచ్‌ఆర్‌ఏ వర్తింపజేశారన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్‌ కేర్‌ లీవ్‌ రెండు నెలల నుంచి ఆరు నెలలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. ఇన్ని చేసిన జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులు, పెన్షనర్లపై ఉందని చెప్పారు.

వలంటీర్లపై నిత్యం చంద్రబాబు అక్కసు..

2014లో చంద్రబాబు ఉద్యోగులకు ఎన్నో హామీలిచ్చి గాలికొదిలేశారని, తాజాగా ఆయన ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేయాలంటే అదనంగా లక్షా యాభై వేల కోట్లు కావాలన్నారు. ఎన్‌డీఏ కూటమి మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పడం ఆశ్చర్యంగా ఉందని, ఇన్ని ఉద్యోగాలు ఎక్కడి నుంచి ఇస్తారని ప్రశ్నించారు. వలంటీర్లపై నిత్యం అక్కసు వెళ్లగక్కిన చంద్రబాబు.. అధికారంలోకొస్తే రూ.10 వేలు జీతం ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీ సభల్లోనే అధికారులను తిడితే ఎంతో మంది గుండెపోటుకు గురయ్యారని గుర్తుచేశారు. ఇప్పుడూ రెడ్‌ బుక్‌లో నోట్‌ చేస్తున్నాం.. శంకరగిరి మాన్యాలు పట్టిస్తాం.. అంటూ పోలీసులు, ఉద్యోగులను బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. బాబు అధికారంలో ఉన్నప్పుడు ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు ఇవ్వాలని అడిగితే.. అవసరమైతే ప్రతిపక్షంలో కూర్చుంటాను గానీ డీఏలు ఇచ్చేది లేదని మొండికేసిన విషయం ఉద్యోగులు ఇంకా మర్చిపోలేదని చంద్రశేఖర్‌రెడ్డి వివరించారు.

చెక్‌పోస్టులో భారీగా మద్యం పట్టివేత

- పుదుచ్చేరి నుంచి నెల్లూరు వెళ్తుండగా పట్టుకున్న చెక్‌పోస్టు సిబ్బంది
- టీడీపీ నాయకుడి మద్యం ఫ్యాక్టరీ నుంచి వస్తున్నట్టు అనుమానం



చెక్‌పోస్టులో పట్టుబడ్డ మద్యంతో ఎస్‌ఈబీ అధికారులు, సిబ్బంది

తడ (తిరుపతి జిల్లా): ఎన్నికల వేళ భారీ ఎత్తున మద్యం పట్టుబడుతోంది. తాజాగా బీవీపాళెం చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రం వద్ద బుధవారం పెద్ద ఎత్తున మద్యం పట్టుకున్నారు. ఎస్‌ఈబీ అధికారులు తెలిపిన వివరాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పుదుచ్చేరి నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కేరళకు చెందిన మినీ లారీని తనిఖీ చేయగా మద్యం రవాణా బట్టబయలైంది. పట్టుకున్న లారీని బీవీపాళెం సరిహద్దు ఉమ్మడి తనిఖీ కేంద్రంలోని ఎస్‌ఈబీ కార్యాలయానికి తరలించి సరుకు లెక్కించారు. లారీలో మొత్తం 300 కేసుల (14,400 బాటిళ్లు) క్వార్టర్‌ బాటిళ్ల మద్యం ఉన్నట్టు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.7.42 లక్షలుగా ఉంటుందని తెలిపారు. దీంతోపాటు లారీ, కేరళకు చెందిన డ్రైవర్‌ మహ్మద్‌ ఫిరోజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ సరుకు పుదుచ్చేరిలోని బాలాజీ ఎంటర్‌ప్రైజెస్, గ్లోబల్‌ బేవరేజెస్‌ పరిశ్రమ నుంచి వస్తున్న 'ఆల్‌వేస్‌ సూపర్‌ స్ట్రాంగ్‌' పేరుతో ఉన్న బ్రాందీ. దీనిని ఏప్రిల్‌ 30వ తేదీన తయారు చేసినట్టు సీల్‌ ఉంది. ఈ బ్రాండ్‌ నెల్లూరుకు చెందిన ఓ టీడీపీ మద్యం వ్యాపారిదిగా ఎస్‌ఈబీ సిబ్బంది గుర్తించారు.

బ్రాహ్మణ సామాజికవర్గాన్ని చైతన్య పరుస్తాం

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ బ్రాహ్మణుల ప్రచారయాత్ర
- హిందూధర్మ పరిరక్షణ కోసం సీఎం జగన్‌ ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 13న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 175 నియోజకవర్గాల్లో బ్రాహ్మణ సామాజికవర్గాన్ని చైతన్యపరిచే విధంగా బ్రాహ్మణుల సంక్షేమం కోసం సీఎం జగన్‌ చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ప్రచారయాత్ర ప్రారంభిస్తున్నట్లు విజయవాడ సెంట్రల్‌ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చెప్పారు. ఈ యాత్రను పార్టీ నేత ద్రోణంరాజు రవి చేపట్టారన్నారు. ఈ యాత్ర ఈ నెల 11వ తేదీ వరకు సాగుతుందన్నారు. ఆయన బుధవారం విజయవాడలో ప్రచారయాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, ప్రకాశం, కృష్ణా, ఏలూరు, ఉభయ గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సాగుతుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేస్తామన్నారు. రాష్ట్రంలో బ్రాహ్మణ సామాజికవర్గం ఎక్కువ ఉన్న చోట ఈ ప్రచారం నిర్వహిస్తామన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌పై కొందరు పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టే విధంగా యాత్ర సాగుతుందని తెలిపారు. ధూప దీప నైవేద్యాలకు సంబంధించి వైఎస్సార్‌ పూనుకుంటే వంశపారంపర్య అర్చకత్వం వంటి అంశాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు. 1.3 లక్షల మంది బ్రాహ్మణ సామాజిక వర్గీయులకు రూ.780 కోట్లకు పైగా నవరత్నాల ద్వారా ఖర్చుచేసి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి 2024
జైత్రయాత్ర
గురువారం
మే, 2





గుసగుస

మో(నో)దీ



గాజుల బేరం భోజనానికి సరి అన్నట్లుగా మారింది పొత్తు పార్టీల వ్యవహారం. ఉమ్మడి మేనిఫెస్టోను ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆవిష్కరిస్తామని గొప్పలకు పోయిన చంద్రబాబును కనీసం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, తన వదినమ్మ కూడా దేకలేదు. వచ్చిన బీజేపీ ఎన్నికల పరిశీలకుడు కూడా మేనిఫెస్టోను ఛీ కొట్టారు. 2014లో మాదిరి బూటకపు హామీలకు వంతపాడి ప్రజల్లో చులకన కావొద్దనే అచ్చమైన బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్ర పార్టీ పెద్దలకు నివేదించారట. అందుకే తమది జాతీయ మేనిఫెస్టో తప్ప, రాష్ట్రాలకు విడిగా ఉండదంటూ తప్పించుకున్నారు. దీనికి తోడు మోదీ రాష్ట్ర పర్యటనపై కూడా టీడీపీ, జనసేన శ్రేణుల్లో నమ్మకం లేదట. ఇప్పటి వరకు పీఎంవో నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడమే కారణమని తెలిసింది.

ఏం తెలివి?



ఒక్క రోజు బాగోతానికి మూతి మీసాలు గొరుక్కున్నట్లుగా ఉంది జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పరిస్థితి. స్వప్రకటిత మేధావిగా పేరు తెచ్చుకున్న ఆయన తాజాగా పోలవరం ప్రాజెక్టుపై తన ఆలోచనను బయటపెట్టారు. పొత్తుల పెద్దన్న బీజేపీ వల్లే ప్రాజెక్టులో స్తబ్ధత నెలకొందన్న విషయాన్ని మర్చిపోయినట్టున్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ దాదాపు రూ.36 వేల కోట్లను రాష్ట్ర ప్రజలందరి మీదా రుద్దేద్దామని వాక్కుచ్చారు మన మేధావి. తన దత్త తండ్రి చంద్రబాబు అమరావతి సెస్ మాదిరి, ఈయన పోలవరం సెస్ అని పెడతారేమో!? ఈ మహానుభావుడికి ఎవరిస్తున్నార్రా.. ఈ సలహాలు అంటూ అభిమానులు వాపోతున్నారు. తమ హీరో హాయిగా సినిమాలు చేసుకుంటే పోయేదని, ఈ పాటి రాజకీయాలకు తన సినీ కెరీర్‌ను బొంద పెట్టారంటూ తెగ ఫీలైపోతున్నారట.

అయ్యో.. ఆర్ఆర్ఆర్



ఓటమి భయం రఘురామకృష్ణ రాజు(ఆర్ఆర్ఆర్)లో అసహనాన్ని పెంచుతోంది. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి బీ ఫామ్ దక్కించుకున్న శివరామరాజుపై బెదిరింపులకు దిగారట. నామినేషన్ ఉపసంహరణకు అంగీకరించకపోవడంతో నీకెన్ని ఓట్లు ఉంటాయి? మహా అయితే రెండు మూడు వేలు అంతేగా.. దాంతో నువ్వు గెలిచేస్తావా? అంటూ గేలి చేశారట. ప్రచారం చేయడానికే డబ్బుల్లేని నువ్వు.. నాతో పోటీ పడగలవా అంటూ ఎద్దేవా చేశారట. దీంతో ఆత్మాభిమానం దెబ్బతిన్న శివరామరాజు తనను నమ్మి, వెంట నడిచే టీడీపీ క్షేత్రస్థాయి నాయకులతో తాజాగా సమావేశం నిర్వహించారు. ఆర్ఆర్ఆర్‌ను ఓడించి గట్టిగా బుద్ధి చెప్పాలన్న నిర్ణయానికొచ్చారట.

'చింత'తప్పదు

బోడి.. ఆడికే దిక్కులేదు.. పోటీ చేసిన రెండు చోట్లా ఓడిపోయాడు.. ఆడి వల్ల మేం గెలిచామా? అంటూ గత ఎన్నికల్లో గెలుపు తర్వాత జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై తిట్ల వర్షం కురిపించిన చింతమనేని ప్రభాకర్‌కు దెందులూరులో బొమ్మ చూపించేందుకు పవన్ అభిమానులు సిద్ధమయ్యారట. ఇప్పటికీ నియోజకవర్గంలో ఆయన నోటి దురుసు తగ్గలేదు. జనసేనతో తమకు ఒరిగేదేమీ లేదని, అంతగా ఉంటే వారెందుకు అన్ని తక్కువ సీట్లకు పరిమితమవుతారని కూడా చెప్తున్నారట. తాజాగా జనసేన వీరమహిళపైనా మాట తూలారు. ఇవన్నీ చింతమనేనిపై జనసేన అభిమానుల్లో మరింత ఆగ్రహానికి దారితీశాయి. దీంతో పవన్ అభిమానులంతా చింతమనేని ప్రచారానికి దూరంగానే ఉంటున్నారట.



ఇక్కడే దూరం

చంద్రబాబుపై నమ్మకం లేకే ఏపీలో ఉమ్మడి మేనిఫెస్టోకు బీజేపీ నో

మోదీ, కమలం గుర్తు ఫొటోల ముద్రణకూ నిరాకరణ

తమిళనాడులో కమలం గుర్తుతో పీఎంకే మేనిఫెస్టో


తమిళ మానిల కాంగ్రెస్ మేనిఫెస్టో కవర్ పేజీపై ప్రధాని ఫొటో

- ఇప్పటికే జాతీయ స్థాయిలో మేనిఫెస్టో విడుదల చేశారని టీడీపీ కవరింగ్
- ఇది ఉత్తి మాటేనని తేల్చిన తమిళనాడు మేనిఫెస్టో
- 2014లో రాష్ట్రం మేనిఫెస్టోలోనూ మోదీ ఫొటో
- పలు ఎన్నికల్లో రెండు మేనిఫెస్టోలు ఇచ్చిన బీజేపీ
- బాబు గత మోసం తెలిసే ఇలా చేశారని సర్వత్రా చర్చ

సాక్షి, అమరావతి: దేశమంతటా ఎన్డీయే మిత్రపక్షాలుగా కొనసాగుతున్న వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు తమ పార్టీ గుర్తుతో పాటు ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో, బీజేపీ ఎన్నికల గుర్తు అయిన కమలం ఫొటో జత పరిచి ఎన్నికల మేనిఫెస్టోలను విడుదల చేశాయి. అయితే ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు – పవన్‌కల్యాణ్‌లు అమలుకు సాధ్యం కాని ఆల్ ఫ్రీ హామీలు ఇస్తుండడంతో ఉమ్మడి మేనిఫెస్టోతో తమకు సంబంధం లేనట్లు బీజేపీ వ్యవహరించిందని స్పష్టమవుతోంది. అందువల్లే మంగళవారం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఉమ్మడిగా విడుదల చేసిన మేనిఫెస్టోలో మోదీ, కమలం ఫొటోలు చోటుచేసుకోలేదని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనప్పటికీ.. లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో బీజేపీ ఆ రాష్ట్రంలోని పీఎంకే, తమిళ్ మానిల కాంగ్రెస్ పార్టీ వంటి ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకొని పోటీ చేస్తోంది. ఈ నేపథ్యంలో తమిళ మానిల కాంగ్రెస్ పార్టీ ఇటీవల వేరుగా విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో ముఖచిత్రంపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను ముద్రించింది. పీఎంకే కూడా విడిగా మేనిఫెస్టోను

-మిగతా III లో

మోసం... వంచన...



అప్పుడూ, ఇప్పుడూ చంద్రబాబు మేనిఫెస్టో అదే

2014 తరహాలోనే అడ్డగోలు హామీలతో 2024 ఎన్నికల మేనిఫెస్టో

2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన సీఎం జగన్

- → 58 నెలల్లో నవరత్నాల పథకాల ద్వారా పేదల ఖాతాల్లో నేరుగా రూ.2,66,810 కోట్లు జమ
- → సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా నాన్ డీబీటీ రూపంలో మరో రూ.95,001 కోట్లు
- → డీబీటీ, నాన్ డీబీటీ కలిపి రూ.3,61,811 కోట్లు.. ఏటా సగటున రూ.72,362 కోట్లు వ్యయం
- → సీఎం రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చేస్తున్నారంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు అండ్ గ్యాంగ్
- → టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో అమలుకు ఏటా రూ.1.65 లక్షల కోట్లకుపైగా అవసరం
- → అంటే.. ఇప్పటి కంటే ఏటా రూ.92,638 కోట్లకుపైగా అదనంగా అవసరం
- → టీడీపీ మేనిఫెస్టో అమలుకు ఐదేళ్లలో మొత్తంగా రూ.8.25 లక్షల కోట్లకుపైగా అవసరం
- → డీబీటీ, నాన్ డీబీటీ పథకాలకు వ్యయం చేసిన దాని కంటే అదనంగా రూ.4,63,189 కోట్లు అవసరం
- → సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తానంటూ చంద్రబాబు ప్రగల్భాలు
- → పద్నాలుగేళ్ల బాబు పాలనలో ప్రతిఏటా రెవెన్యూ లోటేనని సాక్ష్యాలతో వివరించిన సీఎం జగన్
- → ఉమ్మడి రాష్ట్రంలో హైటెక్ సిటీ పేరుతో మురళీమోహన్ వంటి బినామీలకే సంపద సృష్టించిన చంద్రబాబు
- → 2014-19 మధ్య అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా బినామీలకు భూ సంపద సృష్టించిన వైనం
- → ఇప్పుడు అమరావతి నిర్మాణానికి ఖజానా నుంచి ఖర్చు పెట్టి బినామీలకు సంపద సృష్టించేలా ఎత్తుగడ
- → 2014 ఎన్నికల తరహాలోనే ఇప్పుడూ ప్రజలను మోసం చేస్తున్నారని మేనిఫెస్టోను ముట్టుకోని బీజేపీ
- → పథకాల అమలుకు నిధులు ఎలా తెస్తారో వివరణ ఇవ్వాలంటున్న రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు
- → వివరణ ఇవ్వకపోతే తాను మోసం చేస్తున్నట్లు చంద్రబాబు అంగీకరించినట్లేనని స్పష్టీకరణ

-వివరాలు III లో

అప్పుడు అమెరికా అవుతుందా?

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా.. అవసరమైన మేరకు తక్కువగా అప్పులు చేస్తూ.. ప్రజలపై తక్కువగా పన్నుల భారం మోపుతూ.. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ.. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా సీఎం జగన్ పేదల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుంటే రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చేస్తున్నారంటూ చంద్రబాబు, ఎల్లో మీడియా గగ్గోలు పెట్టాయి. ఒకవేళ చంద్రబాబు అధికారంలోకి వచ్చి.. టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలకు ఐదేళ్లలో రూ.8.25 లక్షల కోట్లు ఖర్చు చేస్తే రాష్ట్రం అమెరికా అవుతుందా? అని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

నిధులు ఎలా తెస్తారో చెప్పండి

టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాల అమలుకు ఏటా రూ.1.65 లక్షల కోట్లు అవసరం. ప్రస్తుతం సీఎం జగన్ డీబీటీ, నాన్ డీబీటీ పథకాలకు చేస్తున్న వ్యయం కంటే రూ.92,638 కోట్లు అదనంగా అవసరం. ఈ లెక్కన ఐదేళ్లలో ఆ పథకాల అమలుకు అదనంగా రూ.4,63,189 కోట్లు అవసరం. ఆ నిధులను ఎలా తెస్తారో చంద్రబాబు స్పష్టం చేయాలని ఆర్థిక నిపుణులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే.. 2014 ఎన్నికల తరహాలోనే ఇప్పుడూ ప్రజలను మోసం చేస్తున్నానని చంద్రబాబు అంగీకరించినట్లేనని స్పష్టం చేస్తున్నారు.

నెర్రెలు విచ్చిన నేల తొలకరి చినుకు పడగానే పులకరిస్తుంది. పైరు పచ్చలను తన ఒడిలో మొలకలెత్తిస్తుంది. సస్య సిరులను కురిపిస్తుంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న నీటి సవ్వళ్లు సీఎం జగన్ ప్రభుత్వంలోనే వంశధార ఎత్తిపోతల పథకం రూపంలో మడిమడికీ వడివడిగా పరుగులెత్తి పచ్చని పైర్లకు ఊపిరిపోయబోతున్నాయి. ఆ పైరు వందో, రెండొందల ఎకరాలకో కాదు... అక్షరాలా 2.5 లక్షల ఎకరాలు. శ్రీకాకుళం జిల్లా ప్రజల చిరకాల వాంఛ వంశధార నెరవేరబోతోంది. వృథాగా పోతున్న వంశధార నీరు ఎన్నో వేల ఎకరాలను సస్యశ్యామలం చేయనుంది. పక్క రాష్ట్రం సృష్టించిన అవరోధాలను అధిగమించి... ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని సరికొత్తగా ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. తుదకు ఎత్తిపోతలతో జిల్లా రైతుల కల నెరవేరబోతోంది. చురుగ్గా సాగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఇక్కడి కర్షకుల భవిష్యత్తును బంగారుమయం చేయబోతున్నాయి.

మరిన్ని పేజీల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి



నెర్రెలిచ్చిన నిరాశపై ఆశల తొలకరి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వంశధార ప్రాజెక్టు ద్వారా ఖరీఫ్, రబీ సీజన్‌లో రెండు పంటలకు నీరందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులు ఊపందుకుంటున్నాయి. వచ్చే రబీ కల్లా పనులు పూర్తి చేసి... రైతన్నలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళిక రూపొందింది. పనులు వడివడిగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. 2.50 లక్షల ఎకరాలకు, ముఖ్యంగా శివారు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించేందుకు ఉద్దేశించిన వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయితే జిల్లా మొత్తం సస్యశ్యామలం కానుంది.

వంశధార పూర్తవ్వడంపై రైతుల్లో ఆనందం

- వడివడిగా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు
- రెండు సీజన్‌లు..రెండు పంటలకు మార్గం సుగమం
- రూ.176.35 కోట్ల వ్యయంతో స్కీమ్ రూపకల్పన
- 2.50 లక్షల ఎకరాలు సస్యశ్యామలం
- గొట్టా బ్యారేజీ ఎగువ కోరాడ వద్ద పనులు
- రబీ కల్లా ప్రాజెక్టు పూర్తి చేసేలా అడుగులు
- నెరవేరనున్న శ్రీకాకుళం జిల్లా రైతుల కల



ఒడిశా అవరోధాలను అధిగమించి..

వంశధార ప్రాజెక్టు ఫేజ్–2లోని స్టేజ్ 2 పనుల కోసం ఇప్పటికే రూ.2,069 కోట్ల మేర ఖర్చు చేశారు. దాదాపు 92 శాతం పనులు పూర్తయ్యాయి. ఒడిశా అభ్యంతరాల కారణంగా కీలకమైన నేరడి బ్యారేజీకు లైన్ క్లియర్ కాకపోవడంతో చేసిన ఖర్చుకు సార్ధకత లేకపోయింది. హిరమండలం జలాశయం నిండితేనే జనాశయం నెరవేరుతుంది. అంత పెద్ద జలాశయం నిండాలంటే ఎగువన నేరడి వద్ద బ్యారేజీ నిర్మాణం తప్పనిసరి. ఒడిశా రాష్ట్రం సృష్టించిన అడ్డంకుల కారణంగా బ్యారేజీకి అడుగులు పడలేదు. అందువల్లే వేల కోట్లు ఖర్చు పెట్టినప్పటికీ వంశధార ప్రాజెక్టు లక్ష్యం నెరవేరలేదు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ ప్రభుత్వం వినూత్నంగా ఆలోచించింది. ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించింది. గొట్టా బ్యారేజీ వద్ద నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్‌కు పంపిస్తే వరద నీరు సముద్రం పాలుకాకుండా సంరక్షించవచ్చని భావించింది. దీనికోసం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (ఎత్తిపోతల పథకం) నిర్మిస్తే సరిపోతుందని నిర్ణయం తీసుకుంది. వెంటనే రూ.176.35 కోట్లు మంజూరు చేసింది. పారదర్శకంగా టెండర్లు పిలిచింది. అందరిలో తక్కువకు కోట్ చేసిన కంపెనీకి టెండర్లు ఖరారు చేసింది. ఆ ప్రాజెక్టు పనులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది.

లిఫ్ట్‌తో పరిష్కారం..

జిల్లాలో అత్యధిక ఆయకట్టులో రెండు పంటలు పండాలంటే మండు వేసవిలోనూ వంశధార కాలువ నిండుగా ప్రవహించాలి. హిరమండలంలోని వంశధార రిజర్వాయర్‌కు 19.5 టీఎంసీల నీరు వచ్చి చేరాలి. ఇప్పుడా అవకాశం లేదు. ఖరీఫ్‌లోనే పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందడం లేదు. రబీ విషయమైతే చెప్పనక్కర్లేదు. 19.5 టీఎంసీల నీటిని తీసుకొస్తే మూడు పంటల కల సాకారమవుతుంది. ప్రస్తుతం హిరమండలం రిజర్వాయర్‌లో డెడ్ స్టోరేజ్ కింద 2.5 టీఎంసీల నీరు ఉంటుంది. ఫ్లడ్‌ఫ్లో కెనాల్, కొండ చరియల నుంచి వచ్చే నీరు మరో 4 టీఎంసీలు ఉంటుంది. మిగిలింది నింపాలంటే ఒకటి నేరడి బ్యారేజీ నిర్మాణం పూర్తి చేసి నదిలో నీటిని మళ్లించడం, లేదంటే గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేయడమే మార్గం. నేరడి బ్యారేజీ నిర్మాణానికి అడ్డంకులు ఏర్పడటంతో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ తప్పనిసరి అని భావించింది. ఆ ఆలోచనతో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేసింది.

ప్రతిపాదించిన పనులు..

- ➤ గొట్టా బ్యారేజీ ఎగువన కోరాడ రెవెన్యూ గ్రామం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి సుమారు 100 రోజుల కాలంలో 16 గంటల పాటు పంపింగ్‌తో 2.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న హిరమండలం రిజర్వాయర్‌కు 12 టీఎంసీలకు పైగా నీటిని లిఫ్ట్ చేయనున్నారు. దీనివల్ల ఖరీఫ్, రబీలో మొత్తం ఆయకట్టుకు

-మిగతా III లో

గోల్డ్ స్పాట్ కుటుంబం గోల్‌మాల్ 'గీతం'



భూ దాహం.. భరతుడి వ్యామోహం!

తాత బాటలో భూ కబ్జాలు...

తండ్రి బాటలో బ్యాంకు రుణాల డిఫాల్టర్

రూ.124 కోట్లు ఎగ్గొట్టే యత్నం...

గీతం వర్సిటీ పేరుతో రూ.500 కోట్ల భూ ఆక్రమణలు

చంద్రబాబు హయాంలో రూ.2 వేల కోట్ల భూమిని కారుచౌకగా దోపిడీ

గత ఎన్నికల్లో భరత్‌కు బుద్ధి చెప్పిన విశాఖ

మళ్లీ టీడీపీ ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి...

ఎక్కడైనా కుటుంబంలో ఒకరో ఇద్దరో తేడాగా ఉంటారు..వీళ్లేంటిరా...కుటుంబం మొత్తం తేడాయేనా...అని సందేహం వ్యక్తపరుస్తాడు ఓ సినిమాలో హాస్యనటుడు...అలాంటి పోలికను విశాఖలోనూ చూడొచ్చు...తాత భూ కబ్జాదారు..తండ్రి బ్యాంకు డిఫాల్టర్...మనవడు..వీరి అక్రమాల వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నాడు...తాత ఎంవీవీఎస్ మూర్తి ఉరఫ్ గోల్డ్‌స్పాట్ మూర్తి, గీతం వ్యవస్థాపకుడు. తండ్రి పట్టాభిరామారావు రుణాల ఎగవేతదారు..పిల్లనిచ్చిన మామ బాలకృష్ణ...సినీ నటుడు..ఆడవాళ్ల గురించి అసభ్య నిర్వచనం ఇచ్చే ప్రవచనకర్త.. వీరి వారసుడు భరత్ గీతం యూనివర్సిటీ ప్రస్తుత అధ్యక్షుడు, టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి భరత్.. వెరసి అక్రమాల్లో గుగ్గురువు చంద్రబాబు బంధుగణంలోని ముఖ్యుడు....భరత్ కబ్జాకు నాటి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబూ తనవంతు సహకారం అందించారు...ఇదంతా చూసిన తర్వాత...కబ్జాలు చేయడం, బ్యాంకు రుణాలు ఎగ్గొట్టడమే ఎన్నికల్లో పోటీకి అర్హతగా నేటి రాజకీయాలు మారిపోయాయని విశాఖ వాసులు నవ్వి పోతున్నారు...విద్య వినయం, సౌశీల్యం నేర్పుతుందంటారు.. ఈ భరతుడికి మాత్రం తాత, తండ్రి అక్రమాల వారసత్వాన్ని నేర్పింది...ప్రభుత్వ భూమినే వరకట్న కానుకగా పొందిన ఈ కబ్జాదారుకు గత ఎన్నికలు ఓటమి గుణపాఠం నేర్పినా...ఆ పాఠాన్ని మరిచి మళ్లీ విశాఖ బరిలో టీడీపీ ఎంపీ అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్నారు...

-పూర్తి వివరాలు VI లో

బారామతి నుంచి మెయిన్‌పురి దాకా...

హోరాహోరీ

లోక్‌సభ ఎన్నికల సుదీర్ఘ ఘట్టంలో మే 7న మూడో విడత పోలింగ్‌కు రంగం సిద్ధమవుతోంది. ఈ విడతలో రాజకీయ ఉద్ధండులతో పాటు కొత్త ముఖాలూ బరిలో ఉన్నారు. కొల్హాపూర్‌లో ఛత్రపతి శివాజీ వారసునికి బీజేపీ టికెటిచ్చింది. శివమొగ్గలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ భార్య బరిలోకి ఉన్నారు. మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ లోక్‌సభ టికెట్ తీసుకున్నారు. మెయిన్‌పురిలో డింపుల్ భాభీ మరోసారి మేజిక్ చేసేందుకు సిద్ధమంటున్నారు. ఇలా మూడో దశ బరిలో ఆసక్తి రేపుతున్న కీలక స్థానాలపై ఫోకస్...



బారామతి వదినా మరదళ్ల వార్!

దేశమంతటా ఆసక్తి రేపుతున్న నియోజకవర్గమిది. మరాఠా రాజకీయ యోధుడు శరద్ పవార్ ముద్దుల తనయ సుప్రియా సులేపై వదిన సునేత్రా పవార్ పోటీకి సై అంటున్నారు. బాబాయి శరద్ పవార్‌పై తిరుగుబావుటా ఎగరేసి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని దక్కించుకున్న అజిత్ పవార్ తన చెల్లెలిపై ఏకంగా భార్యనే రంగంలోకి దించారు. సుప్రియ ఇక్కడ సిట్టింగ్ ఎంపీ. ఎన్సీపీ (శరద్) వర్గానికి సారథ్యం వహిస్తున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ నేత కంచన్ రాహుల్ కూల్‌పై 1,55,774 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈసారి వదినా మరదళ్ల మధ్య హై ఓల్టేజ్ పోటీ నెలకొంది. సునేత్రకు బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్)లతో కూడిన మహాయుతి కూటమి బలమైన దన్నుంది. ఇక సుప్రియ కాంగ్రెస్, శివసేన (ఠాక్రే) ఎన్సీపీ (పవార్)తో కూడిన మహా వికాస్ అగాడీ తరఫున వదినకు సవాలు విసురుతున్నారు. బీఎస్పీ నుంచి ప్రియదర్శని కోక్రే కూడా రేసులో ఉన్నారు.

విదిశ మామాజీ ఈజ్ బ్యాక్

మధ్యప్రదేశ్‌కు 20 ఏళ్లకు పైగా సీఎం. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి బంపర్ మెజారిటీ సాధించి పెట్టారు. ఇంతటి రికార్డున్నా శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మళ్లీ సీఎంగా చాన్స్ రాలేదు. అయితే బీజేపీ అనూహ్యంగా ఆయనను విదిశ నుంచి లోక్‌సభ బరిలో దింపింది. ''శివరాజ్‌ను ఢిల్లీకి తీసుకెళ్తా. కేంద్ర ప్రభుత్వంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారు' అన్న మోదీ ప్రకటనతో విదిశ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. మామాజీగా ప్రసిద్ధుడైన శివరాజ్ ఇక్కడ 1991 నుంచి 2004 దాకా వరుసగా ఐదుసార్లు ఎంపీగా గెలవడం విశేషం. బీజేపీ దిగ్గజాలు వాజ్‌పేయి ఒకసారి, సుష్మా స్వరాజ్ రెండుసార్లు ఇక్కడ విజయం సాధించారు. ఈ బీజేపీ కంచుకోటలో కాంగ్రెస్ నుంచి ప్రతాప్ భాను శర్మ బరిలో ఉన్నారు. ఆయన కూడా 1980, 1984లో ఇక్కడ రెండుసార్లు గెలిచారు. ఏకంగా 40 ఏళ్ల తర్వాత మళ్లీ బరిలో దిగుతున్నారు!

ఆగ్రా త్రిముఖ పోరు

యూపీకి దళిత రాజధానిగా పేరొందిన ఆగ్రాలో ముక్కోణపు పోరు నెలకొంది. సిట్టింగ్ బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్‌పై బీఎస్పీ నుంచి పూజా అమ్రోహి, సమాజ్‌వాదీ నుంచి సురేశ్ చంద్ర కర్దామ్ బరిలో ఉన్నారు. మోదీ–యోగీ ఫ్యాక్టర్, అయోధ్య రామమందిరం, సంక్షేమ పథకాలనే బఘేల్ నమ్ముకున్నారు. వైశ్యులు, బ్రాహ్మణులు, పంజాబీలు, యాదవేతర ఓబీసీలతో పాటు దళితుల్లో ఒక వర్గం కమలానికి మద్దతిస్తుండటం ఆయనకు కలిసి రానుంది. దళితుల ఓటు బ్యాంకుపై పూజ, జాతవ్‌లు, ముస్లిం ఓట్లపై కర్దామ్ ఆశలు పెట్టుకున్నారు. ఇక్కడి 20.57 లక్షల ఓట్లలో 30 శాతం దళితులే. వారిలోనూ మూడొంతుల మంది జాతవ్ దళితులు! బీఎస్పీ, ఎస్పీ అభ్యర్థులిద్దరిదీ ఇదే సామాజికవర్గం. ప్రత్యర్థుల నాన్ లోకల్ విమర్శలను పూజ దీటుగా తిప్పికొడుతున్నారు. ఈ స్థానం ఒకప్పటి కాంగ్రెస్ కంచుకోట. రామమందిర ఉద్యమంతో 1990 నుంచి బీజేపీ గుప్పిట్లోకి చేరింది. మధ్యలో రెండుసార్లు మాత్రం ఎస్పీ నుంచి బాలీవుడ్ నటుడు రాజ్ బబ్బర్ గెలిచారు.

శివమొగ్గ బీజేపీకి పక్కలో బల్లెం

కర్ణాటక దిగ్గజ నేత బీఎస్ యడ్యూరప్ప కుమారుడు బీవై రాఘవేంద్ర మరోసారి శివమొగ్గలో బరిలో నిలిచారు. కన్నడ సూపర్‌స్టార్ శివ రాజ్‌కుమార్ భార్య గీతకు కాంగ్రెస్ టికెటివ్వడంతో రాజకీయం వేడెక్కింది. పైగా బీజేపీతో 50 ఏళ్లకు పైగా అనుబంధమున్న అగ్ర నేత కేఎస్ ఈశ్వరప్ప స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి రాఘవేంద్రకు పక్కలో బల్లెంలా మారారు. ఈ ముక్కోణపు పోటీ అందరినీ ఆకర్షిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్న ఈశ్వరప్ప తన కుమారుడు కంతేశ్‌కు ఎంపీ టికెట్ కోసం విఫలయత్నం చేశారు. యడ్యూరప్పతో మొదట్నుంచీ ఉప్పు నిప్పుగా ఉన్న ఈశ్వరప్పకు ఈ పరిణామం తీవ్ర ఆగ్రహం కలిగించింది. రాష్ట్ర బీజేపీ చీఫ్, యడ్యూరప్ప కుమారుడు విజయేంద్రపై తీవ్ర విమర్శలకు దిగి పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. తాను మోదీకి వీర విధేయుడినంటూ ఆయన బొమ్మతోనే ఈశ్వరప్ప జోరుగా ప్రచారం చేస్తుండటంతో బీజేపీ నేతలు తలపట్టుకుంటున్నారు!

కొల్హాపూర్ బరిలో ఛత్రపతి

ఛత్రపతి శివాజీ వంశీయుడిని కాంగ్రెస్ బరిలోకి దించడంతో కొల్హాపూర్‌లో పోటీ కాక పుట్టిస్తోంది. శివసేన సిట్టింగ్ ఎంపీ సంజయ్ మాండ్లిక్ ఈసారి శివసేన (షిండే) నేతగా మహాయుతి కూటమి తరఫున మళ్లీ బరిలో ఉన్నారు. దాంతో కాంగ్రెస్, శివసేన (ఠాక్రే) ఎన్సీపీ (శరద్)లతో కూడిన మహా వికాస్ అగాడీ వ్యూహాత్మకంగా ఛత్రపతి రాజర్షి సాహు మహారాజ్‌కు టికెటిచ్చింది. ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. అయితే ఆయన శివాజీకి నిజమైన వారసుడు కాదన్న మాండ్లిక్ వ్యాఖ్యలతో అగ్గి రాజుకుంది. వీటిపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో అధికార కూటమి వెనక్కు తగ్గింది. 'గాడీ (సింహాసనం)ని గౌరవించండి. కానీ ఓటు మాత్రం మోదీకే వేయండి' అంటూ కొత్త తరహా ప్రచారం మొదలుపెట్టింది. రెండు కూటముల మధ్య ఇక్కడ టఫ్ ఫైట్ జరుగుతోంది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, ఎన్సీపీలకు గట్టి పట్టుండటం సాహు మహారాజ్‌కు కలిసొచ్చే అంశం.

మెయిన్‌పురి భాభీ సవాల్

ఈ స్థానం ఎస్పీ దిగ్గజం దివంగత ములాయం సింగ్ యాదవ్ కంచుకోట. ములాయం మరణానంతరం 2022లో ఉప ఎన్నికలో ఆయన కోడలు, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ సత్తా చాటారు. 2.88 లక్షల ఓట్ల మెజారిటీతో బీజేపీ అభ్యర్థి రఘురాజ్ సింగ్ శాక్యను ఓడించారు. ఈసారి మళ్లీ బీజేపీకి సవాలు విసురుతున్నారు. బీజేపీ నుంచి యూపీ పర్యాటక మంత్రి జైవీర్ సింగ్ ఠాకూర్ బరిలో ఉన్నారు. ఫిరోజాబాద్‌కు చెందిన ఠాకూర్ బలమైన నాయకుడు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచారు. బీఎస్పీ కూడా శివ ప్రసాద్ యాదవ్ రూపంలో బలమైన అభ్యర్థిని రంగంలోకి దించడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. బీఎస్పీ నుంచి మధ్యలో బీజేపీలోకి వెళ్లిన శివప్రసాద్ అనంతరం సొంత పార్టీ కూడా పెట్టి చివరికి బీఎస్పీ గూటికే చేరారు. ఇక్కడ మోదీ–యోగి ఫ్యాక్టర్, అభివృద్ధి నినాదంతో సమాజ్‌వాదీకి ఎలాగైనా చెక్ పెట్టేందుకు కమలనాథులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ డింపుల్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఓటేస్తే డైమండ్ రింగ్

భోపాల్‌లో ఓటర్లకు కానుకలు



లక్కీ డ్రాలో బహుమతులు గెలుచుకోవచ్చంటే సామాన్యుల కాలు కదలకుండా ఉంటుందా..? మధ్యప్రదేశ్‌లోని భోపాల్ లోక్‌సభ స్థానంలో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు ఇలాంటి ఆఫరే ఇస్తున్నారు. మూడో దశలో భాగంగా ఈ నెల 7న భోపాల్‌లో పోలింగ్ జరుగుతోంది. ఆ రోజున ఓటేసే వారి పేర్లనుంచి ప్రతి మూడు గంటలకు ఒకసారి లక్కీ డ్రా తీయనున్నారు. విజేతలకు వజ్రపు ఉంగరాలు, రిఫ్రిజిరేటర్లు, టీవీలు తదితర కానుకలిస్తారట! ''నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఉదయం 10, మధ్యాహ్నం 3, సాయంత్రం 6 గంటలకు లక్కీ డ్రా తీసి విజేతలకు బహుమతులిస్తాం. పోలింగ్ మర్నాడు మెగా డ్రా తీసి విజేతలకు మరింత పెద్ద బహుమతులిస్తాం''అని జిల్లా ఎన్నికల అధికారి కౌసలేంద్ర విక్రమ్ సింగ్ ప్రకటించారు.

ఓటింగ్ పెంచేందుకే..

మధ్యప్రదేశ్‌లో ఇప్పటిదాకా జరిగిన రెండు దశల్లో పోలింగ్ 2019తో పోలిస్తే సగటున 8.5 శాతం తగ్గింది. 2019లో భోపాల్‌లో 65.7 శాతం ఓటింగ్ నమోదైంది. ఈసారి ఎండలు విపరీతంగా ఉన్నందున ఓటర్లు పెద్దగా ఇల్లు కదలకపోవచ్చన్న ఆందోళనలున్నాయి. దీంతో ఎలాగైనా ఓటింగ్‌ను పెంచాలని ఈసీ కృత నిశ్చయంతో ఉంది. భోపాల్ నియోజకవర్గంలో 3,097 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి బూత్ వద్ద ఒక బీఎల్‌వో, వలంటీర్‌ను లక్కీ డ్రా కోసం నియమించారు. ఓటేశాక అక్కడి కూపన్ బుక్‌లెట్‌లో పేరు, మొబైల్ నంబర్ రాసి రసీదు తీసుకోవాలి. బహుమతుల ఖర్చును కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కంపెనీలు భరిస్తున్నాయి. మెగా డ్రా కోసం డైమండ్ ఉంగరాలు, ల్యాప్‌టాప్‌లు, ఫ్రిజ్‌లు ఎనిమిది డిన్నర్ సెట్లు, రెండు మొబైల్ ఫోన్లు రెడీగా ఉన్నాయి. దీంతోపాటు ప్రతి పోలింగ్ కేంద్రంలో తొలి ఓటర్‌ను గౌరవించేందుకు ప్రత్యేకంగా ఏదైనా చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు!

- సాక్షి, నేషనల్ డెస్క్



సీట్లు రెండే... పోటీ సయ్యారే!

గోవాలో కాంగ్రెస్, బీజేపీ అమీతుమీ



ఈవీఎంలపై అనుమానాలు రేకెత్తించిన కాంగ్రెస్‌కు సుప్రీంకోర్టు తాజా తీర్పు చెంపపెట్టు. ప్రజలకు ఆ పార్టీ క్షమాపణ చెప్పాలి. అభివృద్ధికి పెద్దపీట వేసి, ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్న ఎన్డీఏ కూటమి ఒక వైపు... అవినీతి, వారసత్వ రాజకీయాలు, సొంత ప్రయోజనాలే పరమావధిగా ఉన్న ఇండియా కూటమి మరోవైపున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలను గోవా సంతృప్త స్థాయిలో అమలు చేస్తోంది. నిజమైన సెక్యులరిజం, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలుస్తోంది.

- గోవా ఎన్నికల సభలో ప్రధాని మోదీ



అధికారంలోకి వస్తే గోవాలో మైనింగ్ కార్యకలాపాలను మూడు నెలల్లో ప్రారంభిస్తామని 2014లో మోదీ హామీ ఇచ్చారు. దాన్ని నెరవేర్చనందుకు గోవా ప్రజలకు క్షమాపణ చెప్పాలి. నదుల అనుసంధానం పేరుతో మా నదులపై కేంద్రం పెత్తనం చేస్తోంది. వాటి పేర్లు మార్చేస్తోంది. గోవా గుర్తింపు, సంస్కృతిని నాశనం చేస్తోంది.

- ఎన్నికల ర్యాలీలో గోవా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అమిత్ పాట్కర్

సాగర తీర పర్యాటకానికి ప్రపంచవ్యాప్తంగా పేరొందిన గోవాలో రాజకీయాలు అనిశ్చితిమయం. నేతల పార్టీ ఫిరాయింపులు ఇక్కడ పరిపాటి. దేశానికి 1947లోనే స్వాతంత్ర్యం వచ్చినా గోవా మాత్రం 1961 దాకా పోర్చుగీసు పాలనలో ఉంది. కేంద్రపాలిత ప్రాంతంగా కొనసాగి 1987లో రాష్ట్ర హోదా పొందింది. దేశంలోనే అతి చిన్న రాష్ట్రమైనా కొత్త కూటములు, కొత్త పార్టీలు, పదేపదే సీఎంల మార్పుకు మారుపేరుగా మారింది. కొందరు రెండు మూడు విడతలు పాలించగా, మరి కొందరు నెల రోజులు కూడా సీఎంగా కొనసాగలేదు. ఇక్కడ పోరు జాతీయ పార్టీల చుట్టూనే తిరుగుతున్నా ప్రాంతీయ పార్టీలూ చక్రం తిప్పుతున్నాయి...

సర్వేలు ఏమంటున్నాయి...

గత ఎన్నికల్లో మాదిరిగానే ఈసారి కూడా కాంగ్రెస్, బీజేపీ చెరో సీటు గెలుచుకోవచ్చని మెజారిటీ సర్వేలు అంచనా వేస్తున్నాయి.

గోవాలో రెండు లోక్‌సభ సీట్లే ఉన్నా ఈ రాష్ట్రాన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గతంలో కాంగ్రెస్‌కు బాగా పట్టున్న ఈ రాష్ట్రంలో ఇప్పుడు బీజేపీ ఆధిపత్యం నడుస్తోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాషాయదళం ఇక్కడి రెండు సీట్లనూ దక్కించుకుని సత్తా చాటింది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అతి పెద్ద పార్టీగా నిలిచినా బీజేపీ నాటకీయంగా అధికారం దక్కించుకుంది. మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ (ఎంజీపీ), కొత్తగా పుట్టుకొచ్చిన గోవా ఫార్వర్డ్ పార్టీ (జీఎఫ్‌పీ), కాంగ్రెస్ నుంచి జంప్ చేసిన ఎమ్మెల్యే మద్దతుతో మనోహర్ పారికర్ సీఎంగా పగ్గాలు చేపట్టారు. 2019లో పారికర్ మరణానంతరం ప్రమోద్ సావంత్ సీఎం అయ్యారు. తర్వాత కూడా బీజేపీలోకి కాంగ్రెస్ ఎమ్మెల్యేల వలస కొనసాగింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ చెరో సీటు దక్కించుకున్నాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన బీజేపీ ప్రాంతీయ పార్టీలతో కలిసి అధికారాన్ని నిలబెట్టుకుంది. కాంగ్రెస్‌లో ముసలం పుట్టి 11 మంది ఎమ్మెల్యేల్లో ఆరుగురు బీజేపీలోకి జంప్ చేశారు. ఉత్తర గోవా లోక్‌సభ స్థానం బీజేపీకి, దక్షిణ గోవా కాంగ్రెస్‌కు కంచుకోటలుగా మారాయి.



లోకల్ ఎఫెక్ట్

'ఇండియా' కూటమి దన్నుతో కాంగ్రెస్ బరిలోకి దిగింది. రెండు సీట్లలోనూ పోటీ చేస్తోంది. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత, నిరుద్యోగం, ధరల పెరుగుదల తదితరాలను ప్రచారాస్త్రాలుగా సంధిస్తోంది. బీజేపీ మోదీ, అభివృద్ధి, అయోధ్య రామ మందిరం, హిందుత్వ నినాదాలతో బరిలోకి దిగుతోంది. సౌత్ గోవాలో బీజేపీ నుంచి పల్లవి డెంపో, కాంగ్రెస్ నుంచి మాజీ నేవీ అధికారి విరియాటో ఫెర్నాండెజ్ పోటీ చేస్తున్నారు. ఉత్తర గోవాలో సిట్టింగ్ ఎంపీ, కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్ బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. కాంగ్రెస్ తరఫున రమాకాంత్ ఖలప్ తలపడుతున్నారు. ఇండియా కూటమి భాగస్వామి గోవా ఫార్వర్డ్ పార్టీ కాంగ్రెస్‌కు దన్నుగా ఉంది. ఎంజీపీ వంటి పార్టీలు కాంగ్రెస్, బీజేపీల్లో ఎవరి అవకాశాలకు గండి కొడతాయనేది ఆసక్తికరంగా మారింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సంపన్న పల్లవి

రాజకీయ వంట కుదిరేనా!

పల్లవి శ్రీనివాస్ డెంపో. దక్షిణ గోవా నుంచి బీజేపీ టికెట్‌పై లోక్‌సభ బరిలో ఉన్నారు. గోవాలో బీజేపీ తరఫున లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగిన తొలి మహిళగా నిలిచారు. అఫిడవిట్లో పల్లవి ప్రకటించిన ఆస్తులు చూసి అంతా నోరెళ్లబెట్టారు. భర్తతో కలిపి ఏకంగా రూ.1,361 కోట్ల ఆస్తులు వెల్లడించారు. మూడో దశలో రేసులో మొత్తం 1352 మంది అభ్యర్థుల్లో అత్యంత సంపన్నురాలిగా నిలిచారు. గోవా ఎన్నికల చరిత్రలో అత్యంత సంపన్న వ్యక్తి పల్లవే. ఏ రాజకీయానుభవం లేని కుటుంబానికి చెందిన ఆమెను ఎంపిక చేసుకోవడానికి ఆమె దాతృత్వ నేపథ్యమే కారణం కావచ్చంటున్నారు...



దాతృత్వం నుంచి రాజకీయాలకు

49 ఏళ్ల పల్లవి స్వస్థలం గోవాలోని మార్గావ్. టింబ్లో కుటుంబంలో జన్మించారు. రసాయన శాస్త్రంలో డిగ్రీ, పుణెలోని ఎంఐటీ నుంచి ఎంబీఏలో పీజీ చేశారు. 1997లో డెంపో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ శ్రీనివాస్ డెంపోను పెళ్లాడారు. వారి కుటుంబం ఎప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లో లేదు. డెంపో గ్రూప్ మైనింగ్ వ్యాపారంతో మొదలుపెట్టి ఫుడ్ ప్రాసెసింగ్, షిప్ బిల్డింగ్, న్యూస్ పేపర్ పబ్లిషింగ్, పెట్రోలియం, కోక్, రియల్ ఎస్టేట్ తదితరాలకు విస్తరించింది. పల్లవి ప్రస్తుతం డెంపో ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మీడియా, రియల్ ఎస్టేట్ విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. డెంపో చారిటీస్ ట్రస్టీగా దశాబ్దాలుగా సేవా కార్యక్రమాల్లో ఉన్నారు. ప్రత్యేకించి గోవాలో బాలికల విద్యను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. కొత్త ప్రదేశాలను చూడటం, కొత్త వంటకాలను ప్రయత్నించడం తన అభిరుచి అంటారామె. ఇప్పుడు రాజకీయాల్లోకి దిగి మరో ప్రయోగం చేయబోతున్నారు.

ఎన్నికల బాండ్ల రగడ...

2022 జనవరిలో గోవాలో అసెంబ్లీ ఎన్నికలకు కేవలం నెల ముందు పల్లవి భర్త శ్రీనివాస్ వ్యక్తిగతంగా రూ.1.25 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసినట్లు వెల్లడవడం కలకలం రేపింది. ఇక గోవా కార్బన్ లిమిటెడ్, దేవశ్రీ నిర్మాణ్ ఎల్ఎల్‌పి, నవ్‌హింద్ పేపర్స్ అండ్ పబ్లికేషన్స్‌తో సహా డెంపో, గ్రూప్ అనుబంధ సంస్థలు 2019 నుంచి 2024 మధ్య రూ.1.1 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేశాయి. ఇవన్నీ బీజేపీ ఖాతాలోకే వెళ్లాయి.

బీజేపీ సిద్ధాంతాలు నమ్మి...

దక్షిణ గోవా కాంగ్రెస్ కంచుకోట. 2019లో ఈ స్థానాన్ని బీజేపీ కేవలం 9 వేల పై చిలుకు ఓట్ల తేడాతో చేజార్చుకుంది. ఈ సారి ఎలాగైనా ఇక్కడ నెగ్గి తీరాలని పట్టుదలగా ఉంది. క్యాథలిక్ క్రిస్టియన్ల ఓట్లపై పల్లవి ప్రధానంగా దృష్టి పెట్టారు. కాంగ్రెస్ కూడా నాలుగు సార్లు గెలిచిన సిట్టింగ్ ఎంపీ ఫ్రాన్సిస్కో సార్దినాను అనూహ్యంగా పక్కనబెట్టి మాజీ నేవీ అధికారి కెప్టెన్ విరియాటో ఫెర్నాండెజ్‌ను బరిలోకి దించింది. అయితే ఏకంగా 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీలోకి జంప్ చేయడం వంటివన్నీ ఆ పార్టీకి కలిసొచ్చేలా ఉన్నాయి. ఆప్, గోవా ఫార్వర్డ్ పార్టీ (జీఎఫ్‌పీ) వంటి ఇండియా కూటమి భాగస్వాముల దన్నుతో బీజేపీని కాంగ్రెస్ ఢీకొంటోంది. స్థానిక రివల్యూషనరీ గోవన్స్ (ఆర్‌జీ) పార్టీ అభ్యర్థి రూబర్ట్ పెరీరియా ఆ రెండింటికీ సవాలు విసురుతున్నారు. అయినా పల్లవి మాత్రం విజయంపై ధీమాగా ఉన్నారు. ''రాజకీయాలు నా మనసులో ఎప్పుడూ లేవు. మూడు దశాబ్దాలుగా కుటుంబ వ్యాపారాలు, సేవా కార్యకలాపాల్లో బిజీగా ఉన్నాను. అయితే దేనికైనా ఒక ఆరంభమంటూ ఉంటుంది. రాజకీయాల్లో ఇది నా తొలి అడుగు. బీజేపీ సిద్ధాంతాన్ని నమ్మి ముందడుగు వేస్తున్నాను'' అంటున్న ఆమె కాంగ్రెస్‌కు కంచుకోటలో చరిత్ర సృష్టిస్తారేమో చూడాలి!

- సాక్షి, నేషనల్ డెస్క్



ఇవిగో నవరత్నాల వెలుగులు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అప్రతిహతంగా అమలవుతున్న నవరత్నాల పథకాల ద్వారా తమ బతుకులు ఎలా మెరుగుపడ్డాయో 'సాక్షి'తో పంచుకున్న అభిప్రాయాలు వారి మాటల్లోనే...

సర్కారు సాయంతో సొంతంగా గూడు



వ్యవసాయం తప్ప మరో పని రాదు. అదే జీవనాధారంగా బతుకుతున్నాం. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం ఉద్దానం ప్రాంతమైన అమలపాడులో నివసిస్తున్న మాకు కొబ్బరి తోటలో పూరి పాక తప్ప నిలువ నీడ లేదు. తిత్లీ తుపానులో ఉన్న గూడు పోయింది. గుడిసె వేసుకుని ఇద్దరు కుమారులు కోడళ్లు, మనవలతో బతుకుతున్నాం. టీడీపీ ప్రభుత్వంలో ఇంటి కోసం కాళ్లరిగేలా అధికారులు, నాయకులు చుట్టూ తిరిగాం. ఎవరూ పట్టించుకోలేదు. ఒక్క పైసా కూడా సాయం అందలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సంక్షేమ పథకాలు మాకు అండగా నిలిచాయి. మా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నా పెద్దకోడలు, చిన్న కోడలు ఖాతాల్లో అమ్మ ఒడి కింద ఏడాదికి రూ. 30వేలు వంతున వచ్చింది. నా భార్యకు వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి రూ. 18,750లు, ఆసరా ద్వారా రూ. 20వేలు, రైతు భరోసా కింద రూ.42వేలు, వైఎస్సార్ పింఛన్ కానుక అందింది. మాకు సొంతిల్లు సమకూరింది. మా జీవితం హాయిగా సాగుతోంది. మా కష్టాలన్నీ తీరాయి. ఈ పరిస్థితికి కారణమైన జగనన్నకు రుణపడి ఉంటాం.

–మదనాల బారికివాడు, అమలపాడు,
-వజ్రపుకొత్తూరు

కూలి పని మాని హాయిగా జీవిస్తున్నాం



మూడేళ్ల కిందట నా భర్త రామారావు మృతిచెందాడు. నాకు ముగ్గురు ఆడపిల్లలు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మండలం కవలగొయ్యిలో కూలీపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. రేషన్‌కార్డు లేక ఇబ్బంది పడేవాళ్లం. సీఎం జగన్ ప్రభుత్వం వచ్చాక రేషన్‌కార్డు మంజూరైంది. ముగ్గురు కుమార్తెల్లో హెప్సీబా పదో తరగతి, స్రవంతి నాలుగో తరగతి, పుష్ప ఒకటో తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. స్రవంతికి ఏటా అమ్మ ఒడి కింద రూ.15 వేలు వస్తోంది. పిల్లలందరికీ ఉచిత పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, గోరుముద్ద పథకం ద్వారా మధ్యాహ్న భోజనం అందుతోంది. వితంతు పింఛన్ మూడేళ్లుగా వస్తోంది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున బ్యాంకు ఖాతాల్లో నేరుగా పడుతోంది. అద్దె ఇంట్లో జీవిస్తున్న నాకు జగనన్న ఇంటిపట్టాను రిజిస్ట్రేషన్ చేసి మరీ ఇచ్చారు. దీంతో మా కుటుంబం ఎంతో సంతోషంగా ఉంది. సీఎం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల మేము హాయిగా జీవిస్తున్నాం. జగనన్న రుణం మరచిపోలేం.

– బోగి మరియమ్మ, కవలగొయ్యి
-రాజమహేంద్రవరం రూరల్

బాబు హామీలను మహిళలు నమ్మరు

'చంద్రబాబు పాలనలో మోసపోయినంతగా మహిళలు మరెవరి పాలనలోనూ మోసపోలేదు. బాబు తన మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను మహిళలు నమ్మట్లేదు. 2014 ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తానన్నారు. అధికారం చేపట్టాక పట్టించుకోలేదు. బంగారం తాకట్టుపై రుణాలు తీసుకున్న మహిళలు చంద్రబాబును నమ్మి మోసపోయారు. తర్వాత వడ్డీలు కట్టేందుకు ముక్కుపుడకల్ని సైతం తాకట్టు పెట్టాల్సి వచ్చింద'ని పద్మావతి మహిళా వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ జమున దువ్వూరి అన్నారు. 'సాక్షి'తో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో మహిళలకు జరిగిన అన్యాయం, జగన్ మోహన్‌రెడ్డి పాలనలో వారికి దక్కిన గౌరవం, మహిళా సాధికారత దిశగా పడిన అడుగులను వివరించారు. – తిరుపతి సిటీ

- ముక్కుపుడక సైతం తాకట్టు పెట్టి వడ్డీలు కట్టారు
- మహిళా సాధికారిత ఓ యజ్ఞం.. దానికి అడుగు పడింది జగన్‌తోనే
- జగన్ పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు
- మహిళా సంక్షేమం, ఆర్థిక స్వావలంబనలో ఏపీ రోల్‌మోడల్
- పద్మావతి మహిళా వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ జమున దువ్వూరి





2019లో మహిళా సాధికారత వైపు అడుగులు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో మహిళల కష్టాలను ప్రత్యక్షంగా గమనించారు. వారిని ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో నవరత్నాలతో మేనిఫెస్టోను రూపొందించారు. సీఎం అయిన వెంటనే వాటిని అమలు చేశారు. గతంలో ఎంతో మంది రాజకీయ ఉద్దండులు రాష్ట్రాన్ని పాలించినా మహిళా సాధికారతవైపు అడుగులు పడలేదు. ఎన్నికల సమయంలో అమలు సాధ్యం కాని హామీలతో మహిళలను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకునేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నించేవి. సీఎం జగన్ ప్రతి పథకాన్ని మహిళలకు వర్తించేలా జాగ్రత్త పడ్డారు. దీంతో రానున్న ఎన్నికల కోసం సీఎం జగన్ మేనిఫెస్టోలో కొత్త పథకాలను ప్రవేశపెట్టకుండా, తాను గతంలో మహిళా సాధికారత కోసం అమలు చేస్తున్న పథకాలనే మరింత మెరుగ్గా కొనసాగిస్తానన్నారు. తన పాలనలో ప్రతి ఒక్కరికీ మంచి జరిగింది. అందుకే జగన్ మేనిఫెస్టోను మహిళలు పూర్తి స్థాయిలో విశ్వసిస్తున్నారు.

ఆర్థిక స్వావలంబనలో రోల్ మోడల్

జగన్ పాలనలో అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన ప్రతి మహిళకు పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా సంక్షేమ లబ్ధి అందించారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రతి ఇంటి తలుపు తడుతూ ప్రతి పథకానికి అర్హులను గుర్తించి లబ్ధి చేకూర్చడం ప్రగతికి నిదర్శనం. ఈ విధానంలో దేశంలోని పలు రాష్ట్రాలకు ఏపీ రోల్ మోడల్‌గా నిలుస్తోంది. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలపై ఇప్పటికే పలు రాష్ట్రాలు ఆసక్తి చూపుతున్నాయి. సుమారు రూ.2.70 లక్షల కోట్ల నిధులను మధ్యవర్తుల ప్రమేయం, అవినీతికి తావులేకుండా నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేయడం ఆశ్చర్యమేస్తుంది. ఆసరా, చేయూత తదితర పథకాల లబ్ధిదారులు ప్రభుత్వ సాయంతో స్వయం ఉపాధి పొందుతున్నారు.

సాధికారత అంటే ఉచిత బస్సు ప్రయాణమా?

మరో మారు మహిళలను తప్పుదోవ పట్టించి, మభ్యపెట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం, గ్యాస్ సిలిండర్లు అంటున్నారు. మహిళలు ఉచితంగా బస్సులో ప్రయాణిస్తే సాధికారత సాధించినట్టేనా..? పక్క రాష్ట్రాల పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టోగా రూపొందించారు. జగన్ ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకాన్నే తల్లికి వందనం అంటున్నారు. ఇది రాజకీయ పరిపక్వతలేని వ్యక్తులు చేసే పని. దీనిని ప్రజలు విశ్వసించరు.


మేనిఫెస్టో పవిత్ర గ్రంథం

సీఎం జగన్ మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేసే హామీలను మాత్రమే పొందుపరిచారు. తన ఐదేళ్ల పాలనలో చెప్పిన ప్రతి హామీ నెరవేర్చారు. 'మీ కుటుంబానికి మేలు జరిగితేనే తనకు అండగా నిలబడండి' అంటూ ఓట్లు అడుగుతున్న ఏకైక నాయకుడు దేశంలో జగన్ ఒక్కరేనని చెప్పవచ్చు. కేవలం అధికారమే లక్ష్యంగా నోటికి వచ్చినట్లు అమలు చేయలేని హామీలతో మహిళలను మోసం చేయాలనుకుంటే గుర్తించలేని స్థితిలో ప్రస్తుత మహిళలు లేరు. చంద్రబాబు 14 ఏళ్ల పాలన ప్రజలకు బాగానే గుర్తుంది.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

సీఎం జగన్ పాలనలో నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారాయి. పేద పిల్లలు అనర్గళంగా ఇంగ్లిష్‌లో మాట్లాడుతున్నారంటే ప్రభుత్వ స్కూళ్లు ఎంత గొప్పగా ఉన్నాయో స్పష్టమవుతోంది. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలతో ఉన్నత విద్యను ప్రోత్సహించారు. గోరుముద్ద పథకంతో నాణ్యమైన పోషకాహారాన్ని పిల్లలకు అందిస్తున్నారు. దేశంలోనే ఏ రాష్ట్రం విద్యపై ఇంత పెద్ద ఎత్తున దృష్టి సారించలేదు.

మోసం.. వంచన..



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో అలవికాని హామీలు ఇస్తూ అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా అమలు చేయకుండా మోసం చేసిన చరిత్ర ఉన్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఈసారి విశ్వరూపం ప్రదర్శించారు. జనసేన, బీజేపీలతో జత కట్టినా ఘోర పరాజయం తప్పదనే నిర్ణయానికి వచ్చి.. ఉనికి చాటుకోవడం కోసం ఆచరణలో అమలుకు వీలుకాని రీతిలో హామీలతో ముంచెత్తుతూ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిన తరహాలోనే ఈసారీ ప్రజలను వంచించడానికి సిద్ధమయ్యారని గ్రహించిన బీజేపీ.. మేనిఫెస్టోను ముట్టుకోవడానికి కూడా ముందుకు రాలేదని టీడీపీ వర్గాలే చర్చించుకుంటుండటం గమనార్హం. 2019 ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారు. గత 58 నెలల్లో నవరత్నాలు–సంక్షేమ పథకాల ద్వారా అర్హతే ప్రామాణికంగా.. ఎలాంటి వివక్ష చూపకుండా.. అవినీతికి తావు లేకుండా.. అత్యంత పారదర్శకంగా పేదల ఖాతాల్లో నేరుగా రూ.2,66,810 కోట్లను జమ చేశారు. నాన్ డీబీటీ పథకాల ద్వారా మరో రూ.95,001 కోట్లు వ్యయం చేశారు. డీబీటీ, నాన్ డీబీటీ పథకాల ద్వారా ఇప్పటిదాకా రూ.3,61,811 కోట్లు వ్యయం చేశారు. అంటే ఏడాదికి సగటున రూ.72,362 కోట్లు ఖర్చు చేశారు. సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లోకి సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి డబ్బులు జమ చేస్తుంటే.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి శ్రీలంకగా మార్చేస్తున్నారని చంద్రబాబు గగ్గోలు పెడితే.. ఎల్లో మీడియా అదే పల్లవి అందుకుంది.

అదనంగా రూ.4,63,189 కోట్లు ఎలా తెస్తావ్ బాబూ?

టీడీపీ మేనిఫెస్టోలో సూపర్ సిక్స్‌తోపాటు పేర్కొన్న ఇతర హామీల అమలుకు ఏటా రూ.1.65 లక్షల కోట్లకుపైగా అవసరమని ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. అంటే.. ప్రస్తుతం సీఎం జగన్ డీబీటీ, నాన్ డీబీటీ పథకాలకు చేస్తున్న వ్యయం కంటే అదనంగా ఏటా రూ.92,638 కోట్లు అవసరం. ఐదేళ్లలో ఆ పథకాల అమలుకు మొత్తంగా రూ.8.25 లక్షల కోట్లు అవసరం. అంటే.. ప్రస్తుతం సీఎం జగన్ డీబీటీ, నాన్ డీబీటీ పథకాలకు ఐదేళ్లలో చేసిన వ్యయం కంటే అదనంగా రూ.4,63,189 కోట్లు కావాలి. ఈ డబ్బులు ఎలా తెస్తావని ప్రశ్నిస్తుంటే సంపద సృష్టించి సంక్షేమ పథకాలను అమలు చేస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారు తప్పించి స్పష్టంగా లెక్క చెప్పలేక తప్పించుకుంటున్నారు.

హైటెక్ సిటీలో, అమరావతిలో బినామీలకే సంపద సృష్టి

గతంలో సంపద సృష్టించానని, ఇప్పుడూ సంపద సృష్టించి.. దాని ద్వారా వచ్చే ఆదాయంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తానని చంద్రబాబు చెబుతోన్న మాటల్లో వీసమెత్తు నిజం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో 1995–2004 మధ్య సీఎంగా ఉన్న చంద్రబాబు.. హైటెక్ సిటీ పరిసర ప్రాంతాల్లో మురళీమోహన్ వంటి బినామీలు, వందిమాగధులతో భారీ ఎత్తున భూములు కొనుగోలు చేయించారు. ఆ తర్వాత హైటెక్ సిటీ పేరుతో ప్రభుత్వ ఖజానా నుంచి మౌలిక సదుపాయాలకు ఖర్చు చేసి బినామీలకు సంపద సృష్టించారు. విభజన తర్వాత 2014 ఎన్నికల్లో గెలిచి, అధికారంలోకి వచ్చాక.. విజయవాడ–గుంటూరు ప్రాంతంలో రాజధాని ఏర్పాటు చేసే చోటు గురించి బినామీలు, వందిమాగధులకు ముందుగా లీకులు ఇచ్చి ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారు. వేలాది ఎకరాల భూములు తక్కువ ధరలకే కొల్లగొట్టారు. ఆ భూ సంపదను రెట్టింపు చేయడానికి రాజధానిగా అమరావతిని చేశారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తే.. ప్రభుత్వ ఖజానా నుంచి అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు భారీ ఎత్తున నిధులు ఖర్చు చేసి.. బినామీలు, వందిమాగధులు కాజేసిన భూ సంపదను మరింతగా పెంచడానికి ఎత్తులు వేస్తున్నారు.

- ఉమ్మడి రాష్ట్రాన్ని, విభజన తర్వాత రాష్ట్రాన్ని 14 ఏళ్లు సీఎంగా చంద్రబాబు పాలించారు. ఆ 14 ఏళ్లు.. ప్రతి ఏటా రెవెన్యూ లోటే. ఎడాపెడా అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని రుణాల ఊబిలోకి నెట్టిందీ చంద్రబాబే. 2014 నుంచి 2019 వరకు అప్పుల కాంపౌండెడ్ యాన్యువల్ గ్రోత్‌రేట్ (సీఏజీఆర్) 21.87 శాతం. కానీ.. సీఎం జగన్ హయాంలో 2019 నుంచి 2024 వరకు చూస్తే అది 12.13 శాతం. దీన్ని బట్టి చంద్రబాబే ఎడాపెడా అప్పులు తెచ్చినట్లు స్పష్టమవుతోంది.
- అప్పుల మొత్తాన్ని చూసినా... చంద్రబాబు అధికారంలోకి రాక ముందు అంటే 2014 జూన్ 7 నాటికి రాష్ట్రానికి రూ.1,53,346 కోట్ల అప్పు ఉంటే.. 2019 మే 29 నాటికి అది రూ.4,12,288 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం ఆ అప్పులు రూ.7,03,471 కోట్లకు చేరాయి.
- సంపద సృష్టించానని చంద్రబాబు ప్రగల్భాలు పలుకుతున్నారు. కానీ.. వాస్తవానికి చంద్రబాబు హయాం (2014–19)లో మూలధన వ్యయం ఏటా సగటున రూ.15,227 కోట్లు ఖర్చు చేస్తే.. సీఎం జగన్ గత ఐదేళ్లు ఏటా సగటున రూ.17,757 కోట్లు ఖర్చు చేశారు.
- జీడీపీలో రాష్ట్ర వాటా చంద్రబాబు హయాంలో సగటున 4.47 శాతం ఉంటే.. సీఎం జగన్ హయాంలో అది 4.83 శాతానికి పెరిగింది. కోవిడ్ లాంటి క్లిష్ట సమయాన్ని కలిపినా 4.83 శాతం మన వాటా ఉందంటే ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందన్నది స్పష్టమవుతోంది.
- చంద్రబాబు హయాంలో జీఎస్‌డీపీలో పన్నుల భారం సగటున 6.57 శాతం ఉంటే.. జగన్ హయాంలో అది 6.35 శాతమే. అంటే.. సీఎం జగన్ హయాంలోనే పన్నుల భారం తక్కువ. ఇది ఆర్బీఐ (రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా), కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) తేల్చిన లెక్క.

కేంద్రం జీడీపీలో రాష్ట్ర వాటా (స్థూల దేశీయోత్పత్తిలో రాష్ట్ర భాగస్వామ్యం) ఇప్పుడే ఎక్కువ

హయాం	ఆర్థిక సంవత్సరం	జీడీపీ (దేశీయ స్థూలఉత్పత్తి)	జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల ఉత్పత్తి)	జీడీపీలో రాష్ట్ర వాటా
చంద్రబాబు హయాం	2014-15	1,24,67,959	5,24,976	4.21
	2015-16	1,37,71,874	6,04,229	4.39
	2016-17	1,53,91,669	6,84,416	4.45
	2017-18	1,70,90,042	7,86,135	4.60
	2018-19	1,88,99,668	8,73,721	4.62
(ఐదేళ్లలో జీడీపీలో రాష్ట్ర వాటా సగటు 4.47 శాతం)				
సీఎం జగన్ హయాం	2019-20	2,01,03,593	9,25,839	4.61
	2020-21	1,98,29,927	9,77,815	4.93
	2021-22	2,34,71,012	11,48,471	4.89
	2022-23	2,72,40,712	13,03,524	4.79
	2023-24	2,96,57,745	14,39,674	4.85
(ఐదేళ్లలో జీడీపీలో రాష్ట్ర వాటా సగటు 4.82 శాతం)				

రాష్ట్రంలో ప్రజలపై పన్నుల భారం చంద్రబాబు హయాంలోనే ఎక్కువ

హయాం	ఆర్థిక సంవత్సరం	రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం	రాష్ట్ర స్థూల ఉత్పత్తి(జీఎస్‌డీపీ)	జీడీఎస్‌డీపీలో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం వాటా)
చంద్రబాబు హయాం	2014-15	29,857	4,37,480	6.82
	2015-16	39,922	6,04,229	6.61
	2016-17	44,181	6,84,416	6.46
	2017-18	49,813	7,86,135	6.34
	2018-19	58,107	8,73,721	6.65
(ఐదేళ్లలో సగటున జీఎస్‌డీపీలో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం వాటా 6.57 శాతం)				
సీఎం జగన్ హయాం	2019-20	57,619	9,25,839	6.22
	2020-21	57,428	9,77,815	5.87
	2021-22	73,616	11,48,471	6.41
	2022-23	85,874	13,03,524	6.59
	2023-24	95,757	14,39,674	6.65
(ఐదేళ్లలో సగటున జీఎస్‌డీపీలో రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం వాటా 6.35 శాతం)				

బాబు పాలనలో ప్రతి ఏటా రెవెన్యూ లోటే (రూ.కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	రెవెన్యూ లోటు, మిగులు		
		2005-06	-64
		2006-07	2810
1993-94	230	2007-08	159
1994-95	-730	2008-09	1004
1995-96	-740	2009-10	1230
1996-97	-3200	2010-11	2464
1997-98	-700	2011-12	3138
1998-99	-2680	2012-13	1128
1999-00	-1230	2013-14	344
2000-01	-3600	2014-15	-13776
2001-02	-2880	2015-16	-7302
2002-03	-3050	2016-17	-17231
2003-04	-2960	2017-18	-16151
2004-05	-2560	2018-19	-13889

నెర్రెలిచ్చిన నిరాశపై ఆశల తొలకరి


▶ మొదటి పేజీ తరువాయి

నీరందించేలా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను డిజైన్ చేశారు.

➤ గొట్టా బ్యారేజీ కుడి ప్రధాన కాలువ 2.4 కిలోమీటర్ల వద్ద పంప్ హౌస్, నాలుగు పంపుల ద్వారా ఎత్తిపోసేలా, 525 మీటర్ల పైపులైన్ల ద్వారా నీటిని పంపించేందుకు రూపకల్పన చేశారు.

➤ ఒక్కో పంపు సెకనుకు 10 క్యూబిక్ మీటర్ల పరిమాణంలో నాలుగు పంపుల ద్వారా సెకనుకు 40 క్యూబిక్ మీటర్ల నీటిని 100 రోజుల పాటు పంపిస్తే 12 టీఎంసీల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతుందని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను ప్రతిపాదించారు.

➤ నాలుగు ట్రాష్ ర్యాక్‌లు, నాలుగు స్టాప్ లాగ్ గేట్లు, 31.00 మీటర్ల సంప్ ఫ్లోర్ లెవల్, 38.113 మీటర్ల వాటర్ లెవల్ పనులు, 40.000 మీటర్ల పంప్ ఫ్లోర్ లెవల్ పనులు, 45.000 మీటర్ల మోటార్ ఫ్లోర్ లెవల్, 69.00 మీటర్ల డెలివరీ లెవల్ తదితర హైడ్రాలిక్ సిస్టమ్‌తో స్కీమ్ నిర్మాణం జరగనుంది.



ఈ ఖరీఫ్‌కు పూర్తిస్థాయి తాగునీరు

ఇప్పటికే వంశధార రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చిన్న చిన్న పెండింగ్ పనులే మిగిలాయి. వాటిని పూర్తిచేయడంలో ప్రత్యేక దృష్టి సారించామనీ. ఈ ఖరీఫ్ నాటికి పూర్తిస్థాయిలో సాగునీరందిస్తామనీ. 19 టీఎంసీల నీటిని రిజర్వాయర్‌లో నిల్వ చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నామనీ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం గొట్టాబ్యారేజీ ఎత్తిపోతల పథకం నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పట్టిసీమను తలదన్నే రీతిలో ఇక్కడ ఎత్తిపోతల పథకం నిర్మాణం జరుగుతోంది. ముందుగా 12 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా ఏర్పాటు చేశారు. ఎత్తిపోతల పథకం పూర్తయితే జిల్లా సస్యశ్యామలం అవుతుంది.

వ్యవసాయానికి ఎనలేని ప్రోత్సాహం



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఎనలేని ప్రోత్సాహం అందిస్తోంది. వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రాధాన్యమిస్తోంది. సాగునీటి కల్పనకు చేస్తున్న కృషి అభినందనీయం. నాడు జలయజ్ఞంలో భాగంగా రాజశేఖర్‌రెడ్డి వంశధార ఫేజ్–2 లో రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తండ్రి ఆశయాన్ని నెరవేర్చారు. రూ.176.35 కోట్లతో గొట్టా బ్యారేజీ కుడి ప్రధాన కాలువ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి వంశధార రిజర్వాయర్‌లోకి నీటికి మళ్లించేందుకు ఎత్తిపోతల పథకం నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో పనులు శరవేగంగా పూర్తవుతుండడం ఆనందంగా ఉంది. ఖరీఫ్ నుంచి సాగునీటి ఇబ్బందుల్లేకుండా రెండు పంటలు పండించే అవకాశం కల్పించిన సీఎంకు జిల్లా ప్రజలు రుణపడి ఉంటారు.

–ఉలకలాపు శ్రీనివాసరావు, రైతు, కిట్టాలపాడు

చకచకా పనులు.. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పంపు హౌస్, ప్రెజర్ మెయిన్, డెలివరీ సిస్టమ్, పైపులైను, పంపింగ్ మోటార్స్ పనులు చేపట్టాల్సి ఉంది. వాటిలో ఇప్పటికే పంప్ హౌస్, ప్రెజర్ మెయిన్ మాన్యుఫ్యాక్చరింగ్ పనులు ప్రారంభమయ్యాయి. వేగంగా పనులు చేసే సమయంలో వర్షాల వల్ల ఆటంకం ఏర్పడింది. ప్రాధాన్య క్రమంలో మిగతా పనులు చకచకా చేపట్టేలా యంత్రాంగం కార్యాచరణ రూపొందించింది. ఒకవైపు ఎలక్ట్రిఫికేషన్, మరోవైపు లిఫ్ట్ పనులు వేగంగా చేసి జనవరి నాటికి కొలిక్కి తెచ్చేలా అడుగులు పడుతున్నాయి.

ఇక్కడే దూరం

▶ మొదటి పేజీ తరువాయి

విడుదల చేయగా, దాని చివరి పేజీలో బీజేపీ గుర్తు కమలం సహా అన్ని మిత్ర పక్ష పార్టీల గుర్తులను ముద్రించింది. ఇందుకు బీజేపీ కూడా అంగీకారం తెలిపింది. ఒక్క ఏపీలో మాత్రమే చంద్రబాబు, పవన్‌ల మేనిఫెస్టోపై తమ ముద్ర ఏదీ లేకుండా బీజేపీ జాగ్రత్త పడటం.. అసలు ఆ మేనిఫెస్టోను ముట్టుకోవడానికి కూడా బీజేపీ పరిశీలకుడు సిద్ధార్థనాథ్ సింగ్ ఇష్టపడక పోవడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

బాబు ఆల్ ఫ్రీ హామీలను నమ్మే పరిస్థితి లేదు

పదేళ్ల క్రితం 2014లో టీడీపీ–బీజేపీ–జనసేనలు ఉమ్మడిగా పోటీ చేసినప్పుడు ఇచ్చిన హామీలలో చంద్రబాబు అధికారంలోకి వచ్చాక దాదాపు ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ఇప్పుడు అదే చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. మూడు పార్టీల పొత్తులో మళ్లీ అన్నీ ఆల్ ఫ్రీ హామీలనే ఇవ్వడంతో వాటి అమలులో సాధ్యాసాధ్యాలపై బీజేపీకి నమ్మకం కుదరలేదని తెలుస్తోంది. అందుకే పొత్తులో ఉన్నప్పటికీ ఉమ్మడి మేనిఫెస్టోకు దూరం జరిగింది. 'గత వారం బీజేపీ జాతీయ స్థాయిలో మేనిఫెస్టో విడుదల చేసింది. రాష్ట్రాలలో పొత్తులో ఉన్న ఎన్డీయే భాగస్వామ్య పార్టీలకు మా మద్దతు ఉంటుంది' అనే ప్రకటనకు మాత్రమే పరిమితమైంది. అయితే బీజేపీ కేవలం కంటితుడుపుగా మిత్రపక్షాలను సంతృప్తి పరిచేందుకే ఈ వ్యాఖ్యలు చేసిందని పరిశీలకులు చెబుతున్నారు. 2014లో ఈ మూడు పార్టీలు కలిసి పోటీ చేసినప్పుడు.. బీజేపీ జాతీయ స్థాయిలో మేనిఫెస్టోను ప్రకటించినప్పటికీ, రాష్ట్ర పార్టీ వేరుగా మేనిఫెస్టోను విడుదల చేసింది. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు ఒక మేనిఫెస్టోను, సీమాంధ్రకు మరొకటి బీజేపీ ప్రకటించింది. 2019 ఎన్నికల్లోనూ బీజేపీ జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో వేర్వేరుగా మేనిఫెస్టోను ప్రకటించింది. ఈ పరంపరలో కేవలం చంద్రబాబు–పవన్‌ల మేనిఫెస్టోలోని హామీలపై నమ్మకం లేకే బీజేపీ ఢిల్లీ పెద్దలు మద్దతు మాత్రమే ఇచ్చారని పార్టీలో చర్చ సాగుతోంది. ఈ అవమానకర విషయాన్ని ఎలా అధిగమించాలో తెలియక చంద్రబాబు అండ్ గ్యాంగ్ తల పట్టుకుంది.

మీకు తెలుసా?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆవిర్భవించాక 108 వ్యవస్థకు ఊపిరిలూదుతూ రూ.136 కోట్లతో 768 అంబులెన్సులు సమకూర్చారు.

ఫ్యామిలీ డాక్టర్ అమలుకోసం రూ.166 కోట్లతో 104 వాహనాలు కొత్తవి సమకూర్చారు. మొత్తం 936 వాహనాలు సేవలు అందిస్తున్నాయి.



దేశంలో తొలి ఎన్నికల నాటికి 400 లోక్‌సభ స్థానాలు

1951–52లో దేశంలో మొట్టమొదటి సారిగా సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. అప్పట్లో మొత్తం 400 లోక్‌సభ నియోజకవర్గాలుండేవి. అందులో 314 చోట్ల ఒకే ఎంపీ ఉండగా, 86 చోట్ల ఇద్దరు చొప్పున ఎంపీలు (ఒకరు జనరల్ కేటగిరీ, మరొకరు రిజర్వేషన్ కేటగిరీ) ఉండేవారు. పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ బెంగాల్ నియోజకవర్గానికి ముగ్గురు ఎంపీలుగా ఉన్నారు. 1957లో జరిగిన రెండో సార్వత్రిక ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య 494కు పెరిగింది. అప్పుడు 57 నియోజకవర్గాలకు ఇద్దరు చొప్పున ఎంపీలు ఉన్నారు. ఇందులో అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 18 లోక్ సభస్థానాలుండగా.. ఉమ్మడి ఏపీ లోనూ 8 స్థానాలు ఇద్దరు ఎంపీలతో ఉండేవి. 1961 సార్వత్రిక ఎన్నికల నాటికి పూర్తి స్థాయి రిజర్వేషన్ విధానం అమల్లోకి వచ్చింది. ఎస్సీ, ఎస్టీల సంఖ్య ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలకు రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లను వర్తింపజేస్తూ వస్తున్నారు.

ఒకే విడతలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలుగా అన్నదమ్ములు

2019 సార్వత్రిక ఎన్నికల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు మూడు అసెంబ్లీ స్థానాల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి చరిత్ర సృష్టించారు. కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గం నుంచి యల్లారెడ్డిగారి బాలనాగిరెడ్డి, ఆదోని నుంచి యల్లారెడ్డిగారి సాయిప్రసాద్‌రెడ్డి, అనంతపురం జిల్లా గుంతకల్ నుంచి యల్లారెడ్డిగారి వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరి మరో సోదరుడు యల్లారెడ్డిగారి శివరామిరెడ్డి కూడా ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. ఈయన 1999లో ఉరవకొండ ఎమ్మెల్యేగా గెలిచారు. వీరంతా వైఎస్సార్‌సీపీ తరఫునే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా గెలుపొందడం మరో విశేషం. వీరితండ్రి యల్లారెడ్డిగారి భీమ్‌రెడ్డి కూడా 1983లో ఉరవకొండ ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్న బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి ఈ ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో ఉన్నారు.

హస్తం గుర్తు ఆవిర్భావం మదనపల్లెలోనే

దేశ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల చిహ్నం అయిన 'హస్తం' గుర్తుకు అన్నమయ్య జిల్లా మదనపల్లెలోనే రూపకల్పన జరిగింది. అంతవరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల చిహ్నంగా ఆవుదూడ ఉండేది. అప్పట్లో దేశ రాజకీయాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పుల కారణంగా కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలడంతో దేశ వ్యాప్తంగా ఇందిరాగాంధీ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఇందిరాగాంధీ తో పాటు కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు, మాజీ సీఎం మర్రి చెన్నారెడ్డి ఉన్నారు. 1978 ఫిబ్రవరి 2వ తేదీ రాత్రి రాజారత్నం స్వగృహంలో బస చేశారు. అదే సమయంలో ఢిల్లీలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలను ఢిల్లీ నుంచి ఆనాటి కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ బూటాసింగ్ మదనపల్లెలో ఉన్న ఇందిరాగాంధీకి ఫోన్ ద్వారా వివరించారు. కాంగ్రెస్‌పార్టీ రెండుగా చీలిపోవడంతో వేరువేరు ఎన్నికల చిహ్నాలను ఎంపిక చేసుకోవాలని కమిషన్ ఆదేశించింది. ఫిబ్రవరి 3న ఉదయం ఎనిమిది గంటలలోగా ఒకటి ఎన్నిక చేసువాలని ప్రకటించగా హస్తం గుర్తును ఎంపిక చేశారు.

తొలి ఓటు సంక్షేమాభివృద్ధికే



గత ప్రభుత్వాలు ఓటు హక్కులేని విద్యార్థుల్ని పట్టించుకున్న పాపాన పోలేదు. రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని నమ్మిన వ్యక్తి జగన్ మామయ్య మాత్రమే. అందుకే ఓటు హక్కులేని విద్యార్థుల కోసం నిస్వార్థంగా విద్యా విప్లవం తీసుకొచ్చారు జగన్ మామ. నూటికి నూరు శాతం నిజాయితీ ఉన్న ఏకైక మేనిఫెస్టో దేశంలో జగన్ మామయ్య ప్రకటించినదే. ఇపుడే నాకు, మా తమ్ముడికి ఓటు హక్కు వచ్చింది. మా తొలి ఓటు సంక్షేమాభివృద్ధి చేసే ప్రభుత్వానికే.

- గూడవల్లి రాజారత్నం, విద్యార్థి, బ్యాంకు కాలనీ, భీమవరం

మీరూ స్పందించండి — పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

జగనే మళ్లీ మళ్లీ సీఎం



ఎన్నికలకు ఇష్టారీతిన మేనిఫెస్టోలో హామీలు గుప్పించడం రాజకీయ పార్టీలకు అలవాటు. మేనిఫెస్టోను ప్రభుత్వ పాలనకు ఓ గీటురాయిగా మార్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. మైనార్టీలకు, పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం తపించే నాయకుడాయన. ఏ పని చేసినా, ఏ పథకం ప్రారంభించినా భవిష్యత్ తరాల బాగు కోసమే ఆలోచించే వ్యక్తి జగన్. పేదల గుండె చప్పుడాయన. జనం మెచ్చిన నేత కాబట్టే జనాలు జగనే మళ్లీ మళ్లీ కావాలంటున్నారు.

- షేక్ బోదే షావలి, పలమనేరు

మళ్లీ జగన్ రావాలి

జగన్ డబ్బులు పంచలేదు.. మా జీవితాల్లో వెలుగులు నింపారు



విశాఖ జిల్లా రోడ్ షో

సాక్షి రోడ్ షో

- అన్నలా, తమ్ముడిలా ఆదుకున్నారన్న మహిళలు
- ఇంటివద్దకే సంక్షేమం, సుపరిపాలన వచ్చిందంటున్న ఓటర్లు
- జగన్ పాలనకే జై కొడుతున్న చేతివృత్తిదారులు, రైతులు, కూలీలు
- ఆయన రాకపోతే పథకాలు ఆగిపోతాయేమోనని ఆందోళన
- 'సాక్షి రోడ్ షో'లో విశాఖపట్నం, అనంతపురం జిల్లాల ఓటర్ల మనోగతం

పథకాలతో జగన్ మాకు డబ్బులు పంచలేదు. ఆర్థికంగా చేయూతనిచ్చి పేదరికంపై పోరాటంలో సాయపడ్డారు. మధ్య తరగతి ప్రజలను కష్టాల సుడిగుండం నుంచి గట్టెక్కించారు. మా పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడమే కాదు.. స్కూళ్లలో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించారు. విలేజ్ క్లినిక్‌లతో మా ఆరోగ్యాన్ని కాపాడారు. మహిళలకు ఒక అన్నలా, తమ్ముడిలా ఆర్థికంగా అండగా ఉండి తమ కుటుంబాలను అప్పుల ఊబి నుంచి గట్టున పడేశారు. పెద్ద కొడుకులా మలి వయసులో వృద్ధుల్ని ఆదుకున్నారు. ఇంటివద్దకే సంక్షేమం, సుపరిపాలనతో పాలనాదక్షతను చాటిచెప్పారు. ఏదేమైనా మరోసారి జగన్‌కు ఓటేస్తే ఈ సంక్షేమం కొనసాగడంతో పాటు రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని రాష్ట్రంలోని ఓటర్లు 'సాక్షి రోడ్‌షో'లో అభిప్రాయపడ్డారు.

మరో 10 రోజుల్లో ఎన్నికలు.. రాష్ట్రంలో ఎటు చూసినా ఎన్నికల కోలాహలం .. ఎవరికి ఓటర్లు పట్టం కడతారు? అని ఒకటే చర్చ.. 'సాక్షి రోడ్‌షో'లో భాగంగా ప్రత్యేక బృందం పల్లెలు, పట్టణాల్లో రచ్చబండలు, పంట పొలాలు, రోడ్ల కూడళ్లు, కిళ్లీ షాపులు, ఆటోస్టాండ్‌లు, మార్కెట్లు ఇలా వీలున్న చోటుకు వెళ్లి ఓటర్లను పలకరించింది. చేనేతకారులు, రోజువారీ కూలీలు, చేతివృత్తిదారులు, రైతులు, మహిళలు, వ్యాపారులు ఇలా అన్ని వర్గాలతో ముచ్చటించింది. ఎవరికి.. ఎందుకు ఓటేస్తామో 'సాక్షి' రోడ్ షోలో ఓటర్లు స్పష్టం చేశారు.

పాలన బాగుంది.. మరోసారి అవకాశం

పల్లె, పట్టణం, ఊరు, వాడ ఎటు చూసినా ఫ్యాన్ గాలే.. పేద.. ధనిక.. అవ్వా తాత.. అక్కా చెల్లి.. అన్నా.. తమ్ముడు.. ఎవర్ని అడిగినా జగనే అన్నారు. సుపరిపాలనే జగనన్న పాలనకు శ్రీరామరక్ష అని ఆటో డ్రైవర్ అంటే.. ఇంటి దగ్గరకే సంక్షేమాన్ని అందించడం నచ్చిందని కిరాణా కొట్టు మహిళ చెప్పింది. మాకు సాయపడ్డ జగన్‌కే ఓటేస్తామని కొబ్బరి బొండాలమ్మే వ్యక్తి చెప్పగా.. చంద్రబాబు కంటే.. అన్నదాతని ఆదుకున్న జగన్ వెయ్యి రెట్లు మేలని రైతు బదులిచ్చారు. ఇసుక విధానం మార్చితే బాగుంటుందని ఓ మేస్త్రీ అభిప్రాయపడ్డాడు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా సాక్షి రోడ్‌షోలో అత్యధిక శాతం జగన్ పాలన బాగుందని, మరోసారి అవకాశం ఇస్తామని చెప్పారు. విశాఖపట్నంలోని ఉత్తర నియోజకవర్గం నుంచి తూర్పు, భీమిలి, పెందుర్తి మీదుగా అనకాపల్లి జిల్లాలోని మాడుగుల, చోడవరం, అనకాపల్లి వరకూ సాగిన రోడ్‌షోలో ఓటర్ల మనోగతం ఇది..

-కరుకోల గోపీకిశోర్ రాజా, సాక్షి, విశాఖపట్నం



అనంతపురం జిల్లా రోడ్ షో

మేలు చేసిన వారిని మరిచిపోలేం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 70 కిలోమీటర్ల పరిధిలోని ఓటర్లను సాక్షి రోడ్ షో బృందం పలకరించింది. మాకు రాజకీయాలతో పనిలేదు.. సాయం చేసిన వారికి అండగా నిలుస్తామని కొందరు చెబితే.. మహిళలు, చేతివృత్తిదారులు, కూలీలు, రైతులు, వృద్ధులు తమకు సాయం చేసిన జగన్‌కు ఓటేస్తామని నిర్మొహమాటంగా పేర్కొన్నారు. జిల్లాలో అనంతపురం, రాప్తాడు, ధర్మవరం, పెనుకొండ నియోజకవర్గాల్లో 75 కిలోమీటర్లు సాగిన రోడ్‌షో లో ఓటర్ల మనోగతం ఇది..

(జి.రామచంద్రారెడ్డి/బి.నగేష్, అనంతపురం)

చెన్నేకొత్తపల్లిలో ('అనంత' రోడ్‌షో)



ఆంజనేయులు
ఆటో డ్రైవర్

ఉదయం 11 గంటలకు: చెన్నేకొత్తపల్లికి చేరుకున్నాం. టీస్టాల్ నిర్వాహకుడు దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ ఊరిలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాయన్నాడు. నాగసముద్రం పంచాయతీ పల్లెన్నగారిపల్లికి చెందిన శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మళ్లీ జగన్ రాకపోతే పథకాలు ఆగిపోతాయనే భయం ఓటర్లలో ఉందన్నాడు. అనంతరం పెనుకొండ మండలం గుట్టూరులో ఆటోడ్రైవరు ఆంజనేయులుతో మాట్లాడాం. మా కుటుంబానికి రూ.5 లక్షలకు పైగా లబ్ధి జరిగింది. పథకాల కోసం ఏ నాయకుడి వద్దకు, అధికారి వద్దకు వెళ్లలేదు. వలంటీరు వచ్చి రాసుకుని వెళ్లేవాడు.' అని చెప్పాడు.

బాలయ్య శాస్త్రి లేఅవుట్(విశాఖ ఉత్తరం)



ఉదయం 8.30 గంటలు: కొబ్బరి బొండాలు కొడుతున్న రాజుని పలకరించగా.. మనకెందుకు బాబాయ్ రాజకీయాల గురించి.. అంటూ తటపటాయించాడు. ఏ పార్టీ ఈసారి గెలిస్తే బాగుంటుందని అడగ్గా.. 'ఇక్కడైతే కేకే రాజు పక్కా.. కరోనా రోజుల్లో ప్రతి ఇంటికీ భరోసా ఇచ్చారు. పైన మాత్రం జగనే వస్తాడు. మా బంధువుల్లో ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం ఇచ్చారు. చాలా కుటుంబాలు బాగుపడ్డాయి' అని చెప్పాడు. అక్కడ నుంచి కొంచెం ముందుకెళ్తే.. రిటైర్డ్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఇస్త్రీ బండి దగ్గర ఉన్న సన్యాసిరావులు కూడా జగన్ రావచ్చని చెప్పారు.

అనంతపురం సప్తగిరి సర్కిల్‌లో..

ఉదయం 7.20 గంటలకు అనంతపురం కలెక్టరేట్ వద్దకు వెళ్తే ఫరీద్, రాము టీ తాగుతూ మాట్లాడుకుంటున్నారు. జగన్ మళ్లీ గెలుస్తాడని ఫరీద్ చెబితే.. తాను పక్కా టీడీపీ అని అయినా ఈసారి అనంతపురంలో అనంత వెంకటరామిరెడ్డి గెలుస్తాడని రాము చెప్పాడు. అక్కడ నుంచి కందుకూరు వైపు రాప్తాడు నియోజకవర్గం వెళ్తుండగా మధ్యలో ఇటుకల బట్టీ వద్ద ఆగి కూలి పని చేస్తున్న మాధవితో మాట్లాడితే.. తనకు ఏటా రూ.9,100 చొప్పున డ్వాక్రా రుణమాఫీ డబ్బులు అందాయని, అర్హత ఉన్న పథకాలన్నీ వచ్చాయని చెప్పింది.



మాధవి (ఇటుకుల బట్టీ కూలీ)

కందుకూరు శివారులో..



ఈడిగ మహేశ్వరి, కందుకూరు

ఉదయం 8.10: కందుకూరు శివారులోని జగనన్న కాలనీ వద్ద ఆగాం. లబ్ధిదారులు ఈడిగ మహేశ్వరి, సరస్వతి, లక్ష్మీదేవిలు మాట్లాడుతూ.. 'ఇక్కడ సెంటు రూ. 3 లక్షలకు పైగా ఉంది. మాకు సెంటున్నర స్థలం ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించారు. జగన్ సాయం మరచిపోలేం' అన్నారు. కందుకూరులో ఓ అరుగుపై తలారి ఓబుళపతి, సాకే నారాయణ, ఆర్.నారప్పరెడ్డి, రాగే యల్లప్ప కూర్చుని ఉండగా పలకరించాం. పరిటాల సునీతను రెండుసార్లు గెలిపించినా తమ ఊరికి రోడ్డు కూడా వేయించలేదని.. తోపుదుర్తి ఎమ్మెల్యే అయ్యాక రోడ్డుకు మోక్షం వచ్చిందన్నారు. జగన్ పాలనలో ఇంటికే పథకాలు అందుతున్నాయని చెప్పారు.

ప్యాదిండి సమీపంలో..



ధర్మవరం నుంచి ప్యాదిండి మీదుగా ఎస్‌ఎస్ గేట్ వైపు వెళ్లగా.. మధ్యలో చీనీ తోటలో కూర్చున్న రైతులు భాస్కర్‌రెడ్డి, పార్థసారథిరెడ్డి వద్దకు వెళ్లి మాట్లాడాం. తమకు ఏటా సగటున రూ.లక్ష వరకు పంటల బీమా వచ్చిందన్నారు. ఏటా రూ. 13,500 రైతు భరోసా వస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో మండల కేంద్రానికి వెళ్లాల్సిన ఇబ్బందులు తప్పాయన్నారు.

హనుమంతవాక జంక్షన్(విశాఖ తూర్పు)



పాండురంగ, ఆటోడ్రైవర్, ఆరిలోవ

ఉదయం 9 గంటలు: ఆటోడ్రైవర్‌లు చిన్ని, పాండురంగను పలకరించగా.. ఈ సారి జనసేన వస్తుందని చిన్ని చెప్పగా.. 100 శాతం జగనే నండీ అంటూ పాండు సమాధానమిచ్చాడు.

పాండు : 21 సీట్లతో జనసేన ఎలా వస్తుందిరా.?
చిన్ని: 21 కాదు.. 25
పాండు : 25 కాదు.. 50 అనుకో.. పవన్ సీఎం అవుతారా.? చూడండి.. ఎవరేమనుకున్నా.. జగనే మళ్లీ సీఎం అవుతారు.

విశాఖ తూర్పు నియోజకవర్గంలో వెలగపూడి రామకృష్ణబాబు, ఎంవీవీ సత్యనారాయణ మధ్య పోటీ హోరాహోరీగా ఉంది. అయితే రాష్ట్రంలో మాత్రం జగన్ మళ్లీ సీఎం అవుతారు అని పాండు అన్నాడు.

అక్కడ నుంచి కొంచెం ముందుకెళ్లగా.. ఫ్రూట్‌జ్యూస్ అమ్ముతున్న శ్రీను మాత్రం ఎవరొస్తారో చెప్పలేమన్నారు. ముందుకెళ్లి టిఫిన్ సెంటర్ చందుని అడిగితే జగన్ పక్కా అంటూ నవ్వుతూ తన పనిలో మునిగిపోయాడు.

పెనుకొండ పట్టణంలో..



రాధమ్మ, హోటల్ నిర్వాహకురాలు

మధ్యాహ్నం 12 గంటలకు: మునిమడుగులో ఆటో డ్రైవర్ మహిధర్, హోటల్ నిర్వాహకురాలు రాధమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అర్హత ఉన్న ప్రతి సంక్షేమ పథకం అందిందని చెప్పారు. మధ్యాహ్నం పెనుకొండ పట్టణంలో రిటైర్డ్ జూనియర్ వెటర్నరీ అధికారి ఆంజనేయులును కలవగా.. ఆయన మాట్లాడుతూ.. ఈ ఐదేళ్లలో పేదలకు సాయం జరిగిందని.. సాయం చేసిన వారిని ప్రజలు ఎప్పుడూ గుండెల్లో పెట్టుకుంటారన్నారు. అంతకు ముందు చెన్నేకొత్తపల్లిలో రామాంజనేయులు మాట్లాడుతూ తాను టీడీపీ అభిమానినని, ఈ ప్రభుత్వంలో ఎవరి సిఫార్సు లేకుండానే సంక్షేమ పథకాలు అందాయన్నారు. అర్హత ఉన్న ప్రతి పథకం అందిందన్నారు. పెనుకొండలో రామకృష్ణ మాట్లాడుతూ పథకాలు నిష్పక్షపాతంగా అందాయని.. ఓటు మాత్రం ఎవరికి వేయాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు.



ఆంజనేయులు, రిటైర్డ్ జూనియర్ వెటర్నరీ అధికారి

సింహాచలం కొండ దిగువన..



లక్ష్మమ్మ,లండగరువు

ఉదయం 10 గంటలకు: భీమిలి పరిధిలోని సింహాచలం కొండ దిగువన ఆగగా.. వృద్ధురాలు కనిపించింది. మళ్లీ ఎవరొస్తారని అడగ్గా.. 'చంద్రబాబు రాకూడదు. మాటిళ్లో అందరి జీవితాలు అతని వల్లే పోయాయి. పంచగ్రామాల సమస్య పరిష్కారం కాలేదు. కోర్టుకెళ్లడానికి కారణం చంద్రబాబే. పవన్ ఒక్కడొచ్చుంటే మా కులపోడని ఆలోసించేవాళ్లమేమో. ఇప్పుడది కూడా పోయింది' అంటూ ఆటో ఎక్కేసింది. పక్కనే ఉన్న సెలూన్ షాప్ ఈశ్వర్, పూల దుకాణం మస్తాను ఫ్యాన్ గ్యారెంటీ అన్నారు.

ధర్మవరం మండలం చిగిచెర్లలో..



మాబు, టైలర్

ఉదయం 9.20: ధర్మవరం మండలం చిగిచెర్లలో టైలర్ మాబు తారసపడ్డారు. 'జగన్ సొమ్ము తిని ఎలా మరచిపోతాం. చెప్పిన హామీలన్నీ నెరవేర్చాడు. నా ఇద్దరు కూతుళ్లకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అందించారు. నా భార్యకు రూ.70 వేలు డ్వాక్రా రుణ మాఫీ డబ్బులు వేశారు. గతంలో చంద్రబాబు హామీ ఇచ్చి పట్టించుకోలేదు' అని మనసులో మాట బయటపెట్టాడు. ధర్మవరం పట్టణంలోని ఇందిరానగర్‌లో.. పెద్దన్నను పలకరించగా.. 'మాకు అమ్మఒడి, ఆసరా పథకాలు అందాయి. నాకు వృద్ధాప్య పింఛన్ రూ. 3 వేలు వస్తోంది. ప్రతి నెలా వలంటీరు తెచ్చేవాడు. వలంటీర్లు వద్దని ఎవరో చెప్పారంట ఏప్రిల్‌లో ఇంటికి రాలేదు. తెచ్చుకునేందుకు నానా తంటాలు పడ్డాం' అని చెప్పాడు.

పెందుర్తి నియోజకవర్గం గాంధీనగర్‌లో..



రామారావు, తాపీ మేస్త్రి

ఉదయం 11 గంటలకు: నేరుగా పెందుర్తి నియోజకవర్గంలోని గాంధీనగర్‌లో కొత్తగా నిర్మించిన యూపీహెచ్‌సీకి వెళ్లగా.. తాపీ మేస్త్రీ రామారావు కనిపించాడు. 'జగన్ బాగా సెయ్యలేదని మేం సెప్పట్లేదు. మా పిల్లలకు మంచి సదువు ఇచ్చారు. ఆస్పత్రి పెట్టి మాకు వైద్యం ఇచ్చినాడు. ఏ ఇబ్బంది వచ్చినా.. ఇక్కడికే ముందు వస్తాం. మందులన్నీ మంచిగా ఇస్తారు. ఒక్క ఇసక ఇషయంలో మాత్రం ఇబ్బంది పడ్డాం' అని చెప్పుకొచ్చాడు. పెందుర్తి, పినగాడి నుంచి.. సబ్బవరం మండలం గుల్లేపల్లి మీదుగా వెళ్తుండగా.. కల్లుగీత కార్మికుడు లావేటి వెంకట్రావు తారసపడ్డాడు. 'మేము తీసే కల్లు లాగే మా జగన్ ప్యూర్. జగన్ అంటేనే నిలువెత్తు నమ్మకం. చంద్రబాబు కల్పితాలు ఎన్నయినా చెప్పొచ్చు. కానీ చేసి చూపించింది మాత్రం జగన్ ఒక్కడే' అన్నాడు.



లావేటి వెంకట్రావు, కల్లుగీత కార్మికుడు

ధర్మవరం శివారు ఇందిరమ్మ కాలనీలో..





ఉదయం 10.10: ధర్మవరం శివారులోని ఇందిరమ్మకాలనీ.. చేనేత కార్మికులైన పల్లా రంగయ్య, నాగరత్నమ్మ ఇంటికి వెళ్లాం. ఇద్దరూ చీర నేస్తుండగా పలకరించాం.. 'వైఎస్సార్ హయాంలో మాకు స్థలం ఇచ్చి ఇల్లు కట్టించారు. జగన్ వచ్చాక నేతన్ననేస్తంలో ఏటా రూ. 24 వేలు ఇస్తున్నారు. కరోనా సమయంలో చేసిన సాయం మరిచిపోలేం. మా ముగ్గురు కూతుళ్లకు రెండు నెలల వ్యవధిలోనే కాన్పులు చేశాం. ఆ సమయంలో జగనన్న సాయం చేశాడు. జగన్‌కే ఓటు' అని చెప్పారు.

పీఎస్‌పేట(చోడవరం నియోజకవర్గం, విశాఖ రోడ్‌షో)



తలారి సత్యనారాయణ, రైతు

మధ్యాహ్నం ఒంటి గంటకు: చోడవరం నియోజకవర్గం పీఎస్ పేటలో చెరకు రైతుల్ని పలకరించాం. రైతు తలారి సత్యనారాయణ మాట్లాడుతూ.. 'వైఎస్సార్ హయాంలో రెండు రాష్ట్రాల్లో 28 కోపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీలుంటే.. చంద్రబాబు వచ్చాక గోవాడ ఒక్కటే మిగిలింది. ఆ ఫ్యాక్టరీని చంద్రబాబు రూ.120 కోట్ల అప్పుల్లోకి నెట్టేశారు. జగన్ వచ్చాక ఆ అప్పుల్ని తగ్గించారు. ఫ్యాక్టరీ నడిపేందుకు రూ.80 కోట్లు గ్రాంట్ ఇచ్చారు. మళ్లీ జగన్ వస్తేనే ఈ ఫ్యాక్టరీ నడుస్తుంది. రైతు రుణమాఫీ అని చెప్పి మోసం చేశారు. ఒక్క రూపాయి చెల్లించలేదు. నా దగ్గర బాండు ఉంది చూపిస్తాను' అన్నాడు. మిగిలిన రైతులు నాయుడు, వెంకట్రావు, సూర్యనారాయణ కూడా అదే అభిప్రాయం వ్యక్తం చేశారు. అనకాపల్లి వైపు వెళ్తుండగా.. రిటైర్డ్ ఉద్యోగి కేవీ గౌరీపతిని పలకరించగా.. 'అనకాపల్లి జిల్లా కేంద్రం కావాలన్న కలని సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారు. జగన్ పాలనలో ప్రతి ఒక్కరూ హ్యాపీగానే ఉన్నారు. ఇక్కడ లోకల్ నేత బూడి ముత్యాల నాయుడిని ప్రతి ఒక్కరూ నమ్ముతున్నారు' అని చెప్పారు.



కేవీ గౌరీపతి, రిటైర్డ్ ఉద్యోగి

మాడుగుల మండలం కె.కోటపాడులో..



నారాయణమ్మ

మధ్యాహ్నం 12.30 గంటలకు: మాడుగుల మండలం కె.కోటపాడు వెళ్లి నారాయణమ్మ అనే మహిళను పలకరించాం. 'మా ఆయనకు కాలు, చేయి పనిచేయదు. జగన్ మా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ప్రతి నెలా ఇంటికే పెన్షన్ ఇస్తున్నారు. చేయూతలో రూ.18,750తో చిన్న కొట్టు పెట్టుకున్నాను. ఆ షాపుపై రుణం వచ్చింది. మళ్లీ జగనే ముఖ్యమంత్రి అవుతాడు' అని ఆనందంగా చెప్పింది.

జగన్‌కు ప్రజలే ప్రచారకర్తలు



భవిష్యత్ తరాలు ఆనందంగా జీవించాలని తాపత్రయ పడే ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారు. దుష్ట చతుష్టయం చేస్తున్న అబద్ధపు ప్రచారాలను ఎల్లకాలం ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. మంచి పనులు చేసే వారికి లబ్ధి పొందిన ప్రజలే ప్రచారకర్తలు. రాష్ట్రంలో ఎవరిని కదిపినా జగన్ ప్రభుత్వం చేసిన మంచిని, అభివృద్ధిని గుక్క తిప్పుకోకుండా చెప్తారు.

- పల్లపాటి యేసుబాబు, పెడన, కృష్ణా జిల్లా

ప్రభుత్వ పాలన చాలా బాగుంది



జగన్ పరిపాలన సంస్కరణలు బాగున్నాయి. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారు. వలంటీర్లతో ప్రభుత్వ సేవలు ప్రతి ముంగిటకూ చేరాయి. నాడు– నేడు ద్వారా విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేశారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలను ఎంతగానో ఆదుకుంటున్నారు. రైతాంగం జగన్‌ను దేవుడిలా కొలుస్తోంది. ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుబంధంగా మార్చి, గ్రామీణ ప్రాంతాల్లో రైతులను ఆదుకుంటే కూలీల సమస్య తీరుతుంది.

- ఎంవీ రమణారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, అనంతపురం

నాకు నచ్చిన గొప్ప నేత జగన్



ఈ ప్రపంచంలో నాకు బాగా నచ్చిన నేత సీఎం జగన్. మా తల్లిదండ్రులు ఫ్రీడమ్ ఫైటర్స్. గత 40 ఏళ్లుగా రాజకీయాలు పరిశీలిస్తున్నా. ఇలాంటి సీఎం ఎక్కడా నాకు కనిపించలేదు. దేశంలో ఏ సీఎం చేయనంత గొప్పగా పేదల కోసం, వారి చదువుల కోసం రూ.73 వేల కోట్లు ఖర్చు చేయడం సంచలనం. ప్రజలపై అమిత ప్రేమ ఉన్నవాళ్లే ఇలా చేయగలరు. ఏపీలో సుమారు 80 శాతం మంది పేదలే. పేదల గుండెల్లో జగన్ ఉన్నారు. ఈసారీ జగన్‌కే జనాలు పట్టం కట్టడం తథ్యం.

- అశోక్ మెహతా, న్యూఢిల్లీ



పిడుగురాళ్ళ మెడికల్ కళాశాల

వైద్య రంగం కొత్తపుంతలు

- పిడుగురాళ్ల మండలం కామేపల్లిలో 47.54 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- ఇది పూర్తయితే ఓపీడీ, ఐపీడీతో పాటు 24 గంటలూ అక్యూట్ కేర్ బ్లాక్, ఐసీయూ, ఎస్‌ఐసీయూ, ఎంఐసీయూ, ఎస్ఐసీయూ వార్డులు అందుబాటులోకి వస్తాయి.
- దీనికోసం కేంద్ర ప్రభుత్వం రూ. 195 కోట్లు వాటాగా విడుదల చేసింది. మరోవైపు బాపట్లలో రూ.505 కోట్లతో వైద్య కళాశాలను నిర్మించనున్నారు.
- ఇందుకు 51.07 ఎకరాల్లో జమ్ములపటం, మూలపాలెం సరిహద్దుల్లో భూమిని సేకరించారు.
- నాడు-నేడులో భాగంగా జిల్లాలో 8 నూతన పీహెచ్‌సీ భవనాల నిర్మాణం, 77 పీహెచ్‌సీ భవనాల ఆధునీకరణకు రూ.49.24 కోట్లు ఖర్చు చేశారు.
- నవరత్నాల సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకూ 91 లక్షల మంది లబ్ధిదారులకు రూ.30 వేల కోట్లు మంజూరు చేసింది.

ఇదే అభివృద్ధి కదా.. గుంటూరు ఫిదా

- ఈ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న ప్రగతి
- పిడుగురాళ్ల, బాపట్లలో మెడికల్ కళాశాలల ఏర్పాటు
- నిజాంపట్నం, ఓడరేవులో ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణం
- ఆక్వా యూనివర్సిటీ మంజూరు చేసిన ప్రభుత్వం
- గుంటూరు చానల్ విస్తరణతో రైతాంగం హర్షం
- వరికెశెలపూడి ఎత్తిపోతలకు సీఎం శంకుస్థాపన
- వందల కోట్లతో నాడు - నేడు పనులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు :

గుంటూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన జనరంజకంగా సాగింది. ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పరుగులు తీసింది. అన్ని రంగాల్లో ఉజ్వల ప్రగతికి బాటలు వేసింది. నాడు-నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు మార్చింది. అన్ని రంగాల్లో సమీకృత అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకుంది. నాడు-నేడు పథకం కింద జిల్లాలోని 1,183 పాఠశాలల్లో రూ. 289 కోట్లతో నూతన భవనాల నిర్మాణం, ఆధునీకరణ పనులు చేపట్టారు. పరిపాలనా సౌలభ్యం కోసం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా ఏర్పడిన తర్వాత మూడు జిల్లాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గుంటూరు నగరాన్ని రూ.300 కోట్లతో అభివృద్ధి చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 872 గ్రామ సచివాలయాలు, 462 వార్డు సచివాలయాల్లో 11 వేల మంది సిబ్బంది ప్రజల గుమ్మం వద్దే సంక్షేమ ఫలాలను అందిస్తున్నారు.

వైద్య కళాశాలకు మహర్దశ

గుంటూరు వైద్య కళాశాలకు మహర్దశ వచ్చింది. సీఎం వైఎస్ జగన్ ఈ కళాశాలపై ప్రత్యేక దృష్టి సారించి నాడు-నేడులో భాగంగా రూ. 500 కోట్లు మంజూరు చేశారు. దీంతో వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న గుంటూరు జీజీహెచ్, ఛాతి సంబంధిత వ్యాధుల ఆసుపత్రి రూపు రేఖలు మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వైద్య కళాశాలకు ఇటీవల 40 పీజీ సీట్లు మంజూరయ్యాయి. దీనికి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ. 40.8 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులతో లెక్చర్ గ్యాలరీలు, పీజీ మహిళ వసతి గృహం, అసంపూర్తిగా నిలిచిపోయిన సర్వీస్ బ్లాక్ నిర్మాణ పనులు పూర్తిచేయనున్నారు.

ఇదిగో.. మార్పు



షిపింగ్ హార్బర్

జనరంజకంగా జగనన్న కాలనీలు

- పేదలకు ఇళ్ల పథకంలో భాగంగా మూడు లక్షల మందికి 6,660 ఎకరాల భూమిని రూ.1,240 కోట్లతో అభివృద్ధి చేశారు.
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలిదశలో 1,63,053 ఇంటి స్థలాలు కేటాయించగా వీటిలో 1,12,887 మంది ఇళ్లు నిర్మిస్తున్నారు.
- 587 లే అవుట్లతో కొత్త ఊళ్లు ఏర్పడ్డాయి. గుంటూరు, నరసరావుపేట, తెనాలి, బాపట్ల, వినుకొండలలో పెద్ద లే అవుట్లు ఉన్నాయి.
- రాష్ట్రంలోనే అతి పెద్ద లే అవుట్‌గా పేరేచర్ల నిలిచింది.
- ఇందులో 18,091 ఇళ్ల స్థలాలు కేటాయించారు. తాజాగా రాజధాని ప్రాంతంలో 50,793 మందికి పట్టాలు పంపిణీ చేసింది.



వైఎస్సార్ జగనన్న కాలనీ, గుంటూరు జిల్లా పేరేచర్ల-3



గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గం పెదకాకాని మండలం పెదకాకాని గ్రామంలోని గుంటూరు ఛానల్

వెల్దుర్తి మండలంలోని ఏడు గ్రామాల పరిధిలో 25 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించడానికి నాగార్జునసాగర్ రిజర్వాయర్ ఎగువన వరికపూడిశెల వాగుపై రూ.340 కోట్లతో ఎత్తిపోతల పథకం పనులకు ఇటీవల సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. ఈ పథకం పూర్తయితే 73 వేల ఎకరాల ఆయకట్టుకు నీటి ఎద్దడి సమస్య తీరనుంది.

75 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ


- గుంటూరు చానల్ విస్తరణకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.
- ఈ పనులతో 48 వేల ఎకరాల ఆయకట్టు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు రానుంది.
- మల్లయపాలెం, కాకుమాను మేజర్ల కింద ఉన్న 9,600 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగపడుతుంది.
- ప్రస్తుతం 47 కిలోమీటర్ వరకూ ఉన్న గుంటూరు చానల్‌ను ఆధునీకరించి కాలువ సామర్థ్యాన్ని పెంచుతున్నారు.
- దీని కోసం కాలువలో లైనింగ్ పనులు చేయనున్నారు.
- ఈ పనులు పూర్తయితే సామర్థ్యం 600 క్యూసెక్కుల నుంచి 750 క్యూసెక్కులకు పెరుగుతుంది.
- 75 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఏర్పడుతోంది.
- ఈ పనుల కోసం రూ.274.53 కోట్లతో పరిపాలనా అనుమతులు వచ్చాయి.
- పనులను మెగా ఇంజనీరింగ్ సంస్థ చేపట్టింది.
- భూసేకరణ కోసం రూ.113.39 కోట్లు ఖర్చవుతుందని అంచనా
- జిల్లాలో 389.78 ఎకరాలు, బాపట్ల జిల్లాలో 51.38 ఎకరాలు కలిపి మొత్తం 441.16 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

ఇదిగో గ్రామ స్వరాజ్యం

- పంచాయతీరాజ్ శాఖ ద్వారా 311 సచివాలయ భవనాలు
- 346 స్కూల్ ప్రహరీల పనులు
- 139 బల్క్‌మిల్క్ యూనిట్లు, 165 వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ భవనాలు పురోగతిలో ఉన్నాయి.
- 138 రైతు భరోసా కేంద్రాలు,
- 96 వైఎస్సార్ క్లినిక్‌లు రూ. 627 కోట్ల అంచనాతో పూర్తి చేశారు.

కొత్త జిల్లాలతో అభివృద్ధి పరుగులు

- కొత్తగా జిల్లాలో పలు జాతీయ రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.
- అవుటర్ రింగ్ రోడ్డు కోసం 189 కిలోమీటర్ల పొడవుతో రూ.17,772 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి నుంచి చినకాకాని వరకూ చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- రూ.1064.24 కోట్లతో కొండమూడి- పేరేచర్ల రోడ్డును రెండు లైన్ల నుంచి నాలుగులైన్లు చేసే ప్రాజెక్టుకు ఆమోదముద్ర పడింది.
- ఇది పూర్తి అయితే గుంటూరు నుంచి హైదరాబాద్ ప్రయాణం సులువు అవుతుంది.
- ఓడరేవు -చిలకలూరిపేట ప్రాజెక్టు కూడా పట్టాలు ఎక్కనుంది.



వరికపూడిశెల వాగు



నిజాంపట్నం షిపింగ్ హార్బర్

ఫిషింగ్ హార్బర్లకు నూతన సొబగులు

- నాబార్డు సహకారంతో నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ కోసం చేస్తున్న ఖర్చు - రూ.450 కోట్లు
- ఓడరేవులో ఫిషింగ్ హార్బర్ కోసం వెచ్చించిన నిధులు - రూ.450 కోట్లు
- నిజాంపట్నంలో ఆక్వా యూనివర్సిటీ కోసం చేస్తున్న ఖర్చు - రూ.180 కోట్లు
- హార్బర్ రెండవ దశ అభివృద్ధికి కేటాయించిన నిధులు - రూ.451 కోట్లు
- హార్బర్ రెండవ దశలో ప్రధానంగా మోటరైజ్డ్ బోట్లు-1000, 15 మీటర్ల మెకనైజ్డ్ బోట్లు-500, 24 మీటర్ల టూనా లాంగ్ లైనర్స్-100 వంటి బోట్లు ఒకేసారి 1600 వరకూ నిలుపుకునేందుకు వీలుగా 500 మీటర్ల వైశాల్యంతో జెట్టీ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

ఆ ఇల్లు.. సంక్షేమ పొదరిల్లు

అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోట మండలం గుంతావారిపల్లెకు చెందిన మర్రిమాకుల నరసింహులుది వ్యవసాయాధార కుటుంబం. అయినా పెద్దగా ఆదాయం కళ్లజూసింది లేదు. కొడుకు ఆటో నడుపుతూ తీసుకొచ్చే ఆదాయమే ప్రధాన ఆధారం. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ ఇంటికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక భరోసా కలిగింది. వారి ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇంటిల్లిపాదీ సంక్షేమ పథకాలకు నోచుకున్నారు. ఒకప్పుడు సేద్యంపై ఆధారపడిన కుటుంబం, ఇప్పుడు సంక్షేమ పథకాల లబ్ధితో కళకళలాడుతోంది.

- మూడు తరాలకు అందుతున్న సంక్షేమం
- సీఎం జగన్ పాలనలో రూ.6,69,770 లబ్ధి



భార్య, కొడుకు, కోడలు, మనవడితో నరసింహులు

పెద్దలిద్దరికి రూ.2.74 లక్షల లబ్ధి



గుంతావారిపల్లెకు చెందిన మర్రిమాను నరసింహులు, లక్ష్మీదేవి భార్యా భర్తలు, వీరికి ఇద్దరు కుమారులు. అందులో ఓ కొడుకు కుటుంబంతో వీరు కలిసి ఉంటున్నారు. నరసింహులుకు 2019 నుంచి 2024 ఫిబ్రవరి వరకు వృద్ధాప్య పింఛన్ ద్వారా రూ.1,52,250 లబ్ధి కలిగింది. వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లడంతో పంటల బీమా పథకం ద్వారా రూ.16,288 పరిహారం అందింది. పంట పెట్టుబడిగా ప్రభుత్వం రైతులకు అందించే రైతు భరోసా పథకం ద్వారా రూ.67,500 పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాలో జమయింది. నరసింహులు భార్య లక్ష్మీదేవికి ఏడాదికి రూ.18,750 చొప్పున వైఎస్సార్ చేయూత ద్వారా రెండు విడతల్లో రూ.37,500 లబ్ధి చేకూరింది. వీరిద్దరికీ కలిపి ప్రస్తుత ప్రభుత్వంలోరూ.2 లక్షల 73 వేల 538 ప్రయోజనం కలిగింది.

దశ తిరిగింది

కొడుకు, కోడలికి రూ.1.27 లక్షలు



నరసింహులు కుమారుడు రవీంద్ర, కోడలు సుశీలకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో భారీ లబ్ధి చేకూరింది. ఆటో నడుపుతూ జీవిస్తున్న రవీంద్రకు వాహనమిత్ర పథకం ద్వారా ఐదు విడతల్లో రూ.50 వేలు అందింది. ప్యాసింజర్ ఆటో నడిపే రవీంద్ర ఆ ఆటోను విక్రయించి, పాత టాటా ఏస్ వాహనాన్ని కొనుక్కున్నారు. దీని ద్వారా సరకు రవాణాతో ఉపాధి పొందుతున్నారు. భార్య సుశీలకు పంటల పెట్టుబడిలో భాగంగా రైతు భరోసా ద్వారా రూ.67,500 ఆర్థిక ప్రయోజనం కలిగింది. పంటల బీమా కింద రూ.6,898 పరిహారం అందింది. మహిళా సంఘంలో తీసుకున్న రుణానికి వడ్డీ ప్రభుత్వమే భరించడంతో రూ.2,434 వడ్డీ మాఫీ అయ్యింది. దీంతో వీరికి రూ.లక్షా 26 వేల 832 లబ్ధి చేకూరింది.

మనవళ్లకూ భారీ లబ్ధి



చరణ్‌తేజ

కుటుంబంలోని మూడో తరమైన మనవళ్లకూ ప్రభుత్వ పథకాల ద్వారా ప్రయోజనం కలిగింది. పెద్ద మనవడు చరణ్‌తేజకు వసతి దీవెన పథకం ద్వారా రూ.30 వేలు బ్యాంకు ఖాతాలో జమ అయింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో బీటెక్ పూర్తి చేసేందుకు జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా రూ.2,09,400 మంజూరైంది. దీంతో ఎలాంటి ఆర్థిక ఇబ్బందుల్లేకుండా చదువుకున్నాడు. జపాన్‌లోని ఐజు యూనివర్శిటీలో మూడు నెలల ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యాడు. జనవరి 16న చరణ్‌తేజ జపాన్ వెళ్లాడు. జగనన్న విద్యా దీవెన పథకంతో విమానమెక్కి విదేశాలకు వెళ్లాడు. మరో మనవడు గంభీర్ తేజకు రెండేళ్లుగా అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలు చొప్పున రూ.30 వేలు అందింది. మనవళ్లిద్దరి చదువుల కోసం సీఎం జగన్ ప్రభుత్వంలో రూ.2 లక్షల 69 వేల 400 లబ్ధి కలిగింది.


(షమీర్ బాషా, విలేకరి, బి.కొత్తకోట)

ఎలక్షన్ రీల్



రాష్ట్ర అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం: మంత్రి సీదిరి

కాశీబుగ్గ: రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని.. పలాస నియోజకవర్గం అంటే ముఖ్యమంత్రికి అత్యంత ప్రీతి పాత్రమైనదని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఆ అభిమానంతోనే ముఖ్యమంత్రిగా తొలిసంతకం పలాస కిడ్నీ ఆస్పత్రికి రూ.50 కోట్లు నిధుల విడుదలపైనే పెట్టారని గుర్తు చేశారు. బుధవారం మందస మండలం మకరజోల గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మూడు మండలాలు, మున్సిపాలిటీలో రోడ్ల విస్తరణ పనులు, ఆఫ్‌షోర్ పనులు పునఃప్రారంభం, రూ.800 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు, జీడి నూతన పారిశ్రామిక వాడకు శంకుస్థాపన, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుతో పాటు సుమారు రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు, రూ.15 వందల కోట్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని వివరించారు. పలాస నియోజకవర్గం అభివృద్ధిని చూసి తమను ఆశీర్వదించాలని కోరారు.



ఐదేళ్ల పాలన చూసి ఓటేయాలి: ఎంపీ మార్గాని

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాల అమలును చూసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని రాజమహేంద్రవరం ఎంపీ, సిటీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ కోరారు. నగరంలోని 5వ వార్డు చెక్కల వీధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ఎంపీగా నగరంలో తాను చేసిన అభివృద్ధిని చూసి, నచ్చితేనే ఓటువేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. మరోసారి అధికారంలోకి వస్తే మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సిటింగ్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఈ ఐదేళ్లలో పదవిని అనుభవించారే కానీ రాజమండ్రి నగరానికి ఎలాంటి మేలు చేయలేదన్నారు.



అభివృద్ధికే మళ్లీ పట్టం: ఎమ్మెల్యే బడ్డుకొండ

భోగాపురం: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని పార్టీలు జతకట్టి వచ్చినా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. భోగాపురం మండలం అమటాం రావివలస, పోలిపల్లి, గూడెపువలస, దల్లిపేట, భైరెడ్డిపాలెం, రెడ్డికంచేరు, చేపలకంచేరు, పోలిపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్రలో ప్రజల కష్టాలు, కన్నీళ్లు కళ్లారా చూసిన జగనన్న వాటి పరిష్కారానికే నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని తెలిపారు. వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ పథకాలు అందించారని పేర్కొన్నారు. కార్మికులు, కర్షకులు, రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు ఇలా ప్రతి వర్గానికి మేలు చేసింది జగనన్న ఒక్కరేనన్నారు. అందుకే ఆయన విజయం తథ్యమని చెప్పారు.

ప్రజల మంచి కోరే సీఎం జగన్



జగన్ సీఎం అయ్యాక ప్రజల గురించి మాత్రమే ఆలోచించే నాయకులు ఉన్నారన్న నమ్మకం కలిగింది. దివంగత మహానేత వైఎస్సార్ బిడ్డగా, ఆయనకు మించిన ఆదరణను జగన్ సొంతం చేసుకున్నారు. కరోనా రెండేళ్ల కాలంలో జగన్ కాకుండా వేరెవరు అధికారంలో ఉన్నా.. రాష్ట్రంలో లక్షలాది ప్రాణాలు గాల్లో కలిసిపోయేవి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా.. ప్రజలకు కష్టం కలగరాదని నిరంతరం పరితపించారు. అలాంటి జగన్ ప్రభుత్వమే మళ్లీ విజయం సాధించాలి.

- కె.దీపక్‌కుమార్, ఆస్ట్రాలజర్, భీమడోలు

మేలు పొందని కుటుంబం లేదు



రాష్ట్రంలో జగన్ సీఎం అయ్యాక ప్రభుత్వ మేలు పొందని కుటుంబం ఒక్కటీ ఉండదని చాలా గట్టిగా చెప్పగలను. ఇప్పుడు ఇన్ని బూటకపు హామీలతో రోడ్డెక్కిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కరోనా సమయంలో ఏ మూలన దాక్కున్నారో ప్రజలందరికీ గుర్తే. మన పిల్లలకు మంచి చదువు, ప్రజలకు మెరుగైన ఆరోగ్యం, నిరుపేదలకు ఇళ్లు, సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల సేవలు ఇలా.. జగన్ ప్రవేశపెట్టిన ప్రతి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా మారాయి.

- జయరాజ్, పిడుగురాళ్ల

హింసను ప్రేరేపించ వద్దు



అనుభవజ్ఞులమని చెప్పుకునే నేతలు రౌడీల్లా, గూండాల్లా మాట్లాడి, యువతను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదు. బట్టలూడదీసి కొడతాం, రాళ్లతో దాడి చేస్తాం, రేపు నిన్ను చంపితే ఏం చేస్తావ్ జగన్? తదితర ఉద్రేకాలకు దారితీసే మాటలు సరికాదు. ఇలాంటి నేతలపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుని, వారి అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలి. విచారణ జరిపి కఠిన శిక్షలు అమలు చేయాలి. ప్రజల కోసం నిత్యం పరితపించే ప్రభుత్వాలనే ప్రజలు ఓటేసి గెలిపించాలి.

- సి.శారద, సామాజిక మహిళా కార్యకర్త, కావలి, నెల్లూరు జిల్లా

'వనిత'రసాధ్యం

లాభాల 'మాల్'... చేయూత మార్ట్ వెరీ స్మార్ట్

- కార్పొరేట్‌కు దీటుగా 'చేయూత మహిళా మార్ట్'
- డ్వాక్రా గ్రూపుల ఆధ్వర్యంలో నిర్వహణ
- ఏర్పాటు చేసిన 10 నెలల్లోనే రూ.3 కోట్ల టర్నోవర్
- 2,050 స్వయం సహాయక సంఘాలతో ఏర్పాటు
- ఒక్కో మహిళ పెట్టిన పెట్టుబడి రూ.210 మాత్రమే

అలల హోరు జయగీతికై మార్మోగినట్టు.. స్వయం సహాయక సంఘాలే ప్రగతి సు'మాలై' విరిసినట్టు.. 'వనితర'సాధ్యమైన విజయం ఒడిలో వాలినట్టు.. నరసాపురం సిగన మాణిక్యమై మెరిసినట్టు.. పట్టణంలో వెలిసిన మహిళా మార్ట్.. దిగ్గజ సంస్థలకు దీటుగా నిలిచింది. అతివల అద్భుత శక్తికి గీటురాయిౖె వెలుగొందుతోంది. పది నెలల్లోనే రూ.మూడు కోట్ల టర్నోవర్‌తో మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. సంక్షేమ ప్రభుత్వ సాయంతో పేద మహిళల సత్తాను చాటుతోంది.

(కేతినీడి పాండురంగారావు, విలేకరి, నరసాపురం)



నరసాపురంలో కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటైన చేయూత మహిళా మార్ట్



మార్ట్‌లో సరుకులు కొనుగోలు చేస్తున్న కస్టమర్లు

మార్ట్ స్వరూపం ఇదీ

టర్నోవర్ : రూ.ల్లో 3,00,00,000	ఓనర్లైన మహిళల సంఖ్య 20,500
రోజుకు అమ్మకాలు రూ.70,000	సంక్రాంతి సీజన్‌లో రోజుకు విక్రయాలు రూ. 2,00,000

నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణం దాదాపు 32 తీరగ్రామాలకు కేంద్రం. పట్టణంలో రిలయన్స్, మోర్, ఆదిత్య వంటి దిగ్గజ సంస్థల సూపర్‌మార్కెట్లు(మార్టులు) ఉన్నాయి. వీటన్నింటినీ తలదన్నేలా సంక్షేమ ప్రభుత్వ చేయూతతో డ్వాక్రా మహిళలు షేర్ కేపిటల్‌తో 10 నెలల క్రితం మొగల్తూరు రోడ్డులో 216 జాతీయ రహదారి పక్కన వెలిసిన 'చేయూత మహిళా మార్ట్' దిన 'ధన' ప్రవర్ధమానమవుతోంది. నరసాపురం మండలంలోని 2,050 స్వయం సహాయక సంఘాల్లోని 20,500 మంది సభ్యులు ప్రతి ఒక్కరూ తలో కొంత పెట్టుబడి పెట్టి ఈ మాల్‌ను నెలకొల్పి ఓనర్లు కావడం విశేషం. కార్పొరేట్ మాల్స్‌తో పోటీపడుతూ రోజూ రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు అమ్మకాలు సాగిస్తోంది. మొన్నటి సంక్రాంతి పండుగ సీజన్‌లో రోజుకు రూ.2 లక్షల వరకు అమ్మకాలు సాగించి రికార్డు సృష్టించింది.

10 నెలల కిత్రమే ప్రారంభం..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత డ్వాక్రా గ్రూపులను మరింత బలోపేతం చేయడమే కాకుండా వారికి ఆర్థికంగా మరింత తోడ్పాటును అందించే కార్యక్రమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారు. ముఖ్యంగా మహిళలు డ్వాక్రా రుణాలతో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునే దిశగా ప్రోత్సహించారు. ఈ మార్ట్ ఏర్పాటుకు ఒక్కో మహిళ పెట్టిన పెట్టుబడి రూ.210 మాత్రమే కావడం గమనార్హం. మొత్తం 20,500 మంది సభ్యులు రూ.43.05 లక్షలు సేకరించగా, ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు మాల్ ఏర్పాటుకు విలువైన స్థలంలో ఉన్న డీఆర్‌డీఏ భవనాన్ని అద్దె లేకుండా ఉచితంగా సమకూర్చారు.

10 నెలల్లోనే రూ.3 కోట్ల పైనే టర్నోవర్..

మాల్ ఏర్పాటైన తరువాత ఇప్పటి వరకూ రూ.1.54 కోట్ల అమ్మకాలు మాల్‌లో జరిగాయి. సరుకుల కొనుగోళ్లతో కలుపుకుంటే ఈ 10 నెలల్లో జరిగిన టర్నోవర్ రూ.3.02 కోట్లు. చేయూత ఉమెన్ మార్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ పేరుతో రిజిస్టర్ అయింది. ఈ సొసైటీకి అధ్యక్ష కార్యదర్శులతోపాటు మరో 10 మందితో పాలకవర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మార్చిలో తొలి ఆర్థిక సంవత్సరం లాభాలు పంచుకోబోతున్నారు.

చేయూత షాపులకు హోల్‌సేల్‌గా విక్రయించాలని..

ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పథకం ద్వారా నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని 45 పంచాయతీల్లో దాదాపు 60 వరకు చిన్నచిన్న కిరాణా షాపులు ఉన్నాయి. ఈ షాపులకు కూడా సరుకులను ఈ మార్ట్ ద్వారా సరఫరా చేయాలని సొసైటీ తీర్మానించుకుంది. ఇదే జరిగితే వచ్చే ఏడాది టర్నోవర్ రూ.5 కోట్లు దాటే అవకాశం ఉంది. ప్రస్తుతం మాల్‌లో కంపెనీ ఐటమ్స్ మాత్రమే కాకుండా డ్వాక్రా మహిళలు స్థానికంగా తయారు చేసే తినుబండారాలు, పిండి వంటలు, చీపుర్లు వంటి వస్తువులను అమ్ముతున్నారు.

ఇక్కడే సరుకులు కొంటున్నాను



గతంలో నెలవారీ కిరాణా సరుకులు బయట పచారీ కొట్లలో కొనేదాన్ని. ఈ షాపు పెట్టిన తరువాత నుంచి ఇక్కడే కొంటున్నాను. సరుకులు చాలా నాణ్యంగా ఉంటున్నాయి. నేను కొనడమే కాకుండా నలుగురికి చెప్పి కొనిపిస్తున్నాను. నేనూ డ్వాక్రా మహిళనే. మా వాళ్లు పెట్టిన షాపులో సరుకులు కొనడం ఆనందంగా ఉంది. జగన్ బాబు ముఖ్యమంత్రి అయ్యాక చాలా మార్పులు వచ్చాయి. చాలా ఆనందంగా ఉంది.

– ఎరుబండి దుర్గ, నరసాపురం

కొన్ని సరుకుల ధర తక్కువే



మాది పక్కనున్న లక్ష్మణేశ్వరం గ్రామం. నాలుగు కిలోమీటర్ల నుంచి ఇక్కడకు వచ్చి సరుకులు కొంటున్నాను. పెద్దపెద్ద మాల్స్‌లానే ఉంది. కొన్ని సరుకుల ధర కూడా ఇక్కడ తక్కువగా ఉంది. ఈ షాపులో ఉండేవారు చాలా మర్యాదగా మాట్లాడుతున్నారు. ఈ షాపుకొస్తే మంచి అనుభూతి కలుగుతుంది.

– శ్రీనివాస్, లక్ష్మణేశ్వరం

ఎర్రబుక్‌లో పనిమనిషి పేరు!



లోకేశ్ అనే నేను.. మంగళగిరి సాసన.. సాసన.. ఆ.. సాసన.. ఆ.. ఆ.. అంటూ ఉంటే.. బాబూ.. బాబూ అంటూ టీడీపీ నేతలు లేపడంతో ఉలిక్కిపడి లేచారు.

ఓ ఇదంతా కలా.. నేను నిజమనుకున్నానండీ..

అయ్యో లోకేశ్ బాబు గారూ.. పగటి కలలు కనొద్దని నాన్నారు చెప్పారు కదా.. మళ్లీ ఎందుకు ఇవన్నీ..

ఏయ్.. మంగళగిరిలో ఈసారి నేనే గెలుస్తాను. ఎందుకంటే.. ఈ లోకేశ్.. మూ..ర్ఖుడూ...

అవును బాబు.. మీరు చెప్పకపోయినా.. మీరు మూర్ఖుడే అని తెలుగు ప్రజలందరికీ తెలుసులెండి.

బాబు గారు పిలుస్తున్నారు రండి...

నాన్నారూ.. పిలిచారంట.. ఎలక్షన్లు దగ్గరపడుతున్నాయి కదా.. ఇంక తగ్గేదే లేదు.. క్యాంపెయినింగ్ మామూలుగా ఉండకూడదు. ఎక్కడికి వెళ్లినా.. కచ్చితంగా మటన్ బిర్యానీ ఉండాల్సిందే. కోడికూర, గారెలు, స్వీట్లు మస్ట్‌గా పెట్టమని చెప్పండి. రేపటి నుంచే ప్రచారం స్టార్ట్ చేసేద్దాం.

అయ్యో.. చంద్రబాబు గారూ.. చినబాబుని ప్రచారానికి పంపొద్దండి.. ఎలక్షన్ ఖర్చు కంటే.. చినబాబు చిరుతిండి ఖర్చే ఎక్కువైపోతోంది.

అన్నా.. నా సంగతి తెలీదు.. నేను యువగళం యాత్ర చేస్తే.. జనగళం దద్దిల్లింది..

బాబూ.. అది దద్దిల్లింది కాదు.. దద్దరిల్లింది..

అదేలే అన్నా.. ఏదో ఒకటి అయ్యింది కదా.. నేను మైక్ పట్టుకుంటే.. జనం ఊగిపోతారు. డైలాగ్ చెబితే సైకిల్‌కే ఓట్లన్నీ పడతాయి తెలుసు కదా.. నా టంగ్ పవర్ అలాగుంటది..

ఎందుకు తెలీదు చినబాబూ.. మీ టంగ్ మామూలు టంగా... 2019 ఎలక్షన్లలో విన్నాం కదా.. ఏమన్నారో మరోసారి వినిపిస్తాను వినండి..

'అన్నా... పొరపాట్న కూడా.. సైకిల్ గుర్తుకు ఓటేస్తే.. మనం మన ఉరి తీసుకున్నట్‌లెత్తుంది' ఈ డైలాగ్ విన్నాక నాకో డౌటొస్తోంది లోకేష్ బాబూ.. మీరు ఈ మాట పొరపాటున అన్లేదు కదా.. కడుపులో దాచుకున్న నిజాలే కక్కేశారు కదా..

అన్నా.. అది ఒక్కసారి టంగ్ స్లిప్ అయ్యిందంతే..

ఒక్కసారా లోకేశ్ బాబూ.. ఇంకో డైలాగ్ వినండి...

''బంధుప్రీతి, మతపిచ్చి, కులపిచ్చి ఇలాంటి పార్టీ రాష్ట్రంలో ఏదైనా ఉందంటే.. అది తెల్దేశం పార్టీ అవునా కాదా..''

అంటే.. అదీ.. అన్నా..

నాయనా లోకేశం.. మీరేమీ చెప్పొద్దు. మీరు నోరు విప్పితే.. ఏ మాట వినాలో అని భయమేస్తోంది. ఆపెయ్యండి ప్లీజ్.

అన్నా.. నాన్నారు ట్రైనర్‌ని పెట్టి.. నన్ను శిల్పంలా చెక్కారు తెలుసు కదా..

అవును బాబూ.. శిల్పంలా చెక్కారు. కాకపోతే.. అది హేళన శిల్పంలా మారిపోయింది. వీళ్లలాగే అంటారు కానీ.. నేను ప్రచారం చేస్తాను నాన్నారు. ఈసారి నా సత్తా చూపిస్తాను.

ఏయ్.. ఆగాలి.. లోకేశ్ ఆగాలి.. పార్టీ కోసం కాసేపు సైలెంట్‌గా ఉండు.. ఇదిగో.. పనమ్మాయి మజ్జిగ తీసుకొచ్చింది తాగు...

ఆయ్.. మజ్జిగా.. తీసుకురా.. తీసుకురా.. లాలాజలం ఊటలు ఊరిపోతుంది.. ఏమేశావ్ ఇందులో.. చక్కరేశావా.. తియ్యగుందీ...

ఇదిగోండి చంద్రన్నా.. ఇదీ పరిస్థితి.. ప్రచారం చెయ్యండి బాబూ అంటే.. పునుగులు, బజ్జీలు, టిఫిన్స్ బండి దగ్గర ఆగిపోతున్నారు. అక్కడే గంటలు గంటలు గడిపేస్తున్నారు. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదన్నా..

నా పంచ్ పవర్ చూపిస్తానన్నా.. ఈ ఎలక్షన్లో నేను ప్రచారం చేస్తే గెలుపు గ్యారెంటీ..

నిజమే బాబు.. 2019 ఎన్నికల్లో తమరు ప్రచారం చేసిన చోట్లలో 80 శాతం సీట్లు గోవిందా.. గోవిందా.. ఫ్యాన్ గాలికి మన పార్టీ ఊగిపోయింది. మీరేదో పొడిచేస్తారని మిమ్మల్ని నమ్ముకొని ఎలక్షన్లకి వెళ్తే.. మజ్జిగ గ్లాసు పట్టుకొని గోదారి ఈదినట్లే..

అన్నా.. నేను మా నాన్నారిలా కాదు.. మూ..ర్ఖుడినీ..

ఎహె.. ఆపు లోకేశ్ బాబూ.. మీరు చెప్పినా.. చెప్పకపోయినా.. మాకు తెలుసు మీరు మూర్ఖుడే అని. అందుకే.. మీరు దయచేసి మా నియోజకవర్గానికైతే రావొద్దు.

అన్నా.. మందలగిరిలో ఈసారి కొద్దున్నాను.. అప్పుడు మీ అందరికీ సమాధానం చెప్తాను.

బాబ్బాబూ.. అది మందలగిరి కాదు. మంగళగిరి. చంద్రన్నా.. మనోడు పోటీ చేసిన నియోజకవర్గం పేరైనా సరిగ్గా పలకమని చెప్పండి. ప్లీజ్..

ఏయ్.. మా వాడు ప్రచారం చేస్తాడు. అన్నీ దగ్గరుండి చూసుకోవాలి.

ఏమని ప్రచారం చేస్తాడన్నా.. సైకిల్ పోవాలంటాడు.. అంటే.. మన పార్టీ ప్రచారంలో మనం ఓడిపోవాలని చెబితే.. ఇంక జనం ఎలా ఓటేస్తారు? సంకారావం అని మా చంకలో ఎక్కి కూర్చుంటాడు. మేపలేక మేం చావాలి. ఆమెవరో ప్రశాంతత్త అంట.. ఆమె దగ్గరికైనా పంపించి.. సరిగా ఎలా మాట్లాడాలో నేర్పించండి ముందు.

అన్నా.. అది ప్రశాంతత్త కాదు.. ప్రశాంతత్తా.. మీరు ఎక్కువగా మాట్లాడితే.. మీ పేరు కూడా ఎర్రబుక్కులో రాసేస్తాను.

ఆ.. రాసేస్తారు. రాసెయ్యండి లోకేశ్ బాబూ.. రాసి ఏం చేస్తారు.? ఏమీ చెయ్యలేరులెండి..

అన్నా.. ఎర్ర బుక్కు గురించి తక్కువ అంచనా వెయ్యొద్దు.

సీఎం పేరు దగ్గరి నుంచి.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు.. చివరికి మా పనిమనిషి పేరు కూడా ఎర్రబుక్కులో రాశాను తెలుసాండీ..

అయ్యో.. పని మనిషి పేరెందుకు రాశారు చినబాబూ?

ఎండనపడి ఇంటికొస్తే.. ఫ్యాన్ వెయ్యనా బాబుగారు అనింది.. ఫ్యాన్ పేరు చెబితేనే నాకు, మా నాన్నారికి చెమటలు పడతాయని తెలిసి కూడా.. ఫ్యాన్ వేస్తానంటే.. నన్ను భయపెట్టడానికే కదా! అందుకే మా పని మనిషి పేరు కూడా ఎర్ర బుక్కులోకెక్కించేశాను.

మీ ఇంట్లో పనిమనిషే కదా.. ఆ మాత్రం దానికి ఎర్ర బుక్కు వరకు ఎందుకయ్యా.. ఇప్పుడే పనిలోంచి తీసెయ్యొచ్చుగా..

అలాగెలా కుదుర్తుంది.. మా నాన్నారు సీఎం కావాలి.. అప్పుడే ఆ ఎర్రబుక్కులో పేర్ల పని పడతాను. అంత వరకు కుదరదంతే..

ఏం కర్మరా నాయనా.. రాజకీయాల్లోకి పంపితే ఉన్న మతి పోయిందన్నట్లు మాలోకం ఎర్రబుక్కు పట్టుకొని ఊరూరా తిరుగుతున్నాడు. తింగరి చేష్టలతో మా రాజకీయ జీవితంతో ఆడుకుంటున్నారు ఈ తండ్రీకొడుకులు. ఇంకా వీళ్లని ఎలా భరించాలో అర్థం కావడం లేదు.. సరెసర్లే.. ఎన్నో అనుకుంటాం.. అన్నీ జరుగుతాయా.. ఏంటీ? ఈ సారీ.. మా ఎర్రమాలోకం, వాళ్ల నాయన అబద్ధాల వల్ల సైకిల్‌కి పంచర్లేసుకోవడమే గతి అనుకుంటా.. పదండ్రా.. ఇంటికెళ్లి ఫ్యాన్ వేసుకొని రిలాక్స్ అవుదాం..

- సాక్షి, విశాఖపట్నం

గోల్డ్ స్పాట్ కుటుంబం
గోల్‌మాల్ 'గీతం'

సాక్షి, విశాఖపట్నం: తాత ఎంవీవీఎస్ మూర్తి ఉరఫ్ గోల్డ్‌స్పాట్ మూర్తి వందల కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే.. దానిపై అక్రమాల అంతస్తులు కట్టేశాడో భరతుడు. తాతకు మించి నాలుగాకుల అక్రమాలు ఎక్కువే చదివాడు...బ్యాంకుల ఉదారత ఎలాంటిదంటే రుణాలు ఎగ్గొట్టే పెద్దోళ్లకే పిలిచి మరీ రుణాలిస్తుంటాయి.. గీతం సంస్థ పేరుతో బ్యాంకుల నుంచి కోట్ల రుణాలు తీసుకుని ఎగ్గొట్టేందుకు భరత్ ప్రయత్నించారు. ..తాత కబ్జా వారసత్వాన్ని కొనసాగించేందుకు రాజకీయాల్లోకి వచ్చిన భరత్ నిజస్వరూపం తెలుసుకుని ఓసారి విశాఖపట్నం ప్రజలు తిరస్కరించినా.. ఇప్పుడు మళ్లీ ఏ మాత్రం సిగ్గుపడకుండా ఓట్లడిగేందుకు సిద్ధమయ్యారు... విశాఖపట్నం ఎంపీ స్థానానికి తెలుగుదేశం పార్టీ తరఫున నిలబడుతున్న భరత్ అసలు స్వరూపమిదీ...

అక్రమాల పునాదులపై 'గీతం'.!

గోల్డ్ స్పాట్ మూర్తి గీతం ప్రైవేటు కళాశాలను పెట్టి.. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి తూట్లు పొడిచి.. గీతం విద్యాసంస్థను వర్సిటీగా విస్తరించారు. రెండుసార్లు ఎంపీగా పూర్తి పదవీకాలం పని చేసిన మూర్తి.. కేవలం సొంత గీతం కళాశాలకు, రక్షసం బంధీకులైన బంధుగణానికి తప్పించి.. విశాఖ నగరానికి ఈ మంచి పని చేశాను.. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు తెచ్చాను.. అనే ఒక్క పనీ చేయలేదనేది కళ్లెదుటే కనిపించే పచ్చి నిజం. తెలుగుదేశం పాలనలో ఆయన గీతం కళాశాల, తదనంతరం డీమ్డ్ యూనివర్సిటీ పేరిట చేసిన భూ ఆక్రమణల వ్యవహారాలు ఇప్పటికీ కోర్టుల్లో నలుగుతున్నాయి. ఆయన మనుమడు, టీడీపీ ఎంపీ అభ్యర్థి, బాలకృష్ణ చిన్నల్లుడు భరత్ అదే బాటలో వెళ్తున్నారు. 'ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు శ్రీలంక యూనివర్సిటీ 25 ఎకరాల్లోనే ఉంది. విశాఖలోని గీతం (గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్) యూనివర్సిటీకి వందల ఎకరాలు కావాలా? అని ఆ పార్టీకి చెందిన అప్పటి రాష్ట్ర మంత్రి సీహెచ్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలు గతంలో తీవ్ర దుమారాన్ని రేపాయి. తొలుత పాతిక ఎకరాల్లో ఏర్పాటైన ఈ విద్యాసంస్థ ఆ తర్వాత క్రమక్రమంగా ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుంటూ 110 ఎకరాల విస్తీర్ణంలో డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి చేరింది. ప్రభుత్వ భూములు కబ్జా చేయడం అనక ఎలినేషన్ చేసుకుంటూ వాటిని సొంతం చేసుకోవడం గీతం యాజమాన్యానికే చెల్లింది. సంస్థ అధీనంలో ఉన్న 35 ఎకరాల భూములను లీగల్‌గా కైవసం చేసుకునేందుకు అప్పటి కలెక్టర్ ఆరోఖ్యరాజ్ ద్వారా 2012 మే 28న ఎలినేషన్ ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రతిపాదనను రెండేళ్ల పాటు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తొక్కిపెట్టింది. అప్పట్లో సీసీఎల్ఏ కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు ఈ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఎండాడ, రుషికొండ గ్రామాల పరిధిలో ఉన్న ఈ భూములను అప్పటికే వివిధ అవసరాల నిమిత్తం భూములు కావాలని కోరిన ఆరు ప్రభుత్వ శాఖలకు కేటాయిస్తూ 2014 ఫిబ్రవరి 26న ఐవైఆర్ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. దళిత విద్యార్థుల కళాశాల, పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ నిర్మాణం, బలహీన వర్గాల గృహ నిర్మాణం, అధికారులకు రెసిడెన్షియల్ క్వార్టర్స్, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ సెంటర్ ఇలా వివిధ ప్రభుత్వ అవసరాల కోసం ఈ భూములు కేటాయించారు. గీతం మూర్తి వాటినీ వదల్లేదు. వీటికి అదనంగా తమ అధీనంలో ఉన్న మరో 7.52 ఎకరాలను కలిపి తమ సంస్థకు కేటాయించాలని, ఈ మేరకు సిఫార్సు చేయాలని 2016లో జిల్లా కలెక్టర్ యువరాజ్‌పై ఒత్తిడి తెచ్చారు. యువరాజ్ బదిలీ అయిన తర్వాత గత కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలు రావడమే తరువాయి వివిధ శాఖలకు కేటాయిస్తూ గత సీఎస్ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేస్తూ ఆ భూములను గీతం సంస్థకే కట్టబెట్టేందుకు వీలుగా బాబు కేబినెట్ ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడ గజం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పలుకుతోంది. ఈ లెక్కన ఎలినేషన్ ప్రతిపాదనలు పంపిన 42.52 ఎకరాల భూముల విలువ అక్షరాల రూ.514 కోట్ల పైమాటే. వీటన్నింటి గురించీ భరత్‌కు తెలుసు. అవి ఆక్రమిత భూములనీ తెలుసు. అయినా.. ఆ భూముల్ని తన కబంధ హస్తాల్లో ఉంచేసి.. కొత్తగా భవనాలు నిర్మించేందుకు పక్కా ప్లాన్ వేసి.. స్థలానికి కాంపౌండ్ వాల్ నిర్మించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గీతం యూనివర్సిటీ కాంపౌండ్ వాల్‌ను తొలగించి కబ్జాలో ఉన్న 40.51 ఎకరాలను స్వాధీనం చేసుకుంది. సర్వే నంబర్ 10, 17, ,30, 15, 16, 19, 20లో మొత్తం 26 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ వలయం ఏర్పాటు చేశారు. లేదంటే.. ఈ భరతుడు హాంఫట్ చేసేందుకు రెడీగా ఉన్నారు.

కారు చౌకగా.. రూ.2 వేల కోట్ల భూమి...

అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లుగా.. అధికారం చేతిలో ఉంది కదా అని పెళ్లి కోసం ప్రభుత్వ స్థలాన్ని కట్నంగా కొట్టేసిన వరుడిగా భరత్ గుర్తింపు పొందారు. రూ.2 వేల కోట్ల విలువ చేసే భూమితో పాటు కట్నం కింద ఎంపీ టికెట్‌నూ పొందిన అల్లుడీయన. చంద్రబాబు, బాలకృష్ణ సహకారంతో భరత్.. ఈ దోపిడీని ఎంత పకడ్బందీగా చేశారంటే.. అధికారాన్ని అడ్డంగా ఉపయోగిస్తూ దందాను అధికారికంగానే సాగించేశారు. జగ్గయ్యపేట మండలం జయంతిపురంలో సర్వే నెంబర్ 93లో ఉన్న 498.9 ఎకరాల ప్రభుత్వ భూమిని భరత్‌కు చెందిన ఏబీసీ అనే ఫెర్టిలైజర్స్ కంపెనీకి కేవలం నామమాత్ర ధరకి కట్టబెట్టారు. ఎకరం రూ.80 వేల చొప్పున మొత్తం 500 ఎకరాలు కూడా కేవలం రూ.4 కోట్లకి కట్టబెట్టారు. జయంతిపురంలో భరత్‌కు ఇచ్చిన 500 ఎకరాలకు డిమాండ్ పెంచడానికి ఏకంగా ఆ ప్రాంతం మొత్తాన్ని రాజధాని ఏపీసీఆర్‌డీఏ పరిధిలోకి తెస్తూ 2015 సెప్టెంబర్‌లో చంద్రబాబు ఏకంగా జీవోనే జారీ చేసేశారు. భరత్ సంస్థకు భూముల్ని కట్టబెట్టిన కేవలం నెల రోజుల్లోనే జీవో. 207 తీసుకొచ్చి జయంతిపురంలో ఇచ్చిన స్థలం మొత్తాన్ని ఈ జీవో ద్వారా సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకొచ్చారు. కేవలం ఎకరం రూ.80 వేలకు కట్టబెట్టిన స్థలం సీఆర్‌డీఏ పుణ్యాన ఈ రోజు ఎకరం రూ.4 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకూ పెరిగిపోయింది. ప్రస్తుత మార్కెట్ విలువ 500 ఎకరాలకు గాను రూ.2 వేల కోట్ల పై చిలుకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

బ్యాంకులకీ కన్నం వేసేద్దామని.!

విద్యావంతుడిగా బిల్డప్ ఇచ్చే భరత్.. రుణాలు ఎగ్గొట్టడంలోనూ సిద్ధహస్తుడే. రుణాల బకాయిలు ఎగవేసిన కారణంగా భరత్ తండ్రి పట్టాభి రామారావు సహా ఇతర కుటుంబీకుల ఆస్తుల జప్తుకు హైదరాబాద్ అబిడ్స్ కరూర్ వైశ్యా బ్యాంకు 2020 ఫిబ్రవరిలో నోటీసులు జారీ చేసింది. టెక్నో యూనిక్ ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న పట్టాభిరామారావుతో పాటు ఆయన తండ్రి, గీతం వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ఎంవీవీఎస్ మూర్తి కుటుంబీకులు తీసుకున్న రుణం అసలు, వడ్డీ కలిపి రూ.124,39,21,000గా తేల్చింది. జనవరి 21, 2020లోగా చెల్లించాలని బ్యాంకు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులకు వారు స్పందించకపోవడంతో రుణం కోసం విశాఖ జిల్లా గాజువాక మండలం, భీమిలి మండలంలో తాకట్టు పెట్టిన భూములను, విశాఖ నగరం దొండపర్తి ప్రాంతంలోని ఆస్తులను స్వాధీనం చేసుకుని వేలం వేస్తామంటూ జప్తు నోటీసులు జారీ చేసింది. 2019 అక్టోబర్‌లో భరత్ సహా 11 మంది ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులకు విశాఖ నగరంలోని ఆంధ్రా బ్యాంకు సీతమ్మధార బ్రాంచ్ డిఫాల్టర్ నోటీసు జారీ చేసింది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల వద్ద మెసర్స్ వీబీసీ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కోసం తీసుకున్న రుణం ఎగవేయడంతో అప్పట్లో ఆంధ్రాబ్యాంక్ పత్రికా ప్రకటన విడుదల చేసింది. భరత్‌కు చెందిన సంస్థ మొత్తం రూ.13,65,69,000 బాకీ పడిందని పేర్కొంది. ఇలా బ్యాంకుల డిఫాల్టర్ భరత్.. విశాఖ ఎంపీ విషయంలోనూ డిఫాల్టరే... అంటూ 2019లో ప్రజలు తీర్పునిచ్చారు.

ఏం మొహం పెట్టుకుని ఓట్లడుగుతావ్ భరత్..?

2019లో కట్నం కింద విశాఖ ఎంపీ టికెట్ దక్కించుకున్న భరత్.. నిజస్వరూపాన్ని ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో విశాఖ ప్రజలు గమనించారు. ఎన్నికల ముందే తన తాత పవిత్రమైన ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని దయ్యాల కొంప అంటూ పొగరుతో మాట్లాడినప్పుడు విద్యావేత్తగా చెప్పుకునే భరత్ కనీసం నోరు మెదపకపోవడం చర్చనీయాంశమైంది. ఎందరో మహానుభావుల్ని అందించిన విశ్వవిద్యాలయాన్ని నోటికొచ్చినట్లు వ్యాఖ్యలు చేసినా స్పందించని భరత్ ఒక విద్యావంతుడా అంటూ విమర్శలు వెల్లువెత్తాయి. కనీసం ఖండించని భరత్‌ని విశాఖ ప్రజలు ఓటు అనే ఆయుధంతో 'గీతం' కే పరిమితం చేసేశారు. రాష్ట్రాన్ని ఎన్ని రకాలుగా దోచుకోవాలో అన్ని రకాలుగా దోచుకున్న చంద్రబాబు అండ్ కో బ్యాచ్‌తో మరోసారి ఎన్నికల బరిలో నిలిచారు. ఈసారి ఎంపీగా గెలిచి.. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న రూ.వందల కోట్ల భూముల్ని తిరిగి కబ్జా చేసుకోవాలన్న కుట్రతో భరత్ ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి దోపిడీ దారులకు ఓటు వేస్తే.. విశాఖ భవిష్యత్తు నాశనం చేసి.. ఉన్న భూములన్నీ మనవడి పేరున, మనవరాలి కట్నం కోసం ధారాదత్తం చేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని వైజాగ్‌వాసులు దుమ్మెత్తి పోస్తున్నారు. కేవలం విశాఖ ప్రజల్ని దోచుకోవడానికే ఈ కుటుంబం పుట్టిందన్నట్లుగా దోపిడీ పర్వం సాగుతోందని భరత్ వ్యవహారశైలిపై పలువురు విమర్శిస్తున్నారు.



భరత్‌పై కేసులు

భరత్‌పై రెండు కేసులు నమోదయ్యాయి. బెంగళూరులోని గీతం క్యాంపస్‌లో విద్యార్థుల భద్రతపై సరైన ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే తన కుమారుడు బ్రహ్మసాయిరెడ్డి ఆరో అంతస్తుపై నుంచి పడి మృతి చెందాడనీ.. దీనికి కారణం గీతం అధినేత భరత్ నిర్లక్ష్యమేనని దాసరి వెంకట శివారెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనిపై 2024లో బెంగళూరులోని దొడబళ్లాపుర పోలీస్‌స్టేషన్‌లో సెక్షన్ 304(ఏ) కింద భరత్‌పై కేసు నమోదైంది. అదేవిధంగా.. బెంగళూరు గీతం క్యాంపస్ నిర్మాణం పూర్తయినా డబ్బులు చెల్లించడం లేదంటూ ఎంఎస్ రామయ్యా ప్రై.లిమిటెడ్‌సంస్థ భరత్‌పై దొడబళ్లాపుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భరత్‌పై 506, 379,380, 420,448, 323, 506(బీ) సెక్షన్లపై కేసు నమోదు చేశారు

పూర్తిచేయకుండా వదిలేసినది రెండు చోట్లా చేయనట్టు – దాని నిజ కార్య స్థానంలో, మీ తలలో! అసంపూర్ణంగా వదిలేసిన పనులు మీ ఆత్మవైపు నిరంతరం చూస్తూ మీ తలలోని శక్తిని పీల్చేస్తాయి.
– బ్రహ్మకుమారీలు

సాక్షి
గురువారం, 2 మే 2024

సత్యానికి సవాల్!

కంటికి కనిపిస్తున్నదంతా నిజమేనా? ఏది సత్యం? ఏదసత్యం? వేసవి తాపానికి తోడు సార్వత్రిక ఎన్నికల ప్రచారపు వేడి ఎక్కువై, నేతలు పరస్పరం మాటల ఈటెలు విసురుకుంటున్న వేళ... కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో ఇష్టారాజ్యపు మార్పుచేర్పుల నకిలీ వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నందున... ఇప్పుడు అందరూ అప్రమత్తం కావాల్సిన పరిస్థితి. సాక్షాత్తూ కేంద్ర హోమ్‌మంత్రి రిజర్వేషన్లపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్టు వీడియో ప్రచారమవుతుంది. ప్రముఖ నటుడు ఆమిర్‌ఖాన్ కాంగ్రెస్‌కు మద్దతుగా మాట్లాడినట్టు మరో వీడియో ప్రత్యక్షమవుతుంది. మరో ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్ కాశీలోని గంగాతీరంలో తన పుణ్యక్షేత్ర దర్శనానుభూతిని పంచుకుంటే ఆ మాటలు మోదీ, బీజేపీలకు మద్దతు పలికినట్టుగా నకిలీ వీడియోలో మారిపోతాయి. ఇదీ వర్తమాన ఎన్నికల్లో రాజకీయ వీడియోల వైచిత్రి. గడచిన 2019 సార్వత్రిక ఎన్నికలప్పుడు వాట్సప్ యూనివర్సిటీల్లో తప్పుడు సమాచారం వీరవిహారం చేస్తే, ఈసారి ఏఐ ఆధారిత విశ్వామిత్ర సృష్టి వీడియోలు నేతలకూ, ఓటర్లకూ సరికొత్త సవాళ్ళు విసురుతున్నాయి. నాటి ఐటీ బాట్ల నుంచి నేటి ఏఐ డీప్‌ఫేక్‌ల దాకా మన ఎన్నికల్లో అసత్య సమాచార వ్యాప్తి వెనక్కి రాలేనంత దూరం వెళ్ళిపోయింది.

తాజాగా ఈ నకిలీ వీడియోల సెగ అధికార బీజేపీ నేతలకు గట్టిగానే తగిలింది. సాక్షాత్తూ ప్రధాని మోదీ, హోమ్ మంత్రి అమిత్‌షాలు ఈ అంశంపై తీవ్ర వ్యాఖ్యలు చేయడమే అందుకు నిదర్శనం. రిజర్వేషన్ల అంశంపై హోమ్ మంత్రి అనని మాటలను అన్నట్టుగా మార్చి చూపించిన ఫేక్ వీడియో ఇప్పటికే దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారమైంది. సంచలనం రేపింది. తమతో సహా పలువురు బీజేపీ నేతల నకిలీ వీడియోలను ప్రచారంలో పెట్టి, శాంతియుత ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడానికి ప్రతిపక్షాల వారు ప్రయత్నిస్తున్నారంటూ మోదీ ఆరోపించారు. ఎన్నికల వేళ పెద్ద తలనొప్పిగా మారిన ఈ అబద్ధపు వీడియోల వ్యాప్తిపై బీజేపీ ఇప్పటికే ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. పోలీసులకూ ఫిర్యాదు చేసింది. అమిత్‌షాకు సంబంధించిన మార్ఫింగ్ వీడియోను 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) ఖాతాలో షేర్ చేశారనే ఆరోపణపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురికి ఢిల్లీ పోలీసులు సమన్లు ఇవ్వడంపై సవాళ్ళు, ప్రతి సవాళ్ళ పర్వం నడుస్తోంది. మరోపక్క ఈ వీడియో వ్యవహారంపై అసోమ్‌లో ఒకరితో పలువురు అనుమానితుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు.

మొత్తం ఏడు విడతల్లో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో మోదీ మంత్రం ఆశించినంతగా ఫలించడం లేదనీ, 'ఈసారి 400 సీట్ల పైనే' (అబ్ కీ బార్ 400 పార్) అన్న బీజేపీ నినాదం మంచి కన్నా చెడు చేస్తోందనీ ఒక విశ్లేషణ. ఈ పరిస్థితుల్లో ఈ డీప్ ఫేక్ వీడియోలు మరిన్ని వర్గాలను అధికార పార్టీకి దూరం చేసే ప్రమాదం లేకపోలేదు. అయితే, ఈ నకిలీ వీడియోల ముప్పు అధికార పార్టీకే కాదు... ప్రతిపక్షం సహా అన్ని పార్టీలకూ ఉంది. ఇంకా చెప్పాలంటే, గడచిన 2019 ఎన్నికలు 'సోషల్ మీడియా ఎన్నిక'లైతే, ఈ 2024 ఎన్నికలు 'ఏఐ యుగపు ఎన్నికల'ని నిపుణులు అభివర్ణిస్తున్నారు. సగటు ఓటరుకు మునుపెన్నడూ లేనంతగా తప్పుడు సమాచారమందే ప్రమాదం ఈసారి పెరిగింది. చేతిలో ప్రపంచాన్ని ఇమిడ్చిన స్మార్ట్‌ఫోన్‌లో వస్తున్నదంతా నిజమని నమ్మే ధోరణిని మార్చుకోకపోతే కష్టమే. వాట్సప్ సహా వివిధ మాధ్యమాల్లో షేర్ అవుతున్న వాటిలో ఏది అసలో, ఏది ఏఐతో మార్చిన నకిలీయో తెలుసుకోవడం తెలీక సామాన్యులు మోసపోయే ప్రమాదం మరీ ఎక్కువైంది.

గతంలోనూ విద్వేషపూరిత వ్యాఖ్యలు, ప్రత్యర్థిని దెబ్బతీసే ప్రచారాలు లేకపోలేదు. కాకపోతే ఫలానా వర్గం ఎక్కువ మంది పిల్లల్ని కంటోంది, ఫలానా పార్టీ అధికారంలోకి వస్తే మంగళ సూత్రాలను సైతం లాగేసుకుంటుంది లాంటి మాటలు ఈ తడవ మాత్రమే ఏలికల నోట వినిపిస్తున్నాయి. సాంకేతికత వెర్రితలలు వేయడంతో ఈసారి మరింత చిక్కొచ్చి పడింది. మొత్తం మన రాజకీయ సమాచార ప్రసార, ప్రచారాలు శరవేగంతో మారిపోయాయి. 2019 ఎన్నికల ముందు మన 'జనగణమన'ను ప్రపంచ అత్యుత్తమ జాతీయ గీతంగా యునెస్కో ప్రకటించిందనే మెసేజ్ వాట్సప్‌లో తెగ తిరిగితే... ఇప్పుడు జనరేటివ్ ఏఐ సాయంతో మోదీ పెదాల కదలికకు అచ్చుగుద్దినట్టు సరిపోయేలా మూడు భాషల్లో ఆయన ప్రసంగపు యూట్యూబ్ షార్ట్ వంతు వచ్చింది. జనాన్ని ఎలాగోలా బురిడీ కొట్టించి, బుట్టలో వేసుకోవాలనే తపన, తాపత్రయం గడచిన అయిదేళ్ళలో కొత్త పుంతలు తొక్కింది. నిజానికి, సోషల్ మీడియా సంస్థలు సైతం ఫేక్ న్యూస్, ప్రాపగాండాలను అరికట్టడానికి కిందా మీదా పడుతున్నాయి. ఆన్‌లైన్‌లోనూ డీప్‌ఫేక్‌ను అడ్డుకొనేందుకు ప్రస్తుత చట్టాలను నవీకరించేందుకు భారత ప్రభుత్వమూ ప్రయత్నిస్తోంది.

ఓట్లు, సీట్లు, అధికారమే పరమావధిగా మారిన కాలంలో ప్రతి పార్టీ ఒక సోషల్ మీడియా సైన్యాన్ని పెంచి పోషిస్తోంది. ఆన్‌లైన్ అసత్య ప్రచారాన్ని సైతం ఎన్నికల వ్యూహంలో ఒక భాగంగా అందరూ అనుసరిస్తున్న రోజులొచ్చిపడ్డాయి. సమాచారాన్ని వైరల్ చేసే బాట్లకు ఇప్పుడు విశ్వామిత్ర సృష్టి జనరేటివ్ ఏఐ కూడా జతపడేసరికి అగ్నికి ఆజ్యం తోడైంది. ఉచితంగా, కాదంటే కారుచౌకగా ఏఐ సహా రకరకాల ఉపకరణాలు అందుబాటులోకి రావడం ఆకతాయిలకూ వరమైంది. ఓ డీప్‌ఫేక్ వీడియో సృష్టికి మూడేళ్ళ క్రితం పది రోజులు పడితే, ఇప్పుడు మూడు నిమిషాల్లో చేయగలుగుతున్నారు. ఇవన్నీ సత్యాన్వేషణలో నేటి సవాళ్ళు. ఎన్నికల్లో అనియంత్రిత ఏఐ వినియోగానికి తక్షణం అడ్డుకట్ట వేయకుంటే అనర్థం తప్పదు. నేతలు, జర్నలిస్టులు, నటీనటులు ప్రధాన లక్ష్యంగా సాగుతున్న విషం చిమ్ముడుకు విరుగుడు వెతకాలి. లేదంటే, వ్యవస్థపైనే నమ్మకం పోతుంది. యావత్ సమాజం, ప్రజాస్వామ్యం నకిలీలతో నిండిపోతుంది.


గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు చైత్ర మాసం, **తిథి:** బ.నవమి రా.10.45 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.11.06 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.50 నుండి 10.38 వరకు తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, **అమృత ఘడియలు:** ప.1.16 నుండి 2.34 వరకు.

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం : 6.15
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

ప్రభుత్వ ఉద్యోగులతో మరో మాట!

అభిప్రాయం


ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ఏపీలో ప్రైవేటీకరణ అభిమాని చంద్రబాబు జాతీయ ప్రైవేటీకరణ అభిమాని బీజేపీతో పొత్తు పెట్టుకున్నాడు. అన్ని ప్రభుత్వ కంపెనీలను ప్రైవేటు ఏకస్వామ్య కంపెనీలకు అప్పజెప్పాలన్నది వారి ఆలోచన. ఇక్కడ రిజర్వేషన్లు అమలు కావు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ కూటమికి ఓటు వేయడమంటే, ప్రైవేటీకరణకు ఓటు వేయడమే. కానీ నిరుపేదలకు ప్రభుత్వ విద్య, ప్రభుత్వ ఉద్యోగ అవకాశం మొదటి తరంలో చాలా ముఖ్యం. మన దేశ భవిష్యత్తుకు పునాది స్కూలు విద్యను పూర్తిగా ప్రభుత్వ రంగంలోకి తెచ్చి, ప్రైవేట్ స్కూలు విద్యను రద్దు చెయ్యడంలో ఉంది. ఉద్యోగస్థులు మొత్తం సమాజ భవిష్యత్ గురించి ఆలోచించకుండా ప్రైవేటీకరణకు, మత తత్వానికి ఓటు వేస్తే ప్రజాస్వామ్యం కాదుకదా, మానవీయ విలువలు కూడా బతకవు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటీకరణ అభిమాని చంద్రబాబు నాయుడు జాతీయ ప్రైవేటీకరణ అభిమాని బీజేపీతో పొత్తు పెట్టుకున్నాడు. దేశంలోని మొత్తం కేంద్ర ప్రభుత్వ కంపెనీలను, అతి పెద్దదైన రైల్వేతో సహా ప్రైవేట్ 'మోనోపలి' (ఏకస్వామ్య) కంపెనీలకు అప్పజెప్పి ప్రభుత్వం కేవలం సూపర్‌వైజ్ చెయ్యాలనేది ఆరెస్సెస్/బీజేపీ సిద్ధాంతం. దేశంలో రిజర్వేషన్ వ్యవస్థను కూడా క్రమంగా రద్దు చెయ్యాలన్నది వారి సిద్ధాంతం. నరేంద్ర మోదీ ఓబీసీ పేరుతో ప్రధానమంత్రి అయ్యారు కనుక గత పదేండ్ల పాలనలో వాళ్ళు రిజర్వేషన్ పట్ల కాస్త జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఈ రిజర్వేషన్ వ్యతిరేక విధానం రిజర్వేషన్ ద్వారా కాక జనరల్ కోటాలో ఉద్యోగాలు తెచ్చుకున్న వారికి నచ్చవచ్చు కూడా. కానీ విద్యా అసమాన వ్యవస్థ ఉండగా రిజర్వేషన్లు ఎత్తేస్తే దేశంలో అంతర్యుద్ధం జరుగుతుందని చాలామందికి అర్థం కాని విషయం. దేశంలోని ఉత్పత్తి కులాలు రిజర్వేషన్లు రద్దు చెయ్యడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తాయి.

బీజేపీతో పొత్తుతో చంద్రబాబు అధికారంలోకి వస్తే మొట్టమొదట ప్రైవేట్ స్టీల్ కంపెనీకి అప్పజెప్పే అతిపెద్ద స్టీల్ కంపెనీ 'విశాఖ ఉక్కు'. ఆ తరువాత బీజేపీ తెలంగాణలోని బీహెచ్‌ఈఎల్, ఈసీఐఎల్ వంటి అతిపెద్ద కంపెనీలను ప్రైవేట్ గుజరాతీ, ముంబై కంపెనీలకు అమ్మకానికి పెడుతుంది. బీజేపీ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ చేతుల్లోని సంస్థల్లో దొడ్డిదారిన ఏ సెలక్షన్ కమిటీని ఫేస్ చెయ్యకుండా అధికారులను, యూనివర్సిటీ ప్రొఫెసర్లను సైతం నియమిస్తోంది.

ఈ ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నవారు బీజేపీకి ఓటు వేయడమంటే ప్రైవేటీకరణకు అనుకూలంగా ఓటు వేయడమే. చంద్రబాబు 2014 నుండి 2019 వరకు చూపిన స్వతంత్రతను కూడా చూపలేడు. ఆయన పూర్తిగా బీజేపీ ఏమి చెబితే అది చెయ్యాల్సిందే. ఈ స్థితిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు ఈ కూటమికి ఓటేస్తే ముందు ప్రైవేటీకరణ సమస్యను కొని తెచ్చుకుంటారు.

బీజేపీ ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టారు ఎంప్లాయిమెంట్‌ను అమెరికా మోడల్‌లోకి మార్చాలనే ఆలోచనతో ఉన్నట్లు వాళ్ళ ఆర్థికవేత్తల రచనలు చదివితే స్పష్టంగా అర్థమౌతుంది. ఆంధ్రప్రదేశ్ సుదీర్ఘ తీర ప్రాంతం గల రాష్ట్రం. విశాఖ పోర్టు మాత్రమే కాక క్రమంగా ఇతర సీ-పోర్టులను అక్కడ అభివృద్ధి చేసుకోవచ్చు. ఇప్పటికే కొన్ని కొత్త పోర్టుల నిర్మాణం జరుగుతోంది. అయితే బీజేపీ ప్రభుత్వం వాటి నిర్మాణం మాత్రమే కాక వాటి మేనేజ్‌మెంట్ మొత్తాన్ని ప్రైవేట్ సెక్టారుకు అప్పజెప్పే ఆలోచనలో ఉన్నది. ఈ పని ఇప్పటికే ఎయిర్‌పోర్టుల విషయంలో చేశారు. దేశంలోని పెద్ద, పెద్ద ఎయిర్‌పోర్టులన్నిటినీ ప్రైవేటు మేనేజ్‌మెంట్‌కు – అదీ పెద్ద పెద్ద మోనోపలి కంపెనీలకు అప్పజెప్పారు. ఇక్కడి ఉద్యోగాలన్నీ ప్రైవేట్ కంపెనీల చేతిలోనే ఉన్నాయి. ఇక్కడ ఉద్యోగాలన్ని కాంట్రాక్ట్ ఉద్యోగాలే. అక్కడ పెద్ద



ఉద్యోగాలన్నీ పెద్ద కంపెనీల బంధువులకు మాత్రమే వస్తాయి. యూపీఎస్సీ పరీక్షల్లో పోటీపడి ఎవరైనా ఉద్యోగం తెచ్చుకునేది అక్కడ ఉండదు. కమ్మ, రెడ్డి కులాలకు కూడా పెద్ద ఉద్యోగాలు రావు.

ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నాన్ని రాజధానిగా చేసుకొని తీరాన్నంతా అభివృద్ధి చేసుకుంటే అది ముంబైకి మించిన నగరమయ్యే అవకాశముంది. కోల్‌కతా కూలిపోతున్న నగరం. ఇటు చెన్నై దేశపు చివరి మూలన ఉంది. దానికి ఇంకా అభివృద్ధి అవకాశం తక్కువ. ఇంగ్లిష్ విద్యలో ఆదివాసులు, దళితులు, బీసీలు, ఇతర బీద పిల్లలు చదువుకుంటే వైజాగ్ నగరాన్ని అత్యాధునిక నగరంగా మార్చే అవకాశం వారికొస్తుంది. ప్రభుత్వ రంగంలో ఇంగ్లిష్ విద్య నాణ్యంగా కొనసాగితే అడవుల్లోని ఆదివాసులు పక్షులుగా ఎదిగి విమానాలుగా మారుతారు. వారికి ఎంత పోడు భూమి ఇచ్చినా, ఎంత పంట సహాయం చేసినా ఒక్క తరంలో అడవి నుండి విశాఖ నగరంలోకి, అక్కడి నుండి అమెరికాకో, ఆస్ట్రేలియాకో పోలేరు. అయితే ఈ ఆదివాసులకు ప్రభుత్వ విద్య, ప్రభుత్వ ఉద్యోగ అవకాశం మొదటి తరంలో చాలా ముఖ్యం. ప్రైవేట్ సెక్టారు వీరికి అవకాశాలివ్వదు. వారిని ఉన్నత ఉద్యోగాల్లోకి రానివ్వదు. ఆంధ్రలో జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాణ్యమైన ఇంగ్లిష్ విద్య ఈ ఆదివాసుల్లో కొనసాగితే, 20–30 సంవత్సరాల్లో అమెరికాలో నల్లజాతీయులను మించిన మేధావులు ఆదివాసుల నుండి వచ్చి విశాఖ పట్టణాన్ని ప్రపంచ నగరంగా మారుస్తారు. ఈ ఆదివాసుల నుండి ఎంతోమంది ఎలాన్ మస్క్‌లు వచ్చే అవకాశముంది. ఇటువంటి మార్పు భారతదేశపు గుజరాతీ క్యాపిటలిస్టులకు, నరేంద్ర మోదీ ప్రభుత్వానికి, ఆరెస్సెస్‌కు ఏ మాత్రం ఇష్టం లేదు. వీరికి ప్రభుత్వ ఉద్యోగులు ఓటువేసి గెలిపించే ప్రయత్నం చేస్తే వ్యవస్థనంతా గుజరాత్–ముంబై క్యాపిటలిస్టులకు అప్పజెప్పడమే.

భారతదేశం అమెరికా కాదు, యూరప్ కాదు, ఆస్ట్రేలియా కాదు, కెనడా కాదు. ఇది 140 కోట్ల జనాభా కలిగిన చిన్న దేశం. దీన్ని చిన్న దేశం అని ఎందుకు అంటున్నానంటే భూపరిమాణంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, చైనాతో పోలిస్తే ఇది చాలా చిన్న భూమి కలిగిన దేశం. ఈ దేశ జనాభా ఇంకా ముందు, ముందు పెరుగుతుంది. ఆధునిక సైన్స్‌ను ఇంగ్లిష్ భాషతో ముడేసి గొప్ప, గొప్ప శాస్త్ర పరిశోధనల ద్వారానే మనం ఇంతమందికి తిండి, బట్ట, ఇల్లు ప్రపంచంలో తలెత్తుకుని బతికే ఆత్మ గౌరవాన్ని ఇవ్వగలం. అందుకు భావితరాలు – ముఖ్యంగా ఆదివాసులు, దళితులు, ఓబీసీలు – ఇంగ్లిష్‌లో చదువుకొని ప్రపంచ జ్ఞానాన్ని సాధించకుండా ఈ దేశానికి మనుగడ ఉండదు. మన దేశ భవిష్యత్తుకు పునాది స్కూలు విద్యను పూర్తిగా ప్రభుత్వ రంగంలోకి తెచ్చి, ప్రైవేట్ స్కూలు విద్యను రద్దు చెయ్యడంలో ఉంది; అన్ని రకాల ఎంట్రెన్స్‌లను, కోచింగ్‌లను రద్దు చేసి నేరుగా 12వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా, విద్యార్థి శ్రమ గౌరవ పనుల్లో పాల్గొన్న సర్టిఫికెట్ల ఆధారంగా ఉన్నత చదువులకు పోవడంలో ఉంది. అమెరికా, యూరప్ ఇదే చేస్తాయి. బీజేపీ, చంద్రబాబు ఇటువంటి విద్యకు పూర్తిగా వ్యతిరేకం. కనుక ఇప్పుడు ఉద్యోగాలు ఏ కులస్థులైనా మొత్తం సమాజ భవిష్యత్ గురించి ఆలోచించకుండా ప్రైవేటీకరణకు, కుల తత్వానికి, మత తత్వానికి, వర్గ తత్వానికి ఓటు వేసుకుంటే సమాజంలో తిరుగుబాటు మొదలైతే దేశం కుప్పకూలుతుంది.

భారతదేశపు ప్రైవేట్ రంగం అమెరికాలో, యూరప్‌లో ఉన్నట్టు మానవతా విలువలతో ఏర్పడినది కాదు. గ్రామాల్లో రైతులను, కూలీలను దోచుకొని వారితో బడిలో, గుడిలో ప్రేమతో పెరిగిన మనుషులుగా కాక మేం కులానికి ఎక్కువ, మేం కంచం–మంచం పొత్తును అంగీకరించం అనే వారి చేతిలో పెరిగింది. ఈ దేశంలో అతిపెద్ద పెట్టుబడిదారులు కుష్ఠు రోగులకు, కుంటి వారికి, గుడ్డి వారికి ఒక ఆశ్రమం కట్టించి ఆదుకున్నట్టు చూశామా! అమెరికా తెల్లజాతి ధనవంతులు, నల్లజాతి స్త్రీలను తమ ఇంట్లో వంట మనిషిగా పెట్టుకొని వారి పిల్లలను చదివించి మేధావులను చేసిన ఘటనలు చాలా ఉన్నాయి. నల్లవారికి ప్రత్యేక స్కూళ్ళు, కాలేజీలు పెట్టి ముందు చదివించింది తెల్లజాతి పెట్టుబడిదారులు. ఈ దేశంలో అతిపెద్ద పెట్టుబడిదారులు దళితుల కోసం, ఆదివాసుల కోసం ఒక్క స్కూలు కట్టి చదివించారా!

అందుకే దిక్కులేని రోడ్డుమీద బతికే పిల్లల్ని దగ్గరకు తీసి 'నిన్ను ఇంగ్లిష్ మీడియం బడిలో చదివిస్తాన'ని హామీ ఇచ్చిన వ్యక్తిని దింపేసి నారాయణ స్కూలును వెనుక ఉండి నడిపించే వ్యక్తికి ఓటు వేస్తే, ప్రజాస్వామ్యం కాదు గదా మానవ విలువలే బతకవు. అందరికంటే ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నేను చెప్పే ఈ మాట గురించి ఆలోచించండి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



రికార్డు బద్దలయ్యేనా?



భారత మహిళల లాంగ్ జంప్‌లో 6.83 మీటర్లతో అంజూ బాబీ జార్జ్ నెలకొల్పిన జాతీయ రికార్డు ఇప్పటికీ ఉంది. చాలాకాలంగా ఉన్న(2004) ఈ రికార్డును ఈ 2024లో శైలీ సింగ్ బద్దలుకొట్టగలదేమో!

– కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి

విదేశీవే బెస్ట్!



అత్యంత ఉత్తమ పది చిత్రాలను నేను గనక జాబితా చేస్తే, ఒక్క 'సిటిజన్ కేన్' (1941) మినహాయించి, అందులో ఒక్కటి కూడా అమెరికన్ సినిమా ఉండదు.

– వూడీ అలెన్, దర్శకుడు

కొత్త భాష



మా అబ్బాయి నుంచి ఇప్పుడే నేర్చుకున్నది ఏమంటే, 'ఓకే' అని బదులిస్తే అది దురుసుగా ఉంటుందట; అదే 'ఓకేకే' అంటే ఉత్సాహపూరితంగా ధ్వనిస్తుందట. బాస్! జెనరేషన్-జెడ్, జెనరేషన్- ఆల్ఫా వాళ్ల ఆన్‌లైన్ మర్యాదలు నేర్చుకోవడంలో నా మెదడు కిందిమీదవుతోంది.

– స్మితా బరువా, అడిక్షన్ కౌన్సిలర్

ముందది గ్రహించండి!



విమాన టికెట్ కొనుక్కోగానే అది వ్యక్తిగత సేవకులను పొందడంతో సమానంగా కొందరు పొరపడుతుంటారు – ముఖ్యంగా సిబ్బంది మహిళలు అయినప్పుడు! ఫ్లైట్ అటెండెంట్స్‌గా ఉండేవాళ్లు వ్యక్తిగత సేవకులు కాదు, ఉద్యోగులు. వాళ్లను అవమానించేట్టుగా ప్రవర్తించడం సహించలేనిది.

– రతన్ ఢిల్లోఁ, ర్యాలీ డ్రైవర్

ఇంత దిగజారుడా?



భారత ఎన్నికలను యాభై ఏళ్లుగా చూస్తున్న వాడిగా ఇంత నీచమైన, ద్వేషపూరిత ఉపన్యాసాలను చూడలేదు. ప్రతిరోజూ అధికార పార్టీకి చెందిన అగ్ర నాయకులు మరింత కిందికి దిగజారుతున్నారు. అందరికీ మించి హిందువులు నిలబడి చెప్పాలి: ఈ మతోన్మాదులు మాకు ప్రతినిధులు కారు అని!

– రామచంద్ర గుహ, రచయిత

అంకెలేం చెబుతాయి?



1947లో పాకిస్తాన్‌లో మైనారిటీలు– 25 శాతం (హిందువులు, సిక్కులు, క్రైస్తవులు కలిసి). 2023లో – 2 శాతం. 1947లో ఇండియాలో మైనారిటీలు– 14 శాతం (ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు కలిసి.) 2023లో– 24 శాతం. అయినా కొందరు ఇండియా మైనారిటీలు ప్రమాదంలో ఉన్నారని మాట్లాడుతుంటారు.

– రుచీ బాగ్రీ, సాధారణ పన్ను చెల్లింపుదారు

అందరూ అందరే!



అంటే, 2023లోనే ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దుర్వర్తన దృష్ట్యా జేడీఎస్‌తో పొత్తు పెట్టుకోవద్దని ఒక బీజేపీ అభ్యర్థి హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. అయినా పొత్తుకు ముందుకెళ్లారు. ఇక, నెలల ముందుగానే కాంగ్రెస్‌కు ఈ విషయం తెలిసినా ఆయన మీద ఏ చర్యా తీసుకోకుండా, వ్యూహాత్మకంగా ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేకంగా వాడాలనుకున్నారు. ఈ నాయకులందరూ ఎంత నయవంచకులు!

– సోనమ్ మహాజన్, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

అత్యంత పవిత్ర నదికి పుష్కరాలు

భారతదేశంలో తూర్పు నుంచి పడమరకు ప్రవహించే ప్రత్యేకత సంతరించుకున్న నదుల్లో నర్మదా నది ఒకటి. ఈ నది 2024 మే 1 నుంచి 12 వరకు పుష్కరాలు జరుపుకుంటున్నది. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ పుష్కరాల సందర్భంగా నర్మద విశిష్టత గురించి మననం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నర్మదా నది శివుని దేహం నుంచి పుట్టిందనీ, అందుకే 'రుద్రదేహ' అనే పేరు కూడా దీని కున్నదంటారు భక్తులు. శివుని కుమార్తె అని భావిస్తూ 'శాంకరి' అని కూడా పిలుస్తారు. నర్మదా నదిపై ఆది శంకరాచార్యులు 'నర్మదాష్టకం' రచించారు.

మధ్యప్రదేశ్‌లోని అనుప్పూర్ జిల్లాలో ఎత్తైన కొండలు, పచ్చటి అరణ్యాల మధ్య ఉన్న అమర్ కంటక్ నర్మదా నది జన్మస్థానం. ఇక్కడే నర్మదా మాత గుడి కూడా ఉంది. నర్మదా నది మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల గుండా ప్రవహించి గుజరాత్‌లోని బరూచ్ జిల్లాలో అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఈ నది మొత్తం దేశంలో 1,289 కిలోమీటర్లు ప్రవహిస్తోంది. మూడేళ్లు సరస్వతి నదిలో, ఏడు రోజులు యమునా నదిలో, ఒక్క రోజు గంగా నదిలో స్నానం చేయడం వల్ల వచ్చే పుణ్యం... ఒక్కసారి ఈ నదిలో స్నానం చేస్తే వస్తుందని భక్తుల నమ్మకం. నర్మదా తీరంలో గల పుణ్యక్షేత్రాల్లో అత్యంత ప్రసిద్ధమైనది ఓంకారేశ్వర్. ఇది ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి.

నర్మదా నదిపై భారీ ఆనకట్ట నిర్మాణానికి వ్యతిరేకంగా 1985లో ప్రారంభమైన 'నర్మదా బచావో ఆందోళన' అత్యంత శక్తిమంతమైన ప్రజా ఉద్యమం. భారీ నర్మదా ప్రాజెక్టులకు వ్యతిరేకంగా స్థానిక గిరిజనులు (ఆదివాసీలు), రైతులు, పర్యావరణవేత్తలు, మానవ హక్కుల కార్యకర్తలు వంటివారందరూ పాల్గొన్న భారతీయ సామాజిక ఉద్యమం ఇది. సుదీర్ఘ ఆందోళన, ఉద్యమకారుల వ్యతిరేకతల నడుమ పూర్తయిన ఈ ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడంతో ఈ వివాదం సమసిపోయింది. ప్రస్తుతం పుష్కరాలు ప్రారంభమవ్వడంతో భక్తులు పుష్కర స్నానాలకు సిద్ధమవుతున్నారు.

– పగిడి రంగారావు
(మే 1 నుండి 12 వరకు 'నర్మదా' నది పుష్కరాలు)

దీనికి జవాబు లేదా బాబూ?

అభిప్రాయం


ఎస్. అబ్దుల్ ఖాలిక్

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి కొత్త చిక్కు వచ్చిపడింది. ముస్లిం మైనారిటీలకు అమలు చేస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ బీజేపీ అగ్రనేత ఒకరు ప్రకటించడం ఇందుకు కారణం. బీజేపీతో పొత్తులో ఉన్న టీడీపీ ఈ ప్రకటనను ఖండించకపోవడం ముస్లిమ్ మైనారిటీలు గమనిస్తున్నారు. అందుకే ఇప్పటికే అరకొరగా ఉన్న ముస్లిమ్‌ల మద్దతు తమ పార్టీ పూర్తిగా కోల్పోతుందని టీడీపీ భయపడుతోంది.

ఇటీవల ఓ బహిరంగ సభలో కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ముస్లిమ్ మైనారిటీలకు అమలు చేస్తోన్న నాలుగు శాతం రిజర్వేషన్లను తప్పుపట్టారు. ఈసారి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముస్లిమ్‌ల రిజర్వేషన్లను రద్దు చేస్తామని తెగేసి చెప్పారు. లోక్‌సభకు ఇప్పటికే జరిగిన రెండు విడతల పోలింగ్‌లో బీజేపీకి నిరాశే ఎదురైనట్లు సంకేతాలు అందుతున్నాయి. దీంతో కులాలకతీతంగా యావత్ హిందూ ఓటు బ్యాంకును కమలం పార్టీ వైపు మళ్లించడానికి బీజేపీ అగ్రనేతలు ముస్లిమ్‌ల రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించారని భావిస్తున్నారు.

ముస్లిమ్‌ల వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేయడానికి 2005లో కాంగ్రెస్ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేందర్ సచార్ నాయకత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. మొత్తం ఏడుగురు సభ్యులున్న సచార్ కమిటీ 2006లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. సచార్ కమిటీ నివేదిక ప్రకారం భారతదేశ జనాభాలో ముస్లిమ్‌లు 14 శాతం ఉన్నారు. అయితే అధికార యంత్రాంగంలో ముస్లిమ్‌ల శాతం కేవలం 2.5 శాతం మాత్రమే. దళితులు, ఆదివాసీల కంటే దారుణ పరిస్థితుల్లో ముస్లిమ్‌లు ఉన్నారు. చదువు లేకపోవడమే ముస్లిమ్



సమాజం ఎదుర్కొంటున్న సకల సమస్యలకు ప్రధాన కారణమని జస్టిస్ రాజేందర్ సచార్ కమిటీ కుండబద్దలు కొట్టింది. ముస్లిమ్ సమాజం మేలు కోసం మొత్తం 76 సిఫార్సులు చేసింది ఈ కమిటీ. అయితే వీటిలో అమలుకు నోచుకున్నవి అతి తక్కువ.

వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ముస్లిమ్‌ల జీవితాల్లో వెలుగులు నింపడానికి నాలుగు శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. విభజన తరువాత కూడా ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిమ్‌లకు నాలుగుశాతం రిజర్వేషన్లు కొనసాగుతున్నాయి. ఇప్పుడు బీజేపీ అగ్రనేతలు ఈ రిజర్వేషన్లు రద్దు చేస్తామంటున్నా చంద్రబాబు నోరు మెదపకపోవడం విడ్డూరం. నెత్తి మీద టోపీ పెట్టుకుని... ముస్లిమ్‌లతో ఆత్మీయ సమావేశాలంటూ సందడి చేసే చంద్రబాబు అసలు రంగు బయటపడింది.

వాస్తవానికి రాయలసీమలో ముస్లిమ్ మైనారిటీలు పెద్ద సంఖ్యలో ఉన్నారు. కర్నూలు, నంద్యాల, కడప, రాయచోటి, కదిరి లాంటి అనేక ప్రాంతాల్లో గెలుపు ఓటములను ప్రభావితం చేయగల స్థాయిలో ముస్లిమ్‌లు ఉన్నారు. రాయలసీమే కాదు కోస్తా జిల్లాల్లో కూడా వీరి జనాభా భారీగానే ఉంది. గుంటూరు తూర్పు, పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావు పేట, చిలకలూరిపేట, విజయవాడ పశ్చిమం, బందరు, పెడన వంటి అనేక ప్రాంతాల్లో కూడా ముస్లిమ్ మైనారిటీలు అభ్యర్థుల జయాపజయాలను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తారు.

అటువంటి ముస్లిమ్‌ల రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ అంటే తెలుగుదేశం నిశ్శబ్దంగా ఉండడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే ముస్లిమ్‌ల రిజర్వేషన్ రద్దు ఖాయం అని ముస్లిమ్‌లు బలంగా నమ్ముతున్నారు. దీంతో ఇప్పటివరకు కొన్ని ప్రాంతాల్లో టీడీపీకి అనుకూలంగా ఉన్న ముస్లిమ్‌లు పోలింగ్ నాటికి జగన్‌కి జై కొడతారని టీడీపీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 63001 74320

మార్గాలు అనేకం – లక్ష్యం ఒకటే!

దత్తబోధ


శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మన శాస్త్రాల్లో సాధకులకు ఉపయోగపడే వందలాది మార్గాలు ఉన్నాయి. ప్రపంచంలో వేలాదిమంది బోధకులు ఉన్నారు. మన సంప్రదాయాలను అనుసరించి భగవంతునికి కోట్లాది రూపాలు ఉన్నాయి. సాధకులు తమ మార్గాలను, గురువులను, వారు పూజించే దేవుళ్ళను మార్చుకోవడం తెలిసిందే. అయితే ఆ విధంగా చేయుటం సరియైనదే కావచ్చు లేదా తప్పూ కావచ్చు. కాని లక్ష్యాన్ని చేరుకోవడానికి వారు చూపించే ఉత్సాహము మెచ్చుకోదగింది. అటువంటి వారి దృష్టి అంతా ఎప్పుడూ ఆదర్శ మార్గం, ఆదర్శ గురువు, ఆదర్శప్రాయమైన భగవత్ స్వరూపం పైనే ఉంటుంది. వారు ఏ మార్గాన్ని అనుసరించినప్పటికీనీ, ప్రయాణం మాత్రం అంతరాత్మ లోనికే అనే విషయాన్ని అర్థం చేసుకోలేకపోతున్నారు. గురువులందరూ బోధించే సత్యం ఒక్కటే. భగవంతుని ఏ రూపాన్ని పూజించినప్పటికీ, అది సర్వేశ్వరుని పూజించినట్లే. వారు ఎంచుకొనిన మార్గం, అనుసరించు గురువు, ఆరాధించు భగవత్ స్వరూపం – ఇవన్నీ సాంకేతికంగా భగవంతుని సూచిస్తాయి. నువ్వు నీ మార్గాన్ని గంభీరంగా, భక్తిపూర్వకంగా నిశ్చిత బుద్ధితో అనుసరించడమే ముఖ్యం.

అన్ని మతాల వారికీ 'ప్రార్థన' ఉంది. ఇది కేవలం మనుషులకు మాత్రమే ఉన్న దేవుని వరం. అయితే మనకు ఆపదలు, దుఃఖం కలిగినప్పుడు మాత్రమే ప్రార్థన చేయడం సరికాదు. అనుకూల, ప్రతికూల పరిస్థితుల్లో కూడా భగవంతుని ప్రార్థించడం అలవరచుకోవాలి. ఆత్మవికాసమే ప్రార్థన ముఖ్య ఉద్దేశ్యంగా ఉండాలి. భౌతిక అవసరాలు లేక కోరికలను తీర్చుకోవడానికి భగవంతుని ప్రార్థించకూడదు. బంధ విముక్తి కోసం మాత్రమే ప్రార్థించాలి. ఎట్టి పరిస్థితిలో అయినా దేవదేవుని మరచిపోకుండా ఉండేలా ఉంచమని ఆయననే ప్రార్థించాలి.

సంసార బంధాల నుండి విముక్తిని పొంది, ఆత్మవికాసం కావించు కోవడానికి గీతాచార్యులు నాలుగు మార్గాలను చెప్పారు. అవి జ్ఞాన యోగము, భక్తి యోగము, కర్మయోగము, ప్రపత్తి లేక శరణాగతి. ఇందులో శరణాగతి అత్యంత ముఖ్యమైనది. దీని ప్రకారం తనువు, మనస్సు, బుద్ధిని భగవంతుని పాద పద్మాలకు సంపూర్ణంగా సమర్పించుకోవాలి. శరణాగతి కోరువాడికి ఏమాత్రం 'అహం' ఉండకూడదు. భగవంతుని ద్వారమును చేరదలచిన వారు 'అహా'న్ని విడిచిపెట్టాలి. 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ'.

‘ఈ ప్రపంచంలో గొప్ప వృత్తులు ఏమిటి?’ అని చిన్నప్పుడు తండ్రిని అడిగితే ఆయన చెప్పిన సమాధానం జోయా మీర్జా మనసులో ముద్రించుకుపోయింది. ఆ తరువాత కలగా మారింది. కలను నెరవేర్చుకునే ప్రయత్నంలో పరాజయం పలకరించింది. నిరాశలో రెండడుగులు వెనక్కి వేసినా ఆ తరువాత మాత్రం ఆత్మవిశ్వాసం అనే ఇంధనంతో వేగంగా ముందడుగు వేసింది. ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్ డాక్టర్‌గా ఎంపిక అయింది జోయా మీర్జా. చత్తీస్‌గఢ్ నుంచి ఈ ఘనత సాధించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది జోయా....

ఫస్ట్ టైమ్

జయహో జోయా


జోయా మీర్జా

కల కన్నప్పుడే విజయానికి దగ్గరవుతాం. ఏ కలా లేనప్పుడు ఏ విజయమూ ఉండదు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాకు చెందిన జోయా మీర్జా చిన్నప్పటి నుంచి పెద్ద కలలు కనేది. అయితే అవేమీ ఆకాశానికి నిచ్చెన వేయాలనుకునే కలలు కావు. ‘వైద్యురాలిగా సేవ అందించాలి, సైన్యంలో పనిచేయాలి’... ఇలా ఉండేవి ఆమె కలలు.

కన్న కలలు కాలానికి నిలబడతాయనే గట్టి నిబంధన లేదు. అయితే గట్టి పట్టుదల ఉంటే కల నెరవేర్చుకోవడం కష్టమేమీ కాదు అని చెప్పడానికి స్ఫూర్తి... జోయా మీర్జా. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీ (ఏఎఫ్‌ఎంసీ)లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన మీర్జా ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్ డాక్టర్‌గా నియామకం కావడం ద్వారా తన కలను నిజం చేసుకుంది.

అయితే జోయా మీర్జాది నల్లేరు మీద నడకేమీ కాదు.


తల్లిదండ్రులతో జోయా

కుటుంబ ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉండేది.

ఆర్థికంగా ఎన్ని కష్టాలు ఉన్నా ‘ఇక చదివింది చాలు’ అనే మాట తల్లిదండ్రుల నుంచి ఎప్పుడూ రాలేదు. చదువు విషయంలో కుమార్తెను ఎప్పుడూ ప్రోత్సహించేవారు.

జోయాను డాక్టర్‌గా చూడాలనేది అమ్మమ్మ కల.

‘నీట్’ పరీక్షలో జోయాను ఫెయిల్యూర్ పలకరించింది. బాధపడుతూ కూర్చోకుండా ‘యూనివర్శిటీ ఆఫ్ దిల్లీ’లో గ్రాడ్యుయేషన్ చేయడంపై దృష్టి పెట్టింది. ఒక సంవత్సరం గ్యాప్ తీసుకొని రాజస్థాన్‌లోని కోటాలో ‘నీట్’ కోసం కోచింగ్ తీసుకోవడానికి జోయా మీర్జాను తల్లిదండ్రులు ఒప్పించారు. కోచింగ్ కోసం అప్పులు చేశారు.

‘తల్లిదండ్రుల కోరిక మేరకు కోటాకు వెళ్లాను. అయితే ప్రాక్టీస్ ఎగ్జామ్స్‌లో ఇతర విద్యార్థులు నా కంటే మెరుగ్గా ఉన్నారనే విషయం తెలిసినప్పుడు నాలో ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నది. నీట్ పరీక్షకు ఇరవై రోజుల ముందు అమ్మమ్మ తీవ్రమైన అనారోగ్య సమస్య వల్ల నేను ఇంటికి తిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఆ తరువాత తిరిగి కోటాకు వచ్చాను. ఒకే ఒక్క ర్యాంకు తేడాతో సీటు సాధించే అవకాశాన్ని కోల్పోయాను’ అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది మీర్జా.

తల్లిదండ్రులు మొదట నిరాశ పడినా ‘మరో ప్రయత్నం’ అంటూ కుమార్తెను కోచింగ్ కోసం భిలాయ్‌కు పంపించారు.

‘భిలాయ్ కోచింగ్ సెంటర్‌లోని ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడంతో పాటు నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచారు. అది నాకు ఎంతగానో ఉపకరించింది’ అంటుంది మీర్జా. ఆ ఆత్మబలమే ‘నీట్’లో తగిన మార్కులు సాధించి ‘ఏఎఫ్‌ఎంసీ’ ఎంచుకునేలా చేసింది. పుణేలోని ‘ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీ’లో ఎంబీబీఎస్ చేసింది.

‘గొప్ప వృత్తులు ఏమిటి?’ అని చిన్నప్పుడు తండ్రిని అడిగినప్పుడు...

‘సోల్జర్, డాక్టర్’ అని చెప్పేవాడు.

లెఫ్టినెంట్ డాక్టర్‌గా ఆ రెండు గొప్ప వృత్తులలో పనిచేసే అవకాశం తన అదృష్టం అంటుంది జోయా మీర్జా.

తన ఫస్ట్ పోస్టింగ్ జమ్మూలో.

‘చదువుపై నాకు ఉన్న ఆసక్తిని గమనించి మా అమ్మమ్మ నన్ను డాక్టర్‌గా చూడాలనుకుంది. డాక్టర్‌గా ప్రజలకు సేవ చేయాలని కోరుకుంది. దురదృష్టవశాత్తు ఆమె ఏడాది క్రితం చనిపోయింది. నన్ను యూనిఫామ్‌లో చూడలేకపోయింది’ అమ్మమ్మను తలుచుకుంటూ బాధగా అంటుంది మీర్జా.

‘పరులకు సహాయం చేయాలనే తత్వం తనది. తన మనస్తత్వానికి సరిగ్గా సరిపోయే వృత్తి ఇది. మీర్జాకు ఎలాంటి సవాలైనా ఎదుర్కొనే శక్తి ఉంది’ అంటున్నాడు జోయా తండ్రి షమీమ్ మీర్జా.

మహిళాసాధికారతపై ఐక్యరాజ్యసమితి కార్యక్రమంలో ప్రసంగించడానికి భారతదేశం నుంచి ముగ్గురు సర్పంచులకు ఆహ్వానం అందింది. ఈ నెల 3న అమెరికాలోని న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలి నిర్వహిస్తున్న సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి నుంచి సర్పంచ్ హేమకుమారి, త్రిపుర నుంచి సుప్రియాదాస్ దత్తా, రాజస్థాన్ నుండి నీరూ యాదవ్ పాల్గొంటున్నారు.

మన సర్పంచులు @ ఐరాస


నీరూ యాదవ్, సుప్రియాదాస్ దత్తా, హేమకుమారి


హేమకుమారి

‘భారతదేశంలో స్థానిక సంస్థల పాలనలో మహిళల భాగస్వామ్యం, వారు ఎలా దారి చూపుతున్నారు’ అనే అంశంపై ఐక్యరాజ్యసమితిలో చర్చలు జరగనున్నాయి. ఈ సమావేశంలో భారతదేశం నుంచి ముగ్గురు మహిళా ప్రతినిధులతో ఒక ప్యానెల్ చర్చ ఉంటుంది. ఈ కార్యక్రమంలో వారు తమ విజయగాథలను పంచుకుంటారు. అలాగే లింగ సమానత్వం, అభివృద్ధి కోసం వారి వారి పంచాయితీలలో చేసిన కృషిని కూడా పంచుకుంటారు. వీరిని మూడు రాష్ట్రాల పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది.

మూడు కీలకమైన స్తంభాలు: హేమకుమారి

పశ్చిమగోదావరి జిల్లా పేకేరు గ్రామ పంచాయతీలో స్థిరమైన అభివృద్ధి, లింగ సమానత్వం కోసం కార్యక్రమాలను చేపట్టి, విజయవంతంగా పూర్తి చేసింది. సర్పంచ్‌గా హేమకుమారి 2021లో పదవిని చేపట్టినప్పటి నుంచి మూడు కీలకమైన స్తంభాలపై దృష్టి సారించి పరివర్తన కార్యక్రమాలకు నాయకత్వం వహించింది. అవి.. ఆరోగ్యం, విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం. సరైన పోషకాహారం, ప్రసవానికి సంబంధించిన అవగాహన పెంచడానికి క్రమం తప్పకుండా హెల్త్ క్యాంపులు, విద్యాకార్యక్రమాలను చేపట్టింది. దీని ఫలితంగా ముప్పు అధికంగా గల గర్భధారణ కేసుల సంఖ్య, శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. ఈ విషయాలపై హేమకుమారి తాను చేసిన ప్రయోజనకరమైన పనులను, వచ్చిన ఫలితాలను తెలియజేయనుంది.

హాకీ సర్పంచ్: నీరూయాదవ్


నీరూ యాదవ్

రాజస్థాన్‌లోని బుహనా తహసీల్‌లోని లంబి అహిర్ గ్రామ సర్పంచ్ నీరూ యాదవ్ ‘నాయకత్వ అనుభవం’పై తన అభిప్రాయాలను వెల్లడించనున్నారు. నీరూ యాదవ్ 2020లో లంబి అహిర్ గ్రామపంచాయితీకి సర్పంచ్ అయ్యింది. బాలికలు, మహిళల సాధికారత కోసం నీరూ యాదవ్ ఎన్నోపనులు చేశారు. భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడానికి ఐక్యరాజ్యసమితి నీరూని పిలవడానికి కారణం ఇదే. పంచాయితీ పనులతో పాటు రాష్ట్ర మహిళలకు స్ఫూర్తిదాయకంగా తన పంచాయితీలోని బాలికల హాకీ జట్టును తన సొంత ఖర్చుతో సిద్ధం చేసింది. ఈ చొరవ ఆమెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. అందుకే ఆమెను హాకీ సర్పంచ్ అని పిలుస్తారు. గ్రామ పంచాయితీని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు చొరవ తీసుకుంది. పాత బట్టల సంచులను తయారు చేయడం ద్వారా గ్రామీణ మహిళలకు సాధికారత కల్పించింది. గ్రామ ప్రజలరె పర్యావరణం వైపుగా ప్రోత్సహించేలా కొత్త ప్రచారాన్ని ప్రారంభించింది. ప్రతి నెలా వృద్ధులకు, వికలాంగులకు వారి ఇళ్ల వద్దకే పింఛన్ వెళ్లేందుకు శ్రీకారం చుట్టింది. పంచాయితీ స్థాయి సర్పంచ్ పాఠశాలను ప్రారంభించి, బాలికలకు కంప్యూటర్ విద్యతో పాటు డిజిటల్ అంగన్‌వాడీ, మోడ్రన్ ప్లే స్కూల్స్‌ను ఏర్పాటు చేసింది. చిన్న పల్లెటూరిలో ఉండి కూడా గొప్ప పని చేయగలమని నీరూ నిరూపించింది.

చర్చావేదిక: సుప్రియా దాస్ దత్తా


సుప్రియా

ఫార్మసీలో డిప్లమా చేసిన సుప్రియా దాస్ దత్తా త్రిపుర నివాసి. సెపాహిజాల జిల్లా పంచాయితీ అధ్యక్షురాలు. ప్రజాతీర్పులో మహిళల భాగస్వామ్యాన్ని చాటడానికి సుప్రియ బలమైన న్యాయవాదిగా ఎదుగుతున్నారు. సుప్రియ తన జిల్లాలో మహిళల కోసం చర్చా వేదికను ప్రారంభించారు. ఇక్కడ ప్రజలు జిల్లా పంచాయితీ అధికారులకు ముఖ్యమైన గ్రామీణాభివృద్ధి సమస్యలపై తమ ఆందోళనలు, ఆలోచనలను తెలియజేయవచ్చు. సుప్రియ చేస్తున్న పనులను ప్రధాని మోదీనీ ఆకట్టుకున్నాయి. పిల్లల సంరక్షణ సౌకర్యాలను ప్రోత్సహించడంలో కూడా చురుకుగా పాల్గొంటున్నది. లోతుగా పాతుకుపోయిన సామాజిక నిబంధనలను పరిష్కరించడం ద్వారా లింగ సమానత్వాన్ని సాధించవచ్చని సుప్రియ గట్టిగా నమ్ముతోంది. సమాజంలో తాను పోషించే పాత్ర ద్వారా మహిళలు పురుషులకంటే ఏ మాత్రం తక్కువ కాదని నిరూపించాలనుకుంటోంది.

సుమంతి... సంస్కృతికి వారధి

కళ కలకాలం నిలవాలంటే ఆ కళకు రాజపోషణ ఉండాలి. రాజరికాలు అంతరించి పోయాయి. ప్రజలే పాలకులయ్యారు. ఈ మార్పుతో కళల పరిరక్షణ బాధ్యత కూడా సామాన్యుల భుజాల మీదకు చేరింది. సామాన్యులుగా మనం అందరం తలా ఒక చెయ్యి వేస్తే తప్ప మనవైన మనదేశీయ సంప్రదాయ సాంస్కృతిక కళలు మనలేవు. పొలిటికల్ సైన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన సుమంతీదేవి ఆ బాధ్యతను తన భుజాల మీదకు తీసుకుంది. తమ ‘ఉరోన్’ ఆదివాసీల చేతిలో రూపుదిద్దుకున్న కళాకృతులను, కళానైపుణ్యాన్ని పరిరక్షించే బాధ్యత చేపట్టింది.

ఉరోన్ తెగ ఆదివాసీలు బీహార్, ఛోటా నాగ్‌పూర్‌లో ఎక్కువగా నివసిస్తుంటారు. వారి చేతిలో రూపుదిద్దుకుంటున్న పెయింటింగ్‌లు, దుస్తులు, ఇతర హస్తకళాకృతులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అయితే ఆ కళానైపుణ్యం అంతరించే దశకు చేరింది. ఏ కళ అయినా ఆ కళాకారుడికి అది ఉపాధిని ఇవ్వగలిగినంత కాలమే మనుగడలో ఉంటుంది. ఆ పని అన్నం పెట్టలేకపోయినప్పటి నుంచి క్షీణదశ మొదలైనట్లే. ఆ కళాకారులు తమ తరువాతి తరాన్ని ఉపాధికి భరోసా ఉన్న ఇతర పనుల్లోకి పంపిస్తారు. అలా తమ వాళ్లు కొత్త తరాలను మైదానాల్లోకి పంపిస్తున్నారు. ఆ వలసలతో ఆదివాసీ గ్రామాలు బలహీనపడిపోతున్నాయి. ఆ కొత్త తరానికి వాళ్లు వెళ్లిన చోట తమ కళను కొనసాగించే అవకాశాల్లేకపోవడంతో అది వృద్ధతరంతోనే అంతరిస్తోంది. అలాంటి సమయంలో సుమంతీదేవి ఆ వలసలను నిలువరించడం, కళను పరిరక్షించడం అనే రెండు ప్రధాన బాధ్యతలను తన భుజాలకెత్తుకుంది. ‘‘కుటుంబ పోషణ కోసం మగవాళ్లు ఇతర పనులకు వెళ్లడాన్ని ఆపలేం. వృద్ధుల ద్వారా మహిళలకు శిక్షణ ఇప్పించగలిగితే నా వంతుగా మరో తరం వరకు మా కళలను బతికించగలుగుతాను. అందుకోసమే మహిళలను సంఘటితం చేశాను. గోడల మీద బొమ్మలు వేయడం వారికి వెన్నతో పెట్టిన విద్య. వాటినే కాన్వాస్ మీద వేయడంలో శిక్షణ ఇప్పించాను. హ్యాండ్ మేడ్ పేపర్ మీద పెయింటింగ్స్,


కాన్వాస్ మీద చేతితో ఆర్ట్ వేస్తున్న సుమంతీదేవి



మడ్ పెయింటింగ్స్, దుస్తులు నేయడంలో, వెదురు కళాకృతులు తయారు చేయడంలో కూడా వారికి చెయ్యి తిరిగింది. వాటన్నింటినీ మా ఆదివాసీ సమాజం నుంచి నాగరక సమాజంలోకి ప్రవేశ పెట్టడం ఒక సవాల్ అయింది. పదిహేనేళ్ల కిందట భువనేశ్వర్‌లో జరిగిన ఇందిరా గాంధీ రాష్ట్రీయ మానవ్ సంగ్రహాలయలో స్టాల్ పెట్టాను. అప్పుడు కేవలం ఒక్క పెయింటింగ్ మాత్రమే అమ్మగలిగాను. కానీ ఆ ప్రదర్శన నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. మార్కెట్ ట్రెండ్స్ తెలిశాయి. నాగరక సమాజం మా ఆదివాసీ ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతోంది. కానీ వాటి అసలుకీ నకిలీకీ తేడా తెలుసుకోవడంలో వెనుకబడుతోందని గ్రహించాను. అప్పటి నుంచి స్టాల్‌లో ఉత్పత్తుల అమ్మకానికి మాత్రమే పరిమితం కాకుండా ఆదివాసీ హస్తకళాకృతుల గురించి వివరించడం మొదలు పెట్టాను. మా హస్తకళాకృతులను కశ్మీర్ నుంచి కేరళ వరకు విస్తరించగలిగాను’’ అని చెప్పింది సుమంతీదేవి.

గోడల మీద నుంచి కాన్వాస్‌కు



ఉరోన్ కళాకృతుల తయారీలో మట్టిదే కీలకమైన పాత్ర. వస్త్రం, మట్టి, చేతి వేళ్లు... ఉంటే చాలు. గొప్ప కళాఖండం సిద్ధమైనట్లే. మట్టిలో పేడ్స్‌కి మా సృజనాత్మకత జోడిస్తాం. సాధారణంగా గోధుమ వర్ణం, ఎరుపు రంగు మట్టి లభిస్తుంది. నల్లమట్టి కోసం అడవుల్లో నేలను లోతుగా తవ్వి సేకరిస్తాం. తెలుపు రంగుకు సున్నాన్ని, ఆకు పచ్చ రంగును ఆకుల నుంచి సేకరిస్తాం. ఇది తరతరాలుగా వస్తున్న ప్రక్రియ. గోడల మీద నుంచి మా బొమ్మలను కాన్వాస్ మీదకు చేర్చే క్రమంలో నేను జిగురును జత చేశాను. మధుబని కళను కూడా మాతో కలుపుకున్నాం. ‘వాక్ విత్ మి’ పేరుతో సంఘటితమైన ఆదివాసీ మహిళలం మా సంప్రదాయాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నాం. ‘ఏవమ్ కళ’ పేరుతో మా కళలన్నింటికీ అక్షరరూపమిచ్చాను. మరొక్క తరం రక్షించగలిగితే చాలనుకున్నాను. కానీ అక్షరరూపం ఇవ్వడం ద్వారా ఇది శాశ్వతంగా ఉండిపోతుందనే నమ్మకం కలుగుతోంది.

– సుమంతీదేవి,
సంస్కృతి పరిరక్షకురాలు

సామాన్యురాలు... పార్లమెంట్ అభ్యర్థి...

‘మా ప్రాంతంలోని పేదల కష్టాలే నన్ను పెద్దలతో తలపడేలా చేస్తున్నాయి’ అంటోంది దాసరి భారతి. కోవిడ్ సమయంలో నర్స్‌గా పని చేసి ఎందరికో సేవ చేసిన భారతి బాధితులకు న్యాయం జరగాలంటే చట్టం తెలియాలని ఎల్.ఎల్.బి. చదువుతోంది. జోగులాంబ జిల్లా మేడికొండకు చెందిన 26 ఏళ్ల ఈ దళిత యువతి నాగర్ కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి అధికారికంగా పోటీలో ఉంది. ‘జనం కోసం గొంతెత్తకుండా ఉండలేకపోతున్నాను’ అంటున్న భారతి పరిచయం.


దాసరి భారతి

‘నేను హైదరాబాద్ అపోలో నర్సింగ్ కాలేజ్‌లో బీఎస్సీ నర్సింగ్ చదివాను. ఎమ్మెస్సీ నర్సింగ్ చేయాలని ఉండేది. నాకు మెరిట్ ఉన్నా సీట్ వచ్చినా కేవలం డబ్బుల్లేక ఒక సంవత్సరం ఆగాల్సి వచ్చింది. ఆ తర్వాత పాండిచ్చేరి జిప్‌మర్‌లో ఎమ్మెస్సీ నర్సింగ్ చదివాను. నాలా ఎందరో పేదింటి, దళిత, వెనుకబడ్డ వర్గాల యువతీ యువకులు చదువు కోసం బాధలు పడుతున్నారు. వారిని పట్టించుకునేది ఎవరు? వారి కోసం గొంతెత్తాలని ఎన్నికలలో నిలుచున్నాను’ అంటుంది దాసరి భారతి.

26 ఏళ్ల ఈ దళిత అమ్మాయి నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ‘విడుదలై చిరుతైగల్ కట్చి’ (వి.సి.కె.) పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనుంది. ఆమెకు ‘టీవీ రిమోట్’ను ఎన్నికల చిహ్నంగా కేటాయించారు. ‘పాండిచ్చేరిలో చదివేటప్పుడు వి.సి.కె. పార్టీ కార్యక్రమాలు గమనించాను. అది దళితుల అభ్యున్నతి కోసం పని చేస్తున్న పార్టీ. ఒక దళిత యువతిగా నేను ఆ పార్టీతో కలిసి పని చేయాలని భావించాను’ అని తెలిపింది భారతి.

జోగులాంబ జిల్లా మేడికొండ భారతి ఊరు. తండ్రి దాసరి రాములు కౌలు రైతు. తల్లి పద్మావతి గృహిణి. ‘మా నాన్న చనిపోయాడు. మేము నలుగురం పిల్లలం. చదువుకోవడానికి చాలా బాధలు పడాల్సి వచ్చింది’ అంది భారతి.

‘నా బాల్యం నుంచి చూస్తున్నాను. మా ఊరికి ఇప్పటికీ సరైన రోడ్డు లేదు. రోగాలొచ్చినా ఏమొచ్చినా చాలా కష్టం. ఒక నిండు చూలాలు అంబులెన్స్ ఎక్కి రోడ్డు గతుకుల వల్ల దారిలోనే డెలివరీ అయ్యి చనిపోయిన సంఘటన కళ్లారా చూశాను. నిధులన్నీ ఏమవుతున్నాయి? ఎం.ఎల్.ఏలు, ఎం.పి.లు, మంత్రులు ఏం చేస్తుంటారు? ఎందుకు పరిస్థితులు మార్చరు? కృష్ణ, తుంగభద్రల తీరంలో ఉండేదే మా ప్రాంతం. కాని పశువులు తాగడానికి కూడా చుక్క నీరు ఇప్పుడు లేదు. రాజకీయ చైతన్యం ఉన్న యువత ఈ పరిస్థితిని ప్రశ్నించే వరకు మార్పు రాదు. అందుకే నేను ఎన్నికలలో నిలుచున్నాను’ అంది భారతి.

నాగర్ కర్నూల్‌లో పార్లమెంట్ స్థానానికి ప్రవీణ్ కుమార్ (బి.ఆర్.ఎస్), మల్లు రవి (కాంగ్రెస్), భరత్ కుమార్ (బి.జె.పి) పోటీలో ఉన్నారు. భారతి దగ్గర మందీ మార్బలం లేకపోయినా కేవలం తన ధర్మాగ్రహంతో వీరితో తలపడనుంది.

‘కోవిడ్ కాలంలో టిమ్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేశాను. పేదలు సరైన వైద్యం అందక, కార్పొరేట్ ఆస్పత్రులకు పోలేక మరణించారు. నాకు ముందు నుంచి కూడా విద్యార్థి రాజకీయాలన్నా, ఉద్యమాలన్నా ఇష్టం. నా విస్తృతి పెరగాలంటే నర్స్‌గా ఉంటే సరిపోదనిపించింది. అందుకే ఇప్పుడు ఎల్.ఎల్.బి. చదువుతున్నాను. నేను ఎలక్షన్లలో పోటీ చేస్తున్నానని తెలిసి మావాళ్లంతా సంతోషపడుతున్నారు. నాలాంటి వాళ్లు గెలిచి పేదలకు మేలు జరిగినప్పుడే కదా నిజమైన సంతోషం’ అని ముగించింది భారతి.

బ్యూటిప్స్ / హెయిర్ కేర్

జుట్టు రాలకుండా జాగ్రత్త ఇలా...

జుట్టు రాలడానికి అనేక కారణాలుంటాయి. అయితే మనం మామూలుగా ఎలాంటి వైద్యసహాయం లేకుండా నివారించగల సమస్యల్లో ప్రోటీన్ల లోపం, శారీరక ఒత్తిడి ముఖ్యమైనవి. ఇలాంటి సమస్యలను మనకు మనంగా కొన్ని జాగ్రత్తలతో నివారించవచ్చు. అలాంటి సమస్యలూ... వాటిని అరికట్టగలిగే మార్గాలూ...

ప్రోటీన్ లోపాల వల్ల: చాలామందిలో జుట్టు రాలిపోవడానికి ప్రధాన కారణం... వారు తగినంతగా ప్రోటీన్ తో కూడిన ఆహారం తీసుకోకపోవడమే. ఈ ప్రోటీన్లే ప్రధానంగా జుట్టు పెరుగుదలకూ, దెబ్బతిన్న జుట్టు రిపేర్లకూ దోహదపడతాయి.



అరికట్టడం ఇలా: ఇలా జుట్టు ఎక్కువగా రాలుతున్నవారు ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. చేపలు, గుడ్లు, మాంసాహారంలో పుష్కలంగా ప్రోటీన్లు ఉంటాయి. శాకాహారులైతే ఆకుకూరలు, గ్రీన్ పీస్, నట్స్, శనగలు, పప్పుధాన్యాలు, సోయా తీసుకోవాలి. వీటిలో ప్రోటీన్లు చాలా ఎక్కువ.

శారీరక ఒత్తిడి: మనం నిత్యం ఎదుర్కొనే శారీరక ఒత్తిడులు మనలో భౌతికంగా మార్పులు తెచ్చి జుట్టు రాలిపోయేలా చేస్తాయి. ఫలితంగా మాడుపైన జుట్టు పలచబడినట్లుగా కనిపిస్తుంది. ఈ దశలో రాలిన జుట్టు చివరి భాగంలోని తెల్లని పదార్థం పచ్చి పచ్చిగా కాకుండా, బాగా ఎండిపోయినట్లుగా ఉండటాన్ని మనం గమనించవచ్చు.

నివారణ ఇదీ: ఇలా రాలిపోయిన జుట్టు సాధారణంగా ఒత్తిడి తొలిగాక మళ్లీ మొలుస్తుంది. అందుకే ఒత్తిడి తొలగించుకోడానికి రిలాక్సేషన్ టెక్నిక్స్ అవలంబించడం, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయడం, యోగా వంటివి ఉపకరిస్తాయి.

సాక్షి బిజినెస్
గురువారం
2-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (మంగళవారం ముగింపు)		
సెన్సెక్స్	▽ 188	74,482
నిఫ్టీ	▽ 38	22,604

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,595	▽	62
డోజోన్స్	37,915	△	99
ఎఫ్‌టీఎస్ఈ 100	8,162	△	17
డాక్స్ (మంగళవారం ముగింపు)	17,932	▽	186
షాంఘై (మంగళవారం ముగింపు)	3,105	▽	8
నికాయ్	38,274	▽	132


•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామనకశ	81.84	85.13
£	బ్రిటన్ పౌండ్	ధామనకశ	102.36	106.93
€	యూరో	ధామనకశ	87.44	91.55
¥	జపాన్ ఎన్ (100)	ధామనకశ	43.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధామనకశ	52.71	56.97
S$	సింగపూర్ డాలర్	ధామనకశ	59.29	63.53
SAR	సౌదీ రియాల్	ధామనకశ	21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	ధామనకశ	21.85	23.62
¥	చైనా యువాన్	ధామనకశ	10.39	12.39

అదానీ విల్మర్.. జూమ్

క్యూ4లో రూ. 157 కోట్లు



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దిగ్గజం అదానీ విల్మర్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 67 శాతం దూసుకెళ్లి రూ. 157 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో కేవలం రూ. 94 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 14,186 కోట్ల నుంచి రూ. 13,342 కోట్లకు క్షీణించింది. ఇక పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 582 కోట్ల నుంచి భారీగా పడిపోయి రూ. 148 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 59,148 కోట్ల నుంచి రూ. 51,555 కోట్లకు బలహీనపడింది. ఫార్చూన్ బ్రాండుతో కంపెనీ వంట నూనెలు, ఫుడ్, ఎఫ్ఎంసీజీ ప్రొడక్టులను విక్రయించే సంగతి తెలిసిందే. ఫుడ్, ఎఫ్ఎంసీజీ బిజినెస్ గత రెండేళ్లలోనే దాదాపు రెట్టింపుకాగా.. రూ. 5,000 కోట్లకు చేరినట్లు కంపెనీ ఎండీ, సీఈవో అంగ్‌షూ మల్లిక్ వెల్లడించారు.

అదానీ గ్రీన్ లాభం డౌన్

రూ. 381 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 13 శాతం నీరసించి రూ. 381 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) క్యూ4లో రూ. 440 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 3,495 కోట్ల నుంచి రూ. 4,855 కోట్లకు ఎగసింది. ఇక పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 1,281 కోట్ల రూ. 1,196 కోట్లకు నీరసించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 13,840 కోట్ల నుంచి రూ. 17,218 కోట్లకు బలపడింది. ఈ కాలంలో 991.6 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను విక్రయించింది. 2022–23లో విద్యుత్ అమ్మకాలు 906.2 కోట్ల యూనిట్లుగా నమోదయ్యాయి. విద్యుత్ పంపిణీ బిజినెస్‌పై రూ. 1,334 కోట్ల పెట్టుబడి వ్యయాలు వెచ్చించగా.. బాండ్ బైబ్యాక్ కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక రుణ భారాన్ని రూ. 855 కోట్లకు తగ్గించుకున్నట్లు కంపెనీ పేర్కొంది.

అంబుజా సిమెంట్స్.. గుడ్

రూ. 1,526 కోట్లు

న్యూఢిల్లీ: అంబుజా సిమెంట్స్ గత చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో రూ. 1,526 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 7,966 కోట్ల నుంచి రూ. 8,894 కోట్లకు ఎగసింది. కంపెనీ గత త్రైమాసికంలో సంఘీ ఇండస్ట్రీస్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో క్యూ4సహా పూర్తి ఏడాదికి(15 నెలలకు) ఫలితాలు పోల్చి చూడతగదని కంపెనీ పేర్కొంది. కాగా.. కన్సాలిడేటెడ్ ఫలితాలలో కంపెనీకి 51 శాతం వాటాగల అనుబంధ సంస్థ ఏసీసీ పనితీరు సైతం కలసి ఉన్నట్లు వివరించింది. క్యూ4లో అంబుజా సిమెంట్స్ రూ. 532 కోట్ల స్టాండెలోన్ నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 4,780 కోట్లుగా నమోదైంది. ఇక కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 16.6 మిలియన్ టన్నుల(ఎంటీ) అమ్మకాలు సాధించగా.. విడిగా అంబుజా అమ్మకాలు 9.5 ఎంటీగా నమోదయ్యాయి. వాటాదారులకు షేరుకి రూ. 2 డివిడెండ్ ప్రకటించడం గమనార్హం.

పెట్రోల్ అప్- డీజిల్ డీలా

ఏప్రిల్ గణాంకాలు



న్యూఢిల్లీ: దేశీయంగా గత నెలలో పెట్రోల్‌కు డిమాండ్ పుంజుకోగా.. డీజిల్ అమ్మకాలు క్షీణించాయి. ఏప్రిల్‌లో పెట్రోల్ విక్రయాలు 12.3 శాతం పెరిగాయి. అయితే డీజిల్ సేల్స్ 2.3 శాతం నీరసించాయి. మార్చిలోనూ డీజిల్‌కు డిమాండ్ 2.7 శాతం తగ్గడం గమనార్హం! దేశవ్యాప్త సార్వత్రిక ఎన్నికల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తాజా గణాంకాలకు ప్రాధాన్యత ఏర్పడినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. ప్రభుత్వ రంగ దిగ్గజాలు ఐవోసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ గణాంకాల ప్రకారం గత నెలలో 2.97 మిలియన్ టన్నుల పెట్రోల్ విక్రయమైంది. 2023 ఏప్రిల్‌లో ఇవి 2.65 ఎంటీ మాత్రమే. దేశీ ఇంధన అమ్మకాలలో ఇవి 90 శాతం వాటాను ఆక్రమించే సంగతి తెలిసిందే. ఇక డీజిల్ వినియోగం 7 మిలియన్ టన్నులకు పరిమితమైంది. కాగా.. రెండేళ్ల నిలకడ తదుపరి మార్చి మధ్యలో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ. 2 చొప్పున దిగివచ్చాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-5-2024 ఫామ్ ధర...	
విశాఖ	400–00
చిత్తూరు	478–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	385–00
విజయవాడ	385–00
రిటైల్ ధర (డజను)	48.00
హైదరాబాద్	400–00
వరంగల్	402–00
రిటైల్ ధర	4.60

ఏప్రిల్‌లో 'ఆటో' అమ్మకాలు అంతంతే

సార్వత్రిక ఎన్నికల నేపథ్యం, అధిక బేస్ ప్రభావం



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఏప్రిల్‌లో వాహన విక్రయాలు అంతంత మాత్రంగా సాగాయి. 2024–25 తొలి నెలలో మొత్తం 3.38 లక్షల ఆటో మొబైల్ అమ్మకాలు జరిగాయి. అంతకు ముందు ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 3.32 లక్షల యూనిట్లతో పోలిస్తే 1.77% మాత్రమే అధికంగా ఉంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డిమాండ్ తగ్గడం, అంతకు ముందు రెండేళ్ల అధిక బేస్ ప్రభావం ఇందుకు కారణమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

- దేశీయ అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ ఏప్రిల్‌లో 168,089 కార్లు విక్రయించింది. గత ఏడాది ఇదేనెలలో అమ్మకాలు 1,60,529 కార్లతో పోల్చితే 5% వృద్ధిని నమోదు చేసింది.
- హ్యుందాయ్ గతేడాది ఏప్రిల్‌లో మొత్తం 58,201 వాహనాలను విక్రయించగా, ఈ సంఖ్య 9.5% పెరిగి 63,701 యూనిట్లకి చేరింది.
- టాటా మోటార్స్ వాహన విక్రయాలు 11.5% వృద్ధి సాధించాయి. ఏప్రిల్‌లో 77,521 వాహనాలు అమ్ముడయ్యాయి. ఇవి ఏడాది ఏప్రిల్‌లో 69,599 యూనిట్లుగా ఉన్నాయి.

రెండుగా గోద్రెజ్ గ్రూప్..

- లిస్టెడ్ కంపెనీలు ఆది, నాదిర్ గోద్రెజ్‌ల చేతికి..
- మిగతావి దాయాదులు జంషీద్, స్మిత సొంతం



న్యూఢిల్లీ: గృహోపకరణాల నుంచి రియల్టీ, ఏవియేషన్ వరకు వివిధ రంగాల్లో విస్తరించి, వందేళ్ల పైగా చరిత్ర గల గోద్రెజ్ గ్రూప్ రెండుగా విడిపోనుంది. గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలు ఆది గోద్రెజ్ ఆయన సోదరుడు నాదిర్‌కు దక్కనుండగా మిగతావి వారి దాయాదులు జంషీద్ నౌరోజీ గోద్రెజ్, ఆయన సోదరి స్మితా కృష్ణ గోద్రెజ్‌లకు లభించనున్నాయి. రెండు వర్గాలు గోద్రెజ్ బ్రాండ్ పేరును ఉపయోగించుకుంటాయి. అయితే, ఒక గ్రూప్ వ్యాపారంలోకి మరొకటి ఆరేళ్ల పాటు విస్తరించకుండా ఇరు వర్గాలు ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. అటు తర్వాత ఒకరి వ్యాపారంలోకి మరొకరు కార్యకలాపాలు విస్తరించవచ్చు. కానీ అందుకోసం గోద్రెజ్ పేరును ఉపయోగించుకోవడానికి ఉండదు. విభజన ప్రక్రియంతా వాటాల బదలాయింపు రూపంలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఒప్పందం ప్రకారం గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్‌లోని గోద్రెజ్ ఇండస్ట్రీస్, గోద్రెజ్ కన్జూమర్ ప్రోడక్ట్స్, గోద్రెజ్ ప్రాపర్టీస్, గోద్రెజ్ ఆగ్రోవెట్ మొదలైనవి ఆది గోద్రెజ్, నాదిర్‌లకు దక్కుతాయి. మరోవైపు గోద్రెజ్ అండ్ బాయిస్ మాన్యుఫాక్చరింగ్ తదితర సంస్థలు ఉన్న గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్‌కి జంషీద్ సారథ్యం వహిస్తారు. కోట్ల రూపాయల విలువ చేసే వేల కొద్దీ ఎకరాల స్థలాలు గోద్రెజ్ అండ్ బాయిస్ (జీఅండ్‌బీ) కిందే ఉంటాయి. దీనిపై మరో ఒప్పందం కుదిరే అవకాశం ఉంది.

జీఎస్‌టీ రికార్డు వసూళ్లు

ఏప్రిల్‌లో రూ.2 లక్షల కోట్ల పైకి ■ 2023 ఇదే నెల ఇప్పటి వరకూ టాప్ ■ సమీక్షా కాలంలో 12.4 శాతం వృద్ధి

సాక్షి, న్యూఢిల్లీ: భారత్ వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2024–25 ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో చరిత్రాత్మక రికార్డు సృష్టించాయి. సమీక్షా నెల్లో 2.10 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇప్పటి వరకూ ఈ స్థాయి వసూళ్లు ఇదే తొలిసారి. 2023 ఇదే నెలలో నమోదయిన రూ.1.87 లక్షల కోట్లు ఇప్పటి రికార్డు. అంటే సమీక్షా నెల్లో వార్షిక ప్రాతిపదికన 12.4 శాతం పురోగతి నమోదయ్యిందన్నమాట. ఆర్థిక క్రియాశీలత, దిగుమతుల పురోగతి వంటి అంశాలు జీఎస్‌టీ రికార్డుకు కారణమయ్యింది.

విభాగాల వారీగా ఇలా...

- మొత్తం జీఎస్‌టీ వసూళ్లు రూ.2,10,267 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ రూ.43,846 కోట్లు.
- స్టేట్ జీఎస్‌టీ రూ.53,538 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.99,623 కోట్లు
- సెస్ రూ.13,260 కోట్లు (దిగుమతులపై రూ.1,008 కోట్లుసహా)

ఏపీలో 12%, తెలంగాణలో 11% వృద్ధి

కాగా, జీఎస్‌టీ ఇంటర్ గవర్నమెంట్ సెటిల్మెంట్‌లో భాగంగా ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ నుంచి కేంద్ర జీఎస్‌టీకి రూ.50,307 కోట్లు, రాష్ట్ర జీఎస్‌టీకి రూ.41,600 కోట్లు కేంద్ర ఆర్థిక శాఖ పంపిణీ చేసింది. దీంతో మొత్తంగా కేంద్ర జీఎస్‌టీగా రూ.94,153 కోట్లు, రాష్ట్ర జీఎస్‌టీగా రూ.95,138 కోట్ల ఆదాయం సమీక్షా నెల్లో సమకూరినట్లయ్యింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఏప్రిల్ నెలలో జీఎస్‌టీ వసూళ్లు వృద్ధిని కనబరిచాయి. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్‌టీ వసూళ్లు ఆంధ్రప్రదేశ్‌లో 12% వృద్ధితో రూ.4,850 కోట్లు, తెలంగాణలో 11% వృద్ధితో రూ.6,236 కోట్లు నమోదయ్యాయి. అయితే దేశంలోనే అత్యధిక జీఎస్‌టీ వసూళ్లు మహారాష్ట్రలో నమోదయ్యాయి. ఆ రాష్ట్రంలో వసూళ్లు 13 శాతం వృద్ధితో రూ.37,671 కోట్లకు ఎగశాయి.

గత ఆర్థిక సంవత్సరంలో నుంచి (అంకెలు రూ. లక్షల కోట్లలో)	
ఏప్రిల్ 2023	1.87
మే	1.57
జూన్	1.61
జూలై	1.60
ఆగస్టు	1.59
సెప్టెంబర్	1.63
అక్టోబర్	1.72
నవంబర్	1.67
డిసెంబర్	1.64
జనవరి 2024	1.74
ఫిబ్రవరి	1.68
మార్చి	1.78
ఏప్రిల్	2.10



2017జూలైలో తాజా పరోక్ష పన్ను వ్యవస్థ జీఎస్‌టీ ప్రారంభమైన తర్వాత 2024 ఏప్రిల్, 2023 ఏప్రిల్, 2024 మార్చి, 2024 జనవరి, 2023 అక్టోబర్ ఇప్పటి వరకూ టాప్–5 జీఎస్‌టీ నెలవారీ వసూళ్లను నమోదుచేశాయి.

భవిత

సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఈఏపీసెట్, నీట్–2024 విద్యార్థులకు మాక్‌టెస్టులు.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. ఇప్పుడే రిజిస్టర్ చేసుకోండి.

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ జాగ్రఫీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

» ఐసీఏఆర్, అనుబంధ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీజీ ప్రోగ్రామ్స్
» ఐసీఏఆర్ ఏఐఈఈఏ(పీజీ) స్కోర్ ఆధారంగా ప్రవేశాలు
» అగ్రికల్చరల్, అనుబంధ రంగాల్లో కెరీర్స్‌కు సోపానం
» ఐసీఏఆర్-ఏఐఈఈఏ పీజీ-2024 నోటిఫికేషన్ విడుదల

అగ్రి కెరీర్.. ఎవర్ గ్రీన్!

అగ్రికల్చర్, సంబంధిత రంగాల్లో కెరీర్ అవకాశాలకు కొదవలేదు. పీజీ స్థాయిలో అగ్రికల్చర్, అనుబంధ విభాగాల్లో స్పెషలైజేషన్స్ పూర్తి చేస్తే ఈ రంగంలో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. అగ్రికల్చర్, అనుబంధ కోర్సులను అందించడంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్)కు మంచి పేరుంది. ఈ ఇన్‌స్టిట్యూట్ తాజాగా.. ఐసీఏఆర్-ఏఐఈఈఏ (పీజీ)-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఐసీఏఆర్-ఏఐఈఈఏ(పీజీ) కోర్సుల వివరాలు, ప్రవేశ ప్రక్రియ, పరీక్ష విధానం, భవిష్యత్తు అవకాశాలు తదితర వివరాలు..

దేశంలో అగ్రికల్చర్ విద్య నిర్వహణ, పర్యవేక్షణ కోసం కేంద్ర వ్యవసాయ శాఖ పరిధిలో ఏర్పాటైన సంస్థ.. ఐకార్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్). ఈ సంస్థ పరిధిలో దేశవ్యాప్తంగా 74 అగ్రికల్చర్ యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్ వివిధ కోర్సులను అందిస్తున్నాయి. ఐకార్ పరిధిలోని యూనివర్సిటీలు, కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీకి ఏఐఈఈఏ(పీజీ) పరీక్షను నిర్వహిస్తున్నారు. ఆయా యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్స్‌లో 30 శాతం సీట్లకు ఏఐఈఈఏ పీజీలో ర్యాంకు ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

ఇతర రాష్ట్రాల్లో ప్రవేశం

రాష్ట్రాల స్థాయిలోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు.. ఐసీఏఆర్–ఏఐఈఈఏ పీజీ అదనపు పరీక్షగా చెప్పొచ్చు. ఒక రాష్ట్రానికి చెందిన విద్యార్థి ఏఐఈఈఏ స్కోర్ ఆధారంగా ఇతర రాష్ట్రాల్లోని అగ్రికల్చరల్ యూని వర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో ఆల్ ఇండియా కోటా పరిధిలోని 30 శాతం సీట్లకు పోటీ పడే అవకాశం లభిస్తుంది.

పీజీ కోర్సులు ఇవే

ప్లాంట్ బయో టెక్నాలజీ, ప్లాంట్ సైన్స్, ఫిజికల్ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, అగ్రి–బిజినెస్ మేనేజ్‌మెంట్, స్టాటిస్టికల్ సైన్స్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ/ఆగ్రో ఫారెస్ట్రీ అండ్ సిల్వి కల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, వాటర్ సైన్స్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, ఆగ్రోనమీ, ఫిషరీస్ సైన్స్, డెయిరీ సైన్స్, డెయిరీ టెక్నాలజీ, హోంసైన్స్, సోషల్ సైన్స్ తదితర విభాగాల్లో దాదాపు 70 స్పెషలైజేషన్స్‌లో పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఏఐఈఈఏ (పీజీ) అర్హత

సంబంధిత విభాగంలో బీఎస్సీ అగ్రికల్చర్/బీటెక్/బీవీఎస్సీ అండ్ ఏహెచ్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. అర్హత కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

480 మార్కులకు పరీక్ష

ఏఐఈఈఏ(పీజీ) పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఈ పరీక్ష మొత్తం 120 ప్రశ్నలు–480 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 120 నిమిషాలు. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు లభిస్తాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్ష ప్రశ్న పత్రం ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది.

స్కాలర్‌షిప్ సదుపాయం

ఐసీఏఆర్–ఏఐఈఈఏ స్కోర్ ఆధారంగా.. ఐసీఏఆర్ అనుబంధ అగ్రికల్చర్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన వారికి ఉపకార వేతనం లభిస్తుంది. నెలకు రూ.12,640 చొప్పున రెండేళ్ల పాటు ఐసీఏఆర్–పీజీ స్కాలర్‌షిప్ అందిస్తారు. ఆరు వందలకు పైగా ర్యాంకు సాధించిన విద్యార్థులకు నేషనల్ టాలెంట్ స్కాలర్‌షిప్ (పీజీ) పేరిట నెలకు రూ.5వేలు చొప్పున రెండేళ్ల పాటు ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తుంది.

ఉజ్వల కెరీర్‌కు మార్గం

ఐసీఏఆర్–ఏఐఈఈఏ (పీజీ) ఎంట్రన్స్‌తో పీజీ ప్రోగ్రామ్‌లో చేరి పూర్తి చేసుకున్న వారికి చక్కటి కెరీర్ అవకాశాలు లభిస్తున్నాయి. ఇటీవల కాలంలో జాబ్ మార్కెట్ ట్రెండ్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. ఫార్మింగ్ సెక్టార్ ఉద్యోగాల కల్పనలో ముందంజలో నిలుస్తోంది. దీంతో.. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో నైపుణ్యం ఉన్న మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోంది. వ్యవసాయ విద్యను అభ్యసించిన వారికి కెరీర్ పరంగా కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ప్రభుత్వ కొలువులు

అగ్రికల్చర్ అనుబంధ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ప్రధానంగా.. వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్స్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా ప్లాంటేషన్స్, ఫెర్టిలైజర్ కంపెనీలు, అగ్రికల్చరల్ మెషినరీలు, అగ్రికల్చరల్ ప్రొడక్ట్స్, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థల్లో కొలువులు దక్కించుకోవచ్చు. ఎఫ్‌సీఐ, నాబార్డ్‌తోపాటు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూరల్ బ్యాంకింగ్ విభాగాల్లోనూ ఆఫీసర్లు, మేనేజర్లుగా కెరీర్స్ సొంతం చేసుకోవచ్చు. పీహెచ్‌డీ పూర్తి చేస్తే ఐసీఏఆర్, ఐఏఆర్ఐ వంటి అగ్రికల్చర్ రీసెర్చ్ కేంద్రాలతోపాటు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిధిలోని రీసెర్చ్ కేంద్రాల్లో సైంటిస్ట్ హోదాలో స్థిరపడొచ్చు.



డిగ్రీ స్థాయి పుస్తకాల అధ్యయనం

ఏఐఈఈఏలో విజయానికి అభ్యర్థులు.. తాము దరఖాస్తు చేసుకున్న పేపర్‌ను అనుసరించి డిగ్రీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా కోర్ అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయం చేసుకుంటూ చదవాలి. అదే విధంగా డొమైన్ విభాగంలో కీలక భావనలు, సిద్ధాంతాలు, వాటి ఉద్దేశం వంటి వాటిపైనా దృష్టి పెట్టాలి.

ఐసీఏఆర్-ఏఐఈఈఏ (పీజీ) ముఖ్యాంశాలు

- ఐసీఏఆర్ అనుబంధ ఇన్‌స్టిట్యూట్‌లలో ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీకి ఏఐఈఈఏ(పీజీ)
- ప్రస్తుతం జాతీయ స్థాయిలో 74 యూనివర్సిటీలు, నాలుగు ఐసీఏఆర్ డీమ్డ్ యూనివర్సిటీలు, మూడు సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలు, నాలుగు సెంట్రల్ యూనివర్సిటీల్లో అమలవుతున్న ఏఐఈఈఏ ఆల్ ఇండియా కోటా. ▪ ఏఐఈఈఏ (పీజీ)లో ప్రతిభ ఆధారంగా అగ్రి యూనివర్సిటీస్‌లో ప్రవేశం.
- కోర్సు చదివే సమయంలో ప్రతి నెలా స్కాలర్‌షిప్ సదుపాయం. ▪ కోర్సులు పూర్తి చేసుకున్నాక ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 2024, మే 11
- దరఖాస్తుల సవరణ: 2024, మే 13 – 15
- ఎంట్రన్స్ తేదీ: 2024, జూన్ 29
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్, వరంగల్
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://exams.nta.ac.in/ICAR

టీచర్ కెరీర్‌కు మార్గం.. ఎడ్‌సెట్!

విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైంది. ఇలాంటి ఉపాధ్యాయ వృత్తిలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలు అందించే కోర్సు.. బీఈడీ! ఈ కోర్సులో ప్రవేశానికి మార్గం.. ఎడ్‌సెట్. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో ఎడ్‌సెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం తెలంగాణలో టీఎస్ ఎడ్‌సెట్ 2024 ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఏడాది ఈ పరీక్షను నల్గొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో.. టీఎస్ ఎడ్‌సెట్ 2024కు అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» టీఎస్ ఎడ్‌సెట్ 2024 ప్రకటన విడుదల

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన రెండేళ్ల బీఈడీ కోర్సుల్లో ప్రవేశం పొందాలంటే.. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే టీఎస్ ఎడ్‌సెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. ఏదైనా డిగ్రీ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించినవారు టీఎస్ ఎడ్‌సెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు

కనీసం 50 శాతం మార్కులతో బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ(హోంసైన్స్), బీసీఏ, బీబీఎం, బీఏ (ఓరియంటల్ లాంగ్వేజ్), బీబీఏ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు/ఫైనల్ పరీక్షలకు హాజరైన వారు దరఖాస్తుకు అర్హులు. బీఈ/బీటెక్ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులను సాధించాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ ఇతర ప్రభుత్వ రిజర్వేషన్లు కలిగిన అభ్యర్థులకు ఉత్తీర్ణత శాతంలో సడలింపు ఉంది. వీరు కనీసం 40 శాతం మార్కులు సాధించాలి.

వయసు

జూలై1, 2024 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి నిబంధన లేదు.

వీరికి అర్హతలేదు

ఎంబీబీఎస్, బీఎస్సీ(అగ్రికల్చర్), బీవీఎస్సీ, బీహెచ్ఎంటీ, బీఫార్మసీ, ఎల్ఎల్‌బీ వంటి జాబ్ ఓరియెంటెడ్, ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు టీఎస్ ఎడ్‌సెట్ పరీక్ష రాసేందుకు, బీఈడీ కోర్సుల్లో చేరేందుకు అనర్హులు. డిగ్రీ లేకుండా పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు కూడా ఎడ్‌సెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు కాదు.

పరీక్ష ఇలా

ఎడ్‌సెట్ పరీక్ష మొత్తం 150 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహా నిర్వహిస్తారు. సబ్జెక్టు/కంటెంట్–60 మార్కులకు(మ్యాథమెటిక్స్–20 మార్కులు, సైన్స్–20 మార్కులు, సోషల్ స్టడీస్–20 మార్కులు), టీచింగ్ అప్టిట్యూడ్–20 మార్కులు, జనరల్ ఇంగ్లిష్–20 మార్కులు, జనరల్ నాలెడ్జ్ అండ్ ఎడ్యుకేషనల్ ఇష్యూస్–30 మార్కులు, కంప్యూటర్ అవేర్‌నెస్–20 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం రెండు గంటలు.

కనీస మార్కులు

ఎడ్‌సెట్‌లో అర్హత పొందేందుకు కనీసం 25 శాతం మార్కులు అంటే.. మొత్తం 150 మార్కులకు 38 మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు కనీస అర్హత మార్కుల నిబంధన లేదు.

ముఖ్యమైన సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు చివరి తేదీ: 06.05.2024.
- ఆలస్య రుసుముతో 13.05.2024 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు.
- హాల్ టికెట్ల డౌన్‌లోడ్: 20.05.2024
- టీఎస్ ఎడ్‌సెట్ పరీక్ష తేదీ: 23.05.2024
- వెబ్‌సైట్: https://edcet.tsche.ac.in

ప్రిపరేషన్ ఇలా..

ఫిజికల్, బయోలాజికల్ సైన్స్

ఆహారం, జీవులు, జీవన ప్రక్రియలు, జీవ వైవిధ్యం, కాలుష్యం, పదార్థం,కాంతి, విద్యుత్, అయస్కాంతత్వం, వేడి, ధ్వని, కదలిక, మార్పులు, వాతావరణం, బొగ్గు అండ్ పెట్రోల్, సహజ సిద్ధమైన దృగ్విషయం, నక్షత్రాలు, సౌరవ్యవస్థ, లోహశాస్త్రం, రసాయన ప్రతిచర్యల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. వీటికి సమాధానాలు గుర్తించేందుకు స్కూల్ స్థాయి పాఠ్యపుస్తకాలను చదవాలి.

సాంఘిక శాస్త్రం

భౌగోళిక శాస్త్రం, చరిత్ర, రాజనీతి శాస్త్రం, అర్థ శాస్త్రం అంశాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి. ఇందుకోసం తెలంగాణ స్టేట్ కరిక్యులం ప్రాథమిక స్థాయి నుంచి పదోతరగతి వరకూ పుస్తకాలను సమగ్రంగా చదవాలి. నిర్దిష్టమైన టైమ్ టేబుల్ సిద్ధం చేసుకొని.. దానికి అనుగుణంగా ప్రిపరేషన్ కొనసాగించాలి.

మ్యాథమెటిక్స్ సిలబస్

సంఖ్యావ్యవస్థ, వాణిజ్య గణితం, బీజ గణితం, జ్యామితి, కొలతలు, త్రికోణమితి, సమాచార నిర్వహణ(డేటా హ్యాండ్లింగ్) అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఇందుకోసం పదోతరగతి వరకూ గణితం పాఠ్యపుస్తకాలను అధ్యయనం చేయాలి. ప్రశ్నలను వీలైనన్ని ఎక్కువసార్లు ప్రాక్టీస్ చేయాలి.

టీచింగ్ అప్టిట్యూడ్

అప్టిట్యూడ్‌కు సంబంధించి బోధన అభ్యసన ప్రక్రియ, తరగతి గదిలో పిల్లలతో వ్యవహరించే విధానం, విశ్లేషణాత్మక ఆలోచన, జనరల్ ఇంటెలిజెన్స్ వంటివి వాటిపై ప్రశ్నలు ఉంటాయి.

జనరల్ ఇంగ్లిష్

రీడింగ్ కాంప్రహెన్షన్, స్పెల్లింగ్ ఎర్రర్, వొకాబ్యులరీ, ఫ్రేస్ రీప్లేస్‌మెంట్, ఎర్రర్ డిటెక్షన్ అండ్ వర్డ్ అసోసియేషన్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. దీనికోసం హైస్కూల్ స్థాయి ఏదైనా ఇంగ్లిష్ గ్రామర్ పుస్తకాన్ని చదవాలి. పాత ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.



జనరల్ నాలెడ్జ్, ఎడ్యుకేషనల్ ఇష్యూస్

కరెంట్ అఫైర్స్‌లో ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలు, సమకాలీన విద్యాసమస్యలు, జనరల్ పాలసీలు, సైంటిఫిక్ పరిశోధనలు, తాజా ప్రాంతీయ పరిణామాలు, అవార్డులు, వాతావరణ పరిస్థితులకు సంబంధించిన అంశాలుంటాయి. కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ కోసం పత్రికలను చదవాలి. దినపత్రికల్లో ముఖ్యమైన వార్తలను నోట్స్ రూపంలో సిద్ధం చేసుకొని ఎప్పటికప్పుడు రివైజ్ చేస్తుండాలి.

కంప్యూటర్ అవేర్‌నెస్

కంప్యూటర్, ఇంటర్నెట్, మెమొరీ, నెట్ వర్కింగ్, ఫండమెంటల్స్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.



మెయిన్ 'డ్రా'కు సహజ అర్హత

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ100 బోనితా స్ప్రింగ్స్ ఓపెన్ టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి సహజ యామలపల్లి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. అమెరికాలోని ఫ్లోరిడాలో జరుగుతున్న ఈ టోర్నీలో సింగిల్స్ క్వాలిఫయింగ్ చివరి రౌండ్‌లో ప్రపంచ 309వ ర్యాంకర్ సహజ 6-4, 6-2తో క్రిస్టినా రోస్కా (అమెరికా)పై గెలిచింది. హైదరాబాద్‌కే చెందిన శ్రీవల్లి రష్మిక మెయిన్ 'డ్రా'కు చేరుకోలేకపోయింది. చివరి రౌండ్‌లో రష్మిక 4-6, 4-6తో విక్టోరియా (అమెరికా) చేతిలో ఓడిపోయింది.

సిరీస్ విజయంపై భారత్ గురి

వరుసగా మూడో విజయంతో సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో భారత మహిళల టి20 జట్టు ఉంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు సిల్హెట్‌లో బంగ్లాదేశ్‌తో హర్మన్‌ప్రీత్ బృందం తలపడనుంది. తొలి మ్యాచ్‌లో 44 పరుగులతో, రెండో మ్యాచ్‌లో 19 పరుగులతో భారత్ గెలిచింది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం గం. 3:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ప్రసారం చేస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్ లోనే టి20 వరల్డ్‌కప్ జరగనున్న నేపథ్యంలో ఈ సిరీస్ భారత జట్టుకు సన్నాహకంగా ఉపయోగపడనుంది.



బోపన్న జోడీకి నిరాశ



మాడ్రిడ్: టాప్ సీడ్ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీ నుంచి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-7 (4/7), 5-7తో సెబాస్టియన్ కోర్డా (అమెరికా)-జోర్డాన్ థాంప్సన్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడిపోయింది. 77 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జోడీ తొలి సెట్‌ను టైబ్రేక్‌లో కోల్పోయి, రెండో సెట్‌లో ఒకసారి తమ సర్వీస్‌ను చేజార్చుకుంది. బోపన్న-ఎబ్డెన్ జంటకు 16,320 యూరోలు (రూ. 14 లక్షల 55 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

హార్దిక్ పాండ్యాపై రూ. 24 లక్షలు జరిమానా



లక్నో: ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ రూ. 24 లక్షలు జరిమానా విధించింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై జట్టు స్లో ఓవర్‌రేట్ నమోదు చేసింది. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ముంబై స్లో ఓవర్‌రేట్ నమోదు చేయడం ఇది రెండోసారి కావడంతో జరిమానా మొత్తాన్ని రెట్టింపు చేశారు. తొలిసారి ముంబై కెప్టెన్‌పై రూ. 12 లక్షలు పెనాల్టీ వేశారు. రెండోసారి హార్దిక్‌తోపాటు లక్నోతో మ్యాచ్‌లో ఆడిన ముంబై తుది జట్టులోని సభ్యులపై రూ. 6 లక్షల చొప్పున జరిమానా వేయడం గమనార్హం.



అర్జున్ గేమ్ 'డ్రా'

మాల్మో (స్వీడన్): టెపె సెజెమన్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ మూడో 'డ్రా' నమోదు చేసుకున్నాడు. విన్సెంట్ కీమెర్ (జర్మనీ)తో బుధవారం జరిగిన ఐదో రౌండ్ గేమ్‌ను అర్జున్ 39 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ తర్వాత అర్జున్ 3.5 పాయింట్లతో స్విడ్లెర్‌తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాడు.

'కింగ్స్' పోరులో పంజాబ్‌దే గెలుపు

ఐపీఎల్‌లో నేడు
హైదరాబాద్ X రాజస్తాన్
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

డిఫెండింగ్ చాంపియన్ చెన్నైకు ఐదో ఓటమి
- 7 వికెట్లతో నెగ్గిన పంజాబ్ కింగ్స్
- రాణించిన బ్రార్, చహర్



చెన్నై: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ టోర్నీలో మరో సంచలనం సృష్టించింది. డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టును వారి సొంతగడ్డపైనే ఓడించింది. గత శుక్రవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై 262 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ప్రపంచ రికార్డు నెలకొల్పిన పంజాబ్ కింగ్స్ ఈ మ్యాచ్‌లోనూ ఆకట్టుకుంది. బుధవారం ఎంఎ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ 7 వికెట్లతో గెలిచింది. పంజాబ్ కింగ్స్ కెప్టెన్ స్యామ్ కరన్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 162 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (48 బంతుల్లో 62; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీతో రాణించాడు. పంజాబ్ కింగ్స్ స్పిన్నర్లు హర్‌ప్రీత్ బ్రార్ (2/17), రాహుల్ చహర్ (2/16) చెన్నై జట్టును కట్టడి చేశారు. అనంతరం పంజాబ్ కింగ్స్ 17.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 163 పరుగులు చేసి విజయం సాధించింది. బెయిర్‌స్టో (30 బంతుల్లో 46; 7 ఫోర్లు, 1 సిక్స్), రిలీ రోసో (23 బంతుల్లో 43; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడి రెండో వికెట్‌కు 37 బంతుల్లో 64 పరుగులు జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక శశాంక్ సింగ్ (26 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్), స్యామ్ కరన్ (20 బంతుల్లో 26 నాటౌట్; 3 ఫోర్లు) పంజాబ్‌ను విజయతీరాలకు చేర్చారు. గత మూడు సీజన్‌లలో చెన్నైపై పంజాబ్ కింగ్స్‌కిది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. 2022లో చెన్నైతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన పంజాబ్ 2023లో చెన్నైలోనే జరిగిన మ్యాచ్‌లో నాలుగు వికెట్లతో గెలిచింది.

కట్టడి చేసిన బ్రార్, చహర్

చెన్నైకు ఓపెనర్లు రుతురాజ్, రహానే శుభారంభాన్నిచ్చారు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. దాంతో పవర్‌ప్లే ముగిసేసరికి చెన్నై వికెట్ నష్టపోకుండా 55 పరుగులు చేసింది. పవర్‌ప్లే ముగిశాక చెన్నై ఇన్నింగ్స్ తడబడింది. పంజాబ్ కింగ్స్ స్పిన్నర్లు హర్‌ప్రీత్ బ్రార్, రాహుల్ చహర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు.



రుతురాజ్

ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్లో బ్రార్ మూడు బంతుల తేడాలో రహానే, శివమ్ దూబే (0)లను పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత పదో ఓవర్లో జడేజాను చహర్ అవుట్ చేశాడు. దాంతో చెన్నై జట్టు 64/0 నుంచి 70/3తో కష్టాల్లో పడింది. బ్రార్, చహర్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడ్డ చెన్నై జట్టు బ్యాటర్లు వరుసగా ఎనిమిది ఓవర్లపాటు ఒక్క బౌండరీ కూడా బాదలేకపోయారు. రబడ వేసిన ఇన్నింగ్స్ 16వ ఓవర్ రెండో బంతికి రిజ్వీ బౌండరీ కొట్టి ఆ తర్వాతి బంతికే అవుటయ్యాడు. స్యామ్ కరన్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్ రెండో బంతిని బౌండరీ దాటించిన రుతురాజ్, మూడో బంతికి సిక్స్ కొట్టి 44 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇదే ఓవర్ చివరి బంతిని రుతురాజ్ సిక్స్‌గా మలచడంతో ఈ ఓవర్లో చెన్నైకి 20 పరుగులు వచ్చాయి. ఇన్నింగ్స్ 18వ ఓవర్ వేసిన అర్ష్‌దీప్ లయ తప్పి మూడు వైడ్‌లు వేసినా రుతురాజ్‌ను బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత అర్ష్‌దీప్ ఇన్నింగ్స్ చివరి ఓవర్లోనూ రెండు వైడ్‌లతో కలిపి ఎనిమిది బంతులు వేశాడు. ఈ ఓవర్లో ధోని ఒక ఫోర్, ఒక సిక్స్ కొట్టి చివరి బంతికి రనౌట్ అయ్యాడు. పంజాబ్ స్పిన్నర్లు బ్రార్, చహర్ ఒక్క బౌండరీ కూడా ఇవ్వకపోవడం విశేషం.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: అజింక్య రహానే (సి) రోసో (బి) హర్‌ప్రీత్ బ్రార్ 29; రుతురాజ్ గైక్వాడ్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 62; శివమ్ దూబే (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్‌ప్రీత్ బ్రార్ 0; రవీంద్ర జడేజా (ఎల్బీడబ్ల్యూ) (బి) రాహుల్ చహర్ 2; సమీర్ రిజ్వీ (సి) హర్షల్ పటేల్ (బి) రబడ 21; మొయిన్ అలీ (బి) రాహుల్ చహర్ 15; ధోని (రనౌట్) 14; డారైల్ మిచెల్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 162. వికెట్ల పతనం:** 1-64, 2-65, 3-70, 4-107, 5-145, 6-147, 7-162. **బౌలింగ్:** రబడ 4-0-23-1, అర్ష్‌దీప్ సింగ్ 4-0-52-1, స్యామ్ కరన్ 3-0-37-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-17-2, రాహుల్ చహర్ 4-0-16-2, హర్షల్ పటేల్ 1-0-12-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి) రుతురాజ్ (బి) గ్లీసన్ 13; బెయిర్‌స్టో (సి) ధోని (బి) దూబే 46; రిలీ రోసో (బి) శార్దుల్ 43; శశాంక్ సింగ్ (నాటౌట్) 25; స్యామ్ కరన్ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (17.5 ఓవర్లలో 3 వికెట్లకు) 163; వికెట్ల పతనం:** 1-19, 2-83, 3-113. **బౌలింగ్:** దీపక్ చహర్ 0.2-0-4-0, శార్దుల్ ఠాకూర్ 3.4-0-48-1, గ్లీసన్ 3.5-0-30-1, ముస్తఫిజుర్ 4-1-22-0, జడేజా 3-0-22-0, మొయిన్ అలీ 2-0-22-0, శివమ్ దూబే 1-0-14-1.

చైనాతో భారత్ 'ఢీ'

- క్వార్టర్ ఫైనల్లో టీమిండియాకు క్లిష్టమైన ప్రత్యర్థి
- చివరి మ్యాచ్‌లో ఇండోనేసియా చేతిలో ఓడిన భారత్



చెంగ్డూ (చైనా): ప్రతిష్టాత్మక థామస్ కప్ పురుషుల టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు సెమీఫైనల్ బెర్త్ కోసం 10 సార్లు చాంపియన్ చైనాతో క్వార్టర్ ఫైనల్లో తలపడనుంది. బుధవారం జరిగిన గ్రూప్ 'సి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 1-4తో 14 సార్లు చాంపియన్ ఇండోనేసియా చేతిలో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ 61 నిమిషాల్లో 13-21, 21-12, 21-12తో ప్రపంచ ఏడో ర్యాంకర్ ఆంథోనీ సినిసుక జిన్‌టింగ్‌ను ఓడించాడు. రెండో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం 77 నిమిషాల్లో 22-24, 24-22, 19-21తో షోహిబుల్ ఫిక్రి-మౌలానా బగస్ జంట చేతిలో ఓడిపోయింది. మూడో మ్యాచ్‌లో లక్ష్య సేన్ 65 నిమిషాల్లో 18-21, 21-16, 17-21తో ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్ జొనాథన్ క్రిస్టీ చేతిలో ఓటమి పాలయ్యాడు. నాలుగో మ్యాచ్‌లో ధ్రువ్ కపిల-సాయిప్రతీక్ జోడీ 20-22, 11-21తో లియో కార్నాండో-డేనియల్ మార్టిన్ జంట చేతిలో పరాజయం పాలైంది. చివరిదైన ఐదో మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-19, 22-24, 14-21తో ద్వి వర్దాయో చేతిలో ఓడిపోయాడు. గ్రూప్ 'సి'లో ఇండోనేసియా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి అగ్రస్థానంలో నిలువగా... భారత్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో చైనాతో భారత్; మలేసియాతో జపాన్; కొరియాతో ఇండోనేసియా; చైనీస్ తైపీతో డెన్మార్క్ తలపడతాయి. మరోవైపు మహిళల టీమ్ టోర్నీ ఉబెర్ కప్ క్వార్టర్ ఫైనల్స్‌లో నేడు జపాన్‌తో భారత్; డెన్మార్క్‌తో చైనా... శుక్రవారం ఇండోనేసియాతో థాయ్‌లాండ్; చైనీస్ తైపీతో కొరియా పోటీపడతాయి.

స్మిత్‌కు దక్కని చోటు

టి20 ప్రపంచకప్‌కు ఆస్ట్రేలియా జట్టు ప్రకటన



మెల్‌బోర్న్: కెరీర్‌లో ఐదో టి20 ప్రపంచకప్ ఆడాలని ఆశించిన ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ స్టీవ్ స్మిత్‌కు నిరాశ ఎదురైంది. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే ఆస్ట్రేలియా జట్టును బుధవారం ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన జట్టుకు ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ సారథ్యం వహిస్తాడు. గత 14 ఏళ్లలో ప్రపంచకప్ జట్టులో స్మిత్‌కు చోటు దక్కకపోవడం ఇదే తొలిసారి. 2021లో టి20 ప్రపంచకప్‌ను తొలిసారి సాధించిన ఆస్ట్రేలియా జట్టులో స్మిత్ సభ్యుడిగా ఉన్నాడు. 34 ఏళ్ల స్మిత్ ఇప్పటివరకు ఆసీస్ తరఫున 67 టి20 మ్యాచ్‌లు ఆడి 125.45 స్ట్రయిక్‌రేట్‌తో 1094 పరుగులు సాధించాడు.

ఆస్ట్రేలియా జట్టు: మిచెల్ మార్ష్ (కెప్టెన్), వార్నర్, ట్రావిస్ హెడ్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, కామెరాన్ గ్రీన్, టిమ్ డేవిడ్, నాథన్ ఎలిస్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ వేడ్, కమిన్స్, హేజల్‌వుడ్, స్టార్క్, ఆష్టన్ అగర్, ఆడమ్ జంపా.

ఓటమితో ముగించిన నాదల్



మాడ్రిడ్: స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ చివరిసారి బరిలోకి దిగిన మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్‌ను దాటలేకపోయాడు. ప్రపంచ 31వ ర్యాంకర్ జిరీ లెహెస్కా (చెక్ రిపబ్లిక్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో నాదల్ 5-7, 4-6తో ఓడిపోయాడు. నాదల్ 2005, 2010, 2013, 2014, 2017లలో మాడ్రిడ్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. తుంటి గాయంతో బాధపడుతున్న 37 ఏళ్ల నాదల్ ఈ ఏడాది కేవలం మూడు టోర్నీల్లో మాత్రమే పాల్గొన్నాడు.

సినిమా



"కంటెంట్ బాగుంటే మన సినిమా అయినా మలయాళం సినిమా అయినా ప్రేక్షకులు చూస్తారు. కోవిడ్ సమయంలో కొంతమంది ప్రేక్షకులు థ్రిల్లర్, హారర్ వంటి సినిమాలు చూసి ఉండొచ్చు. వారికి నచ్చి ఉండవచ్చు. ఇటీవల కాలంలో మన తరహా కామెడీ సినిమాలు తక్కువగా వచ్చాయి. అయితే అలా వచ్చిన 'సామజ వరగమన', 'డీజే టిల్లు 2' సినిమాలు సక్సెస్ అయ్యాయి. ఇప్పుడు మా సినిమా 'ఆ ఒక్కటీ అడక్కు' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మా సినిమా ప్రేక్షకులకు నచ్చుతుంది" అని 'అల్లరి' నరేశ్ అన్నారు. 'అల్లరి' నరేశ్, ఫరియా అబ్దుల్లా హీరో హీరోయిన్లుగా మల్లి అంకం దర్శకత్వంలో రాజీవ్ చిలక నిర్మించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో 'అల్లరి' నరేశ్ పంచుకున్న విశేషాలు.

అల్లరి మాత్రం వదలను

\- 'అల్లరి' నరేశ్

- 'ఆ ఒక్కటీ అడక్కు'లో ఓ మ్యారేజ్ బ్యూరోలో వర్క్ చేసే గణ అనే పాత్ర చేశాను. లైఫ్‌లో సెటిలయ్యాక గణ పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. ఈలోపు ఏజ్ బార్ అయిపోతుంది. పైగా మ్యారేజ్ బ్యూరోలో వర్క్ చేస్తున్న కారణంగా అందరూ అతన్ని నీ పెళ్లెప్పుడూ అని అడుగుతుంటారు. ఈ క్రమంలో వచ్చే హ్యూమర్, హీరో ఫ్రస్టేషన్ ఆడియన్స్‌కు నవ్వు తెప్పిస్తాయి. నేను చేసిన కొన్ని కామెడీ సినిమాలు సరిగా ఆడలేదు. కారణం విశ్లేషించుకుంటే కథలో కామెడీ ఉండాలి కానీ, కామెడీ కోసం కథ ఉండకూడదని తెలుసుకున్నాను. ఆ పొరపాటు ఈ సినిమాలో చేయలేదు. 'ఆ ఒక్కటీ అడక్కు'లో సందర్భానుసారంగానే కామెడీ వస్తుంది.
- ఈ చిత్రంలో కామెడీ మాత్రమే కాదు.. ఎమోషనల్, సందేశాత్మక అంశాలు కూడా ఉన్నాయి. పెళ్లి పేరుతో ఎలాంటి మోసాలు జరుగుతున్నాయి? మ్యారేజ్ రిజిస్ట్రేషన్, మ్యారేజ్ బ్యూరోస్‌లో అమ్మాయి.. అబ్బాయిల ఫేక్ ప్రొఫైల్స్, పెళ్లిని వ్యాపారంగా చూడటం వంటి అంశాలను ఈ సినిమాలో చూపించాం. మంచి కథతో మల్లి బాగా డైరెక్ట్ చేశారు.
- నాన్న (ఈవీవీ సత్యనారాయణ) గారి 'ఆ ఒక్కటీ అడక్కు' (1992) సినిమాకు, నేను హీరోగా చేసిన ఇప్పటి 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమాకు సంబంధం లేదు. ఆ సినిమాలో పెళ్లి జరిగినా లైఫ్‌లో సెటిల్ అవ్వాలనుకోని పాత్ర హీరోది. కానీ ఈ సినిమాలో సెటిలయ్యాకే పెళ్లి చేసుకోవాలనుకునే పాత్ర హీరోది. ఇక నాన్నగారి బ్యానర్‌లో సినిమాలు నిర్మించాలని ఉంది. 'ఎవడి గోల వాడిది' తరహా కథ కోసం చూస్తున్నాను. కామెడీ కథలు రాసే రైటర్స్ తగ్గిపోయారు. దేశంలో హిట్టైన అన్ని సినిమాల్లోని అంశాలను స్పూఫ్‌గా తీసుకుని 'సుడిగాడు 2' సినిమాకి కథ రాస్తున్నాను. నా కుమార్తె సెకండ్ క్లాస్ చదువుతోంది. కాసేపు డాక్టర్ అంటుంది... కాసేపు పైలెట్ అంటుంది. షార్ట్ స్టోరీస్ కూడా రాస్తోంది. భవిష్యత్‌లో తను డైరెక్టర్ అయితే బాగుంటుందని అనుకుంటున్నాను.
- వరుసగా నేను సీరియస్ రోల్స్ చేసిన 'నాంది', 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం', 'ఉగ్రం', 'నా సామిరంగ' సినిమాలు విడుదలయ్యాయి. ఇప్పుడు కామెడీ సినిమా వస్తోంది. ఇక కామెడీ, సీరియస్ తరహా సినిమాలను బ్యాలెన్స్ చేద్దామనుకుంటున్నాను. 'అల్లరి' (కామెడీ సినిమాలు) మాత్రం వదలను. అలాగే వెంకటేశ్‌గారితో ఓ మల్టీస్టారర్ మూవీ చేయాలని ఉంది. అమితాబ్ బచ్చన్‌గారితో స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉంది.
- ఈ ఏడాది నేను నటించిన నాలుగు సినిమాలు విడుదలవుతాయి. 'నా సామిరంగ' (ఇందులో నరేశ్ ఓ లీడ్ రోల్‌లో నటించారు) చిత్రం విడుదలైంది. ఇప్పుడు 'ఆ ఒక్కటీ అడక్కు' రిలీజ్ అవుతోంది. నేను చేస్తున్న 'బచ్చలమల్లి' మూవీ ఆగస్టులో, డిసెంబరులో మరో సినిమా విడుదల కావొచ్చు. నేను హీరోగా కమిటైన రెండు కొత్త చిత్రాల ప్రకటన త్వరలో వస్తుంది.



● అల్లు అర్జున్

దేశం దద్దరిల్లే...

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పుష్ప: ది రూల్'. ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతదర్శకుడు. ఈ చిత్రం నుంచి తొలి లిరికల్ వీడియోను విడుదల చేశారు. 'పుష్ప.. పుష్ప.. పుష్ప.. పుష్పరాజ్...., నువ్వు గడ్డం అట్టా సవరిస్తుంటే దేశం దద్దరిల్లే, నువ్వు భుజమే ఎత్తి నడిచొస్తుంటే భూమే బద్దలయ్యే...' అంటూ ఈ పాట సాగుతుంది. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటకి విజయ్ పొల్లంకి, శ్రేష్టి వర్మ కొరియోగ్రఫీ చేశారు. ఈ పాటను తెలుగుతో పాటు హిందీ, తమిళ, మలయాళ, కన్నడ, బెంగాలీ భాషల్లోనూ రిలీజ్ చేశారు. ''పుష్ప క్యారెక్టరైజేషన్, 'పుష్ప: ది రూల్'ను ఎలివేట్ చేసే విధంగా ఈ సాంగ్ ఉంటుంది'' అన్నారు మేకర్స్. ఆగస్టు 15న 'పుష్ప: ది రూల్' ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కానుంది.



● కొరటాల శివ, రాజమౌళి, సత్యదేవ్, అనిల్ రావిపూడి, గోపీచంద్, కృష్ణ కొమ్మాలపాటి, గోపాలకృష్ణ

కృష్ణమ్మతో సత్యదేవ్ స్టార్ అవుతాడు - రాజమౌళి

''చిన్న చిన్న హావభావాలతో అన్ని రకాల నటనని చూపించగల నటుల్లో సత్యదేవ్ కూడా ఒకడు. తను మంచి నటుడు అని ఇటు ఇండస్ట్రీకి అటు ప్రేక్షకులకు తెలుసు. కానీ, ఒక్క సినిమా సడెన్‌గా స్టార్‌ని చేస్తుంది.. నాకు తెలిసి 'కృష్ణమ్మ' మూవీ తనని స్టార్ చేస్తుందనుకుంటున్నాను'' అని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. సత్యదేవ్, అతీరా రాజ్ జంటగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వీవీ గోపాలకృష్ణ దర్శకుడు. డైరెక్టర్ కొరటాల శివ సమర్పణలో అరుణాచల క్రియేషన్స్‌పై కృష్ణ కొమ్మాలపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న రిలీజ్ కానుంది. మైత్రీ మూవీ మేకర్స్, ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ విడుదల చేస్తున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన 'కృష్ణమ్మ' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన **రాజమౌళి మాట్లాడుతూ–** ''కృష్ణమ్మ' టైటిల్ నాతో పాటు అందర్నీ ఆకర్షించిందంటే కారణం కొరటాల శివగారు సమర్పించడమే. ఆయన సమర్పిస్తున్న తొలి సినిమాతోనే పెద్ద విజయం అందుకోవాలని కోరుకుంటున్నాను. ఈ మూవీ టీజర్, ట్రైలర్ చూస్తే సినిమాని కచ్చితంగా థియేటర్లోనే చూడాలనిపించేలా తీశాడు గోపాలకృష్ణ. కాలభైరవని చూస్తుంటే గర్వంగా ఉంది. 'కృష్ణమ్మ' టీమ్‌కి ఆల్ ది బెస్ట్'' అన్నారు.

కొరటాల శివ మాట్లాడుతూ– ''గోపాల్ చెప్పిన 'కృష్ణమ్మ' కథ నచ్చడంతో నేను కూడా భాగస్వామ్యం అవుతానని అడిగాను.. అంతే కానీ, ఈ కథలో నేను కల్పించుకోలేదు. నేను చూసిన మంచి నటుల్లో సత్యదేవ్ ఒకడు.. మంచి ప్రతిభ ఉంది. ఈ మూవీతో తన కెరీర్ మరో మెట్టు పైకి ఎక్కుతుందని నమ్ముతున్నాను. అలాగే నిర్మాత కృష్ణగారికి పెద్ద విజయం రావాలి'' అన్నారు. ''కొరటాల శివగారు తీసే సినిమాలు ఎలా ఉంటాయో మనకు తెలిసిందే. ఆయన సమర్పిస్తున్న 'కృష్ణమ్మ' కూడా అద్భుతంగా ఉంటుంది'' అన్నారు గోపీచంద్ మలినేని. ''సత్యదేవ్ హీరోగా బిజీగా ఉన్నా 'సరిలేరు నీకెవ్వరు'లో ఓ చిన్న పాత్ర చేశాడు.. ఎందుకంటే సినిమా అంటే అంత గౌరవం. ఈ వేసవిలో 'కృష్ణమ్మ' సినిమాని ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. **సత్యదేవ్ మాట్లాడుతూ–** ''రాజమౌళి, కొరటాల శివ, గోపీచంద్ మలినేని, అనిల్ రావిపూడి గార్లు ఉన్న ఈ వేదికపై నేను మాట్లాడటం ప్రపంచంలోనే ఖరీదైన వేదికగా భావిస్తున్నాను. 'కృష్ణమ్మ' విడుదల తర్వాత నేను బయట ఎక్కడ కనిపించినా ప్రేక్షకులు ఈ మూవీ గురించే నాతో మాట్లాడతారు.. అందుకు నాదీ గ్యారంటీ. క్రికెట్‌కి సచిన్ టెండూల్కర్ గారు ఎలాగో.. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీకి రాజమౌళి సార్ అలాగే. తెలుగు సినిమాని (ఆర్ఆర్ఆర్) అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లి.. ఆస్కార్ తీసుకొచ్చారు'' అన్నారు. **వీవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ–** ''కృష్ణమ్మ' కథ నచ్చడంతో మమ్మల్ని ప్రోత్సహించిన కొరటాలశివగారికి థ్యాంక్స్. మా ట్రైలర్ నచ్చిన వారు మూవీని థియేటర్లో చూడండి''అన్నారు.



● లారా దత్తా

కైకేయి.. శూర్పణఖ... ఏదైనా ఓకే

''రామాయణ్' లాంటి ప్రతిష్టాత్మక చిత్రంలో నటించాలనే ఆసక్తి ఎవరికి మాత్రం ఉండదు? ఆ సినిమాలో నటించమని ఇప్పటివరకూ ఎవరూ నన్ను సంప్రదించలేదు. ఆ అవకాశం వస్తే మాత్రం నటించేందుకు నేను సిద్ధం'' అన్నారు బాలీవుడ్ బ్యూటీ లారా దత్తా. 'దంగల్' ఫేమ్ నితీష్ తివారి దర్శకత్వంలో హిందీలో 'రామాయణ్' మూవీ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. మూడు భాగాలుగా ఈ చిత్రం రూపొందుతోందని సమాచారం. కాగా ఈ చిత్రంలోని నటీనటులపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు. కానీ, రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారని లీక్ అయిన ఒక ఫొటో స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే.. ఈ చిత్రంలో కైకేయి పాత్రలో లారా దత్తా నటించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై తాజాగా స్పందించారు లారా దత్తా. ''రామాయణ్'లో నేను కైకేయి పాత్ర చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అవి విన్నప్పుడు సంతోషంగానే ఉంది. ఎందుకంటే.. అంత గొప్ప సినిమాలో నటించాలని ఎవరు కోరుకోరు? ఒకవేళ ఈ మూవీలో నాకు అవకాశం వస్తే కైకేయి పాత్రే కాదు.. శూర్పణఖ, మండోదరి లాంటి క్యారెక్టర్స్ చేయడానికి కూడా నేను రెడీ. ఈ మూడు పాత్రల్లో దేనికైనా నేను చక్కగా సరిపోతాను'' అంటూ తన మనసులోని మాటని బయటపెట్టారు లారా దత్తా. మరి... ఈ మూడు ప్రాతల్లో ఏదో ఒకటి చేసే చాన్స్ లారా దత్తాకి వస్తుందా? అనేది చూడాలి.



● సుకృతి వేణి

పర్యావరణ పరిరక్షణ కోసం...

ప్రముఖ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వంలో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, గోపీ టాకీస్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, శేష సింధు రావు నిర్మించారు. సుకుమార్ భార్య తబిత సమర్పకురాలిగా వ్యవహరించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''పర్యావరణ పరిరక్షణే ప్రధానోద్దేశంగా రూపొందిన సందేశాత్మక చిత్రం 'గాంధీ తాత చెట్టు'. ఈ చిత్రం ఇప్పటికే పలు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శితమై, అవార్డులు గెలుచుకుంది. సుకృతి వేణి నటనకుగాను ప్రశంసలతో పాటు అవార్డు కూడా వచ్చింది'' అన్నారు.

సినిమా బాగుందని క్లాప్స్ కొడతారు - సుహాస్



● అర్జున్, మణికంఠ, సుహాస్

సుహాస్ హీరోగా నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'ప్రసన్న వదనం'. ఈ చిత్రంలో రాశీ సింగ్, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్లు. వైకే అర్జున్ దర్శకత్వంలో జీఎస్ మణికంఠ, టీఆర్ ప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా సమావేశంలో సుహాస్ మాట్లాడుతూ– ''ఫస్ట్ కాపీ చూశాను. బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ ఇది. ఏ మాత్రం సందేహం లేదు. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ మూవీ. సినిమా బాగుందని ఆడియన్స్ క్లాప్స్ కొడతారు'' అన్నారు. ''ఫన్, థ్రిల్, రొమాన్స్, ఎమోషన్స్... ఇలా అన్ని అంశాలు కలిసి ఉండి ఓ యునిక్ కాన్సెప్ట్‌తో రూపొందిన కమర్షియల్ ఫిల్మ్ ఇది'' అన్నారు అర్జున్. ''ఈ సమ్మర్‌కి పర్‌ఫెక్ట్ ట్రీట్ ఈ ఫిల్మ్. వందకు వంద శాతం ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు నిర్మాతలు–కథానాయికలు.